బి.ఆర్.అంబేద్కర్ ముందుమాటతో

# బుద్ధ ధర్మ సారం

ఆంగ్ల మూలం: పి.లక్ష్మి నరసు

తెలుగు: డి.చంద్రశేఖర్

Cat-2011



ఎవరి హృదయాలు ఆకాశమంత విశాలమై
అవధుల్లేని కరుణ, ప్రేమల్ని నింపుకున్నాయో;
ఎవరి ఆలోచనలు, పరిమళించే పూవుల్లా,
నిరంతరం పరిమళాలు వెదజల్లుతాయో;
ఎవరు, స్వప్రయోజనం ఆశించక, హేతుబుద్ధితో
సత్యాసత్యాలను నిగ్గుతేల్చటానికి నడుం బిగిస్తారో;
ఎవరు మూఢనమ్మకాలకు, దుర్బుద్ధికి మోకరిల్లక
సోమరితనానికి బానిసలై బ్రతులీడ్చక,
సుగుణశీలం విలసిల్లేదారిలో పరివ్రాజకులౌతారో;
ఎవరు ప్రజ్ఞతో విముక్తినాశించి
అరియమార్గంలో పయనిస్తారో;
మూల సమస్యను నిలువెల్లా దర్శించి
మహోపాధ్యాయుడు అందించిన మార్గాన్ని ఎవరు
ఉత్సాహంతో పదుగురికీ పంచుతారో;

**వారందరికీ**

# అంకితం

# బుద్ధ ధర్మ సారం

రచన

**ప్రొఫెసర్ పి. లక్ష్మినరసు**

ముందుమాట

**డా॥ బి.ఆర్. అంబేద్కర్**

సంక్షిప్తానువాదం

**డి. చంద్రశేఖర్**

**పీకాక్ క్లాసిక్స్ • హైదరాబాద్**

Buddha Dharma Saaram
abridged Telugu version of Laxminarasu's Essence of Buddhism,
originally published in 1907 and forworded and published
by Dr. B R Ambedkar, in 1948

published by Peacock Classics, Publication wing of People's Trust

Cover: Chandra
Graphics: Suri

Publication No: 56
©: People's Trust
price: Rs. 50
copies: 1000

abridged in Telugu by D. Chandrasekhar

First Published in 2009
Hyderabad, Andhra Pradesh, India

Title printed at Venkatsai Graphics, Chikkadpally, Hyd.
Text printed at Rainbow Print Pack, Ameerpet, Hyd.

sole distributors
Visalaandhra Publishing House, Hyderabad.

PEOPLE'S TRUST REGD. OFFICE
G14, PRAGATHI ENCLAVE, BHAGYANAGAR COLONY, KUKKATA PALLY,
HYDERABAD - 500072; Ph. 2306 3729

A. GANDHI, EDITOR, PEACOCK CLASSICS
Phs: 98499 40791, 2389 0328 (R)
email: agaandhi@yahoo.co.in, agaandhi@gmail.com

294.3
9209
Cat-2011
A C. No. 91932

# మూడో ముద్రణకు ముందుమాట

ఈ పుస్తక రచయిత ప్రొఫెసర్ లక్ష్మినరసు. ఈ పుస్తకాన్ని మీకు పరిచయం చెయ్యటం నాకెంతో ఆనందకరం. అయితే రచయితను నేను కలవలేదని, ఆయన వ్యక్తిగత జీవితం గురించి నాకు తెలిసింది చాలా తక్కువని ఒప్పుకుంటున్నాను. ఆయన జీవితం, రచనల గురించి సాధ్యమైనంత సమాచారం సేకరించేటందుకు ప్రయత్నించాను. ఇందుకోసం డా॥ పట్టాభి సీతారామయ్య సరైన వ్యక్తి అని తెలుసుకున్నాను. ప్రొ॥ నరసుతో యీయనకు వ్యక్తిగత పరిచయమేగాక, స్నేహం కూడా వుంది. ప్రొ॥ నరసు జీవితం గురించి డా॥ పట్టాభి చెప్పిన విషయాల్లో ముఖ్యమైన వాటిని క్రింద తెలియజేస్తున్నాను.

ప్రొఫెసర్ పి. లక్ష్మినరసు, బి.ఎ., గత శతాబ్దానికి చెందిన అసాధారణ ప్రజ్ఞావంతుడు. ఆయన మద్రాస్ క్రిష్టియన్ కాలేజీనుండి భౌతికశాస్త్రంలో పట్టభద్రుడు. మొదట ట్యూటర్, డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేసి, 1897లో అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగాడు. 1898-99ల్లో ప్రొ॥ మోఫాట్ సెలవుపై వెళ్ళగా అతని స్థానంలో ప్రొ॥ నరసు, భౌతిక, రసాయనశాస్త్ర శాఖాధిపతిగా వ్యవహరించాడు. ప్రొ॥ నరసు పనిచేసే శాఖకి అధిపతిగా ఔత్సాహికుడైన ప్రొ॥ మోఫాట్‌ను నియమించారు. అప్పటికే ప్రొ॥ నరసు భౌతికశాస్త్ర విభాగమైన వైర్‌లెస్ టెలిగ్రఫీలో గొప్ప ప్రతిభావంతుడిగా పేరు గడించాడు. 1898, 1899ల్లో ఆయన బి.ఏ., ఎం.ఏ. భౌతిక, రసాయనశాస్త్రాల ఎగ్జామినర్‌గా వున్నాడు. ప్రత్యేకించి గతిశాస్త్రంలో ప్రొ॥ నరసు మంచి దిట్ట. ఒకసారి గతిశాస్త్రంలో ఒక ప్రశ్న విషయమై ఆంగ్లేయుడైన ప్రొ॥ విల్సన్, ప్రొ॥ నరసుల మధ్య వివాదం తలెత్తింది. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో రసాయనశాస్త్ర ప్రొఫెసరైన ప్రొ॥ విల్సన్ భౌతిక, రసాయనశాస్త్ర ఎగ్జామినర్స్ బోర్డుకు చైర్మన్‌గా వుండేవాడు. పై వివాదంలో ప్రొ॥నరసు అభిప్రాయాన్ని, ఆయన ప్రశ్నించాడు. ప్రొ॥ నరసు తన అభిప్రాయం సరైనదేనని వాదించాడు. "నువు నాకే పాఠాలు చెప్పాలనుకుంటున్నావా మిస్టర్ నరసు?" అంటూ తలబిరుసుగా ప్రశ్నించాడు ప్రొ॥ విల్సన్. ప్రొ॥ నరసు అతనికి యిలా బదులిచ్చాడు: "ప్రొ॥ విల్సన్‌కు గతిశాస్త్రంలో ఒక విషయాన్ని బోధిస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది." ప్రొ॥ నరసు ఒక ధీశాలి. అందుకే యాభై సంవత్సరాల తర్వాత కూడా యీ సంఘటనను మనం గుర్తుచేసుకుంటున్నాం. ప్రొ॥ నరసు ఒక సంఘసంస్కర్త. పందొమ్మిదో శతాబ్దపు చివరిదశలోనే, ఆయన హిందూమతంలోని దుర్మార్గమైన కులవ్యవస్థపై శక్తివంచన లేకుండా తిరుగుబాటు చేశాడు. ఆయన బుద్ధిజాన్ని ఎంతగానో అభిమానించాడు. దానిపై

ఎన్నో వుపన్యాసాలిచ్చాడు. ఆయన కలిగించిన అద్భుతమైన ప్రభావం వల్ల విద్యార్థులు విశాలదృక్పథాన్ని ఏర్పర్చుకోగలిగారు. ఆయనకున్న ఆత్మాభిమానం, దేశాభిమానం వుత్తమస్థాయికి చెందినవి. తన యూరోపియన్ సహోద్యోగుల పొగరుబోతుతనాన్ని, అహంకారాన్ని ఆయన సహించలేదు. వారికి మేధోపరమైన విషయాల్లో ఆయన దీటుగా బదులిచ్చేవాడు, అంతేగాని, తలవంచి అవమానాల్ని భరించేవాడు కాదు.

ప్రతిభావంతుడైన విద్యావేత్తగా గుర్తింపు పొందటానికి ప్రొ॥ నరసుకు ఎక్కువకాలం పట్టలేదు. కొద్దికాలంలోనే ఆయన పచ్చి అప్పాస్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందాడు.

ప్రొ॥ నరసు గొప్ప సామాజిక స్పృహగల పౌరుడు. ఆయన 'నేషనల్ ఫండ్ అండ్ యిండస్ట్రియల్ అసోసియేషన్' అనే సంస్థ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించాడు. విదేశాల్లో టెక్నికల్ ఎడ్యుకేషన్ నిమిత్తం వెళ్ళే విద్యార్థుల కోసం యీ సంస్థ విరాళాలు సేకరించేది. చిన్నతరహా పరిశ్రమల్లో అవసరమైన సాంకేతిక విద్య నేర్చుకొనేటందుకు ఆ రోజుల్లో యువకులు జపాన్ పట్ల ఆసక్తి చూపేవారు. సంఘసంస్కరణలో గాఢమైన ఆసక్తి వున్నందున, ఆయనకు బౌద్ధధర్మంలో వూరట లభించింది. కులవ్యవస్థ, బాల్యవివాహాలు, విధవావివాహాల నిషేధంలోని దుర్మార్గాన్ని గుర్తించిన మొదటివారిలో ఆయన ఒకడు. సంస్కరణ వుద్యమ కార్యకర్తగా ఆయన సోదరుడు ఒక విధవను వివాహమాడాడు. ఆ రోజుల్లో తొలిదశలో క్రైస్తవ సంస్థలు సంస్కరణ వుద్యమాలకు మద్దతిచ్చాయి. ఎందుకంటే ప్రజలు సనాతన హిందూమతం నుండి క్రైస్తవంలోకి మారేటందుకు ఆ ఉద్యమాలు వారధిగా పనిచేస్తాయని అవి భావించాయి. తర్వాత వాటి దృష్టి మారింది. ఎందుకంటే ఆ ప్రగతిశీల వుద్యమాలు మతమార్పిళ్ళకు పెద్ద అడ్డంకిగా మారాయని గ్రహించడానికి వాటికి ఎంతోకాలం పట్టలేదు. ప్రొ॥ నరసు యూరోపియన్ల అహంకారాన్ని దేశభక్తితో, సనాతన హిందూయిజాన్ని సాహసంతో, బ్రాహ్మణిజాన్ని జాతీయ దృక్పథంతో, దుందుడుకు క్రైస్తవాన్ని హేతువాద దృక్పథంతో ఎదురొడ్డి పోరాడిన ధీశాలి.. వీటన్నిటిని మహోపాధ్యాయుడైన బుద్ధుని బోధనల్లో అచంచల విశ్వాసం, అది కలిగించిన స్ఫూర్తితో కొనసాగించాడు.

ఈ మధ్యకాలంలో భారతదేశంలో వివిధ ప్రాంతాలకు చెందినవారు బుద్ధిజంపై ఒక మంచి పుస్తకం సూచించమని అడుగుతున్నారు. ఈ పుస్తకాన్ని నేను ఏమాత్రం తటపటాయించకుండా సూచిస్తాను. ఎందుకంటే, బుద్ధిజంపై యింతవరకు వెలువడిన పుస్తకాల్లో యిది అత్యుత్తమమైందని నేననుకుంటున్నాను. దురదృష్టవశాత్తు, యీ పుస్తకం చాలాకాలంగా అందుబాటులో లేదు. కాబట్టి, బుద్ధుని బోధనల్లో ఆసక్తిగలవారికి ఒక

సమగ్రమైన, సుస్పష్టమైన రచనను అందించే నిమిత్తం నేను యీ పుస్తకాన్ని పునర్ముద్రించాలని నిర్ణయించుకున్నాను. ఈ పుస్తకం మూల హక్కులు కలిగి, పునర్ముద్రణకు అనుమతిచ్చిన వరదాచారి & కం., మద్రాసువారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

బుద్ధుని బోధనలపై అతని ప్రత్యర్థులు - గతంలో, వర్తమానంలో - చేసిన కొన్ని విమర్శలకు యీ ముందుమాటలో సమాధానం చెప్పాలని అనుకున్నాను. రెండు కారణాల వల్ల యీ వుద్దేశాన్ని విరమించుకున్నాను. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చటంలో నా ఆరోగ్యం నాకు సహకరించదేమోననేది మొదటి కారణం. కాగా, నేను స్వయంగా బుద్ధుని జీవితంపై కృషిచేస్తున్నాను. ఇటువంటి విషయానికి యితరుల రచనకు రాసే ముందుమాటలో కంటే, నా స్వంత రచనలో మరింత న్యాయం చెయ్యగలననుకుంటున్నాను. ప్రొ॥ నరసు పుస్తకానికి నా యీ నిర్ణయంవల్ల ఏ విధంగాను నష్టం వాటిల్లదని నమ్మకంగా చెప్పగలను.

**బి.ఆర్. అంబేద్కర్**

"రాజగృహ"
హిందూ కాలనీ, దాదర్
బాంబే-14,
10 మార్చి, 1948

# రచయిత ముందుమాట

"బుద్ధిజంపై కొన్ని దక్షిణ భారతదేశ పత్రికల్లో నేను వరుసగా రాసిన వ్యాసాల తుదిరూపం యీ పుస్తకం. బౌద్ధధర్మంలోని ప్రధానమైన విషయాల్ని ఒకచోట కూర్చి, వాటిని ఆధునిక విజ్ఞానం వెలుగులో వివరించటం దీని వుద్దేశం. ఈ పుస్తకంలోని విషయమంతా కొత్తదని నేను చెప్పను. దీనిలో చెప్పిన చాలా విషయాలు తూర్పుదేశాలకు చెందిన ప్రముఖుల రచనల్లో కనిపిస్తయ్. పాలీ, సంస్కృతం కొటేషన్లు దీనిలో వున్నా, ఆ భాషల్లో పాండిత్యం వుండి రాసింది కాదు యీ పుస్తకం. ఒక విద్యార్థి తన గురువు సేవలో వినయపూర్వకంగా చేసిన దానికి మించి యీ పుస్తకంలో మరేమీ లేదు.

"తన శాస్త (గురువు) బోధనల్ని వివరించటంలో, వాటిలోని మౌలిక సూత్రాలపై చెదరని దృష్టి నిలపటం శిష్యుని బాధ్యత. బుద్ధునికి సత్యమే ఆలంబన అయినందున సత్యం ఎటువైపు దారిచూపినా శిష్యుడు దాన్ని అనుసరించవలసిందే. దీనికి అనుగుణంగానే, 'హేతుబద్ధం కానిది లేక సత్యం కానిది ఏదీ బుద్ధుని బోధన కాదు' అనేది అన్ని బౌద్ధశాఖలు అంగీకరించిన నియమం. గుర్తింపు పొందిన బుద్ధిస్టు రచయితలందరు ధర్మాన్ని వివరించటంలో తర్కం, మనోవిజ్ఞానశాస్త్రాల సహాయం తీసుకున్నారు. సాధారణంగా భావాలకుండే విలువపై వారికి ఎంత గౌరవం అంటే, వారు కొన్నిసార్లు ధర్మానికి మూలంగా భావించే సూత్రాలను సైతం పక్కనబెట్టారు. కాబట్టి, ఆధునికవిజ్ఞానం వెలుగులో బుద్ధిజాన్ని వివరించటంలో యీ రచయిత తన బౌద్ధధర్మమార్గం నుండి పక్కదోవ పట్టలేదు, తొలినాటినుండి బుద్ధిస్టులు కొనసాగిస్తున్న పద్ధతినే అనుసరించాడు. బుద్ధిజానికి ఆధునికతను అందించటంలో రచయిత విజయవంతమైతే, అది ఆయన ఆధునిక భావాలకు బుద్ధిజం రంగు అద్దటం ద్వారాగాక, వివిధరూపాల్లో వున్న బుద్ధిజం యొక్క లోతుల్లోకి వెళ్ళి వాటిలోని మౌలికసత్యాలను వెలుగులోకి తీసుకురావటం ద్వారానే జరిగింది.

"యూరప్, అమెరికాల్లో ఆలోచనాపరులైనవారు బుద్ధిజంపట్ల ఆకర్షితులౌతున్నారు. ఇప్పటికే ఆ దేశాల్లో బుద్ధిజం వ్యాప్తికోసం పనిచేస్తున్న సంస్థలు వున్నయ్. చికాగో కేంద్రంగాగల మహాబోధి సొసైటీశాఖ ఒకటి అమెరికాలో ఎంతో విలువైన కృషి చేస్తున్నది. శాన్‌ఫ్రాన్సిస్కోలో జపాన్‌కు చెందిన బుద్ధిస్టు సంస్థ ప్రచురించే 'ది లైట్ ఆఫ్ ధర్మా' అనే పత్రికను అమెరికాలో విస్తృతంగా చదువుతారని చెబుతారు. లీప్జింగ్ (జర్మనీ)లో స్థాపించబడ్డ ఒక బుద్ధిస్టు సంస్థ 'డెర్ బుద్ధిస్ట్' (ద బుద్ధిస్ట్) అనే పత్రికను ప్రచురించటంతో పాటు రచనలు, ఉపన్యాసాల ద్వారా తథాగతుని బోధనల్ని వ్యాప్తిచెయ్యటంలో చురుకుగా పనిచేస్తుంది. మాయావాదపు ధోరణుల్ని తొలగిస్తే, బుద్ధిజం ఎంతోమంది పాశ్చాత్యుల్ని

ఆకర్షిస్తుందనటంలో సందేహం లేదు. ఏదేమైనా, ఉన్నతస్థాయి ఆలోచనకు వివాహం ప్రతిబంధకం కాదు అనేచోట బుద్ధిజంలోని బ్రహ్మచర్యం అతిగానే కనిపిస్తుందని చెప్పవచ్చు. కాని, యీ విషయంలో కూడా బుద్ధిజం భయపడాల్సింది లేదు. తొలి బుద్ధిస్టు శాఖల కాలంనుండి గృహస్థులు కూడా అర్హతులు కాగలరని చెప్పటం జరిగింది. నేపాల్ వజ్రాచార్యులు మొదలు శ్రీలంక స్థవిరుల వరకు తనలో యిముడ్చుకొనే విశాలత్వం కలిగిన ధర్మంలో, అటు నిష్ఠతో ఆచరించేవారికి, యిటు గృహస్థ జీవితం గడిపేవారికి స్థానం వుంది.

"భారతదేశంలో బౌద్ధం పునరుద్ధరణకు గల అవకాశాలను ఒక ప్రముఖ చరిత్రకారుడు అంచనా వేశాడు. విద్య, స్వేచ్ఛాయుతమైన ఆలోచన వ్యాప్తిచెందటంతో, రామ్, రహీమ్, కృష్ణుడు, జీసస్, మారియమ్మ, మేరి వంటివారి పట్ల విశ్వాసం సడలిన చింతనాపరులైన భారతీయులకు బౌద్ధం ఆసక్తి కలిగించగలదు. మానవజాతి విముక్తి ప్రదాతగా దీర్ఘకాలం భారతీయుల మన్ననలందుకున్న వ్యక్తి బోధనలివి. నేడు బుద్ధావతారంగా మరుగుపరచబడ్డ, అజరామరమైన శాక్యముని పేరు, స్వదేశీ స్ఫూర్తి వేళ్ళూనుకొని ఎదిగే కొలది, పునరుద్ధరించబడి పూర్వవైభవంతో వెలుగొందగలదని ఖచ్చితంగా చెప్పవచ్చు.

"నాగరిక సమాజపు జవం, జీవం నైతికతేగాని, ఆధ్యాత్మికత కాదని చెప్పినమాట నిజం. జీవాత్మ, పరమాత్మ లేదా సర్వశక్తిమంతుడైన భగవంతునిలో నమ్మకంకాదు సమాజాన్ని నడిపేది. దాన్ని నడిపే నిజమైన శక్తి సత్యసంధత, దానగుణం, న్యాయం, సహనం, సోదరభావం – క్లుప్తంగా చెప్పాలంటే, ధర్మం లేదా బుద్ధిజం అనే పదాల్లో వ్యక్తమయ్యే ప్రతిదీ. సామ్రాట్ అశోకుడు బౌద్ధధర్మాన్ని తన పరిపాలనకు పునాదిగా నిలిపి వుత్తమమైన పనిచేశాడు. బుద్ధుని బోధనల వెలుగు పునరుత్తేజం పొందకుండా భారతదేశం అశోకుని కాలంనాటి వైభవాన్ని తిరిగి పొందజాలదు. ధర్మం ప్రపంచ ప్రజలందరికి స్ఫూర్తి, మార్గదర్శి కాకుండా శాంతి, సుఖాలకు హామీ లేదు. మహోన్నతమైన యీ ఆశయసాధనను యీ పుస్తకం వేగవంతం చేస్తుందని రచయిత ఆశించటం అత్యాశే. కాని యిది తన శాస్త యొక్క బోధనల్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోటానికి ఎంతో కొంత వుపయోగపడుతుందని ఆశిస్తున్నాడు."

మొదటి ముద్రణ నుండి యింత దీర్ఘంగా వుటంకించినందుకు క్షమించాలి; రెండు కారణాల వల్ల యిది జరిగింది. నా ఆశయాలను, లక్ష్యాన్ని వివరించే మరో దారి నాకు కనిపించలేదు; భారతదేశంతో పాటు యితర దేశాలనుండి మొదటి ముద్రణకు వచ్చిన ఆదరణ, ప్రేమ ఆశించింది నెరవేరుతున్నదనే నమ్మకం కలిగించింది. మొదటి ముద్రణ వెలువడిన నాటినుండి జరిగిన అనేక సంఘటనలు మేధావుల్లో బుద్ధిజం పట్ల ఆసక్తి పెరుగుతుందనే విషయాన్ని రుజువు చేస్తున్నయ్. వాటిలో కొన్నిటిని మాత్రమే యిక్కడ

ప్రస్తావిస్తున్నాను: పెషావర్ సమీపాన వెలికితీసిన బుద్ధుని అవశేషాల పట్ల భారతదేశ వ్యాపితంగా ఆసక్తి కనిపించింది; బుద్ధిస్టులు కానివారు ఎందరో వైశాఖి పండుగ జరుపుకుంటున్నారు; బెంగాల్ బుద్ధిస్టు అసోసియేషన్ ఎంతో ప్రగతిని సాధించింది; గ్రేట్ బ్రిటన్, ఐర్లాండుల్లో బుద్ధిస్టు సంఘాలు వెలిశాయ్; బెంగాలీలో 'జగజ్యోతి', ఇంగ్లీషులో 'బుద్ధిస్టు రివ్యూ' పత్రికలు వెలువడుతున్నయ్. ఈ సంఘటనలు జరగటంలో నా పుస్తకం యొక్క ప్రత్యక్ష ప్రభావం వుందని చెప్పటం అహంకారమే. కాని యీ వుద్యమాల్లో భాగస్వాములైన కొందరు, నా పుస్తకం వారికి స్ఫూర్తినిచ్చిందని చెప్పటం నాకు ఎంతో తృప్తినిచ్చే విషయం.

ఈ ముద్రణ యొక్క పథకం స్థూలంగా మొదటిదానిలాగే వుంది. కాని నా బుద్ధిస్టు 'ఆధునికత' 'పాత, కొత్త తరాలకు చెందిన సైంటిస్టుల అభిప్రాయాల కలగూరగంప' కాదని, అది బుద్ధుని బోధనల స్ఫూర్తికి చాలా సన్నిహితమైందని చెప్పటానికి కొన్ని కొత్త విషయాల్ని జోడించాను. బుద్ధిస్టుకు తాను మహాయానానికి చెందుతాడా లేక హీనయానానికా అనేది కాదు సమస్య, గతంనుండి అరువు తెచ్చుకున్న ఆదర్శాలతోగాక, నవీన విజ్ఞానస్ఫూర్తితో మనుగడ సాగిస్తున్న ఆధునిక నాగరికతతో బుద్ధిజం భుజం కలిపి నడవగలుగుతుందా, లేదా అనేదే అసలు సమస్య. ఈ ప్రశ్నకు జవాబివ్వటం ఎంతో అప్రమత్తతతో చెయ్యవలసిన పని, కనుక మిత్రులు, సమీక్షకులు, యీ రంగంలో కృషిచేస్తున్న యితరుల నుండి వచ్చిన సూచనలు, విమర్శల్లో దేన్నీ తేలిగ్గా తీసుకోలేదు. కొంతమంది మిత్రుల సలహాతో బౌద్ధానికి చెందిన కళల గురించిన వివరాలు జోడించాను.

హనొలులూకు చెందిన బుద్ధిస్టు మిసెస్ మేరీ ఇ.ఫోస్టర్ తన విరాళంతో, యీ పుస్తకం అన్యథా చేరలేని ప్రాంతాలవారికి అందుబాటులోకి తెచ్చారు. వీరితో పాటు నా పుస్తకం విజయవంతం అవటంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**పి.ఎల్.ఎన్.**

మద్రాస్,
367, మింట్ స్ట్రీట్,
డిసెంబర్ 1911

# మొదటి అధ్యాయం

## చారిత్రక బుద్ధుడు

**బో**ధి అంటే పరిపూర్ణమైన బుద్ధి, నైతికప్రవర్తనల మేలు కలయిక. బోధిని పొందిన వ్యక్తిని బుద్ధుడు అంటారు. ఇటువంటి బుద్ధులు బోధించిన ధర్మాన్ని బుద్ధధర్మం లేదా బుద్ధిజం అని పిలుస్తున్నాం. మనిషి బోధిని కేవలం మానవప్రయత్నం ద్వారా పొందవచ్చు. అలా బోధిని పొందినవారిలో సుప్రసిద్ధుడు గౌతమ శాక్యముని.

బౌద్ధధర్మాన్ని స్థాపించింది గౌతమ శాక్యముని అని సాధారణంగా చెబుతారు.కాని తనకంటే ముందు ధర్మబోధ చేసిన బుద్ధులున్నట్లు శాక్యముని ప్రస్తావించాడు. క్రైస్తవమత స్థాపకుడైన జీసస్ తాను 'దేవుని కుమారుడన'ని ప్రకటించాడు. క్రీస్తు తనను నమ్మినవారి పాపభారం తనపై వేసుకుని శిలువపై మరణించి, తిరిగి జీవాన్ని పొందాడని నమ్మనివారిని క్రైస్తవుడని అనరు. అలాగే ఇస్లాం మతస్థాపకుడైన మహమ్మద్ 'దైవదూత' అని విశ్వసించనివారిని మహమ్మదీయుడని పిలవరు. కాని, బుద్ధుడు తాను మానవుణ్ణి మాత్రమేనని, అంతకుమించిన అతీంద్రియశక్తులేవీ తనకు లేవని చెప్పాడు. అయితే ఆయన పరిపూర్ణమయిన మానవుడనటంలో సందేహం లేదు. తనను అనుసరించినవారి పాపాలను కడిగివేసే రక్షకుడిగా బుద్ధుడు తనను ప్రకటించుకోలేదు. మానవాతీత శక్తుల (దైవ) సందేశాన్ని ప్రజలకు అందించటానికి వచ్చిన ప్రవక్తనని చెప్పలేదు. ఏ మార్గం ద్వారా బుద్ధుడు తన విముక్తిని సాధించుకున్నాడో, ఆ మార్గాన్ని యితరులకు బోధించటానికి మించి తనవద్ద మరేమీ లేదన్నాడు. ప్రతి ఒక్కరూ తమ పాపభారాన్ని తామే భరించాలని, అలాగే తమ విముక్తినీ తామే సాధించుకోవాలని బోధించాడు. ఈ విషయాన్ని శాక్యముని బోధనల సకంలనంగా చెప్పబడే "ధర్మపాద" నొక్కిచెబుతుంది.

**"మన ఆలోచనల ఫలితమే మన జీవితం.**
**అది మన ఆలోచనల పునాదిపై,**
**వాటి సమాహారంగా నిర్మించబడింది"**
**"నువు చెడు చేస్తే, వాటి ఫలితం నీకే చెందుతుంది.**
**నువు మంచి చేస్తే, వాటి ఫలితం నీకే దక్కుతుంది.**
**మంచయినా, చెడయినా అది నీకోసం నువు చేసుకునేదే.**
**ఒకరు మరొకరిని ఉద్ధరించలేరు సుమా!"**
**"స్వయంకృషితో నీ ముక్తిని నీవే సాధించాలి.**
**తథాగతులు దారి మాత్రమే చూపగలరు."**

మహాపరినిర్వాణసూత్రంలో ఆనందునికిచ్చిన ఉపదేశం దీనికి రుజువు: "ఓ ఆనందా, మీకు మీరే వెలుగుదివ్వెలు కావాలి. మీకు మీరే దిక్కు. వెలుగునిచ్చే ధర్మాన్ని ఆశ్రయించండి. మీకు మీరే రక్ష. వేరెవ్వరూ మిమ్మల్ని రక్షించలేరు."

"ఇప్పుడైనా, నా తదనంతరమయినా, ఎవరైతే తమకు తామే ఆలంబన అవుతారో, ఎవరయితే తమకు తామే దీపాలై వెలుగు పొందగలుగుతారో వారే మహోన్నతమైన సంబోధిని పొందుతారు." మానవుని విముక్తి సాధనలో మానవాతీత శక్తుల పాత్రను నిరాకరించటమే గాక, తనపై నమ్మకం వుంచినంతమాత్రానే దుఃఖవిముక్తి జరుగుతుందని శాక్యముని* ఎక్కడా చెప్పలేదు. అంతేగాక తనకు వ్యక్తిగా ఎలాంటి ప్రాముఖ్యత యివ్వొద్దని, నిరంతరం ధర్మాచరణ మీదే దృష్టి నిలపమని తన శిష్యులను కోరాడు. **వజ్రచ్ఛేదికలో** యిలా చెప్పబడింది: "తథాగతుని కోసం ఒక రూపంలోనో, శబ్దంలోనో ఎవరైతే వెతుకుతారో వారు దారితప్పి నడుస్తున్నట్లే, వారు ఎన్నటికీ తథాగతుణ్ణి అవగాహన చేసుకోజాలరు." ఇదే సత్యాన్ని ద్రోణుడనే బ్రాహ్మణునితో బుద్ధుడు జరిపిన సంభాషణ మరింత రమ్యంగా వివరిస్తుంది. ఒకరోజు చెట్టుకింద కూర్చొనివున్న బుద్ధుణ్ణి ద్రోణుడు ప్రశ్నించాడు. "నువు దేవతవా?" అందుకు బుద్ధుడు "కాదు" అని బదులిచ్చాడు. "నువు గంధర్వుడివా" - "కాదు" - "యక్షుడివా?" - "కాదు" - "మానవుడివా?" - "నేను మానవుణ్ణి కాదు." చివరకు ద్రోణుడు "మరి నువ్వెవరు?" అనడిగిన ప్రశ్నకు బుద్ధుడిలా జవాబిచ్చాడు: "ఏ కోరికలు, ఏ మనోక్లేశాలు నన్ను దేవతగా, గంధర్వుడిగా, యక్షుడిగా, మనిషిగా భావించేటట్లు చేశాయో, ఆ కోరికలను మనోదౌర్బల్యాలను అంతమొందించినవాణ్ణి. ఓ బ్రాహ్మణా! నేను బుద్ధుణ్ణి."

హిందూ పురాణాల్లో దేవతలు, యక్షులు, గంధర్వులు మానవ రూపం ధరిస్తారు. అందువల్ల ద్రోణుడు తన ముందున్న వ్యక్తిని పైవిధంగా ప్రశ్నించటం సహజమే. కాని 'నువు మానవుడవా?' అన్న ప్రశ్నకు వచ్చిన జవాబు అతన్ని ఆలోచనలో పడేట్లు చేసింది. అందుకే బ్రాహ్మణుడు 'నువ్వెవరివి?' అని ప్రశ్నించాల్సి వచ్చింది. తటపటాయించకుండా బుద్ధుడు సమాధానమిచ్చాడు. ఆయన దృష్టిలో ముఖ్యమైంది అతని రూపం కాదు. అపారమైన కరుణ, ప్రజ్ఞలతో నిండిన 'బోధి' అనేపదం మాత్రమే ఆయన మూర్తిమత్వాన్ని సంపూర్ణంగా నిర్వచించగలిగేది. ఆయన శాక్యముని మాత్రమే కాదు. తథాగతుడు కూడా. బుద్ధుడు బోధించిన సత్యాలు ఆయన మూర్తిమత్వసారాంశం తప్ప మరేమీ కావు. మానవులందరిలో పరమవాస్తవికతకు నిదర్శనంగా నిలిచిన భగవానుని 'ధర్మధాతుస్వభావాత్మకుడు' అని అనటం అతిశయోక్తి కాదు. అందుకే బుద్ధిజంలో

---

* సిద్ధార్థ గౌతముడు శాక్య వంశస్తుడైనందున ఆయన్ని శాక్యముని అని కూడా అంటారు.

ప్రముఖంగా కనిపించే మూర్తిమత్వం బుద్ధునిదేగాని శాక్యముని*ది కాదు.

ధర్మానుగుణ్యమైన జీవితం ప్రధానమైనదైనప్పటికీ, ఆ మహోపాధ్యాయుని వ్యక్తిత్వం విలువలేనిదేమీ కాదు. అది ధర్మాచరణలో నడిచేవారికి ఒక నమూనా. ఈ సందర్భంలో గుర్తుంచుకోదగిన విషయం ఒకటుంది. తథాగతుని బోధనలకు ఆయన జీవితంలో జరిగిన అద్భుత సంఘటనలు ఆధారం కాదు. గౌతమ శాక్యముని జీవితంలోని కొన్ని సంఘటనలకు చారిత్రక ఆధారాలు లేకపోవచ్చు. కాని, అవి ఆయన బోధనల విలువను ఏ మాత్రం దిగజార్చేవి కావు. బుద్ధుడు చెప్పినట్లు అతని 'బోధనలు వాటికవే నిరూపకాలు.' గౌతమబుద్ధుని జీవితంలోని ప్రధాన సంఘటనలను, వాటికుండే కావ్యలక్షణాల పొరలను తొలగించి చూస్తే, సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఆయన క్రీ.పూ. 6వ శతాబ్ది మధ్యకాలం (563 బి.సి)లో జన్మించాడు. నేటి నేపాల్‌లోగల కపిలవస్తు జిల్లాలోని 'లుంబినివనం' ఆయన జన్మస్థానం. ఇక్కడ ఆ మహోపాధ్యాయుని స్మృతిగా అశోకచక్రవర్తి క్రీ.పూ. 239లో ఒక మహాస్థంభాన్ని నిర్మించాడు. దానిపై యిలా రాసివుంది: "ఇది భగవానుని జన్మస్థలం."

కపిలవస్తు శాక్యజాతి ముఖ్యపట్టణం. సిద్ధార్థుడు ఆ జాతిలో జన్మించకపోతే శాక్యుల గురించిన చరిత్ర బహుశా మనకు తెలిసవుండేది కాదు. గౌతముని తండ్రి శుద్ధోదనుడు, తల్లి మాయాదేవి శాక్యజాతివారు. సిద్ధార్థుడు పుట్టిన ఏడవరోజునే తల్లి మరణించింది. పినతల్లి ప్రజాపతి గౌతమి పెంపకంలో సుఖసంతోషాలతో అతని బాల్యం గడిచింది. పదహారవ ఏట తన మరదలైన యశోధరతో వివాహం జరిగింది. యశోధర కోలీయవంశ రాజకుమారి. సిద్ధార్థ, యశోధర దంపతులకు రాహులుడనే కొడుకు పుట్టాడు. సిద్ధార్థుడు ఇరవైఐదేళ్ళ ప్రాయం వరకు ఆనందమయమైన, ఆహ్లాదకరమైన ప్రపంచాన్నే చూశాడు. అటుతరువాత మనిషి అనుభవిస్తున్న బాధాకరమైన, దు:ఖమయమైన జీవితాన్ని చూడటం తటస్థించింది. అది అతని హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. జీవితసమస్యలపట్ల అంతర్మథనానికి దారితీసింది. మానవుని దుఃఖానికి మూలాలను అన్వేషించి, వాటిని సమూలంగా అంతమొందించాలనే మహాసంకల్పంతో తన ఇరవైతొమ్మిదవ ఏట సంసారబంధాలను తెంచుకుని పరివ్రాజకుడయ్యాడు.

ఈ మహాభినిష్క్రమణ అనంతరం, బోధి కోసం అన్వేషిస్తున్న సిద్ధార్థుడు బోధిసత్వుడని పిలవబడ్డాడు. సిద్ధార్థుడు మొదట ఆలారకాలాముడనే బ్రాహ్మణుని వద్ద శిష్యునిగా చేరి సత్యాన్వేషణ ప్రారంభించాడు. ఆలారకాలాముని నివాసం వైశాలి. ఆయన సాంఖ్యదర్శనం బోధించిన కపిలుని వారసుడు. సాంఖ్యసిద్ధాంతం 'ఆత్మ' పునాదిగా కలిగింది. ఆత్మను ప్రాపంచిక బంధాలనుండి విముక్తి చేయటం ద్వారానే మనిషి తన విముక్తిని సాధించగలడని చెప్పింది. ఈ విషయం బోధిసత్వుని సంతృప్తిపరచలేదు. అందుకే

ఆయన ఆలారకాలాముని విడిచి వెళ్ళాడు. తరువాత వైశేషికాన్ని బోధించే ఆచార్యుడు ఉద్రకరామ పుత్రుని వద్దకు చేరాడు. ఉద్రకరామ పుత్రుడు కర్మ, ఆత్మ, పునర్జన్మల గురించి సిద్ధార్థునికి బోధించాడు. కర్మసిద్ధాంతాన్ని సరైనదేనని భావించిన సిద్ధార్థుడు ఆత్మ, పునర్జన్మ వంటి అంశాలను అంగీకరించలేకపోయాడు. అందుచేత ఉద్రకరామ పుత్రుని శిష్యరికాన్నీ వదలి, కొంతకాలం వైదిక మతగురువుల సాహచర్యంలో గడిపాడు. సున్నితమనస్కుడైన సిద్ధార్థుడు యజ్ఞయాగాలలో జరుగుతున్న జంతుబలులను చూసి చలించిపోయాడు. నైతికప్రవర్తనను విడనాడి, మూగజీవాలను బలివ్వటం ద్వారా దు:ఖ విముక్తిని సాధించటం అసాధ్యమని వైదికబ్రాహ్మణులకు స్పష్టం చేశాడు.

వైశాలి నుండి బయలుదేరి మగధ సామ్రాజ్యంలో గయ సమీపానగల ఉరువేల అరణ్యప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ కౌండిన్యుడు, అతని సహచరులయిన మరో నలుగురు పరివ్రాజకులను కలిశాడు. వీరినే పంచవర్గీయులంటారు. పంచవర్గీయులు తమ యింద్రియాలను అదుపు చేయటం ద్వారా భావోద్రేకాలను అణచివేయటం, తమ శరీరాన్ని తీవ్రమయిన బాధలకు గురిచేయటం వల్ల ముక్తి లభిస్తుందనే మార్గాన్ని నమ్మి, ఆచరిస్తున్నారు. వారి సత్యనిష్ఠను, కఠోరసాధనను సిద్ధార్థుడు అభినందించాడు. తాను కూడా వారితో కలసి దుఃఖ విముక్తి మార్గం కనుగొనే లక్ష్యంతో ఆరు సంవత్సరాల పాటు అత్యంత కఠోరమైన సాధనను కొనసాగించాడు.

దీనితో ఆయన శరీరం చిక్కిశల్యమయింది. ఒకరోజు నిరంజన నది (నేటి ఫాల్గు)లో స్నానం చేసి, నీరసించిన శరీరంతో ఒడ్డుపైకి రాలేకపోయాడు. పక్కనున్న చెట్టుకొమ్మను ఆధారం చేసుకుని ఎలాగో పైకి రాగలిగినా, తన ఆశ్రమానికి వెళ్తూ దారిలో సొమ్మసిల్లి కిందపడిపోయాడు. బహుశా యీ సంఘటన అతనికి ప్రాణాంతకమై వుండేది. కాని, యాదృచ్ఛికంగా అటువైపు వచ్చిన ఒక పశువుల కాపరి కూతురైన సుజాత పాలతో కలిపిన అన్నం తినిపించి సిద్ధార్థుని ప్రాణాలు కాపాడింది. దీనితో తేరుకున్న సిద్ధార్థుడు 'దేహదండన శరీరాన్ని, మనసునూ దుర్బలం చేస్తుంది తప్ప, తానాశించిన దుఃఖవిముక్తిని కలిగించదని గ్రహించాడు. ఫలితంగా తాను అప్పటివరకూ ఆచరిస్తున్న కఠోర దేహదండనను వదిలేశాడు. తన శరీరపోషణపై తగిన శ్రద్ధ వహిస్తూనే, అంతఃశోధనపై మనసు లగ్నంచేసి, మానవునిలో స్వతస్సిద్ధంగా వున్న హేతుబుద్ధితో సత్యాన్వేషణ కొనసాగించాడు.

**"సత్యమన్నది వున్నది మన అంతరంగమున**
**అక్కరకు రాదు నువు నమ్మిన మరేదైనా.**
**మనలోని మనసుమూలము స్థావరమై**
**వెలుగుతున్నది సత్యము పరిపూర్ణమై."......**

ఒకరోజు రాత్రి, రావిచెట్టు కింద గాఢమైన ధ్యానంలో వుండగా, సిద్ధార్థునిలో అంతః చేతనతో నిండిన జ్ఞానం మేలుకొంది. అప్పటివరకు తానాచరించిన మార్గాలలోని దోషాలను గ్రహించాడు. ప్రపంచాన్ని దుఃఖమయం చేస్తున్నవాటి మూలకారణాలను, దీన్ని సమూలంగా అంతమొందించగలిగే మార్గాన్ని స్పష్టంగా దర్శించగలిగాడు. స్వార్థాన్ని పట్టుకొని వేలాడటమే దుఃఖానికి హేతువని, దశపారమితలను పొందగలగటమే దు:ఖ వినాశన మార్గమని తెలుసుకున్నాడు. స్వయం సంబోధితో మహోన్నతమైన యీ సత్యాలను కనుగొనటంతో జ్ఞానోదయం పొందిన బోధిసత్త్వుడు బుద్ధుడైనాడు. గురువు లేదా దేవుని సహాయం లేకుండా స్వయంకృషితో మాత్రమే అందుకోగలిగిన సంబోధిని స్వబోధనం అనటం ఎంతో సరైనది.

ఇది బుద్ధభగవానుని జీవితంలోనే అత్యంత క్లిష్టమైన సమయం. "ఎన్నో కష్టాలను అధిగమించి కనుగొన్న మహత్తర సత్యాలు ఎంతో విలువైనప్పటికి, వీటిని సామాన్యులు అర్థంచేసుకోవటం అంత సులభం కాదు. ఈ సత్యాలు ముక్తికి సోపానాలైనప్పటికీ, ప్రాపంచిక, కామసుఖాల్లో* మునిగివున్న జనం వీటిని ఎలా అర్థం చేసుకోగలరు? మానవులకు ప్రపంచ వాస్తవ స్వభావాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం ఉన్నప్పటికి, వీరంతా అవిద్య, అజ్ఞానమనే వలలో చిక్కుకొని వున్నారు. కర్మ, కార్యకారణ సిద్ధాంతాలతో కూడిన యీ నూతనధర్మాన్ని సామాన్యులకు వివరించటం సులభం కాదు. 'ఆత్మ' భావన వీడి మానవజీవితపు నిజస్వభావాన్ని వీరు గ్రహించగలరా? ప్రాపంచిక సుఖాలను వీడి, పరిపూర్ణ సుఖశాంతులనిచ్చే నిర్వాణస్థితిని అవగతం చేసుకోగలరా? నేను కనుగొన్న సత్యాలను యితరులకు బోధించటం సరైనదేనా? ఈ కార్యసాధనలో విఫలమైతే మిగిలేది నిరుత్సాహం, నిస్పృహలే కదా!" ఈ విధమైన సంశయాత్మక ప్రశ్నలు అతని మనసును అలముకున్నాయి. కాని, కొద్దిసమయం తరువాత, అతని హృదయంలో మానవాళిపట్ల అపారమైన కరుణ ఉదయించింది. "స్వార్థాన్ని తుదికంటా అంతమొందించిన తనకు యితరుల శ్రేయస్సును మించిన పరమార్థం ఏముంది? దుఃఖసాగరంలో మునిగి వున్న యీ జనుల విముక్తిమార్గాన్ని బోధించటానికి మించి చేయవలసింది లేదు." ఇలా పునరాలోచనతో, తాను కనుగొన్న ధర్మాన్ని సమస్త మానవాళికి అందించాలని బుద్ధభగవానుడు నిర్ణయించుకున్నాడు.

ఈ దృఢసంకల్పంతో బుద్ధుడు అప్పటికే శతాబ్దాలుగా వైదిక ఆచారాలకు నిలయమైన, 'కాశీ' నగరానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో నగ్నంగా సంచరించే ఉపాకుడనే జైనసన్యాసి ఎదురయ్యాడు. ప్రశాంతత తొణికిసలాడే, తేజోవంతమైన శాక్యముని

---

* అంటే అన్ని రకాల సుఖాలు అని. కేవలం సెక్స్ అని కాదు.

స్వరూపాన్ని చూసి ఆకర్షితుడైన ఉపాకుడు యిలా ప్రశ్నించాడు: "మిత్రమా! నీ ఆచార్యుడెవరు? ఎవరి బోధనలతో ప్రభావితుడవై ప్రాపంచిక సుఖాలను విడనాడి యిలా పరివ్రాజకుడవైనావు?" అందుకు శాక్యముని, "నాకు గురువులైనవారెవరూ లేరు. నా సరిసమానులూ లేరు. బుద్ధుడనైన నేను పరిపూర్ణ మానవుడను. అచంచలమైన శాంతిని, నిర్వాణాన్ని పొందినవాడిని. సత్ప్రవర్తనా సామ్రాజ్యాన్ని నెలకొల్పే నిమిత్తం కాశీరాజ్యానికి వెళుతున్నాను. అజ్ఞానపు చీకటిలో సంచరిస్తున్న జనావళికి వెలుగుదివ్వెను అందించబోతున్నాను" అని జవాబిచ్చాడు. ఉపాకుడు తిరిగి ప్రశ్నించాడు: "నువు యీ ప్రపంచాన్ని జయించిన జినుడవా?" అందుకు బుద్ధుడిలా బదులిచ్చాడు: "సమస్త మనోక్లేశాలను, దౌర్బల్యాన్ని జయించినవాడినే జినుడు అని పిలుస్తారు. మనసును తన అధీనంలో వుంచుకోగలిగినవాడే నిజమైన విజేత. పాపచింతనను అంతమొందించి, స్వార్థాన్ని జయించిన నేను జినుడనే."

కాశీనగరంలోగల హరిణివనం (జింకలతోట)లో కౌండిన్య తదితర పంచవర్గీయులను కలిసే నిమిత్తం బుద్ధుడు అక్కడికి చేరుకున్నాడు. అతని రాకను దూరంనుండే గమనించిన పంచవర్గీయులు తమలో ఎవరూ తపోభ్రష్టుడైన శ్రమణ గౌతమునికి నమస్కరించరాదని, లేచి నిలబడటంగాని, మర్యాదపూర్వకంగా పలకరించటంగాని చెయ్యకూడదని నిశ్చయించుకున్నారు.కాని, తథాగతుడు వారిని సమీపించగానే అప్రయత్నంగా వారు కూర్చున్న ఆసనాల నుండి లేచి నిలబడి, ఆయనకు తగిన మర్యాదలన్నీ చేశారు. అయితే, వారు భగవానుని 'శాక్యగౌతమా' అని సంబోధించారు. అప్పుడు ఆయన వారితో యిలా అన్నాడు: వ్యక్తిగతమైన పాతపేరుతో మీరు నన్ను పిలవద్దు. అర్హతుడైనవానిని అలా పిలవటం సముచితం కాదు. నన్నెవరు గౌరవించినా, అగౌరవపరచినా నా మనసు చలించదు. కాని సమస్త జీవులను కరుణరసహృదయంతో ప్రేమించేవారిని, వారిపేరుతో పిలవటం సమంజసం కాదు. సంబోధిని పొందినవారు యీ జగత్తుకే ముక్తిమార్గం చూపిస్తారు. అటువంటివారిని 'పిల్లలు తమ తండ్రిని గౌరవించినట్లు'గా మీరు గౌరవించాలి."

తరువాత భగవానుడు పంచవర్గీయులకు తన మొదటి ధర్మోపదేశమైన '**ధర్మచక్ర ప్రవర్తనసూత్రాన్ని**' బోధించాడు. అందులో వారికి **చతురార్యసత్యాలను, ఆర్య అష్టాంగమార్గాన్ని** వివరించి, వారిని తన తొలి శిష్యులుగా స్వీకరించాడు. దీనితో బౌద్ధ'సంఘా'నికి అంకురార్పణ జరిగింది. తరువాత కొద్దిరోజులకే కాశీనగరంలో ధనవంతుడైన ఒక వ్యాపారి కొడుకు యక్షుడు కలిశాడు. దుఃఖభారంతో పిచ్చివానిలా తిరుగుతున్న యక్షునికి విముక్తిమార్గాన్ని బోధించి, అతనికి 'సంఘం'లో స్థానం కల్పించాడు. యక్షుణ్ణి అనుసరించి, విలాసజీవితం గడుపుతున్న అతని మిత్రులు

యాభైనలుగురు సంఘంలో చేరారు. భగవానుడు తన అరవైమంది శిష్యులను ధర్మబోధకులుగా వివిధ ప్రాంతాలకు వెళ్ళమని ఆదేశించాడు. తరువాత కొద్దికాలానికి, ప్రముఖ అగ్ని ఆరాధకులైన ఉరువేలకాశ్యపుడు, నాదికాశ్యపుడు, గయా కాశ్యపుడు వారి అనుచరులైన వెయ్యిమందిని తన శిష్యులుగా పరివర్తన చెందించాడు. వీరికి చేసిన బోధననే **"అగ్నిప్రబోధసూత్రం"** అని అంటారు. దీనిలో అవిద్య లేదా అజ్ఞానం అనేది రాగం, ద్వేషం, మోహం అనే మూడు రకాలైన అగ్నులను ఉత్పత్తి చేసి, జీవితాన్ని ఎలా దహించివేస్తుందో, వీటిని సత్రవర్తన ద్వారా ఎలా నివారించవచ్చో వివరించబడింది.

సిద్ధార్థుడు పరివ్రాజకుడైన కొత్తలో మగధసామ్రాజ్య రాజధాని రాజగృహకు వెళ్ళాడు. మగధరాజయిన బింబిసారుడు సిద్ధార్థుని లక్ష్యం సిద్ధించిన తరువాత, రాజగృహకు వచ్చి తనను శిష్యునిగా స్వీకరించమని అభ్యర్థించాడు. బింబిసారునికిచ్చిన మాట కోసం బుద్ధుడు శిష్యసమేతంగా రాజగృహకు వచ్చాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బింబిసారుడు సపరివారసమేతంగా భగవానుని దర్శనార్థం వెళ్ళాడు. అక్కడ ఉరువేల కాశ్యపుని చూసిన బింబిసారునికి 'గౌతముడు కాశ్యపుని శిష్యునిగా మారాడ'నే అనుమానం తలెత్తింది. వెంటనే కాశ్యపుడు భగవానుని పాదాలకు నమస్కరించి అక్కడివారి అనుమానాన్ని తొలగించాడు. నిర్వాణప్రశాంతతను అనుభవించిన తాను యజ్ఞ యాగాదులను, పశుబలులను వదలివేశానని వివరించాడు. అప్పుడు బుద్ధుడు ఆత్మభావనలో వుండే డొల్లతనాన్ని అక్కడివారికి వివరించాడు. ఈ ప్రబోధాన్ని విన్న బింబిసారుడు, అతని పరివారం త్రిశరణాలను స్వీకరించి ఉపాసకులయ్యారు. రాజు భగవానుని శిష్యసమేతంగా రాజప్రాసాదానికి ఆహ్వానించి, భోజనాది కార్యక్రమాల అనంతరం, తన విహారప్రాంతమయిన వేణువనాన్ని భిక్షుసంఘానికి దానం చేశాడు.

రాజగృహలో మరో ప్రధాన సంఘటన జరిగింది. సంజయుడనే బ్రాహ్మణుని శిష్యులయిన సారిపుత్ర, మొగ్గలాయనలకు బుద్ధుని ప్రథమశిష్యులలో ఒకరైన అశ్వజిత్తు కనిపించాడు. తేజోవంతమై ప్రశాంతత తొణికిసలాడే అతన్ని చూసి సారిపుత్రుడు, "నీ ఆచార్యుడెవరు? ఆయన బోధించే ధర్మమార్గం ఏమిటి?" అని ప్రశ్నించాడు. అశ్వజిత్తు తాను శ్రమణగౌతముని శిష్యుణ్ణని చెప్పి, ఆయన బోధించే ధర్మాన్ని యిలా వివరించాడు: "హేతుజనితాలైన సకలధర్మాల* హేతువును, వాటి నిరోధాన్ని తథాగతుడు వివరించాడు. ఇదే ఆ మహాశ్రమణుని వాదం."

వెంటనే సారిపుత్రుడు మొగ్గలాయనుడి వద్దకు వెళ్ళి తాను విన్న బుద్ధధర్మాన్ని వివరించాడు. వారిద్దరూ తమ సహచరుల సమేతంగా తథాగతుని దర్శించి

---

* ఇక్కడ ధర్మం అంటే వస్తువూ సంఘటనలూ అని అర్థం.

భిక్షుసంఘంలో చేరారు. బుద్ధుడు వేణువనంలో వున్నప్పుడు మహాకాశ్యపుడనే బ్రాహ్మణుడు తన సర్వసంపదలను, సౌందర్యరాశి అయిన భార్యను వదలి భిక్షుసంఘంలో ప్రవేశం పొందాడు. తథాగతుని పరినిర్వాణం తరువాత యీ మహాకాశ్యపుడే భిక్షుసంఘ ప్రథమ సంగీతిని నిర్వహించి, త్రిపీటకాల రూపకల్పనకు సారధ్యం వహించాడు.

తన జీవితకాలంలో బుద్ధుడు ఎంతోమందిని ధర్మాచరణవైపు పరివర్తన చెందించాడు. ఉన్నతులు-నీచులు, సంపన్నులు-పేదలు, పండితులు-పామరులు, బ్రాహ్మణులు-చండాలురు, పరివ్రాజకులు-గృహస్తులు, నేరస్తులు-ఉత్తములు, స్త్రీలు-పురుషులు అనే భేదం లేకుండా అందరూ ఆయన బోధనలతో పరివర్తన చెంది తథాగతుని శిష్యులయ్యారు. ప్రసేనజిత్తు వంటి రాజవంశీకులు, మహాకాత్యాయనుని వంటి బ్రాహ్మణులు, అంగుళీమాల వంటి కరడుగట్టిన హంతకులు, సునీత వంటి చండాల కులస్తులు అనేకమంది తరతమభేదం లేకుండా బౌద్ధసంఘంలో చేరారు. శాక్యవంశంలో సిద్ధార్థుని బంధుమిత్రులు ఎంతోమంది భిక్షుసంఘంలో చేరారు. సిద్ధార్థుని పెంపుడుతల్లి ప్రజాపతి గౌతమి భిక్షుణి సంఘ ఆవిర్భావానికి నాంది పలికింది. బుద్ధుని శిష్యులలో పన్నెండుమంది ప్రముఖ బోధకులయ్యారు. వారు: అజ్ఞాతకౌండిన్య, అశ్వజిత్తు, సారిపుత్రుడు, మొగ్గలాయనుడు, మహాకాశ్యపుడు, మహాకాత్యాయన, అనురుద్ధ, ఉపాలి, పిండోల భరద్వాజ, కొష్ఠిల, రాహుల, పూర్ణమైత్రాయనిపుత్ర.

బుద్ధునికి, సంఘానికి తమ సహాయసహకారాలందించిన ఉపాసకులు అనేకమంది వున్నారు. సుదత్తుడు, జీవకుడు, విశాఖ, ఆమ్రపాలి వారిలో ప్రసిద్ధులు. సుదత్తుడు అనాథబాలల సంరక్షకుడైనందున అతన్ని 'అనాథపిండకుడని పిలిచేవారు. ఈయన శ్రావస్థిలోని ఒక ధనవంతుడు. శ్రావస్థి రాజకుమారుడివద్ద నుండి అత్యంత విలువైన జేతవనాన్ని కొని, భిక్షుసంఘం కోసం జేతవనవిహారం నిర్మించాడు. బింబిసారుడు తన ఆస్థానవైద్యుడైన జీవకుణ్ణి భిక్షుసంఘానికి వైద్యసేవలందించమని కోరాడు. శ్రావస్థిలో అత్యంత ధనవంతుడు, జైనధర్మ అనుయాయి అయిన మిగారుని కోడలు విశాఖ. ఈమె తన మామగారిని బుద్ధధర్మం స్వీకరించేటట్లు చేసింది. తాను మొట్టమొదటి ఉపాసికగా మారి, తన జీవితాంతం భిక్షుణీ భిక్షువులకు అన్నవస్త్రాలను సమకూర్చేటందుకు బుద్ధుని అనుమతి పొందింది. శ్రావస్థి సమీపంలో పూర్వారామ విహారాన్ని నిర్మించింది. సౌందర్యరాణి, నాట్యగానంలో అత్యంత ప్రతిభాశాలియైన ఆమ్రపాలి వైశాలి రాజనర్తకి. బుద్ధుని ఉపదేశం విని, రాజు తనకు ప్రసాదించిన తన నివాసాన్ని, మామిడితోటను సంఘానికి దానం చేసి, తాను భిక్షుణిగా మారింది.

శాక్యముని కాలంలో భారతదేశం తత్వచింతన, మేధోసంపత్తితో విలసిల్లింది. బుద్ధుని కాలంలో అరవైమందికి పైగా తత్వచింతనాపరులు వున్నట్లు బౌద్ధగ్రంథాలు చెబుతున్నయ్.

వారిలో దార్శనికులైన సంజయ వైరాతిపుత్రుడు, అజితకేశకంబళుడు, పూర్ణకాశ్యపుడు, మక్కలి గోశాలుడు, ప్రకృథకాత్యాయనుడు మరియు నిగంఠనాథపుత్రుడు బాగా ప్రసిద్ధిచెందినవారు. సంజయుడు 'ఆత్మభావన'ను నిరాకరించి, ఏ విషయంపైనా నిర్దిష్టమైన అభిప్రాయాన్ని వెల్లడించని 'విక్షేపవాదా'న్ని ప్రచారం చేశాడు. అజితకేశ కంబళుడు 'మానవుని శరీరం నేల, నీరు, గాలి, అగ్ని వంటి భౌతికపదార్థాల సమ్మేళనం తప్ప మరేమీ కాదు. వివిధ పదార్థాలనుండి పుట్టిన మనిషి మరణానంతరం మళ్ళీ వాటిలోనే కలుస్తాడు. అంతకుమించిన జీవితపరమార్థం ఏమీ లేదు' అని బోధించాడు. పూర్ణకాశ్యపుని దృష్టిలో పాపం, పుణ్యం అనేవి అసత్యాలు. అందుచేత మానవుని ప్రవర్తనలో నైతికతను తిరస్కరించాడు. మక్కలి గోశాలుడు బహుశా 'ఆజీవక' సిద్ధాంతకర్త అయి వుండవచ్చు. ఈయన నియతివాది. ఈ విశ్వం తనలో అంతర్గతమై, మార్పుచెందని నియమాలతో నడుస్తుందని చెప్పాడు. మానవుడు తన సుఖదుఃఖాలను తాను అదుపు చేయలేడని, ప్రకృతి ముందు సకలజీవులు నిస్సహాయులని బోధించాడు. మానవుని స్వేచ్ఛను పూర్తిగా నిరాకరించిన యీ ఆజీవకసిద్ధాంతం అత్యంత దోషపూరితమైనదని శాక్యముని దీనిని ఖండించాడు. ప్రకృధ కాత్యాయనుడు నేల, నీరు, గాలి, అగ్ని, జీవం, సుఖదుఃఖాలు అన్నీ అఖండమైన అణువుల సమ్మేళన ఫలితమేననే 'జడభౌతికవాదా'న్ని ప్రచారం చేశాడు. జైనముని అయిన నిగంఠనాథపుత్రుడు మహావీరుడనే పేరుతో సుప్రసిద్ధుడు. ఈయన ఆత్మసిద్ధాంతాన్ని బోధించాడు. మానవ, జంతు, వృక్ష భేదం లేకుండా సమస్తజీవులలో ఆత్మ వుందని, అది మరణానంతరం పునర్జన్మ పొందుతుందని చెప్పాడు. దుఃఖవిముక్తికి కఠోరమైన శరీరదండనే మార్గమని బోధించాడు. మహావీరునికి అతని కాలంలో రెండు లక్షలమంది అనుచరులున్నట్లు జైనగ్రంథాలు చెబుతున్నాయి.

వేగంగా విస్తరిస్తున్న బుద్ధుని పేరుప్రతిష్ఠలు మరియు ఆయన శిష్యగణానికి ప్రజలనుండి అందుతున్న ఆదరణ చూసి యితర శాఖలకు చెందిన గురువులు అసూయచెందారు. శాక్యమునిని అప్రతిష్టపాలు చెయ్యాలని వారు కుట్రపన్నారు. చించా అనే సన్యాసినిని పురికొల్పి బుద్ధునిపై అక్రమసంబంధ ఆరోపణ చేయించారు. ఆమె ఆడిన 'నాటకం' బట్టబయలై, తదనంతరం తాను చేసిన తప్పుకు ఎంతో బాధను అనుభవించింది. అంతటితో ఆగని ప్రత్యర్థులు తమ రెండవ ప్రయత్నంగా, సుందరి అనే స్త్రీ శాక్యమునితో ఏకాంతంగా ఒక రాత్రి గడిపిందని పుకార్లు పుట్టించారు. కొద్దిరోజులకు కొంతమంది దుండగులకు డబ్బు యిచ్చి, సుందరిని హత్యచేయించారు. ఆమె శరీరాన్ని ముక్కలుగా నరికి జేతవనవిహారం దగ్గర పడేశారు. సుందరిని శ్రమణగౌతముడే చంపించాడని రాజాస్థానంలో ఫిర్యాదు చేశారు. కాని, ఒక రోజు హంతకులు తప్పతాగిన మైకంలో సుందరి హత్య గురించి తమలో తాము గొడవ

పడుతుండగా, రాజభటులు వాళ్ళను నిర్బంధించి న్యాయస్థానంలో నిలబెట్టారు. న్యాయాధిపతి సమక్షంలో దుండగులు తమ నేరాన్ని అంగీకరించటమే గాక, వారిని యీ హత్యకు ప్రేరేపించినవారి పేర్లను కూడా బయటపెట్టారు. దీనితో రాజు సుందరిని హత్యచేసినవారికి, చేయించినవారికి మరణదండన విధించాడు.

తథాగతుని దినచర్య చాలా సరళమైనది. ప్రతిరోజు తెల్లవారుజామున నిద్రలేచి స్నానం తరువాత ఏకాంతంగా ధ్యానంలో గడిపేవాడు. మధ్యాహ్నం అయ్యేటప్పటికి తగిన వస్త్రాలు ధరించి భిక్షపాత్రతో ఒంటరిగా లేదా కొందరు శిష్యులతో కలిసి భిక్షకోసం పరిసరగ్రామాలకు వెళ్ళేవాడు. భోజనానంతరం తనకు భిక్షనిచ్చిన గృహస్థు కుటుంబానికి ధర్మబోధ చేసేవాడు. తిరిగి విహారానికి చేరుకుని అక్కడి భిక్షువుల భోజనం పూర్తయ్యేవరకు వరండాలో వేచివుండి, తరువాత తన ఏకాంత మందిరానికి వెళ్ళేవాడు. మధ్యాహ్నపు విశ్రాంతి అనంతరం చుట్టుప్రక్కల ప్రాంతాలనుండి వచ్చిన జనానికి సమావేశమందిరంలో ధర్మబోధ జరిగేది. సాయంత్రపు స్నానం తరువాత, కొంతమంది భిక్షువులకు ధర్మబోధలో ఎదురయ్యే సమస్యలను వివరించేవాడు. అనంతరం చారిక చేస్తూ (నడుస్తూ) ధ్యానంలో గడిపి, తన మందిరంలో నిద్రపోయేవాడు. అనుకూల వాతావరణం వుండే తొమ్మిది నెలలు రోజుకు పదిహేను ఇరవైమైళ్ళు ప్రయాణిస్తూ పల్లెలు, పట్టణాలు తిరుగుతూ ధర్మబోధ చేసేవాడు. సంవత్సరంలో మిగిలిన మూడు నెలలు, వర్షాకాలంలో, జేతవనం లేదా పూర్వారామ విహారాల్లో గడిపేవాడు.

గౌతమబుద్ధుని బోధనాశైలి బ్రాహ్మణ గురువుల పద్ధతికి చాలా భిన్నమైంది. ప్రత్యేకంగా ఎంపిక చేయబడ్డ చిన్న బృందాలకు మార్మికపద్ధతిలో బోధించటం నాటి బ్రాహ్మణుల సాంప్రదాయం. దీనికి భిన్నంగా, తన బోధనలను వినాలని వచ్చే అందరికీ బహిరంగంగా బోధించటం తథాగతుని పద్ధతి. అందరికీ సులభంగా అర్థమయ్యే భాషలో, ప్రతి ఒక్కరూ ధ్యాసతో వినగలిగేటట్లు బోధన జరిగేది. తన వద్దకు వచ్చేవారి నైతిక, బౌద్ధికస్థాయికి అనుగుణంగా బోధించటం ఆయన ప్రత్యేకత. ఏదో విధంగా యితరులను తన మార్గంలోకి ఆకర్షించాలని కాకుండా, వారిలో అంతఃచేతనను మేల్కొల్పే లక్ష్యంతోనే బోధన సాగేది.

పండితులతో జరిగే చర్చలు తరచుగా తార్కికంగా వుండేవి. సామాన్యజనంతో జరిపే సంభాషణలు ఉపమానాలు, జానపదకథలు, సామెతలతో నిండివుండేవి. సంపన్న బ్రాహ్మణుడైన కృషిభరద్వాజునితో జరిగిన సంభాషణ యీ సందర్భంలో ఎంతో ఆసక్తికరమైంది. ఒకరోజు బుద్ధుడు మగధసామ్రాజ్యంలోని ఏకనాలగ్రామం వెళ్ళటం తటస్థించింది. తన పొలంలో కూలీలతో పనిచేయిస్తున్న భరద్వాజుడు గౌతముణ్ణి చూసి యిలా అన్నాడు: "ఓ శ్రమణుడా! నేను నేల దున్ని, విత్తునాటి, పంట పండించి నా ఆహారాన్ని నేను సంపాదించి భుజిస్తాను. నువు కూడా యీ విధంగా నేలదున్ని, సాగు

చేసి నీ ఆహారాన్ని నువు సంపాదించుకోవటం మంచిది కదా!" భరద్వాజుని మాటల్లోని అంతర్యాన్ని గ్రహించిన గౌతముడు యిలా జవాబిచ్చాడు:

ఓ బ్రాహ్మణుడా! నేను కూడా నేలదున్ని, విత్తు నాటి, సాగుచేసి నా ఆహారం నేను పొందుతున్నాను.

అలాంటప్పుడు దుక్కి దున్నే నీ ఎద్దులెక్కడ? నీ నాగలేది? పంటకవసరమైన విత్తనాలేవీ?

విశ్వాసమనేది నేను నాటిన విత్తనం; శ్రద్ధ నేను దానికి వేసే ఎరువు; వినయమనే కాడికి, మనసనే నాగలిని, అప్రమత్తతనే నాగలికర్రను సత్యనిష్టత అనే తాడుతో బంధించాను. నాలోని శక్తిసామర్థ్యాలే నా జోడెద్దులు. వీటితో సన్నద్ధుడనైన నేను అజ్ఞానమనే కలుపును కూకటివేళ్ళతో పెకలించి, నిర్వాణమనే ధాన్యాన్ని పండిస్తాను. నేను చేసే వ్యవసాయంతో దుఃఖమనే క్షామాన్ని సమూలంగా అంతమొందిస్తాను." ఇది విని ఆనందభరితుడైన భరద్వాజుడు బంగారుగిన్నెలో పాలబువ్వ నింపి పవిత్రమూర్తికి అందించాడు. బౌద్ధ సాహిత్యంలో యిటువంటి సంఘటనలు ఎన్నో చోటుచేసుకున్నయ్.

బుద్ధుని బోధనాసరళిని మించినది అతని మూర్తిమత్వం. మాటల్లోని మృదుత్వం, ప్రశాంతమయిన ఆయన చూపులు వినేవారిలో నమ్రతను, గౌరవాన్ని ప్రేరేపించేవి. కేవలం మాటలతోనే కర్కోటకుడైన అంగుళీమాల మనసు మార్చటం సాధ్యమా? అతని సన్నిధికి చేరిన ప్రతి ఒక్కరు అతన్ని అనుసరించేవారు. సత్యాన్ని బోధించటమే కాదు, బుద్ధుడు శ్రోతల హృదయాలను గెలిచేవాడు. కరుణామయుడైన బుద్ధుని సమక్షంలో ఉండటమంటే, ఆయన కురిపించే ప్రేమ, మైత్రి, కరుణలతో స్నానమాడినట్లే.

బుద్ధుడు తనజీవితయాత్ర చరమదశలో చుందుడనే కమ్మరి యింట చివరిసారిగా భోజనం చేశాడు. దీనికారణంగా రోగగ్రస్తుడై కుసినార పట్టనానికి చేరుకున్నాడు. అక్కడ తన చివరి క్షణాల్లో కూడ సుభద్రుడనే మునికి ధర్మోపదేశం చేశాడు. బుద్ధభగవానుడు చనిపోయే ముందు శిష్యులకు చెప్పిన చివరి మాటలు సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. ఆయన యిలా అన్నాడు: "అస్థిత్వాన్ని పొందిన ప్రతిదీ గతించిపోయేదే. అప్రమత్తులై స్వయంకృషితో మీ విముక్తి మీరే సాధించుకోండి."

తథాగతుని అంతిమసంస్కారాలను గౌరవలాంఛనాలతో నిర్వహించిన కుసినార మల్లులు, ఆయన చితాభస్మాన్ని భద్రపరిచారు. ఈ విషయం తెలిసి, మగధరాజు అజాతశత్రువు భగవానుని అస్థికలలో కొంతభాగం తమకు యివ్వాలని రాయబారం పంపాడు. వైశాలినుండి లిచ్ఛవీయులు, కపిలవస్తునుండి శాక్యులు, రామాగ్రామంనుండి కోలీయులు, ఇంకా కొంతమంది కూడా అస్థికలలో భాగం కావాలని కోరారు. భగవానుడు తమ ప్రాంతంలో పరినిర్వాణం పొందిన కారణంగా ఆయన అస్థికలు తమకు మాత్రమే చెందుతాయని మల్లులు మొండికేశారు. 'విశ్వమానవ సోదరత్వాన్ని బోధించిన



సందర్భయ్య గ్రంథాలయ
A C No. 91932

తథాగతుని అస్థికలపై వివాదం సభ్యత కాద'ని చెప్పి ద్రోణుడు మల్లుల మనసు మార్చాడు. ద్రోణుని ఆధ్వర్యంలో అస్థికలను అందరికీ పంచారు. ఆయా ప్రాంతాల్లో బుద్ధుని అస్థికలను పదిలపరచి వాటిపై స్థూపాలు నిర్మించారు. ధాతుగర్భాలని పిలవబడ్డ యీ కట్టడాలను అశోకచక్రవర్తి తెరిపించి, అస్థికలను చిన్న చిన్న భాగాలుగా విభజించి, వాటి చిహ్నంగా తన సామ్రాజ్యమంతటా ఎనభైవేల స్థూపాలను నిర్మించినట్లు చెబుతారు.

బౌద్ధసాహిత్యంలో చోటుచేసుకున్న కాల్పనిక కథల పరదాలను తొలగించి చూస్తే, ఇదీ చారిత్రక బుద్ధుని జీవితం. ఇందులో వాస్తవం ఎంత అనే ప్రశ్నకు సమాధానం చెప్పటం చాలా కష్టం. అయినప్పటికి గౌతమశాక్యముని చారిత్రకవ్యక్తి అని నిస్సందేహంగా చెప్పవచ్చు. "మానవచరిత్రను మలుపుతిప్పిన అన్ని వుద్యమాలు చారిత్రక వ్యక్తులతోనే మొదలయ్యాయి. అలాగే బుద్ధిజం కూడా ఒక మహాపురుషుని ద్వారానే అభివృద్ధిచెంది వుంటుందని గట్టిగా చెప్పవచ్చు" అని మినాయేఫ్ అనే చరిత్రకారుడు వివరించాడు. గౌతమ శాక్యముని జీవితంపై చరిత్రకారులు ఏ తీర్పు చెప్పినప్పటికి, మానవజాతికి మార్గదర్శకులైన తత్వవేత్తల్లో ఆయన ప్రముఖస్థానంలో నిలుస్తాడనేది ముమ్మాటికి నిజం. అసామాన్యమయిన బుద్ధికుశలత, చెదరని దృఢసంకల్పం, ఆయనలోని సునిశితత్వం, ప్రేమ, కరుణ యిందుకు సాక్ష్యంగా నిలుస్తాయి.

గౌతమబుద్ధుడు రాజవంశంలో పుట్టినా, సంకుచితమైన కులం, హోదా, సంపద వంటి తారతమ్యాలను వదలి సామాన్య మానవుడిలా జీవించాడు. ఆయన మానవాతీత శక్తులేవీ తనకు లేవని ప్రకటించాడు. సత్యాన్ని గ్రహించటంలో మానవులకున్న సామర్థ్యాన్ని విశ్వసించాడే గాని, మంత్రాలను, మహిమలను ఏనాడూ ఆశ్రయించలేదు. మానవుని వాస్తవిక జీవితంపై ఆధారపడి, మనిషి నైజాన్ని లోతుగా పరిశీలించి ఆచరణయోగ్యమైన తన ధర్మమార్గానికి రూపకల్పన చేశాడు. మనిషిని రాగ, ద్వేష, మోహాలనే బంధాలనుండి విముక్తిచేసి, లోకోత్తరమైన ఆదర్శంవైపు నడిపించటమే ఆయన లక్ష్యం. హృదయ పరివర్తన, సత్‌శీలత, ప్రజ్ఞలతో కూడిన జీవనం ద్వారా సకలజీవుల పట్ల ప్రేమను పెంపొందించటం ఆయన గమ్యం.

గౌతమ శాక్యముని మనిషిని శాసించే మరే శక్తిని ప్రతిపాదించలేదు. అందుకే 'బాహ్యశక్తులను ఆశ్రయించకుండా, మీ విముక్తిని మీరే సాధించుకోండ'ని చెప్పాడు. ప్రపంచంలోని మరే యితర మతస్థాపకుడు యిలా చెప్పలేదు. లోకమంతా తనను మహోన్నతుడని కీర్తించినా తనకు దైవత్వాన్ని ఆపాదించుకోలేదు. జనం తనను కీర్తిస్తూ పాటలు పాడుతుంటే విని, ఆనందుణ్ణి పిలిచి హితవు చెప్పాడు: దీనికి నేను తగినవాణ్ణి కాను. ఇలా కీర్తించటం వృథాప్రయాస. ఎవరైతే సత్ప్రవర్తన కలిగివుంటారో వారే నాకు సంతోషాన్ని, గౌరవాన్ని కలిగిస్తారు." సకల జీవుల పట్ల అవధులు లేని ప్రేమ, కరుణ

కురిపించిన ఆ అమృతమూర్తికి సరిసాటి ఎవరూ లేరు. నిజానికి తథాగతుడు జగజ్యోతి (Light of the World).

## రెండో అధ్యాయం

# బుద్ధిజంలో హేతువాదం

బుద్ధిజం ఆచరణయోగ్యమైన నైతికసూత్రాలతో కూడిన తత్వశాస్త్రమా లేక అది ఒక మతమా? ఈ ప్రశ్నకు సమాధానం మతం (religion) అనే పదాన్ని మనం ఎలా నిర్వచిస్తాం అనేదాన్నిబట్టి వుంటుంది. "మతం అనేది మనిషికి స్ఫూర్తినిచ్చి, జిజ్ఞాసను ప్రేరేపిస్తుంది; మనిషి ముందు ఆదర్శప్రాయమైన మహోన్నత లక్ష్యాన్ని ప్రతిపాదించి, తద్వారా ఉత్తమ జీవనవిధానంవైపు నడిపిస్తుంది; అది మనలోని స్వార్థచింతనను అంతమొందించి, సాటి మానవుల సంక్షేమం కోసం పురికొల్పుతుంది." ఇది మతం యొక్క నిర్వచనం అయితే, బుద్ధిజం ఖచ్చితంగా మతమే. ఎందుకంటే, అది ప్రపంచంలోని యాభై కోట్లమంది మంచిమనసున్నవారిగా, ఉదారస్వభావులుగా, పవిత్రులుగా, కరుణామయులైన ప్రేమమూర్తులుగా జీవించేటందుకు కారణమయింది. మరో అర్థంలో మతమంటే అంతుచిక్కని అదృశ్యశక్తికోసం వెదుకులాట; అనంతం, అనిర్వచనీయమై, సమస్త సృష్టిని నియంత్రించే మానవాతీతశక్తి అంటే భయం, ఆరాధన; ప్రతి విషయంలో ఆ శక్తిపై ఆధారపడటం. ఈ అర్థంలో చూస్తే బుద్ధిజం మతం అని పిలవటానికి తగింది కాదు. ఎందుకంటే అది మానవాతీతశక్తులపై ఆధారపడటాన్ని పూర్తిగా నిరాకరించింది. మనిషి తన విముక్తికోసం తనపైనే ఆధారపడాలని నొక్కిచెప్పింది. అజ్ఞాతశక్తికి సంబంధించిన అన్నిరకాల ప్రతిపాదనలను నిరాకరించటం, నిత్యజీవితంలోని వాస్తవాలపై ఆధారపడటం అనేవి బుద్ధిజంలో అన్నిటికంటే ప్రస్ఫుటంగా కనిపించే విషయాలు. ఒక సందర్భంలో బుద్ధభగవానుడు ఒక బ్రాహ్మణునితో యిలా అన్నాడు: "ఓ బ్రాహ్మణా, 'పగటిని రాత్రని, రాత్రిని పగల'ని వాదించే శ్రమణులు, బ్రాహ్మణులు ఎందరో వున్నారు. కాని నేను 'పగటిని పగలని, రాత్రిని రాత్రేన'ని చెబుతాను." మరో సందర్భంలో "తథాగతుడు అన్నిరకాల సిద్ధాంతాలనుండీ విముక్తుడయ్యాడు" అని చెప్పాడు. బుద్ధిజానికి పునాది దైవశక్తిపై నమ్మకం కాదు, మనిషి జీవితంలోని బాధ, దుఃఖం. దుఃఖమంటే పేదలు, అనాధలు పడుతున్న బాధలే కాదు, అన్నీ వున్నవారు అనుభవిస్తున్న దుఃఖం కూడా. స్వర్గసుఖాలు, పరమాత్మలో లీనమవటం బుద్ధిజం యొక్క లక్ష్యం కాదు. బౌద్ధిక-నైతికజీవనం సాగిస్తూ, మనోక్లేశాలన్నింటిని జయించటం ద్వారా సకల ప్రాపంచిక దుఃఖాలనుండి విముక్తిని సాధించటమే బుద్ధధర్మం యొక్క లక్ష్యం. బుద్ధిస్టు అయిన

వ్యక్తి ఎడతెగని ప్రాపంచిక విశ్లేషణలో మునిగిపోడు. నైతిక ప్రవర్తనకు మానవుని శక్తిసామర్థ్యాలు, బుద్ధివికాసానికి అవినాభావ సంబంధం వుందనే జీవితసత్యాన్ని అతడు నమ్ముతాడు. అతను వైయక్తికమైన మానవాతీతశక్తిని నమ్మడు కాని, అత్యున్నత ఆదర్శస్వరూపమైన 'ధర్మకాయం'లో విశ్వాసం కలిగివుంటాడు.

దైవప్రబోధాలని చెప్పబడే యితర మతాల వలె, బుద్ధిజం సత్యాన్వేషణలో హేతుప్రమాణాన్ని తిరస్కరించలేదు. బుద్ధుడు తమ పట్టణానికి వచ్చాడని విని కాలాములు అనే జాతి జనం ఆయన వద్దకు వెళ్ళి యిలా అన్నారు: "అయ్యా, కొందరు శ్రమణులు, బ్రాహ్మణులు మా కేశపుత్రానికి వస్తుంటారు. వారు తమ ధర్మాన్ని మాత్రమే బోధించి వివరిస్తారు. ఇతరులు బోధించే వాటిని ఖండించి నిరాకరిస్తారు. వారందరూ చెప్పింది విని మాకు ఒక సందేహం కలుగుతుంది. ఎవరు చెప్పేది సత్యమో, ఎవరు చెప్పేది అసత్యమో తెలియక సతమతమవుతున్నాం." అందుకు బుద్ధుడిలా జవాబిచ్చాడు: "కాలాములారా, యీ విషయంలో మీకు సందేహం కలగటం సహజమే. చూడండి, తరతరాలుగా వస్తున్న సాంప్రదాయం అనిగాని లేదా పూర్వకాలంలో గురువులు చెప్పారనిగాని దేనిని విశ్వసించవద్దు. చాలామంది యిదే చెబుతున్నారనిగాని లేదా గొప్ప గ్రంథాల్లో రాసివుందని గాని ఒక విషయాన్ని సత్యంగా భావించకండి. తార్కికంగా వుందనో లేక వినసొంపుగా వుందనో, బోధించే వ్యక్తి సమర్థుడనో లేక అతని మీద గౌరవం వల్లనో దేనిని సత్యంగా స్వీకరించవద్దు. ఎవరు ఏమి చెప్పినా దానిని పరిశీలించి, విశ్లేషించి అది అందరికి మేలు చేస్తుందని మీరు భావిస్తే, దాన్ని స్వీకరించి ఆచరించండి. అలా కాకుండా వారు చెప్పింది అందరికీ కీడు చేస్తుందని మీకు అనిపిస్తే దాన్ని నిరాకరించండి." దీనికి అనుగుణంగానే దేనినైనా పరిశీలించకుండా కేవలం నమ్మకంతోనే అంగీకరించమని బుద్ధిజం చెప్పదు. అవగాహన కోసం విశ్వాసంపై ఆధారపడమని కూడా చెప్పదు. హేతుదృష్టిని మించి విశ్వాసం జీవితంలో ప్రముఖపాత్ర వహిస్తుందని, అయితే అందుకు "విశ్వసించే సంకల్పం" (will to believe) కావాలని కొందరు చెబుతుంటారు. విశ్వసించే సంకల్పాన్ని మనం ఒప్పుకున్నట్లయితే, విశ్వసించ నిరాకరించే సంకల్పాన్ని (will to disbelieve) కూడా అంగీకరించాలి. అసత్యాన్ని సత్యంగా అంగీకరించేటందుకు తనను తాను మభ్యపెట్టుకోటాన్ని సంకల్పం అనాలా? విశ్వాససంకల్పమనేది మోసపుచ్చే సంకల్పం తప్ప మరేమీ కాదు, అయితే అది మొదట తన మీద తాను తరువాత యితరుల మీద ప్రయోగించబడుతుంది. హేతుబద్ధమైన వాదంతో 'హేతువు' యొక్క విలువనే నిరాకరించటం తన ఓటమిని తానే ఆహ్వానించటం.

మతాలన్నిటిలో బుద్ధిజం ఒక్కటే మానసికపరమైన కృషిని నొక్కి చెబుతుంది. ప్రతి ఒక్కరు ధర్మాన్ని ప్రశ్నించి, పరిశీలించిన పిదప ఆమోదయోగ్యంగా వుంటేనే దాన్ని

అనుసరించాలని బుద్ధుడు కోరాడు. ఈ విషయమై ఆయన చెప్పింది: "కేవలం నామీద గౌరవంతో ఎవరూ ధర్మాన్ని అంగీకరించవద్దు. బంగారాన్ని నిప్పులో కాల్చి దాని నిగ్గుతేల్చినట్లుగా మీరు ధర్మాన్ని పరీక్షించండి." బ్రాహ్మణులు వేదాలు సత్యప్రమాణం అంటూ తరచుగా వాటిలోని శ్లోకాలను ఉటంకించటాన్ని వృధాప్రయాసగా బుద్ధుడు కొట్టిపారేశాడు. "ఇది కొందరు గుడ్డివారు ఒకరికొకరు దారి చూపుతున్నట్లుంది; మొదటివాడు చూడలేదు, మధ్యనున్నవాడు చూడలేదు, చివరివాడూ చూడలేదు" అన్నట్లు వుందని చెప్పాడు. 'సత్యాన్ని అవగాహన చేసుకోవటం', 'సత్యాన్ని స్వీకరించటం' యీ రెంటి మధ్య స్పష్టమైన భేదం వుందని బుద్ధుడు చెప్పాడు. తేనెతో నింపిన గిన్నెకు తేనె రుచి తెలియనట్లే, సత్యాన్ని 'స్వీకరించే' వాడికి సత్యం తెలియదు. **బోధిసత్వ భూమి** అనే గ్రంథంలో యిలా చెప్పబడింది: "ఎవరూ యితరుల అభిప్రాయం మీద మాత్రమే ఆధారపడరాదు. ఇది స్థవిరులు (పెద్దలు) లేదా బుద్ధుడు లేదా సంఘం యొక్క అభిప్రాయమని అంగీకరించరాదు. సత్యాన్ని ఎవరికివారే స్వయంగా నిర్ధారించుకోవాలి. సంఘం పట్ల, సాంప్రదాయం పట్ల విధేయత చూపటం దానికదే గొప్పదేమీ కాదు. జ్ఞానం కోసం బోధన అవసరమే, కాని బోధించినదాన్ని స్వీయ అనుభవంతో జోడించి అవగాహన చేసుకోవాలి." పక్షపాతం లేని, భావోద్రేక రహితమైన మనసు మాత్రమే సత్యాన్ని చూడగలదు. సత్యమనేది ఎప్పుడూ సులభంగా పైపైన లభించదు, అందుకోసం లోతుల్లోకి వెళ్ళి శ్రమించాలి. సత్యాన్ని తెలుసుకోవటం కంటే దాన్ని అవగాహన చేసుకొని ఆచరణలో పెట్టటం మరీ కష్టమైన పని. అందుకోసం బౌద్ధిక, నైతిక శక్తులను పెంపొందించే సాధన ఎంతో అవసరం.

బుద్ధిజంలో జ్ఞానంపై ఆధారపడని విశ్వాసాలేవీ లేవు. అది పరిష్కరించ సాధ్యం కాని సమస్యలపై మానవమేధస్సును కేంద్రీకరించదు. ప్రపంచం శాశ్వతమా లేక అశాశ్వతమా? విశ్వం పరిమితమా లేక అనంతమా? ఇటువంటి ప్రశ్నలకు బుద్ధిజంలో స్థానం లేదు. ఈ విషయాలపై పొట్ఠపాద సూత్రంలో బుద్ధుడు యిలా చెప్పాడు "ఇటువంటి ప్రశ్నలు వాస్తవ ప్రపంచంతో సంబంధం లేనివి; అవి జీవితధర్మానికి సంబంధించినవి కావు; అవి రాగద్వేషాలను వదిలించుకోటానికిగాని, సత్ప్రవర్తనను పెంపొందించేటందుకుగాని పనికిరావు; అవి జ్ఞానాన్ని, శాంతిని పెంపొందించవు." తథాగతుని వచనంలో నిగూఢమైన లేదా అంతుచిక్కని బోధనలేవీ లేవు. తన జీవితపు చివరి క్షణాల్లో ఆనందుడికి యిలా చెప్పాడు: "ఏ తారతమ్యాలు లేకుండా నేను సత్యాన్ని అందరికీ బోధించాను. ఆనందా! ధర్మం విషయంలో నేను దాచింది ఏమీ లేదు." మరో సందర్భంలో చెప్పిన మాటలు: "ప్రేమలో పడ్డ స్త్రీలు, తమకు అద్భుతశక్తులున్నవని చెప్పుకొనే పూజారులు, ధర్మమార్గం వీడినవారు యీ ముగ్గురు తమ విషయంలో

రహస్యాన్ని పాటిస్తారు. అలాగే మనం దాచలేనివి మూడు వున్నయ్. మొదటి రెండు సూర్యచంద్రులు కాగా, మూడవది తథాగతుని ధర్మం. వీటికి సంబంధించి రహస్యం ఏమీ లేదు." అందుకే బుద్ధిజాన్ని అర్థం చేసుకోటానికి, యితర మతాల వలె, మతబోధకుల మార్మిక కళపై ఆధారపడవలసిన అవసరం లేదు. బుద్ధిజానికి ఆధునిక విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణలతో గాని, దాని శాస్త్రీయ పద్ధతులతోగాని వైరుధ్యం లేదు. బౌద్ధ ధర్మం, సైన్సు పరస్పర విరుద్ధాలు కావు. నేడు మనకున్న విజ్ఞానశాస్త్ర సమాచారం అందుబాటులో లేని రోజుల్లోనే బుద్ధుడు సైకాలజి, ఫిలాసఫీలకు సంబంధించిన సమస్యలతో వ్యవహరించాడు. మతం ప్రతిపాదించే సమస్యలకు సరైన పరిష్కారాలను సూచించాడు. అశాస్త్రీయమైన మూఢనమ్మకాలపై ఆధారపడిన మతం స్థానంలో జీవితసత్యాలపై అధారపడిన ధర్మాన్ని బోధించాడు.

బుద్ధిజం అంధ విశ్వాసాన్ని ప్రోత్సహించదు. అయితే అది విశ్వాసం (శ్రద్ధ) పెంపొందించుకోవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. విశ్వాసం అంటే అహేతుకమైన, అసంబద్ధమైనదాన్ని నమ్మటం కాదు. నిరూపించబడని విషయాలను అంటిపెట్టుకుని వుండటం అసలే కాదు. విశ్వాసం అంటే సత్యాన్ని తెలుసుకోగలమనే ప్రగాఢమైన నమ్మకం. సత్యాన్వేషణలో హేతుసహితమైన పద్ధతి జ్ఞానాన్ని క్రమంలో అర్థం చేసుకోటానికి వుపకరిస్తుంది. విశ్వాసం సత్యం పట్ల దృఢమై సంకల్పాన్ని కలిగిస్తుంది. హేతువునుండి విడదీస్తే విశ్వాసం మూఢనమ్మకమవుతుంది. విశ్వాసంలేని హేతువాదం మానవునిలో తన లక్ష్యం పట్ల జిజ్ఞాసను హరించి, అతన్ని యంత్రంగా మార్చివేస్తుంది. విశ్వాసమనేది రాగం, ద్వేషం, నిరాసక్తత వంటి మానసిక జాడ్యాలను వదిలించి ముందుకు నడిపిస్తుంది. ఇప్పటికి కనుగొన్నవాటితో సంతృప్తిచెందక ముందడుగు వెయ్యమని ప్రేరేపిస్తుంది.

సాధారణంగా ప్రజలు బౌద్ధధర్మాన్ని తెలుసుకోటానికి పురాతన గ్రంథాలు, పుస్తకాలపై ఆధారపడతారు. ప్రపంచవ్యాపితంగా బుద్ధిస్టులు "త్రిపీటకాలు" అనే గ్రంథాలను కలిగివున్నారు. ఇవి సూత్ర, వినయ, అభిధర్మ అనే మూడు భాగాలుగా వున్నయ్. సూత్రపీటకంలో బుద్ధుడు యితరులతో జరిపిన సంభాషణలు, వినయపీటకంలో భిక్షువులు పాటించవలసిన నియమాలు, మూడవదైన అభిధర్మ పీటకంలో తత్వపరమైన విషయాలపై చర్చలు పొందుపరిచారు. బుద్ధుని మరణానంతరం భిక్షుసంఘం అనేక శాఖలుగా, అవి మళ్ళీ ఉపశాఖలుగా విడిపోవటం జరిగింది. ధర్మానికి సంబంధించిన అన్ని విషయాలలో వీరిమధ్య ఏకాభిప్రాయం లేదు. వర్తమాన ప్రపంచంలోని బుద్ధిస్టులను స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు. దక్షిణాది బుద్ధిజం పేరుతో శ్రీలంక, బర్మా, సియాం (నేటి థాయిలాండ్) వారు, ఉత్తరాది బుద్ధిస్టులు టిబెట్, చైనా, మంచూరియా, మంగోలియావాసులు, తూర్పు ప్రాంత బుద్ధిజంలో జపాన్‌వారు

వున్నారు. దక్షిణాదివారు **హీనయానం (థెరవాద)** అనుసరిస్తే, ఉత్తరాదిన **తంత్రయానం,** తూర్పున **మహాయానం** అనుసరిస్తున్నారు. మహాయానుల, హీనయానుల **త్రిపీటకాల** మధ్య తేడా వుంది. **సూత్రపీటకం** బుద్ధుడు పరినిర్వాణం చెందిన వెంటనే నిర్వహించబడిన **మొదటి సంగీతి** (బౌద్ధమహాసభ)లో కూర్చబడిందని ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు.

ఇటువంటి అనిశ్చిత స్థితిలో మనకు దారిచూపేదెవరు? ఈ సంకటం నుండి గట్టెక్కించగలిగే మార్గం ఒక్కటే. అది శిక్షాసముచ్చయం అనే గ్రంథం చూపిన మార్గం: "యద్‌కించిత్ సుభాషితమ్ తద్ సర్వమ్ బుద్ధభాషితమ్ – సుభాషితమైన ప్రతిదీ బుద్ధవచనమే." హేతువుకు, అనుభవానికి నిలబడనిదేదీ తథాగతుని ప్రబోధం కాదు. బుద్ధభగవానుని మరణానంతరం వంద సంవత్సరాల తరువాత వైశాలిలో జరిగిన 'సంగీతి' పైన చెప్పినదాన్నే బలపరిచింది. బుద్ధిస్టు ఐన వ్యక్తి అన్ని విషయాలను చర్చిస్తూ, సత్యాసత్యాలను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగాలి. సత్యమనేది ఎప్పుడో అశ్వఘోషుడు లేదా బుద్ధఘోషుడు రాసిన గ్రంథాలలో నిక్షిప్తమై వుందనో లేక సంఘ పెద్దలు 'సంగీతి'లో దీనిపై తీర్మానించేశారనో పిడివాదానికి దిగరాదు. అతడు కాలం చెల్లిన, అసంగతమైన జ్ఞానాన్ని వదలివేస్తూ, తన జ్ఞానాన్ని మెరుగుపరుచుకునేటందుకు నిరంతరం కృషిచెయ్యాలి. అనుభవం వెలుగులో సత్యానికి సానపెట్టి కాలపరీక్షను తట్టుకొనే నూతన సత్యాన్ని అవిష్కరించాలి. ఇదే మహోపాధ్యాయుడైన బుద్ధుని మార్గం, ప్రముఖ బౌద్ధపండితులు అనుసరించిన మార్గం కూడా. వారు కేవలం బౌద్ధసాహిత్యంలోని సూత్రాలను వల్లెవేయటంతో సరిపెట్టుకోలేదు. ప్రతిపాదించబడ్డ విషయాలపై తార్కికంగా ఆలోచించి, అనుభవాన్ని జోడించి తమ స్వంత అభిప్రాయాలను, వ్యాఖ్యానాలను వెలిబుచ్చారు. చైనా బౌద్ధపండితుడు లో జు చెప్పిన మాటలు యీ సందర్భంగా ఎంతో విలువైనవి. ఆయన యిలా అన్నాడు: "అలిఖితమైన పుస్తకం మనచుట్టూ ఎల్లప్పుడూ తిరుగుతూనే వుంది. భూమ్యాకాశాలు దానిలోని సత్యాన్ని ప్రతిధ్వనిస్తూనే వున్నయ్. అసలైన పుస్తకం మానవ జీవితానికి ఆవల లేదు. ధర్మమనేది అదృశ్యంగా వుండి ఎప్పటికప్పుడు దానంతటదే ప్రకటితమౌతూనే వుంది. దానికి పుస్తకాలతో పనిలేదు."

బుద్ధుడు దుఃఖవిమోచన కోసం అనేక మార్గాలు సూచించినట్లు పైకి కనిపిస్తుంది. కాని, నిజం చెప్పాలంటే, ఉన్నది ఒకే మార్గం **(ఏకయానం),** అదే తత్వమార్గం **(తత్వయానం).** ఆచరణ సౌలభ్యం కోసం **శ్రావకయానం, ప్రత్యేక బుద్ధయానం, బోధిస్వయానం** అనే మూడు దశలను గుర్తించవచ్చు. శ్రావకుడు బోధిని పొందినవారి మార్గదర్శకత్వంలో అర్హతుడవుతాడు. అర్హతుడైన వ్యక్తి యితరులపై కరుణతో వారికి ముక్తిమార్గాన్ని చూపటానికి బోధిసత్వుడై నిర్వాణం పొందుతాడు. ఈ మూడు లక్షణాలను ఎవరైతే పొందగలుగుతారో వారు జగద్గురువులై **సమ్యక్ సంబుద్ధుడు** అని పిలవబడతారు.

భిన్నమైన యీ యానాలు (దశలు) పండితులకు, పామరులకు కూడా వారి వారి చైతన్యస్థాయిని బట్టి అనుసరించటానికి అనువుగా వుంటయ్.

బుద్ధిజంలోని అన్ని శాఖల్లో అత్యున్నత లక్ష్యమైన నిర్వాణాన్ని చేరటానికి నాలుగు ఆర్యసత్యాలను అర్థం చేసుకోవటం, ఆర్య అష్టాంగమార్గాన్ని ఆచరించటమే మార్గమని చెబుతారు. బుద్ధిస్టులు తమ సందేశం సామాన్య ప్రజలకు అందించేటందుకు బుద్ధుణ్ణి వివిధ అకృతుల్లో రూపొందించారు. మేధావులు లోతైన తత్వచింతన ద్వారా బుద్ధిజం వైపు వస్తే, సామాన్యులు బుద్ధుణ్ణి మంజుశ్రీ, అవలోకితేశ్వరుడు, తారా మొ॥ రూపాల్లో పూజించటం ద్వారా ఆయన మార్గంలో నడుస్తామని భావిస్తారు. బుద్ధిస్టు పండితులు కూడా ఆయన్ను వివిధ రూపాల్లో వర్ణించటం ద్వారా ధర్మాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసే ప్రయత్నం చేశారు. కాని, అన్నిరకాల పూజలు, ప్రార్థనలు బౌద్ధంలోని ప్రాథమిక సూత్రాలతో పొసగనివి, వాటికి విరుద్ధమైనవి కూడా. ***బోధిచర్యావతారం*** అనే గ్రంథంలో చెప్పినట్లు 'సత్ప్రవర్తనతో జీవించటమే మనం బుద్ధుణ్ణి గౌరవించే అత్యుత్తమ మార్గం'.

సమతాదృష్టి హేతుబద్ధత అనేవి బుద్ధిజంలోని ప్రతి అంశంలో ఉన్నయ్. జన్మతహా తనకు అసాధారణమైన శక్తులున్నట్లు బుద్ధుడు చెప్పుకోలేదు. సంకల్పశుద్ధి, నిరంతర కృషి ద్వారా మాత్రమే ఆయన దుఃఖవిముక్తి మార్గాన్ని కనుగొనగలిగాడు. తాను సత్ప్రవర్తన, జ్ఞానసముపార్జన ద్వారా ఎలా బోధిని పొందాడో అలాగే ప్రతి మనిషి సంకల్పం, కృషితో దీన్ని సాధించవచ్చని స్పష్టంగా చెప్పాడు. తన జీవిత చరమాంకంలో ఆనందునితో బుద్ధుడిలా అన్నాడు: "ఆనందా! 'సంఘం నామీదే ఆధారపడి వుంది, నేనే సంఘానికి సారథ్యం వహించాలి' అని ఎవరైనా భావిస్తుంటే, వారినే సంఘానికి ఆదేశాలు యివ్వమనండి. తథాగతుడు మాత్రం 'సంఘం తనమీదే ఆధారపడివుందని, తానే దానికి సారథ్యం వహించాల'ని అనుకోటం లేదు. కాబట్టి ఓ ఆనందా! మీకు మీరే వెలుగుదివ్వెలు కావాలి. మీ మీదే మీరు ఆధారపడాలి. ధర్మాన్ని స్థిరంగా ఆశ్రయించండి. మిమ్మల్ని మీరు తప్ప మరెవ్వరూ రక్షించలేరు." బుద్ధుడు ఏనాడు జనం యొక్క మానసిక బలహీనతలపై ఆధారపడి బోధించలేదు. ఎప్పుడు వారి మంచితనం, సామర్థ్యంపై ఆధారపడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాడు. అందుకే బుద్ధిస్టులు తమ విముక్తికోసం మానవాతీత శక్తులను వేడుకోకుండా, తమ స్వయంకృషిపైనే ఆధారపడతారు.

మాయలు, అద్భుతశక్తుల పట్ల బుద్ధిజం యొక్క వైఖరి దాని హేతుబద్ధతకు మరొక తార్కాణంగా చెప్పవచ్చు. మానవాతీత దైవశక్తిని నిరాకరించిన బౌద్ధంలో ప్రకృతిశక్తులను మించిన అద్భుతాలకు చోటే లేదు. అయినప్పటికి అది సహజరీతిలో కొన్ని శక్తులను పెంపొందించుకునే అవకాశాన్ని నిరాకరించలేదు. ఇలాంటి శక్తులను ప్రదర్శించటం

ద్వారా ప్రజలను ధర్మమార్గంలోకి ఆకర్షించటాన్ని బుద్ధుడు నిరసించాడు. తన శిష్యులు కొందరు అద్భుతశక్తులను ప్రదర్శించేటందుకు అనుమతినివ్వమని కోరగా, బుద్ధుడు వారితో యిలా అన్నాడు: "మీరు అద్భుతాలను ప్రదర్శించటంవల్ల యిప్పటికే మీపై నమ్మకం వున్నవారు మరింత దగ్గరవుతారు. కాని, మీపై నమ్మకం లేనివారు వాటిని గారడి విద్యలని, మిమ్మల్ని చులకన చేస్తారు. మీరు కేవలం జ్ఞానబలం, నైతికబలంతో యితరులను ధర్మమార్గంలోకి నడిపించగలిగితే అదే నిజమైన అద్భుతం."

అద్భుతశక్తుల స్థానంలో బుద్ధుడు ఉపయోగించిన పద్ధతులు తెలియజేసే చక్కని కథ ఒకటుంది. కిసాగౌతమి అనే ఆమెకు పెళ్ళయిన చాలాకాలం తరువాత ఒక కొడుకు పుట్టాడు. ఆ పిల్లవాడు జబ్బుచేసి చిన్నవయసులోనే చనిపోయాడు. శోకభారంతో ఆమె కొడుకు శవాన్ని భుజాలపై ఎత్తుకొని, మందు ఇచ్చి తన కొడుకుని బ్రతికించమని యింటింటికి తిరుగుతూ వుంది. అది చూసిన గ్రామస్తులు "నీకు మతిచెడిందా, చనిపోయినవాడికి మందు కావాలని అడుగుతున్నావ్?" అని ఆమెను దూషించసాగారు. ఈ స్థితిలో పిచ్చిదానిలా తిరుగుతున్న ఆమెకు ఎవరో శాక్యముని మాత్రమే ఆమె సమస్యను తీర్చగలడని సూచించారు. అప్పుడు ఆమె బుద్ధుని వద్దకు వెళ్ళి "మందిచ్చి నా కొడుకును బ్రతికించు" అని వేడుకొంది. అప్పుడు ఆమెతో బుద్ధుడిలా అన్నాడు: "నీ బిడ్డకు మందిస్తాను. అయితే నువు ఎవరింటికైనా వెళ్ళి గుప్పెడు ఆవాలు తీసుకురావాలి. నువు ఎవరి యింటినుండి ఆవాలు తెస్తావో ఆ యింటిలో యిప్పుడుగాని, యింతకు ముందుగాని ఎవరూ చనిపోయి వుండకూడదు." కిసాగౌతమి యింటింటికి వెళ్ళి 'వారి యింట్లో ఎవరైనా చనిపోయారా?' అని అడిగింది. కాని ప్రతివారు తమ యింటిలో గతంలో ఎంతోమంది చనిపోయినట్లు చెప్పారు. సాయంకాలం వరకు కాళ్ళరిగేలా తిరిగి ఆమె చివరకు యిలా అనుకొంది: "నా కొడుకు మాత్రమే చనిపోయాడనుకున్నాను. కాని ప్రతి యింటిలో ఎంతోమంది చనిపోయారు. ఈ నగరంలో బ్రతికున్నవారికంటే చనిపోయినవారు ఎన్నో రెట్లు ఎక్కువ." ఇలా ఆలోచించిన కిసాగౌతమికి భ్రమలు తొలగి వాస్తవం తెలిసివచ్చింది. అప్పుడు ఆమె కొడుకు శవాన్ని ప్రక్కనున్న అడవిలో పూడ్చిపెట్టి తిరిగి బుద్ధునివద్దకు చేరింది. బుద్ధుడు ఆమెకు ధర్మోపదేశం చేసి మనసు శాంతపరిచాడు.

బుద్ధిజం ఎటువంటి ఉద్రిక్తతలను పెంపొందించదు. అది తన లక్ష్యాన్ని చేరుకోటానికి మనిషి అంతర పరివర్తన మీదే ఆధారపడుతుంది కాని ధన, బల ప్రయోగం వంటి చౌకబారు పద్ధతులను ఆశ్రయించదు. బుద్ధిస్టులైన పాలకులు సహనశీలతను, స్నేహభావాన్ని ప్రదర్శించారు. తాను బౌద్ధధర్మాన్ని అనుసరించినప్పటికీ అశోకచక్రవర్తి బ్రాహ్మణ, జైన, ఆజీవ పండితులకు ఉదారంగా దానధర్మాలు చేసి గౌరవించాడు. తన

పన్నెండవ శిలాశాసనంపై అశోకుడు యిలా ప్రకటించాడు: "తాను నమ్మిన ధర్మాన్ని వ్యాప్తిచెయ్యాలని ఎవరైతే యితరులను కించపరుస్తూ మాట్లాడుతారో, వారు నిజానికి తమ ధర్మానికే నష్టం కలిగిస్తారు." మధ్యయుగంలోని శ్రీలంకరాజులు, బెంగాల్‌లో 'పాలక' వంశ రాజులు తాము బౌద్ధధర్మాన్ని ఆచరించినా, బ్రాహ్మణులకు బహుమతులిచ్చారు. కాని బ్రాహ్మణ పాలకులు బౌద్ధభిక్షువులను హతమార్చటమేగాక, దీన్ని తమ ఘనతగా చెప్పుకునేవారు. రాజు పుష్యమిత్రుడు క్రీ.పూ. రెండవ శతాబ్దంలో ఎన్నో సంఘారామాలను ధ్వంసం చేసి, వాటిలో నివాసముంటున్న బౌద్ధభిక్షువులను నిర్దాక్షిణ్యంగా హతమార్చాడు. కనిష్కుని తరువాత వంద సంవత్సరాలకు శ్రావస్థిరాజైన విక్రమాదిత్యుడు, శైవుడైన మిహిరకులుడు లెక్కలేనంతమంది బౌద్ధభిక్షువులను చంపించారు. బుద్ధిజానికి బద్ధశత్రువుగా పేరుపొందిన బెంగాల్ రాజు శశాంకుడు గయలోని బోధివృక్షాన్ని ధ్వంసం చెయ్యాలని ఎన్నోసార్లు ప్రయత్నించాడు. బౌద్ధ ఆరామంలో కాలుమోపటమే క్షమించరాని పొరపాటు అని వృహణ్ణాదియ పురాణం చెబుతుంది. అనుభాగవత పురాణం ప్రకారం విష్ణువు పదవ అవతారమైన కల్కి యొక్క ప్రథమ కర్తవ్యం బౌద్ధభిక్షువులను అంతమొందించటమే. అహింసాధర్మాన్ని చాటిచెప్పే జైనులు కూడా బుద్ధిస్టుల పట్ల ఎంతో కటువుగా వ్యవహరించారు. ఇస్లాంమతం రక్తాన్ని చిందించి, యితరమతాలవారిని హతమార్చటం ద్వారానే వ్యాప్తి చెందింది. క్రైస్తవమత వ్యాప్తి కోసం రెండువేల సంవత్సరాల యుద్ధంలో లెక్కలేనంత ధన, ప్రాణ నష్టం జరిగింది. కాని బుద్ధిజం యొక్క వ్యాప్తికోసం ఎక్కడా హింస ప్రేరేపించబడలేదు. తమపై దారుణమైన అణచివేత జరిగినా, బుద్ధిస్టులు ఎప్పుడూ ప్రతిహింస తలపెట్టలేదు. సద్ధర్మపుండరీక సూత్రంలోని బుద్ధుని వాక్యాలే వారికి స్ఫూర్తి: "దానగుణమే నా నివాసం, సహనమే నేను ధరించే వస్త్రం, స్వార్థరహితమే నా వేదిక. వీటి ఆధారంగానే ఎవరైనా ధర్మబోధ చెయ్యాలి. ఎవరైనా మీపై కర్రలు, కత్తులు, ఈటెలతో లేదా అసభ్య పదజాలంతో దాడిచేస్తే, మీరు నన్ను తలుచుకొని సహనం వహించాలి."

బౌద్ధభిక్షువులకుండే ధర్మప్రచార సంకల్పం వారికే సొంతం. అది బ్రాహ్మణుల పద్ధతికి పూర్తిగా భిన్నమైంది. బ్రాహ్మణులు ఏకాంతాన్ని కోరుకొని ఒంటరిగా జీవిస్తారు. నిత్యం ధర్మబోధ చెయ్యటం బుద్ధిస్టుల జీవనవిధానం. విశ్వమానవ సహోదరత్వాన్ని పెంపొందించటంలో వారికుండే నమ్మకమే దీనికి కారణం. అందుకే అన్నారు "అన్ని దానాలను మించినది ధర్మదానం." ఈ విషయమై తన శిష్యులకు బుద్ధుడిలా చెప్పాడు: "భిక్షువులారా! వెళ్ళండి, బహుజనుల సుఖం కోసం, బహుజనుల హితం కోసం కరుణామయులై ధర్మాన్ని బోధించండి. ఈ ధర్మం ఆది, మధ్య, అంతాలలో కూడా మహోన్నతమైనది. విజ్ఞులైనవారు దీన్ని తప్పక అర్థం చేసుకుని, ఆదరిస్తారు." ధర్మబోధ

కోసం అనేకమంది భిక్షువులు అడవులు, కొండలు, నదులు, సముద్రాలు, మంచుపర్వతాలు, యిసుక ఎడారులు దాటి సుదూరప్రాంతాలకు వెళ్ళారు. బుద్ధుని బోధనలు అందించిన శక్తి, ప్రోత్సాహాలకు యిదే నిదర్శనం.

కత్తులు, తుపాకుల సాయం లేకుండానే బుద్ధిజం ఆసియాఖండపు నలుమూలలకు తన శాంతిసందేశాన్ని వినిపించింది. ఆయా ప్రాంత ప్రజలను నాగరికులుగా తీర్చిదిద్దింది. "అస్థిత్వం, వ్యక్తిత్వం కూడా శాశ్వతం కాదని చెప్పిన బుద్ధిజం కోట్లాది ప్రజల హృదయాలలో ఎలా స్థానం సంపాదించింది, సత్ప్రవర్తన, దయ, కరుణ, స్వార్థత్యాగాన్ని బోధించిన యీ మతం భారతదేశ ప్రజలనే గాక, మధ్య ఆసియాలోని అనాగరిక జాతులను సైతం ఎలా ప్రభావితం చెయ్యగలిగింది? అనేది ఎంతకూ అంతుపట్టని సమస్య" అని మాక్స్‌ముల్లర్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. ఇది అంతుచిక్కని సమస్యేమీ కాదు. బుద్ధిజంలోని సత్యనిష్టత, సహనశీలతలే దాని విజయానికి కారణం. విశ్వజనీన లక్షణాలు తనలో అంతర్భాగం కాని ధర్మం టిబెట్, చైనా, జపాన్, బర్మా, శ్రీలంక వంటి భిన్నసంస్కృతులుగల ప్రాంతాలకు విస్తరించటం సాధ్యం కాదు.

కరుణామయ హృదయం లేని ప్రజ్ఞ నిస్సారమైందని చెప్పి బుద్ధిజం దీన్ని ఆచరణలో నిరూపించింది. రాజ్యాల మధ్య జరిగే యుద్ధాలను నివారించింది. అది కాలుమోపిన ప్రతిచోట జంతుబలులను నిలువరించింది. "బుద్ధుని రాకతో అశ్వమేధం, పురుషమేధం వంటి దుష్టసాంప్రదాయాలకు తెరపడింది" అని మహావస్తు అనే గ్రంథం చెబుతుంది.

ఏ మతమైనా ఒక నాగరికతపై చూపిన నిజమైన ప్రభావాన్ని అంచనావెయ్యటానికి కళలు ఒక మంచి కొలబద్ద. బుద్ధిజం విస్తరించిన ప్రతిచోట కళలు వికసించాయి. విశాలమైన విహారాలు, సుందరమైన స్థూపాలు, సౌందర్యం ఉట్టిపడే పగోడాలు (చైనాలోని బౌద్ధ ఆరామాలు) నిర్మించబడ్డయ్. భారత పురావస్తు పరిశోధనా సంస్థ డైరెక్టర్ జె.హెచ్. మార్షల్ అభిప్రాయం ప్రకారం, బుద్ధిస్టు శిల్పాలు శైలి, నైపుణ్యంలో ప్రాచీన ప్రపంచంలో అత్యున్నతస్థాయికి చెందినవి. చైనా, జపాన్‌లలో అత్యుత్తమమైన నిర్మాణాలు బౌద్ధ ఆరామాలే. 'అజంతా గుహల్లోని చిత్రకళ తథాగతుడు బౌద్ధభిక్షువులకిచ్చిన గాఢమైన ప్రేరణకు ప్రత్యక్ష సాక్ష్యమ'ని జె. ఆఫిత్ భావించాడు. భారతదేశంలోని హిందూ, జైన శిల్పకళ, చిత్రలేఖనం బుద్ధిస్టులనుండి అందుకున్న వారసత్వమేనని చరిత్ర పరిశోధకులు అంటారు.

శిల్పకళ, చిత్రలేఖనంలోనేగాక సైన్సు తదితర సాంస్కృతిక రంగాల్లో కూడా భారతదేశం బుద్ధిజానికి ఎంతో ఋణపడి వుంది. ప్రాచీన వైద్యశాస్త్రం యొక్క అత్యున్నత దశ అంతా బుద్ధిజం అభివృద్ధి చెందిన కాలమే. భారతీయ వైద్యం అశోకుడు తదితర బౌద్ధపాలకులు స్థాపించిన వైద్యశాలల్లోనే అభివృద్ధిచెందింది. ప్రముఖ వైద్యశాస్త్ర గ్రంథం

'చరకసంహిత' రచించిన చరకుడు బుద్ధిస్టు రాజైన కనిష్కుని ఆస్థానవైద్యుడు. అయుర్వేద వైద్యాన్ని కొత్తపుంతలు తొక్కించిన ఆచార్య నాగార్జునుడు బౌద్ధుడే. ఈనాటికీ అయుర్వేద వైద్య విద్యార్థులకు అత్యంత విలువైన పాఠ్యగ్రంథం బౌద్ధభిక్షువైన వాగ్భటుడు రాసిందే. దిగ్నాగుడు అతని శిష్యుడైన ధర్మకీర్తి భారత తర్కశాస్త్రాన్ని మలుపు తిప్పినవారు. వరరుచి, జయాదిత్య, వామన, చంద్ర మొదలైన వ్యాకరణ పండితులు కూడా బౌద్ధధర్మాన్ని ఆచరించినవారే. ఎన్నో రకాల కళలు, శాస్త్రాలు నలంద వంటి బౌద్ధవిశ్వవిద్యాలయాల్లోనే అభివృద్ధిచెందాయి.

చెట్టుయొక్క గొప్పదనం అది కాసే కాయల వల్ల తెలుస్తుందంటారు. బుద్ధిజం సాధికారత (authority) స్థానంలో హేతుదృష్టిని వుంచింది; ఊహాజనిత పండిత చర్చలను కాదని జీవితవాస్తవికతకు స్థానం కల్పించింది; మతాచార్యులను కాకుండా సంస్కారవంతుడైన భిక్షువును రూపొందించింది; వంశపారంపర్యంగా కొనసాగుతున్న పూజారివర్గాన్ని కాదని సత్ప్రవర్తనాశీలురైన సోదరసంఘాన్ని నెలకొల్పింది. పిడివాదం లేని విశ్వాసాన్ని, మూఢభక్తిలేని జిజ్ఞాసను, దేహదండన లేని మానసిక స్వచ్ఛతను పెంపొందించింది. బుద్ధిస్టు అయిన వ్యక్తి స్వార్థపూరితమైన కోరికలను త్యజించాలి. దయ, సానుభూతి, కరుణలతో కూడిన జీవితాన్ని జీవించాలి. అంతఃదృష్టితో సత్యాన్ని అందుకోగల విజ్ఞత, స్వేచ్ఛ, సహనం అలవరచుకోగలిగిన ధైర్యసాహసాలు పెంపొందించుకోవాలి. మనిషి సమస్యల పరిష్కారం మనిషి చేతుల్లోనే వుందనే విశ్వాసాన్ని కలిగించేది బుద్ధిజం ఒక్కటే.

## మూడవ అధ్యాయం

# బుద్ధిజం యొక్క నైతికభావన

సకల దుఃఖాలనుండి సంపూర్ణమైన స్వేచ్ఛ (విముక్తి) పొందటమే బుద్ధిజం యొక్క పరమలక్ష్యం. స్వార్థపూరితమైన తపన, ఆరాటాన్ని (తృష్ణ) సమూలంగా అంత మొందించటం ద్వారానే దీనిని సాధించగలం. ఆత్మ (నేను, నాది) భావన తీవ్రమైన కోరికల రూపంలో వ్యక్తమౌతూవుంటుంది. ఆత్మభావనను నిర్మూలించాలంటే తృష్ణను అంతమొందించాలి. సంపూర్ణమైన తృష్ణారాహిత్యస్థితిని పొందాలంటే వున్నది ఒకటే మార్గం: అది "చెడువనులకు దూరంగా వుంటూ, నిరంతరం మంచిని పెంపొందించటమే."

**"పవిత్ర సద్ధర్మాన్ని పాటించిన**
**సుఖశాంతులు నీ సొంతమవును:**
**తృష్ణవలలో చిక్కావా,**
**దుఃఖం నిను వెంట తరుమును."**

మనిషి "దశకుశలాలు" (పది కుశల నియమాలు) అతిక్రమించి ప్రవర్తిస్తే అది అతనికి కీడు చేస్తుంది, వీటిని పాటించే వ్యక్తి ప్రవర్తన తనకు మేలు చేస్తుంది. ఈ పది నియమాల్లో మూడు శరీరానికి, నాలుగు మాట తీరు (వాక్కు)కు సంబంధించినవి కాగా, మరో మూడు మనసుకు సంబంధించినవి. జీవులను చంపటం, తనకు యివ్వనిదాన్ని తీసుకోవటం (దొంగతనం), కామసుఖాల్లో చెడుప్రవర్తన - యివి దేహానికి సంబంధించిన పాపాలు. అబద్ధాలాడటం, తంపులమారి (తగవులు పెట్టే) మాటలు, కించపరచటం, వ్యర్థమైన సరదా కబుర్లు - యీ నాలుగు వాక్కుకు సంబంధించినవి. లోభితనం, ద్వేషం, చెడుతలపు అనేవి మానసికజాడ్యాలు. వీటి విషయమై తథాగతుడు యిలా చెప్పాడు, "తాను తప్పు చేశానని తెలిసి పశ్చాత్తాపం చెందని మనిషి మనసులోకి, సముద్రంలోకి చేరే నీరులా చెడు ఆలోచనలు పరుగెత్తుతాయి. దుర్బుద్ధి బలపడితే దాన్ని వదిలించుకోవటం యింకా కష్టం. దుష్ప్రవర్తన కలిగిన వ్యక్తి తన తప్పులను గుర్తించగలిగితే, వాటిని క్రమంగా అంతమొందించగలుగుతాడు."

పది నిబంధనలు (దశ శిక్షాపాద) భిక్షువుల కోసం ప్రత్యేకంగా చెప్పినవి. కాని పది కుశల నియమాలు (దశకుశలాలు) భిక్షువులేగాక బౌద్ధధర్మాన్ని అనుసరించేవారందరూ పాటించవలసినవి. ఈ దశకుశలాల గురించి వివరంగా తెలుసుకుందాం.

## 1. మనిషి అయినా లేక అతిచిన్న పురుగునైనా ఏ ప్రాణిని చంపరాదు. జీవులన్నిటిపట్ల ఆదరణ కలిగి వుండాలి.

**"జీవులను చంపరాదు. అందుకు సహకరించరాదు. ఇతరులను యీ పని చేసేందుకు అనుమతించరాదు. పెద్దవయినా, చిన్నవయినా ప్రాణులను గాయపరచరాదు" - ధమ్మికసుత్తం.**

**"ఒకరు వందసంవత్సరాలు బ్రతికి, వేలకొలది మూగజీవులను దేవుళ్లకు, దేవతలకు బలిచ్చినా, ఇవేవీ ప్రేమతో ఒక్క జీవి ప్రాణాన్ని కాపాడిన ఫలితాన్ని అతనికి యివ్వలేవు." - చైనా ధమ్మపాద.**

ఈ నియమాన్ని అనుసరించి, ప్రపంచవ్యాపితంగా బుద్ధిస్టులు సరదాకోసం జంతువులను వేటాడటం, వాటిని బలుల పేరుతో చంపటం వంటి పనులకు దూరంగా

వున్నారు. బౌద్ధధర్మం వెలుగుచూడక ముందు, ప్రాచీన భారతదేశంలో జంతుబలులు సర్వసాధారణం. మనుషులు, గుర్రాలు, దున్నపోతులు, గొర్రెలు, మేకలను యజ్ఞ యాగాదుల్లో బలి యిచ్చినట్లు 'సతపాత బ్రాహ్మణం'లో చెప్పబడింది. 'అశ్వలాయన గృహ్యసూత్రం'లో లేగదూడలను ఏ విధంగా కాల్చి తినాలో సవివరంగా వర్ణించబడింది. ఎన్ని యజ్ఞాలు, యాగాలు చేసినా, మాంసం తిననివాడు రాబోయే యిరవై జన్మలు జంతువుగానే పుడతాడని మనుధర్మశాస్త్రం (35వ సూక్తం) చెప్పింది. ముఖ్యమైన అతిథులు వచ్చినప్పుడు ఆవు మాంసం వడ్డించటం ప్రతిష్ఠకు చిహ్నంగా వుండేది. అందుకే హోదా గలిగిన అతిథిని 'గోఘ్న' (ఆవును హరించేవాడు) అని పిలిచేవారు. ఇప్పటికీ ఉత్తర భారతదేశ దేవాలయాల్లో జంతుబలులు సర్వసాధారనంగా జరుగుతుంటయ్. అయినప్పటికి, హిందువులు 'అహింసా పరమోధర్మ' అని వల్లెవేస్తుంటారు. ఈ మార్పు ఎలా వచ్చింది? ఇందుకు దారితీసిన అసలు కారణాన్ని 'నిరణ్యాసింధు' గ్రంథం యిలా వివరించింది: "పండితులైన బ్రాహ్మణులు, వేదాలు చెప్పాయనే కారణంతో, దున్నపోతులను, గొర్రెలను బలిచ్చే సాంప్రదాయాన్ని పాటించనవసరం లేదు. ఎందుకంటే ప్రజలంతా దీన్ని నిరసిస్తున్నారు. అలాగే ఆవులను బలివ్వటం కూడా ప్రజల మనోభావాలకు వ్యతిరేకం కాబట్టి, దీన్ని కూడా నిలిపివెయ్యాలి." వేదాలు చెప్పినదాన్ని సైతం వ్యతిరేకించే స్థితి ఎలా వచ్చింది? రక్తపాతంతో కూడిన పశుబలులను బుద్ధిస్టులు బహిరంగంగా తిరస్కరించటమే దీనికి కారణం. ఈ విషయమై అశోకుని శాసనం యిలా చెబుతుంది: "ఈ సామ్రాజ్యంలో దేవతలకు అర్పించే పేరుతో, విందు వినోదాల కోసం జంతువులను చంపటం నిషేధించబడింది."

బౌద్ధ అనుయాయులు నిరర్థకమైన పశుబలులను నిరసించటమేగాక, జంతువులను ప్రేమతో ఆదరించారు. అశోకచక్రవర్తి రెండవ శాసనంలో యిలా వుంది: "మహారాజు ప్రియదర్శిని (అశోకుని) సామ్రాజ్యంలో, సామంతరాజ్యాలలో మానవులకు, జంతువులకు రెండురకాల వైద్యశాలలు నిర్మించబడ్డాయి. మనుషుల, జంతువుల ఆరోగ్యం కోసం అవసరమయ్యే మూలికలు, పండ్లమొక్కలు యితర ప్రాంతాలనుండి దిగుమతి చేసుకొని అన్ని ప్రాంతాలలో నాటబడ్డాయి. రహదారుల ప్రక్కన చెట్లు నాటి బావులు తవ్వటం జరిగింది." బౌద్ధధర్మం వ్యాప్తిచెందిన అన్ని ప్రాంతాల్లో మూగజీవుల పట్ల ప్రేమ కూడా వ్యాపించింది. సియామి (థాయిలాండ్)లో బుద్ధిస్టులు బ్రతికున్న చేపలను కొని వాటిని తిరిగి సముద్రంలో వదలటం సాంప్రదాయంగా వుంది. అక్కడ ఏనాడూ మనుషుల దరిచేరని పక్షులను కూడా చేరదీసి పెంచుతారు.

బౌద్ధధర్మంలోని యీ నియమమే అనేక దేశాల్లోని ప్రజలు శాకాహారులుగా మారటానికి దారితీసింది. అశోకుని మొదటి శాసనంలో యిలా వుంది: "ఇంతకాలం మహారాజు

ప్రియదర్శిని వంటశాలలో వేలకొలది జీవులను చంపారు. ఈ శాసనం రూపొందే సమయానికి రోజూ రెండు నెమళ్ళు, ఒక జింకను మాత్రమే కోస్తున్నారు. ఇకముందు వీటిని చంపటం కూడా నిషేధిస్తున్నాం." మాంసాహారం తినే కొందరు బుద్ధిస్టులు కూడా స్వయంగా జంతువులను, పక్షులను చంపరు. బుద్ధభగవానుడు మాంసాహారం తినటంపై కఠిన నిబంధన విధించినట్లు కనిపించదు. దీనికి సంబంధించిన సంఘటన ఒకటి **ఆమంగధసుత్తంలో** వివరించబడింది. మాంసాహారం తనను మలినపరుస్తుందని నమ్మి ఒక బ్రాహ్మణుడు దాన్ని తినటం మానేశాడు. "మనిషిని చెడు ఆలోచనలు, అతని కుటిలచర్యలు మలినపరుస్తాయి, కాని మాంసాహారం కాదు", అని బుద్ధుడు ఆ బ్రాహ్మణునితో చెప్పాడు. భిక్షుసంఘ సభ్యులు ఉప్పు, పాలు, పెరుగు, మాంసం తినకుండా కఠినమైనమైన నిబంధన విధించమని దేవదత్తుడు కోరగా, బుద్ధభగవానుడు అందుకు నిరాకరించాడు. అటువంటి నిబంధనలు అతివాదానికి దారితీస్తాయని, తాను చెప్పే 'మధ్యమమార్గం'కు యిది విరుద్ధమని చెప్పాడు. "అన్ని దేశాల్లో, ప్రాంతాల్లో ప్రజలు సాధారణంగా తినే ఏ ఆహారమైనా తినేటందుకు భిక్షు సంఘాన్ని అనుమతిస్తున్నాను. అయితే దీనిలో అత్యాశ, దురుద్దేశం కాని వుండరాదు" అని బుద్ధుడు చెప్పాడు. ఏడవ శతాబ్దంలో శిలాదిత్యుడు అన్నిరకాల జీవులను చంపటంపై నిషేధం విధించేవరకూ భారతదేశంలో శాకాహార సాంప్రదాయం పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు.

ఆహారసమస్యను మానసిక, నైతిక సూత్రాల ఆధారంగా పరిష్కరించలేం. దానికి శారీరక, ఆరోగ్యపరమైన అవసరాలే ప్రాతిపదిక. మానవుని జీర్ణవ్యవస్థ, దంత నిర్మాణంలోని వైవిధ్యం అతనికి మిశ్రమ ఆహారమే తగినదని సూచిస్తున్నయ్. మాంసాహార జీవులకుండే దంతాలు, కొన్ని గ్రంధులు మానవశరీర నిర్మాణంలో వున్నయ్. వాటితో పాటు శాకాహారం కోసం ప్రత్యేకించబడిన సాధనాలూ వున్నయ్. కేవలం శాఖాహారం తింటూ మనిషి బ్రతకగలడు. కొన్ని పరిస్థితుల్లో శాఖాహారిగా వుండటంవల్ల కొన్ని ప్రయోజనాలు వుండవచ్చు. కాని మానవులు స్థల, కాల భేదాల్లేకుండా మిశ్రమ ఆహారంపై జీవించారు. శాకాహారులైనవారు మాంసం తిననప్పటికి, పాలపదార్థాలు, గుడ్లు తరచుగా వుపయోగిస్తారు. మాంసాహారం త్వరితగతిన శరీరానికి శక్తినిస్తుందనే విషయాన్ని నిరాకరించలేం. మరోవైపు, అది మనిషిలో అవాంఛనీయమైన ఉద్రేకాలను ప్రేరేపిస్తుందనటంలో వాస్తవం లేదు. తక్కువ నాగరికత గల ప్రాంతాల్లో వుండే సాధారణమైన ఆహారం, నాగరిక సమాజాలలోని ఆధునిక ఆహారం కంటే పుష్టికరమైంది.

కొన్ని ప్రాంతాల్లో బుద్ధిస్టులు 'జీవులను చంపరాద'నే నియమాన్ని తీవ్రంగా తీసుకున్నట్లు తెలుస్తుంది. ఇటువంటి తీవ్రమయిన ఆచారాలను బుద్ధుడు అనుమతించలేదు. ఈ విషయమై చైనా పండితుడు ఐజింగ్ యిలా చెప్పాడు: "ప్రతి

ఒక్క జీవిని కాపాడాలని తాపత్రయపడే వ్యక్తి చివరకు తనను తాను కాపాడుకోలేడు. అతను ఏ కారణం లేకుండానే తనను తాను అంతమొందించుకోవలసి వస్తుంది."

బుద్ధభగవానుడు యుద్ధం గురించి తన అభిప్రాయాలను విడిగా చెప్పనప్పటికీ, కొన్ని సుత్తాల నుండి మనం వాటిని గ్రహించవచ్చు. సరదా కోసం, బలివ్వటం కోసం లేదా యుద్ధంలో జరిగే ప్రాణహానిని ఆయన నిరాకరించాడు. అదేవిధంగా శాంతిస్థాపన కోసం యితర పద్ధతులు విఫలమైనప్పుడు యుద్ధం చెయ్యటం తప్పుకాదని బోధించాడు. వృధా రక్తపాతం పట్ల పశ్చాత్తాపపడినప్పటికి, బుద్ధిస్టులైన రాజులు సరైన లక్ష్యంకోసం యుద్ధం చెయ్యటానికి వెనుకాడలేదు. బౌద్ధభిక్షువులు యుద్ధాల్లో పాల్గొన్న సందర్భాలు కూడా వున్నయ్. యుద్ధం చెయ్యటానికి సరైన కారణం వున్నచోట ద్వేషం, ప్రతీకారాలకు తావు లేకుండా, దృఢసంకల్పంతో బహిరంగంగా యుద్ధం నిర్వహించాలి. ఒక దుర్మార్గాన్ని నిలువరించే వీలు వుండి కూడా చేతులు ముడుచుకొని కూర్చోవటాన్ని బుద్ధుడు ఎక్కడా అంగీకరించలేదు.

## 2. ఎవరి శ్రమఫలితం వారికే చెందాలి. దొంగతనం, దోపిడీలు చెయ్యరాదు.

"దొంగతనం చెయ్యకూడదు, యితరులు చేస్తుంటే సహకరించరాదు. దొంగతనాలకు అనుమతిని యివ్వరాదు. అన్నిరకాల దొంగతనాలను వదిలివెయ్యాలి" - ధమ్మికసుత్తం.

"తనది కానిదాన్ని దొంగిలించని, తనకివ్వనిదాన్ని తీసికొనని వ్యక్తి, యితరులు తనకు యిచ్చినదాన్ని మాత్రమే తీసుకొని తృప్తిచెందుతాడు. అతను నిజాయితీతో, చిత్తశుద్ధితో బ్రతుకుతాడు." - తెవిజ్జసుత్తం.

సంపద పట్ల తిరస్కారం, దాన్ని పోగేసుకోవటం తాత్వికజీవనానికి అవరోధం అనేవి దొంగతనాన్ని నిషేధించటం వెనుకగల అసలు వుద్దేశాలు. అనాధ పిండకునితో బుద్ధుడు ఒకసారి యిలా అన్నాడు: "జీవితం, సంపద, అధికారాలు పొందటంగాక వాటికోసం తీవ్రంగా ఆరాటపడటమే మనిషిని బానిసగా మారుస్తుంది. ఎవరైతే సంపద కలిగివుండి దాన్ని సవ్యంగా వుపయోగిస్తారో వారు తమ తోటివారికి వరం వంటివారు." తమకోసం మాత్రమే గాక తన కుటుంబం కోసం శ్రమించేవారు ఒక్క మెట్టు మాత్రమే పైన వున్నట్లు. అటువంటి వ్యక్తి తన కుటుంబంలోనివారికి దేవతైనా, యితరుల విషయంలో రాక్షసుడుగా వుండొచ్చు. మనం కూడబెట్టే ధనరాశులు తరచుగా పేదవారి కడుపు మాడ్చటం లేదా? బుద్ధిస్టులు సమకూర్చుకునేదంతా మానవాళి సంక్షేమం కోసమే వుపయోగించాలి. బౌద్ధభిక్షువు తాను పేదవాడిగానే జీవిస్తాడు. కాని మానవులందరి

సంక్షేమం కోసం కృషిచేసే “సంఘం” సంపన్నంగా వుండవచ్చు. సంఘం అవసరాల కోసం సంపదను వినయపీటకం అనుమతించింది. కాని, సంఘం కూడా తాను వుపయోగించుకోలేనంత సంపదను సేకరించటం నిరాకరించబడింది.

సామాజిక లక్ష్యాల కోసం సమిష్టి కృషి (సమానార్థ)ని, సోదరభావంతో కూడిన సాంఘిక జీవితాన్ని బోధించే బుద్ధిజం యొక్క సందేశం సామ్యవాదమే. అందుకే అది 'ఏ నీచానికైనా దిగజారి, నిర్దాక్షిణ్యంగా నిరంతరం సంపదను కూడబెట్టటమే మానవ జీవితలక్ష్యమ'ని చెప్పే పారిశ్రామికవాదానికి వ్యతిరేకం. ఈ రకమైన పారిశ్రామిక వాదమే అభివృద్ధిచెందిన దేశాల్లో జీవితాన్ని అస్థవ్యస్తం చేసింది. సంపద కోసం పడుతున్న యీ ఆరాటమే వ్యాపారరంగంలో సర్వమానవ సోదరభావాన్ని ధ్వంసం చేసింది. ఒక కార్మికుడు పెట్టుబడిదారుణ్ణి, కౌలుదారు భూస్వామిని, దళారి ఉత్పత్తిదారుడిని, కొనుగోలుదారు దళారిని చూసే దృష్టిని పరిశీలించండి. ఇవి పరస్పరం అనుమానం, శత్రుభావాన్ని ప్రదర్శించటం లేదా?... వ్యాపారసంస్కృతి స్వార్థపూరిత లక్షణాలను మాత్రమే పెంపొందిస్తుంది. అది న్యాయం, నిజాయితీలకు విలువనివ్వదు. వ్యక్తిపరమైన హక్కులను కాపాడుకోవటమే దాని ప్రథమ కర్తవ్యం. స్వార్థరహితమైన జీవితాన్ని అది నీచమైందిగా భావిస్తుంది. కొంతమంది చేతుల్లో పెట్టుబడి పోగుపడటం నైతికంగా సమర్థనీయమా? కొందరు ఆర్థికవేత్తలు చెప్పినట్లు పెట్టుబడి అనేది పొదుపుద్వారానో లేక అదనపు సామర్థ్యం వల్లనో పొందేది కాదు. అది ఎంతోమందిని బానిసలుగా మార్చి, వారి శ్రమను దోచుకోవటం ద్వారా పోగుపడిందే. పేదవారి శ్రమను పిండుకోవటం ద్వారానే సంపన్నులు విశ్రాంతిని, విలాసాలను పొందగలుగుతున్నారు. కొందరు ఏవిధమైన సామర్థ్యం లేకనే, శ్రమించకుండానే కోటీశ్వరులవుతున్నారు. ఇది దొంగతనం కాక మరేమిటి?

మరికొన్ని యితర రకాల దొంగతనాలూ వున్నయ్. హెర్బర్ట్ స్పెన్సర్ అనే తత్వవేత్త తన “సోషల్ స్టాటిక్స్” అనే గ్రంథంలో యిలా చెప్పాడు: “ఈ నిజాన్ని మనం దాచలేం. ఇప్పుడున్న ఆస్థి (భూమి) పట్టాలు న్యాయబద్ధంగా పొందినవి కావు. అక్రమపద్ధతులు, కుటిలత్వం, బలప్రయోగం, హింస అనేవి భూమిపై హక్కులు పొందటానికి వుపయోగించిన అసలు పద్ధతులు.” పరిస్థితుల్లో పెద్ద మార్పేమీ లేదు. ఆయన చెప్పింది ఆనాడు (1850) ఎంత సత్యమో, ఇప్పుడూ అంతే నిజం. దురాశాపూరితమైన వ్యాపారలాభం, దురాక్రమణ అనే ఆధునిక సామ్రాజ్యవాద లక్షణాలు దొంగతనం, దోపిడీల కొనసాగింపు తప్ప మరేమీ కాదు. తూర్పు ఆసియా ప్రాంతాలపై దండెత్తటంలో యూరప్‌లోని క్రైస్తవదేశాలకున్న ఏకైక లక్ష్యం వాటిని దోచుకోవటమే. నాగరికతను వ్యాప్తిచెందించే పేరుతో ధనికదేశాలు పేదదేశాలను దోచుకుంటున్నయ్. ఇతరులనుండి పొందిన సంపదే నిజమైన సంపదని హిందూపురాణం చెబుతుంది. కాని, ఏ ముద్దు

పేరుతో పిలిచినా దొంగతనం దొంగతనమేనని చెప్పి, బుద్ధిజం వాటన్నిటిని నిషేధించింది. అత్యవసరమై, గత్యంతరం లేని స్థితిలో కూడ యితరుల వస్తువులను దొంగిలించటం సమర్థనీయం కాదు. సమాజ సంక్షేమం కోసం నిస్వార్థం, త్యాగశీలత తప్పనిసరి.

## 3. పరాయివాని స్త్రీ (భార్య లేక ప్రియురాలు)తో కామసంబంధం అనర్థదాయకం

**"పరాయిస్త్రీతో శారీరక సంబంధం మండుతున్న అగ్నిగుండం వంటిదని గ్రహించి, వివేకవంతులు దానికి దూరంగా వుండాలి: బ్రహ్మచర్యం పాటించలేనివారు అక్రమ సంబంధాలకైనా దూరంగా వుండాలి." - ధమ్మికసుత్తం.**

**"అందం కనిపించినంతనే మనసు దాని వశమవుతుంది. ఎందుకంటే, దానికి అందం అశాశ్వతమని తెలియదు. పట్టుపురుగు తనచుట్టూ తానే గూడు కట్టుకున్నట్లు, మూర్ఖుడు కామసుఖాల్లో తనను తాను బంధించుకుంటాడు. వివేకవంతుడు అటువంటి బంధాలను తెంచుకొని దుఃఖవిముక్తుడవుతాడు." - ధమ్మపాద.**

వేదకాలంలో కామసుఖాల్లో నియమం పాటించటానికి పెద్దగా విలువనిచ్చినట్లు కనిపించదు. 'వరుణప్రఘాస'లో యజ్ఞాన్ని నిర్వహించే వ్యక్తి భార్య పూజారికి ప్రియురాలి పాత్ర పోషిస్తుంది. ఈ విషయమై "ఆమె శీలవతా, కాదా అనేది ముఖ్యం కాదు" అని చెప్పబడింది. ఋగ్వేదంలో వివాహేతర కామసంబంధాల విషయమై అశక్తత వ్యక్తమయింది. తరువాత ఉపనిషత్‌ల కాలంలో వివాహ విషయమై కఠిన నిబంధనలు రూపొందించినప్పటికి బహుభార్యాత్వం, వ్యభిచారం కొనసాగుతూనే వున్నయ్. బ్రాహ్మణులు కులవ్యవస్థను స్థిరీకరించే క్రమంలో అందుకు మిత్యాచారం (వివాహేతర సంబంధాలు) ప్రమాదకరమైందని భావించారు. తీవ్రమైన శిక్షలను అమలుచెయ్యటం ద్వారా దీన్ని అదుపు చేసే ప్రయత్నం జరిగింది. స్మృతుల్లో, మహాభారతంలో కులం కోణంనుండే అక్రమ సంబంధాలను నిరాకరించటం జరిగింది. ఈ విషయంలో తప్పు చేసినవారికి విధించే శిక్షలు కూడా వారి కులాన్ని బట్టి మారుతుండేవి. వైష్ణవుల్లో బహుసంపర్కం తీవ్రమైన అపరాధం కాదు. వారి దైవమైన శ్రీకృష్ణుని లీలలు చూసినప్పుడు వారు యిలా భావించటం సహజమే. బాల్యవివాహాలు సమాజ పరిణామ క్రమంలో ఏర్పడ్డవి కావు. ఇది బ్రాహ్మణసాంప్రదాయాన్ని అనుసరించేవారిలో మాత్రమే వుంది. బాల్యవివాహం, పరదా పద్ధతి కూడా స్త్రీలపై వున్న అపనమ్మకం ఫలితమే. "భార్యలు తమ భర్తలకు విషం యిచ్చి చంపకుండా నివారించేటందుకు సతి (సహగమనం)

ప్రవేశపెట్టబడిందని స్ట్రాబో చెప్పిన విషయం నిజమే కావచ్చు.

బౌద్ధగ్రంథాలన్నీ దాంపత్యవిషయంలో పవిత్రంగా వుండమని నొక్కి చెబుతాయి. 'ఉన్మాదయంతి జాతక' కథలోని ఒక వృత్తాంతం బౌద్ధసాంప్రదాయంలోని ఆదర్శాన్ని స్పష్టం చేస్తుంది. శిబిచక్రవర్తి ఆస్థానంలోని ఒక ఉద్యోగి సౌందర్యరాశి అయిన తన భార్యను అనుభవించవలసిందిగా రాజును కోరతాడు. అందుకు తిరస్కరించిన శిబిచక్రవర్తి అతనితో యిలా చెబుతాడు: "ఖడ్గంతో నా శరీరాన్ని నిలువునా ఖండించటానికైనా లేదా మండుతున్న అగ్నిగుండంలో యీ శరీరాన్ని దహించటానికైనా నేను సిద్ధమే. కాని నేను నిరంతరం ఆచరించే బౌద్ధధర్మానికి భంగం కలిగించలేను. క్షణికమైన సుఖాల కోసం ధర్మాచరణకు హాని తలపెట్టబోను. సుగుణశీలురైనవారు యితరులను పరాభవించటంలో ఆనందం పొందజాలరు. సత్ప్రవర్తనతో నా అవసరాలను అదుపుచేసుకుంటాను. కాని, అందుకోసం యితరులను నొప్పించలేను. నన్ను అదుపుచేసుకునే శక్తి నాకు లేనప్పుడు, నన్ను నమ్మిన ప్రజలకు నేనెలా రక్షణ కల్పించగలను? నా ప్రజల సంక్షేమం కోసం, నా సత్ప్రవర్తన, నా పేరు ప్రఖ్యాతులపై నాకున్న గౌరవం కారణంగా, తాత్కాలికమైన సుఖాలకు దాసుణ్ని కాబోను."

సాధారణంగా మతాలన్నీ కామోద్రేకాన్ని తిరస్కరించాయి, దాన్ని సంపూర్ణంగా అణచివేయాలనీ బోధించాయి. ఈ ధోరణి అహేతుకమైనది కావచ్చు, కాని అసంబద్ధమైనదేమీ కాదు. కామ కార్యకలాపాలను సవ్యమైనరీతిలో నిర్వహించటం నీతిబాహ్యమైనది కాదు. సానుభూతి, విశ్వసనీయత, అనురాగం, త్యాగం వంటి పరోపకార గుణాలకు మూలం స్వజాతి పునరుత్పత్తి భావంలో వుందనటం నిజమే అయివుండొచ్చు. కాని కామం కేవలం సంతానోత్పత్తికి పరిమితమై లేదు. దానికదే ఒక లక్ష్యంగా తయారయింది. స్త్రీలు ధరించే బట్టలు తరచుగా కామాన్ని ప్రేరేపించే అవయవాలను ప్రదర్శిస్తుంటాయి. సెక్సును సంతృప్తిపరచటం కోసం చేసే పనులు శృతిమించి భయం గొలిపేవిగా వుంటయ్. వ్యభిచారం, సుఖరోగాలు, విడాకులు, పిల్లల పెంపకంలో పెడధోరణులు అనేవి శృంగారం శృతిమించటంవల్ల కలిగే అనర్థాలే. సెక్సు, అగ్నివలె అదుపులో వుంచితే ఎంత వుపయోగకరమో అదుపు తప్పినప్పుడు అంత ప్రమాదకరం. కొద్దిమంది మాత్రమే యీ మంటల్లో చిక్కుకోకుండా తప్పించుకోగలిగారు. మతాచారాల్లో చాలాభాగం సెక్సు కార్యకలాపాలకు ప్రతిరూపాలే. జాతరలు, పండుగల్లో జరిగే అనేక కార్యక్రమాల మూలాలు పునరుత్పత్తి కోరికలోనే వున్నయ్. కాబట్టి విచ్చలవిడి శృంగారంపై ప్రత్యేకమైన నిబంధనలు విధించటం చాలా సహజం.

బౌద్ధధర్మం అక్రమ సంబంధాలను నిషేధించినప్పటికి, ధర్మమార్గంలో నడిచే వారందరికి సెక్సు పూర్తిగా నిరాకరించబడిందని దీని అర్థం కాదు. సెక్సు కార్యకలాపాలు

ఆ అనుభవం పట్ల తీవ్రమైన ఆరాటాన్ని పెంచుతాయి, పైగా కొన్ని నరాల జబ్బులకు యివి కారణమౌతాయి. అందుకే సద్ధర్మం సెక్సు పట్ల విముఖతను చూపింది. జాతి మనుగడ వివాహం యొక్క ప్రధాన లక్ష్యం. పెళ్ళిచేసుకునేవారు ముందు తరాల కోసం కాకుండా కేవలం తమ వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తున్నారు. భాగస్వామి ఎంపికలో ఆరోగ్యం, ఆలోచన, హృదయస్పందనలకు చోటు లేకుండా పోయింది. జాతి మనుగడ అనే సదుద్దేశంతో జరిగే పెళ్ళిపట్ల బౌద్ధధర్మానికి అభ్యంతరం వుండదు. బుద్ధిజంలోని కొన్ని శాఖలు గృహస్తులు కూడా అర్హతులు కాగలరని బోధించాయి.

'భిక్షువుగా ఎందుకు మారాలనుకుంటున్నావ'ని యువాన్ చువాంగ్‌ను ప్రశ్నించినప్పుడు ఆయన "తథాగతుని ధర్మంయొక్క వెలుగును నలుదిశలా వ్యాపింపచెయ్యటమే నా లక్ష్యం" అని జవాబిచ్చాడు. సరిగ్గా యిదే లక్ష్యంతో సిద్ధార్థుడు ప్రాపంచిక సుఖాలను త్యజించాడు. మానవులు ధర్మమార్గం వీడి చీకట్లో కొట్టుమిట్టాడుతున్న కారణంగానే ఆయన తన భార్యాపిల్లలను వదలి పరివ్రాజకుడయ్యాడు. దుఃఖవిముక్తి మార్గాన్ని కనుగొన్న బుద్ధుడు ఆ మార్గాన్ని అందరికీ చూపటమే సర్వస్వంగా భావించాడు. ఆయన అనుచరులు కూడ తమకోసం కాక మానవాళి విముక్తి కోసమే బ్రహ్మచర్యాన్ని అవలంబించి భిక్షువులయ్యారు. భిక్షువుగా మారటమంటే కేవలం పసుపు వస్త్రాలు ధరించటం కాదు, సకల మనోక్లేశాలను అంతమొందించటం. నియమాలు పాటించినంతనే అర్హతులు కాలేరు. పరిపూర్ణ హృదయనిర్మలత్వాన్ని పొందాలి.

## 4. అసత్యం పలుకరాదు, కాని సత్యాన్ని చెప్పటంలో విచక్షణ కలిగివుండాలి. అది ప్రేమ వివేకంతో కూడి, హాని కలిగించనిదై వుండాలి.

**"పదుగురు కూడిన చోట లేదా సభలు, సమావేశాల్లో అబద్ధం చెప్పరాదు, అందుకు సహకరించటంగాని, అనుమతించటంగాని చెయ్యరాదు. అసత్యం ఏ రూపంలో వున్నా దానికి దూరంగా వుండాలి." - ధమ్మికసుత్త.**

**"సత్యాన్ని పలకటం, కోపాన్ని అదుపులో వుంచటం, యితరులు అడిగినదాన్ని యివ్వటం - యీ మూడూ పవిత్ర జీవితానికి సోపానాలు" - ధమ్మపాద.**

బౌద్ధధర్మం అబద్ధం చెప్పటాన్ని తీవ్రమైన అపరాధంగా భావిస్తుంది. అబద్ధం ప్రధానాంశంగా లేని నేరాలు, అపరాధాలు చాలా అరుదు. అబద్ధాలు చెప్పటంలో నమ్మకద్రోహం యిమిడి వుండటమేగాక, దాని సారాంశంలో అది పిరికితనం కూడా. ఇతరులపై చాడీలు చెప్పటం, పొగడ్తలు, తప్పుడు ప్రమాణాలు చెయ్యటం వంటివి మరో రూపంలో అబద్ధాలే.

తప్పనిసరైనప్పుడు అబద్ధం చెప్పవచ్చా అనేది ఒక ముఖ్యమైన ప్రశ్న. ఎటువంటి

పరిస్థితిలోనైనా అబద్ధం చెప్పటం తప్పో లేక అందుకు సమ్మతించే సందర్భాలున్నాయా? "కామసుఖాల్ని పొందటంలో, వివాహం, గోవులు తిన్న ఆహారం, యజ్ఞయాగాల్లో కట్టెలకోసం, బ్రాహ్మణుని రక్షణ లేదా ప్రయోజనం కోసం అబద్ధాలు చెప్పటం పాపం కాదు" అని మనుధర్మశాస్త్రం చెబుతుంది. మహాభారతంలో కృష్ణుడు యీ 'ఐదు తప్పులు' పాపకారణం కావని చెప్పాడు. మనిషి చేసే చర్య (కర్మ)ల్లో వుండే వుద్దేశానికి బుద్ధిజం ఎంతో ప్రాధాన్యతనిస్తుంది. దురుద్దేశం లేని చర్యలు దోషం కాదని చెప్పినప్పటికి, అబద్ధం విషయమై బుద్ధధర్మంలో రాజీధోరణి లేదు. అది చెప్పేదొక్కటే - "సత్యాన్ని విచక్షణతో చెప్పు, కాని ఎల్లప్పుడూ సత్యాన్నే పలుకు, అమరత్వం కంటే సత్యాన్నే ప్రేమించు, నీకు ప్రమాదకరమైనా యితరులకు ప్రయోజనకరంగా వుంటే నిజాన్ని నిర్భయంగా చెప్పు".

## 5. మత్తును కలిగించే ఏ విధమైన పదార్థాలను సేవించరాదు.

**"ధర్మాన్ని అనుసరించేవారు ఎటువంటి మత్తుపానీయాలు సేవించరాదు, అందుకు యితరులకు సహకరించటం, అనుమతించటంగాని చెయ్యరాదు."**

**"తాగిన మైకంలో మంచివాడు కూడా చెడ్డపనులు చేస్తాడు, యితరులకూ తాగిస్తాడు. తెలివిని మందగింపజేసి, నీచమైన పనులకు దారితీసే మత్తుపదార్థాలకు దూరంగా వుండాలి." - ధమ్మికసుత్త**

**"మధుపానం గౌరవాన్ని, మర్యాదను మంటగలుపుతుంది. తగవులకు, రోగాలకు దారితీస్తుంది, తెలివితేటలను మందగింపజేస్తుంది." - శిగాలోవసుత్తం**

పురాతన భారతదేశంలో మత్తుపానీయాలు తాగటం చాలా ఎక్కువగా వుండేది. కల్లు, సారా (సోమ, సుర)లను తాగటం వేదకాల బ్రాహ్మణులకు నిత్యకృత్యం. సోమరసం దేవతలకు చాలా ప్రీతిపాత్రమైనదని వాళ్ళు భావించేవారు. రుగ్వేదంలో యిలా చెప్పబడింది: "ఇంద్ర, అగ్నిదేవతలారా! మీరు ప్రత్యక్షం కావాలని కోరుతూ చేస్తున్న యీ పవిత్ర పూజలో మీ తృప్తికోసం యీ సోమరసాన్ని అర్పిస్తున్నాం. సకల జీవులను పాలించే దేవతలారా! పవిత్రమైన యీ యజ్ఞపీఠాన్ని అలంకరించి యీ సోమరసాన్ని తనివితీరా సేవించండి." మైకం కలిగించటమే సోమపానం యొక్క వుద్దేశమని నొక్కి చెప్పారు. అదేవిధంగా సుర (కాపుసారా) కూడా దేవతలకు అర్పించేవారు. సౌత్రామణి, వాజపేయ క్రతువుల్లో సారాను అర్పించే ఘట్టం చాలా ప్రధానమైంది.

చరిత్రలో హిందువులు ఏనాడూ మత్తుపానీయాలను విడిచి జీవించలేదు. వారి వారి ధర్మసూత్రాల్లో సోమ, సురలతో పాటు మాద్విక, తాళ (తాటికల్లు) మరి యితర మత్తు పానీయాల గురించి చెప్పారు. రామాయణ, భారతాల్లో కూడా వీటిపట్ల

సానుకూలమైన ప్రస్తావనలు ఎన్నో వున్నయ్.

భారతదేశంలో మొట్టమొదట సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని పాటించినవారు బౌద్ధులే. మద్యాన్ని తాగిన వ్యక్తి పైకి హేతుబద్ధంగా వ్యవహరిస్తూనే అంతరంగంలో ఆ శక్తిని కోల్పోతాడు. ఈ కారణంగానే బౌద్ధధర్మం మద్యపానం వద్దని చెబుతుంది. మధుపానం అనేక నేరాలకు, అనర్థాలకు దారితీస్తుందనేది అందరికి తెలిసిందే. అందుకే ఒకరు మత్తులో మునిగితే అది యితరుల్లో అభద్రతను రేకెత్తిస్తుంది. ఆల్కాహాలు (శుద్ధిచేసిన సారా) కొద్దిపాటి మోతాదులో వైద్యరంగంలో వువయోగపడుతుంది, కాని దుర్వినియోగమైతే అది చాలా అనర్థాలకు దారితీస్తుంది.

## 6. అసభ్యకరంగా మాటాడటం, తిట్టటం చెయ్యరాదు. వ్యర్థమైన కబుర్లు చెప్పరాదు. సభ్యతతో మాట్లాడాలి లేదా మౌనం పాటించాలి.

"కోపంతో యితరులను అసభ్యకరమైన మాటలతో నెలవాలనుకొనేవాడు మూర్ఖుడు. అతను సహనశీలురైన వారిముందు చిత్తుగా ఓడిపోతాడు" - **ఉదానవర్గ**

"పసలేని మాటలు కట్టిపెట్టినవాడు అనవసర సంభాషణలకు దూరంగా వుంటాడు. అతను తగిన సమయంలో వున్నది వున్నట్లు నిజం మాట్లాడతాడు. వివేకంతో స్థిరమైన, సునిర్వచితమైన, మేలైన ధర్మాన్ని మాత్రమే పలుకుతాడు." - **తెవిజ్జసుత్తం**

"అసభ్యమైన, చెడు మాటలతో పరులను కించపరిచే ధోరణివల్ల ద్వేషం, తిరస్కారం పెంపొందుతాయి. నోటిని అదుపులో వుంచుకొని, సహనంతో మర్యాదగా ప్రవర్తిస్తే, యీ దుర్లక్షణాలు వాటంతటవే సమసిపోతాయి. మనిషి భవిష్యత్తు అతని మాటలపై ఆధారపడి వుంది, కాబట్టి చెడు మాటలు కీడునే తెనితెస్తాయి." - **చైనా ధమ్మపాద**

ఉన్నతమైన జీవితం కోరుకొనేవారు ప్రాపంచికసౌఖ్యాలను, విలాసవంతమైన అభిరుచులను, వ్యర్థ వినోదాలను వదిలించుకోవాలి; వారు వూసుపోని కబుర్లకు తుంటరి మాటలకు దూరంగా వుండాలి; గొప్పవారి గోత్రాలు, తినటం, తాగటం, నిధినిక్షేపాలు, కట్టుకథలు మొదలైనవాటి గురించి వ్యర్థపు మాటలు మానుకోవాలి.

## 7. కట్టుకథలు చెప్పవద్దు, వాటిని ప్రచారం చెయ్యవద్దు. ఎప్పుడూ యితరుల తప్పులు ఎంచటం మాని, తోటివారిలో మంచిని చూసి వారిని కాపాడు.

"తప్పుడు మాటలు చెప్పనివాడు యితరులను నిందించడు. ఇక్కడ విన్నది

అక్కడ, అక్కడ విన్నది యిక్కడ చెప్పి తగవులు, తన్నులాటలు సృష్టించడు. తద్వారా అతడు విడిపోయినవారిని కలుపుతాడు. స్నేహాన్ని, సోదరత్వాన్ని పెంపొందించి శాంతికాముకుడిగా జీవిస్తాడు." - తెవిజ్జసుత్తం

"ఇతరుల వైఫల్యాలను, తప్పులను గాక తన తప్పులను తాను గ్రహించగలవాడే వివేకవంతుడు." - ధమ్మపాద

కట్టుకథలు సృష్టించటం, వాటిని ప్రచారం చెయ్యటం అనేవి అబద్ధాలకు మరో రూపం.

### 8. పొరుగువాని సంపద చూసి అసూయ చెందకు, యితరులకు కలిగిన అదృష్టాన్ని చూసి ఆనందించు.

"ఉదారస్వభావం, మర్యాద, దానగుణం, కరుణ అనేవి లోకమనే రథానికి యిరుసువంటివి" - శిగాలోవసుత్తం

ఇతరులకు నష్టదాయకమైనా తన ప్రయోజనం కోరుకోవటం స్వార్థపరుల లక్షణం. స్వార్థం యొక్క తీవ్రరూపమే యీర్ష్య. అంటే తనకు ఏ విధమైన ప్రయోజనం లేనప్పటికి, యితరులు బాధపడుతుంటే చూసి ఆనందించటం. సంపదకోసం జరిగే అంతులేని పోటీలో ఒకడు ఎంత ఎదుగుతాడో యితరులపై ద్వేషం కూడా అంతగా పెరుగుతుంది. తన విజయమే కాదు ఎదుటివాడి పతనం కూడా అతని సంబరమే. ఈర్ష్య గురించి ఒక కవి చెప్పిన యీ మాటలుచూడండి: ఇది అంతంలేని చీకటిలో వెలుగునివ్వని మంటవంటిది.

### 9. దురాలోచన, కోపం, పరనిందలకు దూరంగా వుండు. నీకు హాని చేసినవారిని సైతం ద్వేషించకు, ప్రాణులన్నిటిని దయతో ఆదరించు.

"క్రోధాన్ని ప్రేమతో జయించు; చెడును మంచితో, దురాశాపరుణ్ణి ఔదార్యంతో, అసత్యవాదిని సత్యంతో జయించు. ద్వేషం ద్వేషంతో ఎప్పుడూ సమసిపోదు. ప్రేమతోనే ద్వేషం అంతమవుతుంది; అదే దాని సహజలక్షణం" - ధమ్మపాద

"ఉపకారికి ఉపకారం చెయ్యటం వుత్తమమైన పని, కాని అపకారికి వుపకారం చెయ్యటం మహోన్నతమైంది." బోధిచర్యావతారం

న్యాయం అంటే యితరుల, మన యొక్క హక్కులను గౌరవించటం, వాటిని చట్టబద్ధంగా రక్షించటం. అందుకనే అంటారు "ఇతరులు నీకు ఏం చెయ్యాలని కోరుకుంటావో అదే నువు వారికోసం చెయ్యి." కాని దూరదృష్టితో చూసినప్పుడు, న్యాయంగా వ్యవహరించటమంటే నిష్పక్షపాతం, క్షమాగుణం కూడా కలిగివుండాలి.

నిష్పక్షపాతం యొక్క నిజమైన అర్థం, మన పట్ల మనకు కూడా పక్షపాతం లేకపోవటం. ఇతరులకు హానికరమైన సందర్భాల్లో మన హక్కులను సైతం పరిమితం చేసుకోవాలి. మనకు జరిగిన హానిని లెక్కచెయ్యక, ప్రతీకారం తలపెట్టకుండా వుండటమే నిజమైన క్షమాగుణం.

"నీవలె నీ పొరుగువానిని ప్రేమించు" అని బోధించటం అస్పష్టతతో కూడింది మాత్రమేగాక అది విపరీతార్థాలకు దారితీయవచ్చు. తనను తాను సరిగా ప్రేమించలేని వ్యక్తి యితరుల పట్ల కూడా అదే విధంగా వుండాలి. దీని ప్రకారం, తనను తాను ద్వేషించే వ్యక్తి యితరులను కూడా ద్వేషించాలి. బుద్ధిజం యొక్క బోధనలు చాలా స్పష్టంగా వుంటయ్. మనపట్ల మనకు వివేకంతో కూడిన, సవ్యమైన, సంపూర్ణమైన ప్రేమ వుండాలి. సమర్థవంతమైన ఉదారత కలిగివుండాలంటే తాను ఆత్మవిశ్వాసం కలిగి, తనపట్ల తాను నిర్వహించవలసిన బాధ్యతలను స్పష్టంగా ఎరిగివుండాలి. ద్వేషగుణాన్ని వ్యతిరేకించాలి కాని, ద్వేషించే వ్యక్తిని కాదు. దీనర్థం 'ఒక చెంపపై కొడితే మరో చెంప చూపమ'ని కాదు; చెడును మంచితో జయించమని. చెడుపట్ల చేతులు ముడుచుకొని కూర్చోటం నైతికత కాదు. ద్వేషం, లోభం, టక్కరితనం, అహంభావం, సోమరితనం అనేవి మనసును బలహీనపరచి, పరాధీనతను పెంచుతాయి. ద్వేషం, కోపం వల్ల ప్రపంచమంతా వివాదాలు, శత్రుత్వంతో నిండిపోయింది. మనసులో నిరంతర ప్రేమను పెంపొందించటమే దీనికి సరైన మందు.

మైత్రి (విశ్వజనీన ప్రేమ) భావం పెంపొందించుకోమని తథాగతుడు తన శిష్యులను పదే పదే కోరాడు. మైత్రిని కామం లేదా ప్రేమగా పొరపడకూడదు. కామం స్త్రీపురుషుల మధ్య వుండే శృంగారపరమైన సంబంధం. ప్రేమ అనేది తల్లిదండ్రులు పిల్లల మధ్య లేదా అన్నదమ్ములు అక్కచెల్లెళ్ళ మధ్య వుండే సహజమైన అనుబంధం లేదా స్నేహభావం. ఇవి స్వార్థంతో కూడినవి కనుక ఉన్నతమైన ఆదర్శాలుగా పరిగణించబడవు. ప్రతిఫలాన్ని ఆశించని మైత్రి కరుణయొక్క అత్యున్నతరూపం. మెట్ట (మైత్రి) సుత్తంలో యిలా చెప్పబడింది: "ఒక తల్లి, తన ప్రాణాలను సైతం లెక్కచెయ్యక, తన ఒక్కగానొక్క బిడ్డను కాపాడినట్లు, ప్రతి ఒక్కరూ జీవులన్నిటిపట్ల మైత్రిని పెంపొందించుకోవాలి. మన, తన భేదభావం లేక అందరిపట్ల సమానమైన మైత్రిని కలిగి వుండాలి. సర్వకాల సర్వావస్థలయందు మైత్రి నిండిన మనోస్థితిని కలిగివుండటం ప్రపంచంలో అన్నిటికన్నా వుత్తమమైంది." కరుణ, సద్భావనలకు మైత్రి మూలాధారం. మనిషి చేసే ఏ యితర పనులైనా మైత్రికి సాటిరావు. మరో సందర్భంలో భగవానుడు తన శిష్యులకు యిలా చెప్పాడు: "భిక్షువులారా! ఎవరైతే ప్రతిదినం క్షణంపాటయినా మైత్రి నిండిన మనసుతో గడుపుతారో, వారు రోజంతా వందలమందికి అన్నదానం చేసినవారికంటే ఎక్కువ

ఫలితాన్ని పొందుతారు." ఎవరో కొద్దిమంది తప్ప, బుద్ధుని శిష్యులంతా ఆయన చెప్పినట్లుగానే నిరంతరం మైత్రిని సాధన చేశారు.

## 10. నీలో ఎన్నో సంశయాలు రేకెత్తి నిరుత్సాహానికి, అనాసక్తికి దారితీయవచ్చు లేదా నువు చేసే పొరపాట్లు ధర్మమార్గంనుండి నిన్ను దారితప్పించవచ్చు, కావున నీ మనసునుండి అజ్ఞానాన్ని (అవిద్య) పారదోలి సత్యాన్వేషణా సంకల్పంతో ముందుకు నడువు.

'సంశయం' (doubt) పట్ల బౌద్ధధర్మం యొక్క ధోరణి ప్రత్యేకమైంది. స్పష్టంగా, అర్థవంతంగా ప్రతిపాదించబడని సత్యాన్ని అంగీకరించమని బుద్ధుడు ఎక్కడా చెప్పలేదు. నిగ్గుతేలని సత్యాన్ని ఎవరు చెప్పినా వప్పుకోవద్దని, రుజువు (evidence) అనే వెలుగును అనుసరించి నడవమని ఆయన పదే పదే నొక్కి చెప్పాడు. బోధిని పొందటానికి ధర్మాన్ని నిశితంగా పరీక్షించటం అవసరం అన్నాడు. అందుకే బుద్ధిజం ధర్మాన్ని పరిశోధించటంలో సంశయం యొక్క విలువను తక్కువ అంచనా వెయ్యలేదు. సంశయానికి యివ్వబడిన ప్రాముఖ్యత మరింత పట్టుదలతో, కృషితో దాన్ని అధిగమించటం కోసమే. అంతేగాని యిది తగిన ఆసక్తి లేక పట్టనితనం, సోమరితనంతో ప్రతిదాన్నీ అనుమానిస్తూ వుండే మానసిక రుగ్మత వంటిది కాదు. అదుపు లేని సంశయవాదానికి, బుద్ధిజానికి వున్న తేడా యిదే. సంశయవాదం నిరాశకు దారితీస్తే, బుద్ధిజం విశ్వసనీయతకు, సంకల్పశుద్ధికి సంశయాన్ని ఒక మెట్టుగా మాత్రమే భావిస్తుంది.

దుఃఖ విముక్తి కోసం ముందుగా ఎవరో చెప్పిన సత్యాన్ని అంగీకరించాల్సిందే అని బుద్ధిజం చెప్పదు. బౌద్ధిక నిబద్ధత బుద్ధిజానికి మూలస్థంభం వంటిది. ఒకదానితో మరొకటి పొంతన లేకుండా మతాన్ని ఒక జేబులో, సైన్సును మరొక జేబులో పెట్టుకు తిరగటం క్రైస్తవులకు సాధ్యమే. కాని బుద్ధిస్టులకు యిది సాధ్యం కాదు. ఎందుకంటే ధర్మం వాస్తవజీవిత దృక్పథానికి వ్యతిరేకం కాదు. కాబట్టి ఆధునిక శాస్త్ర పరిశోధనా స్ఫూర్తితో పొసగనిదేదీ బుద్ధిజంలో లేదు. సాంప్రదాయాన్ని సమర్థించే వుద్దేశంతో నేటి శాస్త్రవిజ్ఞానాన్ని కించపరిచే ఎటువంటి ప్రయత్నమైనా, సాంప్రదాయానికి నష్టం కలిగిస్తుందేగాని శాస్త్రవిజ్ఞానానికి కాదు. సైన్సు చెప్పే సిద్ధాంతాలను ఋజువు చెయ్యటానికి చూపే ఆధారాలు అసంపూర్ణంగా వుండవచ్చు. కాని సాంప్రదాయం చెప్పే మూఢవాదాలకు అసలు ఆధారాలే లేవు. శాస్త్రీయమైన సైన్సు ఆవిష్కరణలను వుపయోగించుకున్నట్లే, బుద్ధిస్టులు సైన్సు చెప్పే సూత్రాలను సూటిగా అంగీకరించాలి. మానవజీవితాన్ని సమున్నతంగా తీర్చిదిద్దటం కోసం బుద్ధిజాన్ని, శాస్త్రవిజ్ఞానాన్ని అనుసంధానించేటందుకు నడుం కట్టాలి.

వ్యక్తి పరిపూర్ణత అంతిమలక్ష్యంగా కలిగిన బుద్ధిజం యొక్క నైతికత స్వప్రయోజనం కేంద్రంగా వుందని కొందరు విమర్శకులు భావిస్తారు. కాని కొంచెం ఆలోచిస్తే యీ వాదనలోని డొల్లతనం తేటతెల్లమవుతుంది. ప్రకృతి యొక్క పరమార్థం (అత్యున్నత లక్ష్యం) పరిపూర్ణతను సాధించటమేగాని సుఖం, సంతోషం కాదు. మనిషిని జంతువునుండి వేరుచేసేది అతని మానసిక, నైతికశక్తులే. ఈ శక్తుల సమతాస్థితి, పరిపూర్ణ వికాసం ద్వారానే మానవత యొక్క ఉన్నతస్థితిని అందుకోగలం. అందుకోసం యితరులకు సహకరించగలం. కాబట్టి హేతుదృష్టితో చూసినప్పుడు మానవుని అసలైన లక్ష్యం, మానవశక్తుల వికాసం తప్ప మరేమీ కాదు. ఈ విధమైన పరిపూర్ణత కోసం ప్రయత్నించటమే స్వార్థం అనుకుంటే, అటువంటి స్వార్థం వుండి తీరవల్సిందే. దృఢమైన, ప్రయోజనకరమైన స్వయం-ప్రేమ (self-love) అవసరమైన మంచి లక్షణమే. తోటి మానవుల పట్ల నిజమైన, గాఢమైన ప్రేమ ఏర్పడటానికి యిది అత్యావశ్యకం. ఈ విషయమై చైనా ధమ్మపాద ఏమి చెప్పిందో చూద్దాం: "నీ అంతర్గత శక్తులను, ప్రజ్ఞను పెంపొందించుకోవటం నీ ప్రథమ కర్తవ్యం. నీవు ఫలితం పొందిన తరువాతే దాన్ని యితరులకు అందించగలవు. అవిరళమైన కృషితో బోధిని పొందగలవు. బోధిని పొందిన వ్యక్తి మొదట తనపై తాను అదుపు సంపాదించి, క్రమంగా యితరులపై కూడా పట్టు సాధించగలడు. తన ప్రవర్తనను నియంత్రించుకోగలిగినవాడే అత్యున్నతస్థితికి చేరగలడు. అప్పుడు మాత్రమే యితరులకు సహాయపడగలడు." బోధిని పొందే ప్రయత్నంలో మనిషి తనను తాను (స్వ-అర్థ) సంస్కరించుకొని, యితరుల మేలు (పర-అర్థ) కోసం పాటుపడతాడు. "బహుజనుల హితం కోసమే ఒక వ్యక్తి బోధిని పొందగోరుతాడ'ని బోధిచర్యావతారం చెబుతుంది. కరుణ, పరోపకారంతో మెలగనివారికి బోధి సిద్ధించదు.

బౌద్ధధర్మంలో ప్రజ్ఞలేని శీలానికి, శీలంలేని ప్రజ్ఞకు తావులేదు. అవి రెండు జ్వలిస్తున్న అగ్నిలో వెలుతురు, వేడిలా కలగలిసే వుంటాయి. బోధి అంటే బౌద్ధిక పరిపక్వత మాత్రమే కాదు, దానితో మానవాళి పట్ల కరుణ కలగలిసిందే నిజమైన బోధి. నైతిక పరిపక్వతతో నిండిన చైతన్యవికాసమే బోధి యొక్క నిజమైన సారం. 'నీవలె నీ పొరుగువానిని ప్రేమించు', 'నీ శత్రువును కూడా ప్రేమించు' అని బోధించేవి నిజంగా గొప్ప సూక్తులే. కాని నీ పొరుగువానిని, నీ శత్రువును నువు ఎందుకు ప్రేమించాలో అర్థం చేసుకోనంతవరకు యివి నిర్జీవమైన మాటలుగా మిగిలిపోతయ్. స్వర్గంలో చోటుకోసం లేదా నరకంలో బాధలు తప్పించుకోవటం కోసమో నీ శత్రువును ప్రేమించి యితరులకు మేలు చెయ్యటం నీచమైన పని. దానికంటే బోధిని పొందాలనే కారణం ఎంతో మెరుగైనది.

మనిషి పుట్టుకతోనే పాపి అని బుద్ధిజం చెప్పదు. "దుష్టత్వం మనుషులకు పుట్టుకతో

వచ్చింది కాదు; సహజంగా వారు మంచివారే" అని బోధిచర్యావతారం చెబుతుంది. కాబట్టి బుద్ధధర్మం యొక్క నైతికనియమాలకు బాహ్యశక్తుల ప్రేరణ అవసరం లేదు. అవి బుద్ధుని ఆదేశాలని బుద్ధిస్టులు అనుకోరు. ఎందుకంటే, తన సాటిమనిషిని ఆదేశించే హక్కు ఎవరికీ లేదు. నైతిక నియమాలు తథాగతుడు చూపిన మార్గంలో అంతర్భాగం. ఎవరైతే వాటిని అనుసరించరో వారు తమ చర్యల పర్యవసానాన్ని తామే భరించాలి. వరాలు శాపాలు లేనప్పటికి, కార్యకారణ సంబంధం నైతికత పరిధిలో భౌతికశాస్త్ర నియమాలంత ప్రభావవంతమైనది. బుద్ధిస్టుల నైతిక పద్ధతి కర్మ, విపాకం (ఫలితం) యొక్క అధ్యయన ఫలితమే. ఒకరు చెడ్డపనులు చేసినప్పుడు యితరుల వల్ల గాక, తమ చర్యల కారణంగానే వాటి ఫలితాన్ని అనుభవిస్తారు. పట్టుబడని నేరస్తుడు కూడా తన చర్యల ఫలితాన్నుండి తప్పించుకోలేడు. నేరం చేసిన వ్యక్తి మనసును పశ్చాత్తాపం నీడలా వెంటాడుతుంది. ఫలితంగా అతను మనశ్శాంతిని కోల్పోతాడు; దుఃఖం అతని హృదయాన్ని దహించివేస్తుండగా, నిస్సహాయుడై మానసికంగా కుంగిపోతాడు.

బుద్ధిస్టు నైతికత స్వయం సాధికారమైనది. క్రైస్తవంలో మనిషి చర్యలను అతను (క్రైస్తవుల) దైవానికి విధేయుడా, కాదా అనే దానిపై ఆధారపడి అంచనావేస్తారు. 'పరమాత్మ' యొక్క అస్థిత్వాన్ని హేతువాదంతో నిరూపించటం సాధ్యం కాదని, వేదాల్లో వుంది కాబట్టి దాన్ని ఒప్పుకొని తీరవలసిందేనని శంకరాచార్యుడు చెప్పాడు. 'ఒకరు చేసిన పని మంచిదా లేక చెడ్డదా అని అంతిమంగా నిర్ణయించేది స్మృతులపై ఆధారపడే'నని అతని అభిప్రాయం. కాని నైతికతకు అసలైన ప్రమాణం మానవజీవితమే కావాలి... స్వర్గనరకాల్లో విశ్వాసం మనిషి ప్రవర్తనను ప్రభావితం చెయ్యవచ్చు, కాని అది ఒక నైతికశక్తిగా వుండలేదు.

బుద్ధిజం బోధించే నైతికతకు సహజమైన మానవజీవిత అవసరాలే ఆధారం. మనిషి తన జీవితంలోని బాధను, దుఃఖాన్ని వదిలించుకోవాలని కోరుకుంటాడు; తన జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలనుకుంటాడు. దీన్ని సాధించటం ఎలా? బోధిచర్యావతారంలో చెప్పినట్లు 'పుణ్యం మనిషి జీవితాన్ని సుఖమయం చేస్తుంది. ఒకరు యితరుల పట్ల కరుణ, సేవాతత్పరత కలిగివుంటే వారు అతని బాధలకు కారణం కారు. ఇతరుల సహకారం లేకుండా మనిషి తాను ఆశించినవి పొందలేడు. ఇతరుల సహకారం కోరుకునే వ్యక్తి వారి పట్ల కరుణ, సానుభూతి కలిగివుండాలి. వారుకూడా తమ సుఖసంతోషాలను కోరుకుంటారు, కాబట్టి వారి బాధలను, దుఃఖాన్ని దూరం చెయ్యటానికి సహకరించాలి. మనచేతికి దెబ్బ తగిలి బాధ శరీరమంతా వ్యాపించినట్లు, ఒకరికి కలిగే బాధలు యితరులపై ప్రభావం చూపుతాయి. శరీరంలో వివిధ భాగాలున్నా దాన్ని ఒక్కటిగానే పరిగణిస్తాం, సంరక్షిస్తాం. అదేవిధంగా జీవులు విడివిడిగా వున్నా, అందరూ దుఃఖం

నుండి విముక్తి, సుఖసంతోషాలనే కోరుకుంటారు. కాబట్టి అందరినీ ఒకే విధంగా చూడాలి. ఆత్మరహిత (నైరాత్మ్యయ) భావనను అర్థం చేసుకున్నప్పుడే 'జీవులందరు ఒక్కటే' అనే భావన కలుగుతుంది. దీనినుండే ముదిత, కరుణ, మైత్రి అనే సదాచార మూలమైన లక్షణాలు అలవడతాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రం యీనాడు చెబుతున్న సత్యాలను రెండువేల ఏళ్ల క్రితమే బుద్ధుడు తన అంతఃదృష్టితో చూడగలిగాడు. మనిషి తన జాతికి చెందిన ఒక్క కణం నుండే రూపొందుతాడని సైన్సు చెబుతుంది. తోటి మానవులనుండి విడదీసి చూస్తే వ్యక్తికి విలువ లేదు. కన్ను, ముక్కు, చెవి మొదలు మానవుని సర్వశక్తులు అతనికి పూర్వీకులనుండి లభించినవే. అతనికున్న సహజశక్తులు కూడా యితర మానవులు లేకుండా అభివృద్ధి చెందలేవు. మహోన్నతమైన మానవజాతిలో అంతర్భాగంగా, దానితో సహజీవనంలోనే మనిషి వ్యక్తిగా మనగలుగుతాడు. మానవజాతిని ఉన్నతస్థితికి చేర్చటం ద్వారానే మనిషి మానవుడిగా ఎదుగుతాడు; దాని పతనంతో తానూ పతనమైపోతాడు. కొనసాగుతున్న మానవజాతి వికాసంలో అత్యల్పమైన పాత్ర పోషించే వ్యక్తి శాశ్వతజీవితాన్ని పొందలేడు. తన పూర్వపు తరాలు తన జీవితానికి కారణభూతమైనట్లే, తాను కూడా రాబోవు తరాల జీవితానికి కారణమౌతాడు. అందరిలో జీవిస్తూ, అందరికోసం జీవించటం ద్వారా మాత్రమే మనిషి తన జాతి మనుగడను కొనసాగించాలనే కోర్కెను నెరవేర్చుకోగలడు. కాబట్టి, సమస్త మానవాళి మనుగడకు, పరిపూర్ణ వికాసానికి ఏదైతే వుపకరిస్తుందో అదే వ్యక్తి వికాసానికి కూడా దోహదం చేస్తుంది. ఏదైతే మానవజాతి వినాశానికి దారితీస్తుందో అది వ్యక్తికి కూడా హాని చేస్తుంది. పరిపూర్ణతను సాధించిన మానవజాతే అతనికి స్వర్గం, మానవజాతి పతనమే అతనికి నరకం. మానవజాతిని పరిరక్షించటం, దాని వికాసాన్ని పెంపొందించటం పుణ్యం అయితే, దానిని అధోగతిపాలు చెయ్యటం పాపం.

బాధలనుండి, దుఃఖం నుండి త్వరితగతిన విముక్తి పొందాలనుకొనే వ్యక్తి సద్ధర్మాన్ని తప్పక పాటించాలి. ఈ రకమైన ప్రేరణ వైయక్తికమైనది. అయినా యిదే సరైనది కూడా. తన ప్రయోజనం యితరులతో ముడిపడివుందని గ్రహించినప్పుడే ఒక వ్యక్తి యితరులకు అపకారం తలపెట్టడు. అప్పుడు మాత్రమే సొంత మేలు మరచి యితరుల కోసం పాటుపడగలడు. తన శత్రువును ప్రేమించటం తనను బోధికి మరింత చేరువ చేస్తుందని తెలిసిన మనిషి మాత్రమే పగవారిని ప్రేమించగలడు. కేవలం పరుల కోసమే ఒక వ్యక్తి వారిని ప్రేమించడు. వారిపై చూపించే ప్రేమ తనకు తృప్తినిస్తుందని మాత్రమే ఆ పని చేస్తాడు. బృహదారణ్యక ఉపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయితో చెప్పిన మాటలు ఎంతో సబబయినవి: "ఒక స్త్రీ తనపై తనకున్న ప్రేమ కారణంగానే

తన భర్తను ప్రేమిస్తుంది. ఒక పురుషుడు తనపై తనకున్న అనురాగంవల్లే తన భార్యను ప్రేమిస్తాడు. తల్లిదండ్రులు తమపై తమకున్న మమకారం వల్లనే తమ పిల్లల్ని ప్రేమిస్తారు. సంపదమీది ప్రేమతో సంపదనెవరూ కోరుకోరు, తమపై తమకున్న అనురాగం కారణంగానే సంపదను కోరుకుంటారు. రాజును, రాజ్యాన్ని, సైన్యాన్ని, చివరకు దైవాన్ని కూడా వారిపై వుండే ప్రేమతో గాక, తమపై తమకుండే ప్రేమవల్లే మనుషులు వారిని ప్రేమిస్తారు." మహారాజు ప్రసేనుడు "నీకంటే అధికంగా నువు ఎవరినైనా ప్రేమించావా?" అని తన భార్య మల్లికను ప్రశ్నించగా, ఆశ్చర్యకరంగా ఆమెనుండి వచ్చిన సమాధానం: "మహారాజా! నిజం చెప్పాలంటే, నాకంటే అధికంగా మరెవరినీ నేను ప్రేమించలేదు." దీనికి ఏ మాత్రం చలించని ప్రసేనజిత్ తన విషయంలోనూ యిదే సత్యమని చెప్పాడు. ప్రసేనుడు, మల్లిక బుద్ధ భగవానుని కలిసి పైవిషయాన్ని విన్నవించగా ఆయన యీ విధంగా బదులిచ్చాడు:

**"ఎన్నెన్నో ప్రాంతాలు తిరిగి**
**ఎంతమందినో చూశాను, కాని**
**తనకంటే మిన్నగా వేరొకరిని**
**ప్రేమించిన మనిషి కానరాలేదు.**
**మనిషి తనకు తానే మిక్కిలి ప్రీతిపాత్రుడు**
**కావున, తనపై తనకున్న ప్రేమనెరిగి**
**ఎవరూ మరొకరికి హాని తలపెట్టరాదు."**

బుద్ధిజంలో నైతికత వ్యక్తి కేంద్రమైనది. ఆచరణలో దాని కొనసాగింపే పరోపకారం. పొరుగువానిని ప్రేమించటానికి యింతకుమించిన ఆధారం మరొకటి కనిపించదు.

మనిషి జీవితం యొక్క అంతిమ లక్ష్యం సంపదను పోగేసుకోవటం లేదా సహజాతమైన కోరికల్ని తీర్చుకోవటం కాదు. సద్ధర్మం ప్రకారం అది ప్రజ్ఞ, స్వేచ్ఛ, సౌందర్యంలో పరిపూర్ణతను పొందటం. భావికాలంలో మానవజాతి పరిపూర్ణతను బోధించే యీ ధర్మం స్ఫూర్తిని, ప్రేరణను కలిగించగలదా? అవును, గతంలో మానవజాతిని ముందుకు నడిపించటంలో మహత్తరమైన చోదకశక్తిగా యీ ధర్మం పనిచేసింది. అది వర్తమానంలో, భవిష్యత్తులో అదేవిధమైన శక్తిగా పనిచేయదని చెప్పటానికి ఏ కారణమూ కనిపించదు. నేటి ప్రపంచంలో తన ఆశలు, ఆశయాలు తీరని మానవాళి, విజయాల కంటే మిన్నగా పరాజయాలనే ఎదుర్కొంటూ నిరాశా నిస్పృహలతో నిండి నిరుత్సాహాన్నే ప్రేరేపిస్తున్నది. కాని బుద్ధభగవానుని ధర్మకాయంలో పొదిగిన ఆదర్శ మానవత్వం మనిషిలో ప్రేరణ కలిగించి మున్ముందుకే నడిపిస్తుంది. ఆదర్శప్రాయమైన లక్ష్యాలనుండి

మనిషి పొందిన ప్రేరణ చరిత్ర అంతటా కనిపిస్తుంది. అంతకుమించి, ఆదర్శాల సాధన కోసం మానవుడు తన మాన, ధన, ప్రాణాలను సర్వస్వం ఎలా త్యాగం చేశాడో చరిత్ర సాక్ష్యం చెబుతుంది. మానవచరిత్రలో ఏనాడూ ఆదర్శం లేని దశ లేనేలేదు. అది ఎంత తక్కువైనా, మనిషి దాన్ని పాక్షికంగా అందుకోగలిగాడు. పరిపూర్ణమైన బోధిని తన సొంతం చేసుకోగలిగే ప్రాథమిక లక్షణాలు మానవునిలో ఎప్పుడూ వున్నయ్.

## నాలుగో అధ్యాయం

# బుద్ధిజం - కులం

"తథాగతుడు వర్షించే మేఘంవలె జగత్తునంతా పునరుజ్జీవింపచేస్తాడు. ఉన్నతులు-నీచులు, పండితులు-పామరులు, ఉత్తములు-అధములు అనే భేదం లేక అందరిపట్ల సమాన ఆదరణ కలిగివుంటాడు. అతని ధర్మం పవిత్రమైంది. అది ధనికులు-పేదలు, అధికులు-అల్పులు అనే భేదాన్ని పాటించదు. అది నీటివలె మన తన తేడా లేకుండా అందరిని పునీతుల్ని చేస్తుంది. అది భూమ్యాకాశాల మధ్య వుండే అన్నిటిని ఎటువంటి తేడా లేకుండా దహించే అగ్నివంటిది. స్త్రీ-పురుషులు, బాల-బాలికలు, శక్తివంతులు-శక్తిహీనులు ఎవరైనా అది అందరిని సమానంగా ఆదరిస్తుంది." ఇటువంటి మాటలతో గౌతమ శాక్యముని తన విముక్తిమార్గం యొక్క సార్వజనీనతను తన శిష్యులకు బోధించాడు. ఈ విధమైన విశ్వజనీనతా స్ఫూర్తిని బౌద్ధధర్మం ఆచరణలో ఎలా కొనసాగించిందో తెలుసుకోవాలంటే, జుగుప్సాకరమైన హిందూ కులవ్యవస్థ పట్ల బుద్ధిజం యొక్క వైఖరిని లోతుగా పరిశీలించాలి.

ఒకరోజు బుద్ధుని శిష్యుడైన ఆనందుడు బావిలో నీరు తోడుతున్న ఒక అమ్మాయి వద్దకు వెళ్ళి తాగటానికి నీరు పొయ్యమని అడిగాడు. మాతంగ కులానికి చెందిన ఆ యువతి "అంటరాని కులం నాది, నా చేతి నీరు నువ్వెలా తాగుతావ్?" అని ప్రశ్నించింది. అందుకు ఆనందుడు "సోదరీ, నేనడిగింది తాగటానికి నీరు, నీ కులం కాదు." అని అన్నాడు. ఈ మాటలతో పరమానందభరితురాలై ఆ అమ్మాయి ఆనందునికి నీళ్ళు పోసింది. ఆమెకు ధన్యవాదాలు చెప్పి ఆనందుడు అక్కడనుండి వెళ్ళిపోయాడు. కాని అతను భగవానుని శిష్యుడని తెలుసుకున్న ఆ యువతి బుద్ధుడు విడిదిచేసి వున్న ఆరామానికి వెళ్ళింది. ఆ అమ్మాయి ఆనందుని పట్ల మోహభావంతో వుందని గ్రహించిన బుద్ధుడు జ్ఞానబోధతో ఆమెకు సత్యాన్ని తెలియజేశాడు. దీనితో కనువిప్పు కలిగిన ఆమె బౌద్ధసంఘంలో భిక్షుణిగా చేరింది.

ఒక చండాల కుల స్త్రీని సంఘంలో చేర్చుకోటం తీవ్రమైన అపచారంగా భావించిన

మహారాజు ప్రసేనుడు, శ్రావస్థినగరంలోని బ్రాహ్మణ, క్షత్రియులు తమ నిరసనను తెలిపేందుకు బుద్ధుని వద్దకు వెళ్ళారు. అప్పుడు భగవానుడు వారికి కులవివక్షతలోని డొల్లతనాన్ని యిలా వివరించాడు: "మట్టికి, బంగారానికి మధ్య ఎంతో భేదం వుంది. కాని బ్రాహ్మణునికి, చండాలునికి మధ్య అటువంటి తేడా ఏమీ లేదు. ఎండుకట్టెలను రాపిడి చేస్తే అగ్ని పుట్టినట్లుగా బ్రాహ్మణుడు పుట్టలేదు; ఆకాశం లేదా గాలినుండి బ్రాహ్మణుడు వూడిపడలేదు. భూమిని తొలుచుకొని పైకి రాలేదు. చండాలుడు ఒక స్త్రీ గర్భంనుండి పుట్టినట్లే బ్రాహ్మణుడు కూడా పుట్టాడు. మానవులందరికి ఒకేరకమైన అవయవాలున్నయ్; వారి శరీరనిర్మాణంలో ఏ విధమైన భిన్నత్వం లేదు. అటువంటప్పుడు బ్రాహ్మణులను భిన్నమైన జాతిగా ఎందుకు చూడాలి? మనుషుల మధ్య అసమానతలను పాటించటం ప్రకృతి విరుద్ధం."

బ్రాహ్మణత్వం భారతదేశం యొక్క ప్రత్యేక లక్షణం. ఇతర దేశాల్లో బ్రాహ్మణులు వుండరు. ఆ దేశాల్లో బానిసలు, యజమానులు మాత్రమే వుంటారు. సంపన్నులైనవారు యజమానులుగా, పేదలు వారి సేవకులుగా వుంటారు. సంపన్నులు పేదలుగా, పేదలు సంపన్నులుగా మారవచ్చు. భారతదేశంలో కూడ క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు సంపన్నులైతే బ్రాహ్మణులు వారికి సేవ చేస్తారు; వారి ఆజ్ఞలను పాటిస్తూ, మృదువైన మాటలతో అలరిస్తారు. అటువంటప్పుడు నాలుగు కులాలను కచ్చితంగా విడదీసే తేడా ఏముంది? బ్రాహ్మణులు మాత్రమే గొప్పవారని, యితరులంతా వారికంటే తక్కువవారని చేసే వాదనలో పసలేదు.

బ్రాహ్మణుడు చెడ్డపనులు చేస్తే మిగిలిన అందరిలాగే వాటి ఫలితాన్ని అనుభవించాలి; అందరి వలె బ్రాహ్మణుడు కూడ తన విముక్తికోసం చెడుపనులకు దూరంగా వుండాలి. మానవజాతిలో నిర్దిష్టమైన అసమానతలు వున్నాయనే సిద్ధాంతం తప్పని సభ్యప్రపంచం చెప్పటం లేదా? బ్రాహ్మణుల వలె శూద్రులు కూడా మంచి ఆలోచనలు, మంచి పనులు చెయ్యగలగటం లేదా? స్నానం చేసిన బ్రాహ్మణుడికి మురికి, మట్టి వదిలినట్లే యితరుల శరీరాలు స్నానంతో పరిశుభ్రం కావటం లేదా? నీరు, నిప్పు కులభేదం పాటిస్తాయా? భిన్న కులాల వ్యక్తుల మధ్య సంపర్కంతో పుట్టిన బిడ్డలు వారి తల్లిదండ్రులను పోలివుండటం లేదా? అటువంటప్పుడు మానవుల్లో భిన్నత్వం వుందని చెప్పటానికి ఆధారం ఏముంది? ఒక వ్యక్తి గొప్పతనాన్ని నిర్ణయించేది అతని వంటిపై వుండే గుర్తులు కాదు, అతని ప్రవర్తన మాత్రమే. వ్యక్తుల నైతిక ప్రవర్తనకు సంబంధించిన సమాచారం తెలుసుకోగలం, కాని వారి పుట్టుక, వంశపారంపర్యత గురించి అంత కచ్చితంగా చెప్పలేం. వృక్షాలు, జంతువులు, పక్షులు, చేపల్లో భిన్నమైన రకాలు వున్నట్లు తెలియజేసే గుర్తులు అనేకం వున్నయ్. మనుషుల విషయంలో మౌలికమైన తేడాలేవీ లేవు. తలపై

AC No. 91932

జుట్టు మొదలుకొని కాలివేళ్ళ వరకు శరీరానికి చెందిన ఏ భాగంలో కూడ కచ్చితమైన విభజన ఏదీ లేదు. పుట్టుకతో మనుషులంతా ఒకే జాతిగా వున్నారు. వారు చేసే వృత్తులు, జీవించే స్థాయిని బట్టి వారిలో తేడాలు వుంటయ్. కొందరు వ్యవసాయదారులు ఇంకొందరు చేతిపనివారు అయితే, మరికొందరు వ్యాపారులు, పాలకులు, పూజారులు అవుతారు. ఒకే కులంలో పుట్టినవారు కూడ భిన్నవృత్తులను చేపడతారు. ఉదాహరణకు బ్రాహ్మణుల్లో వైద్యులు, వ్యాపారులు, వ్యవసాయదారులు అయినవారు లేరా? వారిలోనే ఒకవైపు దొంగలు, వ్యభిచారులు, బిచ్చగాళ్ళు మరోవైపు సకల క్లేశాలనుండి విముక్తి పొందినవారు, అందుకు యితరులకు సహకరించేవారు వుండలేదా? అటువంటప్పుడు బ్రహ్మదేవుడు వేదపఠనం, యజ్ఞయాగాల నిర్వహణ కోసం బ్రాహ్మణులను, పరిపాలించటానికే క్షత్రియులను, వ్యాపారం కోసమే వైశ్యులను, సేవ చేసేటందుకే శూద్రులను పుట్టించాడని ఎలా చెప్పగలం?

ఎంత లోతుగా పరిశోధించినా రాజు, సేవకుల శరీరాల మధ్య మౌలికంగా ఏ భేదం కనిపించదు. ఉచ్ఛ నీచ కులాలని, బ్రాహ్మణులు బ్రహ్మపుత్రులని చెప్పేవి వట్టి మాటలే. అన్నిరకాల కులాలు సమానమే. ఎవరైతే ద్వేషాన్ని పెంపొందిస్తారో, జీవులను హింసించి చంపుతారో, దొంగతనం దోపిడీలు చేస్తారో, ఎవరైతే తమ తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తారో వారే చండాలురు. మనిషి తన ప్రవర్తనవల్లే చండాలుడవుతాడు, పుట్టుకతో కాదు. సకల పాపకార్యాలనుండి స్వేచ్ఛను పొందినవాడే బ్రాహ్మణుడౌతాడు. పుట్టుకతోనే ఒక వ్యక్తి బ్రాహ్మణుడు లేదా శూద్రుడిగా వుండడు. అతను చేసే పనులను బట్టే మనిషి విలువ నిర్ణయించబడుతుంది.

బౌద్ధధర్మం కులాల విషయంలో ఎటువంటి భేదాన్ని పాటించదు. శాక్యముని, **సద్ధర్మ పుండరీక సూత్రంలో**, కాశ్యపునితో అన్నమాటలు: "తథాగతుడు తన బోధనలో పక్షపాతం చూపడు. సూర్యచంద్రులు ప్రపంచాన్నంతా ఒకే విధంగా ప్రకాశింపజేస్తారు. మంచివారు–చెడ్డవారు, అధికులు–అధములు అనే తేడా లేకుండా వారి వెలుగు కిరణాలు సకల జీవులపై సమానంగా ప్రసరిస్తయ్. అదేవిధంగా, తథాగతుని జ్ఞానమనే కాంతి అందరికీ సమానంగా చేరుతుంది." ఈ విషయంలో బౌద్ధధర్మం అద్వైత వేదాంతంతో పూర్తిగా విభేదిస్తుంది. సనాతన బ్రాహ్మణ సిద్ధాంతమైన వేదాంతం "ఎవరూ శూద్రులకు మత విషయమై సలహాలివ్వటంగాని, ధర్మబోధనగాని చెయ్యరాదు" అని చెప్పి "రెండుసార్లు జన్మించిన" (ద్వి–జ) కులాలవారు మాత్రమే విముక్తి పొందటానికి అర్హులని ప్రకటించింది. దీనికి భిన్నంగా బుద్ధధర్మం ఏ విధమైన వివక్షత చూపకుండ, విముక్తిమార్గంలోకి అందరినీ ఆహ్వానించింది.

వివక్షత లేకుండా 'సంఘం'లో అందరికి ప్రవేశం లభించింది. పిల్లలు, సైనికులు,

బానిసలు, వికలాంగులకు మాత్రం సంఘంలో చేరేందుకు అనుమతి లభించలేదు. ఇవి కొన్ని అనివార్యమైన మినహాయింపులు. సైనికులు తమ ప్రభువులనుండి, బానిసలు తమ యజమానులనుండి అనుమతి పొందితేనే వారికి సంఘప్రవేశం లభించేది. ఒకరు బ్రాహ్మణుడైనా లేక చండాలుడైనా, తెల్లవాడైనా లేక నల్లవాడైనా అందరూ నిర్వాణాన్ని పొందటానికి అర్హులే. బోధిని పొందేటందుకు అవసరమైన సాధన చేయలేరనే కారణంగా వికలాంగులను సంఘం అనుమతించలేదు. భిక్షువుగా జీవించటమంటే ఒంటరిగా, సోమరిగా జీవితం గడపటం కాదు. జనులందరి హితం కోసం నిరంతరం శ్రమించాలి. భగవానుడు "భిక్షువులారా! సత్కార్యాలు చెయ్యటానికి వెనుకాడవద్దు, అదే సుఖ సంతోషాలకు, మనం ఆశించే విముక్తికి మార్గం" అని బోధించాడు.

'సంఘం'లో ప్రవేశం పొందినవారికి కులం లేదు. గంగా, యమున, సరస్వతి, మహానది వంటి వేరు వేరు పేర్లతో ప్రవహించే నదులన్నీ చివరకు కలిసే చోట వున్న పేరు ఒక్కటే, "మహాసముద్రం". అదేవిధంగా ఎవరు ఏ కులంలో పుట్టినా, 'సంఘం'లో చేరి ధర్మాచరణ సాగించేవారు తమ కులం, వారసత్వం కోల్పోయి భిక్షువులుగా మాత్రమే పిలువబడతారు.

"థెరగాథ"లో సంఘపెద్దలు (థెర)గా గుర్తించబడ్డవారిలో భయంకరుడైన నేరస్తుడు అంగులీమాల, చండాల యువకుడు సునీత, బెస్తవాడైన స్వాతి, పశువుల కాపరి నందుడు, మంగలి ఉపాలి వున్నారు. అలాగే భిక్షుణి సంఘంలో నాట్యకళాకారిణి అమ్రపాలి, వ్యభిచార జీవితం గడిపిన విమల, బానిస కూతురైన పూర్ణ, వేటగాని కుమార్తె చంపా వున్నారు. సునీత సంఘంలో చేరిన వృత్తాంతం వింటే, నిమ్నకులాల్లో పుట్టినవారు సంఘంలో చేరటం ఎంత సులువుగా జరిగిందో అర్థమవుతుంది. ఆ కథ సునీత మాటల్లోనే: నేను ఒక సామాన్య కుటుంబంలో పుట్టాను. పేదవాడినైన నేను వీధులు వూడ్చే పని చేసేవాణ్ణి. దీని కారణంగా అందరూ నన్ను చులకనగా చూసేవారు. ఒకరోజు భగవానుడు భిక్షువులతో కలిసి మగధవైపు వెళుతుంటే చూశాను. పరుగున పోయి భక్తితో ఆయనకు నమస్కరించాను. నా మీద దయతో భగవానుడు అక్కడే ఆగాడు. అప్పుడు నేను ఆయన పాదాలపైపడి నన్ను భిక్షుసంఘంలో చేర్చుకోమని ప్రార్థించాను. అందుకు ఆ మహోన్నతుడు నాతో "ఓ భిక్షువా, రా! సద్ధర్మాన్ని, వినయాన్ని ఆచరించి జగత్తునంతా వెలుగుతో నింపు" అని అన్నాడు. ఆ పిలుపే నాకు సంఘప్రవేశానికి లభించిన అనుమతి.

'సంఘం'లో చేరినవారు తమ కులాన్నివదులుకోవాలి. కాని బుద్ధుడు ధర్మాన్ని అనుసరించే గృహస్తులకు యీ విధమైన నిబంధన విధించినట్లు లేదు. ఆనాటి సామాజిక పరిస్థితులు బహుశా కులవ్యతిరేక వుద్యమాన్ని ప్రేరేపించేవిగా లేవేమో. ఇతర

సాంఘికవ్యవస్థల్లాగే కులం కూడా కాలక్రమంలో రూపొందిందే. పురుషసూక్తాన్ని మినహాయిస్తే ఋగ్వేదంలో బ్రాహ్మణ దృక్పథంతో కూడిన కుల ప్రస్తావన నిర్దిష్టంగా లేదు. వేదస్తోత్రాల్లో రాజులు, పూజారులు అనే రెండు ఉన్నతవర్గాలను మాత్రమే గుర్తించినట్లు తెలుస్తుంది. కాని బ్రాహ్మణులే సర్వోత్తములనే అభిప్రాయం అప్పటికింకా స్థిరపడలేదు. బహుశా బుద్ధుని కాలంలో బ్రాహ్మణులు క్షత్రియులమీద పైచెయ్యి సాధించటానికి ప్రయత్నిస్తూ వుండివుండవచ్చు.

గృహస్థులైన బుద్ధిస్టులు భిన్న కులాల్లో వున్నప్పటికి, వాటికి సాంఘికపరమైన హోదా తప్ప, మతపునాది లేదు. అశోకచక్రవర్తి జీవితంలో జరిగిన ఒక సంఘటన బుద్ధిస్టులు కులం పట్ల ఎటువంటి వైఖరి కలిగివున్నారనే విషయం స్పష్టం చేస్తుంది. ఒకానొక సందర్భంలో అశోకునితో ఒక మంత్రి "ప్రభూ, తమరు అన్నిరకాల కులాలకు చెందిన భిక్షువులకు సాష్టాంగపడి, పాదాభివందనం చెయ్యటం సబబుగా లేదు" అని అన్నాడు. అందుకు చక్రవర్తి అశోకుని సమాధానం యిది: "సౌందర్యం, అధికారంతో వచ్చిన గర్వం, అజ్ఞానం యింతకాలం నన్ను వారికి పాదాభివందనం చెయ్యకుండా అడ్డుకున్నయ్. ఉచితంగా యిచ్చినా ఎవ్వరూ ఆశించని విలువలేని వస్తువు యీ నా శిరస్సు. దీనిని ఒక పవిత్ర కార్యానికి వుపయోగించే అవకాశమే నేను భిక్షువులకు చేసే పాదాభివందనం. దీనిలో అసంబద్ధత ఏమీ లేదు కదా. శాక్య భిక్షువులు కులాన్ని అనుసరించనప్పటికీ, వారిలో సుగుణశీలానికి కొదువ లేదు. పుట్టుక కారణంగా వచ్చిన గర్వాతిశయంతో నేను నన్ను యితరులను కూడా మరిచాను; వివాహాల్లో కులం పట్టింపు వుండవచ్చునేమో, కాని ధర్మం విషయంలో కాదు; ధర్మం సద్గుణశీలానికి సంబంధించినది, దానికి కులంతో పనిలేదు. ఉన్నతకులంలో పుట్టినవాడు నీచమైన పనులు చేస్తే, లోకం అతన్ని నిందిస్తుంది. అటువంటప్పుడు నిమ్నకులంలో పుట్టిన వ్యక్తి సుగుణశీలుడైతే అతన్ని గౌరవించవద్దా?"

తమ ధర్మపరివర్తనలో బుద్ధిస్టులు కులభేదాలను పాటించలేదు. హిందూమతం యిందుకు పూర్తిగా వ్యతిరేకమైంది. హిందూయిజం అంటే సనాతన బ్రాహ్మణ సాంప్రదాయాలను కొనసాగిస్తూ అన్నిటికి వేదాలు మూలమని చెప్పే మతం, బ్రాహ్మణ దేవతలను వారి అవతారాలను పూజించే మతం, గోవును పూజిస్తూ దాని మల మూత్రాలకు పాపప్రక్షాళన చేసే శక్తివుందని చెప్పే మతం, ప్రతి కార్యంలోను బ్రాహ్మణుల పాత్రను నొక్కి చెప్పే మతం. హిందూత్వం కులవ్యవస్థ ఆధారంగానే మతంగా వ్యాప్తి అవుతుంది. కులనియమాలు పాటించనివారు 'మ్లేచ్ఛులు'. మ్లేచ్ఛులూ కులవ్యవస్థ నియమాలను పాటించేందుకు అంగీకరిస్తే వారూ హిందువులుగా మారవచ్చు. కుల వ్యవస్థతో సంబంధం లేని అనేక గిరిజనజాతులు యీవిధంగా హిందూమతంలో చేరాయి. ఈనాడు ఏ బుద్ధిస్టు దేశంలోనూ కులవ్యవస్థకు సంబంధించిన ఛాయలు లేవు.

హిందువుల కులభేదాలు కేవలం సాంఘికపరమైనవి కావు. అవి మతపరంగా ఎంతో ప్రాధాన్యత కలవి. హిందూమతం ప్రకారం పుట్టుకతోనే మనిషి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య లేదా శూద్రుడు అవుతాడు. వీరిలో బ్రాహ్మణుడిగా జన్మించినవాడు అందరికంటే వుత్తముడు. కాబట్టి బ్రాహ్మణుడు దివ్యమైన శక్తులు పొందుతాడు. బ్రాహ్మణుడు యితర కులస్తుల ముందు లేచి నిలబడకూడదు. శూద్రుని యింటిలోని దేవుళ్ళ విగ్రహాలకు సైతం బ్రాహ్మణులు తలవంచి నమస్కరించకూడదు. నీతి తప్పిన బ్రాహ్మణుడినైనా అందరూ గౌరవించి పూజించాలి. శూద్రుడు సత్ప్రవర్తన కలిగినవాడైనా అతను గౌరవించదగినవాడు కాదు. బ్రాహ్మణులు ఏ వృత్తిలో వున్నా వారిని గౌరవించాలి. శూద్రుడు యితర కులాలకు సేవ చెయ్యటానికే సృష్టించబడ్డాడు, కాబట్టి సేవ చెయ్యటమే అతని విధి. తన యజమాని నుండి స్వేచ్ఛను పొందిన శూద్రుడు కూడా సేవకుడిగానే బ్రతకాలి; అది అతనికి సహజమైనది, దాన్ని అతిక్రమించరాదు. శూద్రుడు ముక్తిని ఆశించరాదు, అందుకు తగిన సామర్థ్యం అతనికి లేదు.

వేల సంవత్సరాల క్రితం కులవ్యవస్థ ఎలా రూపుదిద్దుకుందో చెప్పటం కష్టం. కాని అది సాంఘికపరమైన అవసరాల కంటే కూడ మనుషుల్లోని తెగల పునాదిపై పుట్టిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఆర్యులు వలస వచ్చిన ప్రారంభదశలో ఒకేరకమైన జాతిగా వున్నారు. వలసజాతి అయిన ఆర్యుల్లో స్త్రీలు చాలా తక్కువ సంఖ్యలో వుండేవారు. సాహసవంతులయిన కొందరు పరిసరాల్లోని ద్రవిడుల ప్రాంతాలకు విస్తరించాలని ప్రయత్నించారు. వారు తమవెంట స్త్రీలు లేకుండా, మంత్రగాళ్ళుగా, జాతకాలు చెప్పేవారుగా యితర ప్రాంతాలకు వెళ్ళేవారు. వారు ద్రవిడులను ప్రభావితం చేసి, పూజారులుగా స్థిరపడి, స్థానిక స్త్రీలను వివాహం చేసుకున్నారు. దీనితో క్రమంగా తమ స్వజాతి జనంతో ఆర్యులకు సంబంధాలు తెగిపోయాయి. ఇతర జాతులకు చెందిన స్త్రీలను వివాహం చేసుకోవటంవల్ల వారిలో కొంతమేర మార్పు వచ్చినా, తమ జాతి ప్రత్యేకతను నిలుపుకోవాలనే అహం వారిలో పాతుకుపోయివుంది. ఈ లక్ష్యంవైపు తమ స్త్రీలను కూడా మలచుకొని, యితరులతో రక్తసంబంధం పెట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ విధంగా వారు యీనాడు మనం చెప్పుకునే ఒక కులంగా ఏర్పడ్డారు. వారు ద్రవిడస్త్రీలను తమలో చేర్చుకున్నారే గాని, తమ స్త్రీలను ద్రవిడులతో కలవనివ్వలేదు. అందువల్ల ఆర్య, ద్రవిడ కలయిక పూర్తిస్థాయిలో జరగలేదు.

కులవ్యవస్థ పుట్టుక ఎలా జరిగినప్పటికి, ఎవరైతే దానిద్వారా తమ స్వార్థ, సంకుచిత ప్రయోజనాలను నెరవేర్చుకున్నారో వారి ద్వారానే యిది వ్యాప్తిచెందింది. యజ్ఞయాగాల్లో, యితర క్రతువుల్లో తమకున్న పట్టు కారణంగానే బ్రాహ్మణులు తమ ఆధిపత్యం నెలకొల్పగలిగారు. కులవ్యవస్థ బ్రాహ్మణులకు ప్రయోజనకరంగా వుండటంతో

సహజంగానే వారు దాన్ని పెంచి పోషించి, తమకు మరింత అనుకూలంగా మలుచుకున్నారు. **ఐతరేయబ్రాహ్మణంలో** యిలా వుంది: "పురోహితుడు లేకుండా రాజు అర్పించిన ప్రసాదాన్ని దేవతలు స్వీకరించరు. కాబట్టి రాజు చేసే యజ్ఞయాగాల్లో పురోహితునికి అగ్రస్థానం యివ్వాలి." రాజు స్వర్గంలో స్థానం పొందాలంటే పురోహితుణ్ణి ఐదు విషయాల్లో సంతృప్తి పర్చాలి. విధేయతతో మాట్లాడటం, పాదాలు కడగటం, పూజించటం, కడుపును సంతృప్తిపర్చటం, అతని కామాగ్నిని తీర్చటం కోసం అంతః పురంలోని స్త్రీల నివాసాలకు ఆహ్వానించటం – యివే ఆ ఐదు విషయాలు. బ్రాహ్మణులు ఎక్కడికి వెళ్ళినా ధర్మసూత్రాలన్నీ తమ గుప్పెట్లో వున్నాయని చెప్పి తమ ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రయత్నం చేశారు. భారతదేశంలో వారు వెళ్ళిన ప్రతిచోట స్థానిక ప్రజల విధులు, అధికారాలను వారే నిర్ణయించి తమకు అందరికంటే అధికమైన స్థానాన్ని పదిలపర్చుకున్నారు. బ్రాహ్మణులు తమకు తామే ఆపాదించుకున్న గొప్పతనంలోని డొల్లతనాన్ని క్రీ.పూ. 1వ శతాబ్దికి చెందిన బౌద్ధపండితుడైన అశ్వఘోషుడు తేటతెల్లం (వజ్రశూచి గ్రంథంలో) చేశాడు. వజ్రశూచిలోని ఆయన వాదాన్ని వివరంగా పరిశీలిద్దాం.

వేదాలు, ఉపనిషత్తులు, వీటి పరంపరలోని యితర ధర్మశాస్త్రాలు చెప్పేదంతా సత్యమని, వాటికి భిన్నమైనవన్నీ విలువలేనివని అనుకున్నా, బ్రాహ్మణ కులం అన్నింటిలో వుత్తమమైందని చెప్పలేం.

బ్రాహ్మణత్వం అంటే ఏమిటి? అది పుట్టుకతో లేదా వారసత్వంగా వచ్చేదా? శారీరక లక్షణమా లేక విజ్ఞానమా? పాటించే ఆచారమా లేక వ్యక్తి చేసే చర్యల (కర్మల) ఫలితమా లేదా వేదపాండిత్యమా?

బ్రాహ్మణత్వం పుట్టుకతో వచ్చేదయితే మరి జంతువులు, పక్షులు దేవుళ్ళు ఎలా అయ్యాయి? తన ధర్మశాస్త్రంలో మనువు "వేదాల్లో పాండిత్యం పొందినా, శూద్రునివద్ద కానుకలు, దానాలు పొందిన బ్రాహ్మణులు పన్నెండు జన్మలు గాడిదగా, అరవై జన్మలు తోడేలుగా, డెబ్బై జన్మలు కుక్కగాను పుడతాడ"ని చెప్పాడు. అటువంటప్పుడు బ్రాహ్మణత్వం పుట్టుకతో వచ్చేదనటం సరైంది కాదు.

బ్రాహ్మణత్వం తల్లిదండ్రులనుండి సంక్రమించేదైతే, స్మృతుల్లో ఎంతోమంది మునుల తల్లులు బ్రాహ్మణ స్త్రీలు కారని చెప్పినదానికి దీనితో పొంతన ఎలా కుదురుతుంది? వ్యాసుడు చేపలుపట్టే బెస్త కులస్త్రీకి పుట్టాడు; కౌశికుని తల్లి శూద్రుల అమ్మాయి; పరాశరుని తల్లి చండాలకులానికి చెందినది; వశిష్టుని తల్లి ఒక వ్యభిచారిణి. విశ్వామిత్రుడు క్షత్రియకులంలో పుట్టి బ్రాహ్మణుడిగా జీవించాడు. ఒకని తల్లిదండ్రులిద్దరూ బ్రాహ్మణులే అని చెప్పినా, వారి పూర్వీకుల్లో వర్ణసంకరం జరగలేదని చెప్పలేం. మహాభారతం, వనపర్వంలో ధర్మరాజు చెప్పిన విషయం యిది: "సమాజంలో చతుర్వర్ణాల (నాలుగు

కులాల) స్త్రీ, పురుషుల మధ్య సంపర్కం విచ్చలవిడిగా వున్నందువల్ల ఒక వ్యక్తి కులం 'ఇదీ' అని కచ్చితంగా చెప్పటం సాధ్యం కాదు. అన్ని కులాల్లోని స్త్రీలు అక్రమ సంబంధాల వల్ల యితర కులస్తులతో పిల్లల్ని కంటున్నారు. మనుషుల్లో శారీరక సంబంధాలు పుట్టుక, మరణం, మాట్లాడడం వలె సర్వసాధారణం. 'ఏ కులానికి చెందినా, మేమంతా యీ యాగాన్ని కలిసికట్టుగా చేస్తున్నాం' అని చెప్పి ఋషులు యిందుకు సాక్ష్యంగా నిలిచారు.'' మానవధర్మశాస్త్రం ప్రకారం మాంసం తిన్న బ్రాహ్మణుడు తక్షణం కులభ్రష్టుడౌతాడు; ఉప్పు, మైనం, పాలు వంటివాటిని అమ్మిన బ్రాహ్మణుడు మూడుదినాల్లో శూద్రుడిగా మారిపోతాడు. బ్రాహ్మణత్వం పుట్టుకతో వచ్చేదైతే, అది మనిషి చేసిన పనులవల్ల అంత సులభంగా ఎలా మారిపోతున్నది? ఆకాశంలో విహరించే గ్రద్ద నేలమీద వాలినంత మాత్రాన కాకిగా మారుతుందా?

ఇక శరీరమే బ్రాహ్మణత్వమైతే, బ్రాహ్మణుని శవాన్ని దహించే అగ్ని బ్రాహ్మణ హంతకి అవుతుంది. అతని శరీరానికి దహన సంస్కారాలు నిర్వహించే బంధువులు కూడా బ్రాహ్మణ హంతకులే. మరి బ్రాహ్మణుడైన పురుషునికి ఏ కులస్త్రీతో పుట్టిన బిడ్డ అయినా బ్రాహ్మణుడౌతాడని ఒప్పుకుందామా? కాని మహాభారతం ప్రకారం ఒక బ్రాహ్మణునికి శూద్రస్త్రీతో పుట్టినవాణ్ణి శవానికి పుట్టినవాడు (పరాశవ) అని పిలిచారు. అందువల్ల బ్రాహ్మణత్వం శారీరక లక్షణం కాదు.

ఒక వ్యక్తి విద్యనార్జించి, విజ్ఞానవంతుడైతే అతను బ్రాహ్మణత్వం పొందినట్లు భావించాలా? అటువంటప్పుడు వేదాలు, వ్యాకరణం, జ్యోతిష్యం, సాంఖ్య, న్యాయ, వైశేషిక దర్శనాల్లో పాండిత్యం కలిగిన ఎంతోమంది శూద్రులను బ్రాహ్మణులని పిలవాలి. కాని అలా జరగలేదు. అలాగే ఆచార వ్యవహారాలు, మనిషి చేసే చర్యలు (కర్మలు) బ్రాహ్మణత్వాన్ని తెచ్చిపెడతాయనీ చెప్పలేం. ఎందుకంటే బ్రాహ్మణేతరులు అనేకమంది బ్రాహ్మణులకు ధీటుగా సదాచారాలను, సత్కర్మలను పాటించేవారున్నారు.

అలాంటప్పుడు శూద్రులకు ఉన్నతస్థాయి జీవితాన్ని ఎందుకు నిషేధించాలి? అగ్రకులాల అధీనంలో, సేవకులుగా శూద్రులు బతకాలని ఎందుకు చెప్పారు? నాలుగు కులాల పేర్లు చెప్పే వరుసలో శూద్ర శబ్దం చివర వున్నందుకా? కొన్ని సూత్రాల్లో శూద్రులను కుక్కల సరసన చేర్చిన కారణంగా వారు నీచులు, అల్పులుగా బతకవలసిందేనా? లేదు. చతుర్వర్ణక్రమంలో బ్రాహ్మణులు మొదట, శూద్రులు చివర వున్నదాన్ని బట్టి బ్రాహ్మణులు గొప్పవారని, శూద్రులు తక్కువస్థాయివారని అనటం అర్థరహితం. కాబట్టి శూద్రులు బ్రాహ్మణుల సేవ చెయ్యాలనే వాదం కూడా విలువ లేనిదే.

పరమాత్మ నుండే సకల జీవరాశి పుట్టిందని బ్రాహ్మణులు చెప్పారు. అదే నిజమైతే

మనుషుల్లో నాలుగు రకాల కులాలు ఎందుకున్నయ్? ఒకే తల్లిదండ్రుల సంతానంలో వుండే చిన్న చిన్న తేడాల వంటివి తప్ప మనుషులంతా సమానంగా లేరా? పనసచెట్టు కొమ్మలకు, కాండానికి, వేరుకూ కాయలు కాస్తాయ్. ఆ కాయలన్నీ ఒకేరకంగా వుంటయ్. మరి వేరుకు కాసిన కాయల్ని 'శూద్రకాయలు' అని పిలవాలా? లేదు, కచ్చితంగా అలా పిలవకూడదు. బ్రహ్మయొక్క వివిధ శరీరభాగాలనుండి పుట్టారని చెబుతున్న మానవులు కూడా ఒకే రకంగా వున్నారు. బ్రాహ్మణునికి సంతోషం, బాధ కలిగినట్లే చండాలునికి కూడా కలుగుతాయి. వారి పుట్టుక ఒకేవిధంగా జరుగుతుంది, వారు ఒకే రకంగా ఎదిగి, ఒకే రకమైన కారణాలతో మరణిస్తారు. వారి తెలివితేటలు, చేసే పనులు, కలిగే భావనల్లో ఏ తేడా లేదు. అందుకే చతుర్వర్ణాలని చెప్పే మాటల్లో ఏ మాత్రం నిజం లేదు. మానవులందరిదీ ఒకే కులం.

బుద్ధిస్టుల నుండి యిటువంటి తీవ్రమైన దాడి జరగటంతో, బ్రాహ్మణులు తమ మతభావాలను గొప్పవని నిరూపించేటందుకు అనేక రకాలుగా ప్రయత్నించారు. వాటిలో అంతర్భాగమే మహాభారత రచన. బౌద్ధధర్మం పుట్టిన తరువాతే మహాభారతం రాయబడినదని చెప్పటానికి కచ్చితమైన ఆధారాలున్నయ్. 12వ పర్వం 15, 32ల్లో "వేదాలను తిరస్కరించి, పసుపు వస్త్రాలు ధరించి బోడితలలతో తిరుగాడే భిక్షువులు" అనే మాటలు స్పష్టంగా వున్నయ్. క్రీ.శ. 200, 400 మధ్యకాలంలో మహాభారతం రాయబడిందని సాధికారంగా చెబుతారు. మహాభారత రచన ఏ వుద్దేశంతో మొదలైనా, ప్రస్తుత రూపాల్లో వున్న గ్రంథం బ్రాహ్మణులు తమ స్వార్థ, సంకుచిత ప్రయోజనాల కోసం హిందూమతాన్ని పునరుద్ధరించాలని రచించిందే. భారతం 'పంచమవేదం' అని అన్నారు. అప్పటికే నాలుగు వేదాలు వుండగా ప్రత్యేకించి ఐదవ వేదం యొక్క అవసరం ఏమొచ్చింది?

సమాధానం చాలా సులభం. బౌద్ధభిక్షువులు ఏ తారతమ్యం లేకుండా ప్రజలందరికి తమ ధర్మాన్ని బోధించేవారు. కాని వేదాలు ద్విజుల (రెండుసార్లు పుట్టినవారు)కు, అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు మాత్రమే అందుబాటులో వున్నయ్. కాబట్టి బుద్ధిస్టులను ఎదుర్కొనేటందుకు ద్విజులు కానివారికి కూడా అందుబాటులో వుండే గ్రంథాలు సృష్టించాల్సిన అవసరం వుందని బ్రాహ్మణులు భావించారు. అందుకే భారతంలో iii 216, xii 14-5 మరియు 143, 46లో "ఇక మీదట శూద్రులు **అసంస్కృత ద్విజులుగా** మారి, ఇంద్రియ నిగ్రహాన్ని, హృదయ పవిత్రతను అలవరచుకుంటే వారిని గౌరవించాల్సిందే. ఎందుకంటే, మనిషిని పునీతుణ్ణి చేసేది అతని పుట్టుక, పాండిత్యం, వారసత్వం కావు. అతని ప్రవర్తన మాత్రమే" అని ప్రకటించింది. బ్రాహ్మణాలు, సూత్రాలు చివరకు ఉపనిషత్తులు కూడా శూద్రుల గురించి పైవిధంగా

చెప్పలేదు. ఇది హిందూయిజం పేరుతో చెప్పిన స్వచ్ఛమైన బుద్ధిజం. కాని, మానవులందరు తమ క్లేశాలనుండి విముక్తి పొంది బ్రాహ్మణుల స్థాయిని అందుకోగలరని బుద్ధభగవానుడు చెప్పినట్లు బహిరంగంగా వప్పుకునే సాహసం వారికి లేదు. అలా చెయ్యటమంటే శాక్యముని గొప్పతనాన్ని అంగీకరించినట్లే. అందుకే మహాభారతం ఒకవైపు బ్రాహ్మణులను కీర్తిస్తూ, మరోవైపు యితరకులస్తులను బుద్ధుని బోధనల నుండి దూరం చెయ్యాలని ప్రయత్నించింది. వసుదేవుడు భూమాతను "గృహస్తు ఏమి చేస్తే తన పాపాలనుండి విముక్తి పొందుతాడు?" అనడగ్గా, అందుకు భూదేవి "గృహస్తు బ్రాహ్మణులకు సేవ చెయ్యాలి. బ్రాహ్మణుడు పుట్టుకతోనే సకల జీవులు పూజించటానికి అర్హుడు" అని సమాధానమిచ్చింది. మరొకచోట, నిష్ఠతో పూజలు చేస్తున్న ఒక చండాలునికి "నీవు పొందాలనుకునే సమున్నతస్థానం (బ్రాహ్మణత్వం) పూజల ద్వారా పొందగలిగేది కాదు" అని చెప్పబడింది.

సర్వశాస్త్రసారం అని చెప్పుకునే భగవద్గీతలో, 'బ్రాహ్మణ కులాన్ని సంరక్షించటం ద్వారానే వైదికధర్మం సంరక్షించబడతుంద'ని కృష్ణుని నోటితో చెప్పించారు. గీతలో మొదటి నుండి చివరివరకు పడిన తంటాలన్నీ కులవ్యవస్థను కాపాడటం కోసమే. ప్రతి వ్యక్తి తాను చెయ్యవలసిన కర్తవ్యాన్ని తానే నిర్ణయించుకోవాలనేది బుద్ధుని బోధన. కాని కృష్ణుడు ప్రేమ, అనురాగం వంటి సున్నిత భావాలకు లోనవ్వక క్షత్రియునికి విధించిన కులధర్మం అయిన యుద్ధం చెయ్యమని అర్జునుడికి బోధించాడు. సరిగ్గా యీ పద్ధతిలోనే వేదాలు చెబుతున్నాయి కనుక జంతుబలులు, మానవసహజం కానప్పటికీ, సమర్ధనీయమేనని చెప్పాడు. కులవ్యవస్థకు మరింత బలమైన పునాదిని ఏర్పాటు చేసే యత్నం నిస్సందేహంగా జరిగింది. ఇతరులంతా అనేక జన్మల పరంపర ద్వారా బ్రాహ్మణులుగా పుడితేనే వారికి విముక్తి లభిస్తుందని పాతగ్రంథాలు చెబితే, దీనికి కొనసాగింపుగా 'ఎవరికి వారు తమ స్వధర్మాన్ని విధిగా పాటించటం ద్వారానే విముక్తి పొందుతార'ని గీత చెప్పింది. అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు, తమకు కేటాయించబడ్డ పరిధిలోనే, తమ విధులు నిర్వహించాలి. "మానవులు చేసిన పనులు (పూర్వకర్మలు), సామర్థ్యం ఆధారంగా నాలుగు కులాలను నేనే సృష్టించాను. ఎవరైతే తమ కులధర్మం పాటించరో వారు దారితప్పి అంధకారమైన నరకంలోకి నెట్టబడతారు. వారు అక్కడినుండి బయటపడటం చాలా అరుదు. కాబట్టి లోకకళ్యాణం దృష్ట్యా ఎవరి ధర్మాన్ని వారు పాటించాలి. అజ్ఞాని తాను చేసే కర్మ ఫలితాన్ని గురించి ఆలోచిస్తాడు. కాని, జ్ఞాని అయినవాడు కర్మఫలాన్ని గురించి ఆలోచించక సమాజ శ్రేయస్సు కోసం తన ధర్మాన్ని నిర్వహించాలి. వివేకవంతులైనవారెవరూ కర్మఫలం గురించి ప్రజల్లో అనుమానాలు రేకెత్తించరాదు. చెడు ఫలితాన్నిచ్చేదైనా స్వధర్మ నిర్వహణే ఉత్తమమైంది.

తనకు పుట్టుకతో వచ్చిన విధిని పాటించటం వల్ల అతనికి పాపం అంటదు. అది తప్పుడు పనైనా స్వధర్మాన్ని వీడకూడదు, ఎందుకంటే పరధర్మం పాపాన్ని తెచ్చిపెడుతుంది కనుక." ఈ విధంగా గీత బుద్ధుని బోధనలకు వ్యతిరేకంగా మనిషి తాను చేసే పనిని తాను నిర్ణయించుకునే స్వేచ్ఛను అనుమతించలేదు.

పైవిధంగా ప్రచారం చెయ్యటం వెనుక దాగిన అసలు వుద్దేశం చాలా స్పష్టం. శూద్రులు బుద్ధుని బోధనల వల్ల ప్రభావితులై కులాన్ని వదిలివేయకుండా నిరోధించటమే ఆ వుద్దేశం. బ్రాహ్మణ ధర్మం ప్రకారం బ్రాహ్మణులతో పాటు క్షత్రియులు, వైశ్యులు వేదాలు చదవచ్చు. కాని వాటిని బోధించే అర్హత మాత్రం బ్రాహ్మణులకే సొంతం. వారి దృష్టిలో బుద్ధుడు చేసిన అపరాధం ఏమిటంటే, క్షత్రియుడిగా పుట్టి, తన కులధర్మాన్ని పాటించక, బ్రాహ్మణులు తమకే సొంతమని భావిస్తున్న బోధనా వృత్తిని చేపట్టటం. అంతకు మించిన మహాపరాధం: ఏ కులాలయితే ధర్మాన్ని వినటానిక్కూడా అనర్హులుగా బ్రాహ్మణులు ప్రకటించారో ఆ కులాలవారికి ధర్మబోధ చెయ్యటం. కుమారీలభట్టు తన **తంత్రవార్తిక** (గ్రంథం)లో బుద్ధునిపై సరిగ్గా యిదే ఆరోపణ చేశాడు. ఆయన యిలా రాశాడు: క్షత్రియుడిగా జన్మించి తన కులధర్మాన్ని వదలి బోధకుడిగా మారిన వ్యక్తి యితరులకు కర్తవ్యాన్ని బోధించగలడని ఎలా ఆశించగలం? బుద్ధుడు చేసిన యీ ధర్మ అతిక్రమణ ఆయనకు కీర్తికిరీటమని అతని అనుచరులు చెబుతారు; ఎందుకంటే, ఆయన 'కలియుగంలోని పాపభారమంతా నాపై మోపబడనీ, కాని జగమంతా వెలుగుతో నిండాలి' అని అన్నాడు. ఆ విధంగా, ప్రజలందరి సంక్షేమానికి అవసరమైన క్షత్రియధర్మాన్ని విడిచి, బ్రాహ్మణులు మాత్రమే చేయదగిన బోధన చేపట్టాడు. ఇతరుల మీద దయతో యిదంతా చేస్తున్నాననుకొని, తన స్వంత కర్తవ్యాన్ని మరిచాడు. వేదాల, ఉపనిషత్తుల బోధనలకు వ్యతిరేకమైన బుద్ధుని బోధనల్ని అనుసరించేవారు తీవ్రమైన అపచారం చేసినట్లే." దీన్నిబట్టి చూస్తే, గీతయొక్క ప్రధాన వుద్దేశం, పైకి బుద్ధుడు చెప్పినవాటికి అనుకూలంగా వున్నట్లు కనిపిస్తూ, దొడ్డిదారిన బ్రాహ్మణ ఆధిపత్యాన్ని బలపర్చటమే. గీతలో సరైనది, గొప్పది ఏదైనా వుందంటే, అది బ్రాహ్మణవాదులు తమ ప్రత్యర్థి నుండి స్వేచ్ఛగా అరువు తెచ్చుకున్నదే. గీతలో మిగిలినదంతా పొంతనలేని సనాతన భావాలను పునరుద్ధరించేటందుకు అసంబద్ధత, పునరుక్తి, అంతరవైరుధ్యాలను గుదిగుచ్చి చేసిన విఫలయత్నం.

కులవ్యవస్థ హిందూమతానికి మూలస్థంభం వంటిది. దాన్ని నిలబెట్టుకోవటం కోసం బ్రాహ్మణులు చేసిన ప్రయత్నాలకు పురాతన భారతసాహిత్యం సాక్ష్యంగా నిలుస్తుంది. **హిందూధర్మతత్వం** అనే గ్రంథం రచయిత యిలా చెప్పాడు: "చతుర్వర్ణ వ్యవస్థ ద్వారానే భరతఖండంలో హిందూధర్మం కాపాడబడుతూ వుంది... ఈ కుల విభజన హిందూ

ధర్మానికి ప్రబలమైన శక్తి; కులవ్యవస్థ విచ్ఛిన్నమైన రోజు హిందూమతం అంతరించినట్లేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. కులవ్యవస్థను ఆధారం చేసుకొనే బ్రాహ్మణులు హిందూ మతాన్ని వ్యాపింపచేశారు. ఇప్పుడున్నది నాలుగు కులాలు కాదు, వెయ్యికంటే ఎక్కువే. బ్రాహ్మణులలోనే వందకు పైగా ఉపకులాలు వున్నయ్. దాదాపు ప్రతి వృత్తి పనివారు ఒక కులంగా ఏర్పడ్డారు. వీరు యితరులతో సాంఘికసంబంధాలు, ఒకే దేశస్తులమనే బావన లేకుండా జీవిస్తున్నారు. భారతదేశ ప్రజానీకాన్ని అసంఖ్యాకమైన భాగాలుగా విభజించటం పెద్ద శాపమైంది. కులాలతో నిండిన సమాజం ప్రమాదకరమైన అరాచకానికి దారితీసింది. అరాచకంపై వ్యతిరేకత మరింత ప్రమాదకరమైన ఏకస్వామ్యాని (monarchy)కి పునాది అయింది. అత్యధిక కులాలను రాజకీయజీవితంనుండి మినహాయించటంతో సమిష్టి ప్రయోజనం, సంఘటితశక్తి అనే భావాలకు దాదాపు స్థానం లేకుండా పోయింది. నిజమైన అర్థంలో దేశాభిమానం అనే భావన కులం వూబిలో కూరుకుపోయిన హిందూ సమాజానికి లేనేలేదు. కోట్లమందికి నివాసమైన సువిశాల భారత ఉపఖండం శతాబ్దాల తరబడి దురాక్రమణదారులకు దాసోహమవుతూ వచ్చింది. అలెగ్జాండర్ యీ దేశంలో అడుగుపెట్టింది మొదలు భారతావనిని ఎందరో విదేశీయులు పరిపాలించారు. గ్రీకులు, శ్వేతయానులు, హూణులు, అరబ్బులు, ఆఫ్ఘనులు, మంగోలులు మొదలు నేటి పోర్చుగీస్, ఫ్రెంచ్, బ్రిటిష్‌వారి నిరంతర పరాధీనతలో వుండటం భారతదేశం యొక్క ప్రత్యేకత. విదేశీయులు యిక్కడ పుట్టి పెరిగిన సైనికుల సహకారంతోనే యీ దేశాన్నికొల్లగొట్టారు. కొద్దిసంఖ్యలో వున్న విదేశీసైనికులు తమకంటే వందల, వేల రెట్లు అధికంగా వున్న ప్రజలను సులభంగా అదుపుచెయ్యగలిగారు.* హిందూసమాజం విదేశీదురాక్రమణలను ఎదుర్కొనే శక్తి కోల్పోవటమేగాక, అది మేధోపరంగా జడత్వంలో కూరుకుపోయింది. క్రోజియర్ చెప్పినట్లు "ఎక్కడైతే కులం పూర్తిస్థాయిలో పాతుకుపోతుందో, కులాల మధ్య అంతరాలు అధిగమించరానివిగా వుంటాయో, ఎక్కడైతే కులప్రతిష్ఠ సర్వస్వమై వుంటుందో అక్కడ ఆచరణాత్మకమైన ప్రజ్ఞ, చొరవ, స్వతస్సిద్ధత (originality), కార్యదక్షత అనేవి కరువవుతాయి. ఫలితంగా యీ దేశాలు దీర్ఘకాలంపాటు అభివృద్ధి మందగించి ప్రజ్ఞపరంగా జడత్వంలో కూరుకొని పోయాయి." కులసమాజానికున్న ఒక లక్షణం ఏమిటంటే, అది సృజనాత్మకతను కోల్పోయి

* భారతదేశ కార్యదర్శి పదవిలో వుండి, లార్డ్‌జార్జ్ హామిల్టన్ చెప్పిన మాటలు: "ఇక్కడ భిన్నమైన జాతులు, కులాలు వుండటమే మన (బ్రిటిష్) సామ్రాజ్యం ఏర్పడటానికి మూలం, దాని శక్తి యొక్క అసలు రహస్యం". "పరస్పరం శత్రువులైన కులాలు ఒకేచోట వుండటమే భారతదేశంలో పటిష్టమైన మన రాజకయ స్థితికి కారణం." – సర్ జాన్‌స్ట్రాచీ, తన 'ఇండియా' అనే గ్రంథంలో.

అనుకరణతో బతికే తరాలను సృష్టించింది. మనిషి వ్యక్తిగత, కుటుంబ జీవితాలపై కులవ్యవస్థ విధించే జుగుప్సాకరమైన నిబంధనలు ఉత్పత్తిని కుంటుపరచటమే గాక, ప్రకృతి వనరులలో సమాజానికుండే, సప్లై-డిమాండ్ వంటి సహజ సంబంధాలను కూడా ధ్వంసం చేసింది.

పైన చెప్పిన దారుణమైన ఫలితాలు చాలవన్నట్లు, ఆధునిక హిందూవాదులు శాస్త్రీయ పునాదులపై కులవ్యవస్థను సమర్థించి, శక్తివంతం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు. కులానికి జాతి, రక్తసంబంధమైన మూలాలు వున్నాయని వారు వాదిస్తారు. 'వర్ణం' అనే సంస్కృత పదానికి మామూలు అర్థం రంగు. అగ్రకులాలు, అధమకులాల మధ్య నిజమైన వర్ణభేదం వుందనేది వారి వాదం. కాని మనుషుల్లో వుండే రంగుభేదం వారిలో ముఖ్యమైన తేడాలనేమీ సూచించటం లేదని సైన్సు తేల్చిచెప్పింది. భిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో దీర్ఘకాలం జీవించటంవల్ల మనిషి శరీరం యొక్క రంగులో మార్పు వచ్చిందనేది తేటతెల్లం. అదలా వుంచితే, మతం మనుషుల మధ్య వుండే తేడాలను రూపుమాపాలని ప్రయత్నించాలి గాని, వాటిని యింకా పెద్దవి చెయ్యకూడదు.

మానవజాతిని భిన్నజాతులుగా విభజించి చూడాలనే ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మానవ శరీరనిర్మాణ శాస్త్రజ్ఞులు మానవులను భిన్నమైన తరగతులుగా విభజించటం విశ్లేషణలో సౌలభ్యం కోసం తప్ప మరేమీ కాదు. ఈనాడున్న మానవజాతి మొత్తం ఒకే మూలాలనుండి వ్యాప్తిచెందిందనేది ప్రపంచమంతా అంగీకరించిన సత్యం. మనుషుల ఆకారం, రంగు, జుట్టు, కళ్ళలో మనకు కనిపించే తేడాలు పరిసరాల మార్పు వల్ల వచ్చినయ్ తప్ప మరేమీ కావు. అన్ని ప్రాంతాల్లో మనుషులు నేర్చుకోటానికి తగిన అంతర్గతశక్తిని ఒకేవిధంగా కలిగివున్నారు. నేర్చుకోవటంలో వున్న తేడాలు వారికి లభించిన అవకాశాల్లో వున్న అంతరంవల్ల వచ్చాయేగాని, అవి సహజాతమైనవి కావు. శాస్త్రీయ విజ్ఞానాన్ని, శాస్త్రీయ బోధనాపద్ధతుల్ని వుపయోగించి అందరి మానసికశక్తుల్ని అభివృద్ధి చెయ్యవచ్చని జపాన్ దేశస్తులు యిప్పటికే రుజువు చేశారు.

తమది 'మలినం లేని రక్తమ'ని కొందరు గర్వంగా చెప్పుకొనేది వట్టి భ్రమ మాత్రమే. ఈనాడు సనాతన హిందువులు ఆందోళన చెందే 'వర్ణసంకరం' వేలసంవత్సరాల క్రితమే జరిగింది. పూనాకు చెందిన డి.ఆర్. భండాకర్* "భారతదేశంలో యితర కులాలతో సంకరం చెందని కులం ఏదీ లేదు. క్షత్రియులే కాదు, తమలో యితరుల రక్తం చేరలేదనే భ్రమల్లో వున్న బ్రాహ్మణుల్లో కూడా యితర కులాల రక్తం కలగలిసిపోయి వుంది" అని అన్నాడు. యూరప్‌లోని తెల్లవారిలో ఒకనాటి నల్లవారి రక్తం ప్రవహిస్తున్నట్లే, నేటి

---

* *Foreign Elements in the Hindu Population* గ్రంథంనుండి

బ్రాహ్మణుల్లో ఒకనాటి శూద్రుల రక్తం ప్రవహిస్తూ వుంది. స్వేచ్ఛగా పరస్పరం సంకరం జరిగిన జాతులు నిరంతరం అభివృద్ధిచెందతూ వచ్చాయి. మరోవైపు రక్తస్వచ్ఛతను కాపాడుకోవాలని తాపత్రయపడిన యూరప్ ఉన్నతవర్గాలు పతనమైపోవటమో లేదా అంతరించటమో జరిగింది.

ఈనాడు ప్రజలు వంశపారంపర్యతకు ప్రాధాన్యతనివ్వటం సాధారణ విషయమే. వంశానుక్రమానికి సంబంధించిన నియమాలు కళ్ళు, ముక్కు, చెవులు, రంగు, రూపం విషయంలో సరైనవే కావచ్చు. కాని అవి మనిషి తెలివితేటలను నిర్ణయిస్తాయనే విషయంలో చాలా అనుమానాలున్నయ్. తెలివితేటలు పరిసరాలు, శిక్షణపై ఆధారపడేవి గనుక వాటిని ఎవరైనా పొందవచ్చు. అవి వంశపారంపర్యమని చెప్పే ఆధారాలు లేవు, కాని అందుకు వ్యతిరేకమైన ఆధారాలు పుష్కలంగా వున్నయ్. తెలివితేటల్లో సారూప్యత వుండటానికి కారణం కలిసి జీవించటమే. తల్లిదండ్రులు, పిల్లల మధ్య మానసికమైన పోలికలు వుంటానికి అనుకరణ, శిక్షణ, ఒకే పరిసరాల్లో సన్నిహితంగా పెరగటం అనేవి బలమైన కారణాలు.

పుట్టిన ప్రతిబిడ్డ ఒక కొత్తజీవితం ప్రారంభిస్తుంది. ఆ బిడ్డ తల్లిదండ్రులు ఎలాంటివారైనా, సంపూర్ణ వికాసం పొందటానికి ద్వారాలు తెరిచే వుంటయ్... మానవజాతి వికాసం దానికున్న శక్తిసామర్థ్యాలను అభివృద్ధి చెయ్యటంపైనే ఆధారపడివుంటుంది. అందుకోసం అత్యున్నతమైన నైతికవిలువలు పునాది కలిగిన సమాజం తప్పనిసరి. మనిషి సామర్థ్యాన్ని సంపూర్ణంగా వికసింపచెయ్యటానికి, ఆ సామర్థ్యానికి తగిన ఫలితాన్ని పొందటానికి వీలులేని సమాజంలో వుండాలని ఎవరూ కోరుకోకూడదు. కొందరిని అల్పులుగా, అనర్హులుగా చూసే కులసమాజంలో పైన చెప్పినవాటిని పొందటం అసాధ్యం. కుల అహంభావం, వర్గప్రత్యేకతలనేవి మంచి ప్రభుత్వాలకు, స్వేచ్ఛా వికాసానికి మధ్య అడ్డుగోడలుగా నిలిచాయి; అవి యింతవరకు ప్రజలకు శాపంగా వున్నయ్; ఇకముందు కూడా యిలాగే వుంటాయని రుజువు చేసుకుంటయ్.

అధికారంలో వున్నవారెవరైనా, తమ కిందివారికంటే తామే నిరంతరం ముందుంటామని అనుకుంటారు. ఇటువంటి వూహలు సరైనవి కావని సైన్సు చెబుతుంది. 'అత్యున్నతస్థితికి చేరిన జీవజాతులు సాధారణ స్థాయికి మరలటం, క్రింది తరగతికి చెందిన జాతులు పైకి ఎదగటం' అనేది పరిణామశాస్త్రం నిరూపించిన సత్యం. కాబట్టి నేడు అల్పులైనవారి సంతతి అవకాశం కలిసొస్తే పైకి ఎగబాకటం, పైతరగతుల సంతతి దిగజారి క్రిందికి రావటం సాధ్యమే. ఇందుకు చరిత్రలో తగినంత సాక్ష్యం వుంది.

కులవ్యవస్థను మనం ఏ కోణం నుండి చూసినా, అది ప్రమాదకరమైంది. మానవ

సహజ స్వభావానికి అనుగుణంగా బుద్ధుడు కులం పరిమితులను ఛేదించి సర్వమానవ సమానత్వాన్ని బోధించాడు. ఆయన తన శిష్యులతో, “నేను బోధించే ధర్మం అందరిపట్ల సమాన ఆదరణ కలిగిన ధర్మం. దీన్ని మన, తన భేదం లేకుండా అందరికి బోధించండి; ఇది మంచివారిని-చెడ్డవారిని, సంపన్నులను-పేదలను ఒకే విధంగా విముక్తి చేస్తుంది. ఇది ఆకాశంలా విశాలమైంది, దీనినుండి ఎవరికి మినహాయింపు లేదు. కరుణామయులైన వారు తమను మాత్రమే గాక, యితరులనూ విముక్తి చెయ్యాలని కోరుకుంటారు. ఎందరినో మనం విముక్తి చేసినా, చెయ్యవలసింది మరెంతో వుంటుంది. ఇది నిరంతరం కొనసాగాలి. ఆ విధంగా యీ ధర్మం ప్రపంచమంతా వ్యాపించి దుఃఖసాగరంలో మునిగిన అందరిని రక్షించాలి.” ఈ విధమైన స్ఫూర్తితో కొనసాగిన సద్ధర్మం జనులందరి మతంగా మారి సువిశాలమైన ఆసియాఖండం నలుమూలలకు - ఇండియా, బర్మా, శ్రీలంక, టిబెట్, చైనా, జపాన్ - వ్యాపించి క్రమంగా యూరప్, అమెరికాల్లో ఆలోచన, జీవన స్రవంతిని ప్రభావితం చేస్తూ వుంది. ఈ మానవీకరణ ప్రక్రియ మరింత విస్తృతమై, అనేక ప్రాంతాల్లో నేటికీ మిగిలివున్న వర్ణ, వర్గ వివక్షతను చరిత్ర శకలాల పైకి విసిరేసే రోజు వస్తుందని ఆశిద్దాం.

## ఐదో అధ్యాయం

# బుద్ధిజం - స్త్రీలు

గృహస్థ జీవితాన్ని వదలి బౌద్ధసంఘంలో చేరినవారి భార్యలు తాము కూడా ధర్మాచరణ మార్గంలో నడవాలనుకున్నారు. సిద్ధార్థుని పినతల్లి, పెంపుడు తల్లి ఐన ప్రజాపతి గౌతమి నాయకత్వంలో వారు తమను కూడ సంఘంలో చేరేటందుకు అనుమతించమని బుద్ధుణ్ణి ప్రాధేయపడ్డారు. ధర్మసూత్రాలననుసరించి ఆయన వారికి అనుమతి నిరాకరించలేకపోయాడు. కాని, స్త్రీలు బౌద్ధ సంఘంలో చేరితే దీన్ని అవకాశంగా తీసుకుని ఎవరైనా సంఘం గురించి దుష్ప్రచారం చేస్తారని భయపడ్డాడు. అందుకే తెల్లబట్టలు ధరించి ఉపాసికలై బ్రహ్మచర్యం, శీలవ్రతం పాటిస్తూ అంతిమలక్ష్యం కోసం సాధన చెయ్యమని గౌతమి తదితరులకు సూచించాడు. గౌతమి దీనితో సంతృప్తిచెందలేదు. వారు వెంట్రుకలు కత్తిరించుకొని, తగిన వస్త్రాలు ధరించి, భిక్షపాత్రలను చేపట్టి కాళ్ళు పుళ్ళు పడేలా ఎంతోదూరం నడిచి మళ్లీ బుద్ధుని వద్దకు చేరుకున్నారు. బుద్ధుని వ్యక్తిగత సేవకుడైన ఆనందుడు వారి పట్టుదల, పడినకష్టాలు చూసి చలించిపోయి, వారి అభ్యర్థనను పదే పదే భగవానునికి వివరించాడు. అప్పుడు బుద్ధుడు “తథాగతులు పుట్టింది పురుషుల కోసం మాత్రమే కాదు. పురుషులవలే స్త్రీలు కూడా సంఘంలో ప్రవేశించవచ్చు” అని

గౌతమి తదితరులను సంఘంలో చేర్చుకున్నాడు. ఆ విధంగా బుద్ధుడు స్త్రీలను తమ స్వంత హోదాలో పురుషులతో సమానంగా నిలిపాడు.

సుగుణశీలతలో తప్ప మనిషికి, మనిషికి మధ్య మరేవిధమైన భేదభావం పాటించని బౌద్ధధర్మ సూత్రాలకు అనుగుణంగానే స్త్రీలను సంఘంలో చేర్చుకోవటం జరిగింది. ప్రాచీన భారతదేశంలో మహిళల దయనీయస్థితిని పరిగణనలోకి తీసుకొని చూస్తే, బుద్ధుడు, అతని అనుచరులు చేసిన యీ పని ఎంతో సాహసోపేతమైంది. నైతిక అస్థిరతకు ప్రాచీన భారతదేశం పుట్టినిల్లు. వేదకాలం నాటి పూజాకార్యక్రమాల్లో శృంగారం అధికంగా వుండేది. వేదాల్లో ప్రధాన దేవత అయిన ఇంద్రుడు నిరంతరం సోమరసం మత్తులో మునిగివుండటంతోపాటు, వ్యభిచారి కూడా. పుండరీకంలో అంగప్రవేశ చిహ్నాన్ని పూజించేవారు. తరువాత కాలంలో యిది పురుషాంగాన్ని మహాదేవుడనే పేరుతో పూజించటంగా మార్పు చెందింది. భూమ్మీద దేవుని ప్రతినిధులుగా చెప్పుకున్న పూజారులు విస్తృతంగా పరస్త్రీలతో శృంగారం జరిపేవారు. స్త్రీలపై చాలా చులకనైన భావన వుండేది. మహాభారతం ఆదిపర్వంలో యిలా చెప్పబడింది: "గతకాలంలో స్త్రీలు యింటికే పరిమితమై, భర్తలమీద ఆధారపడేవారు కాదు. వారు స్వేచ్ఛగా తిరుగుతూ తమ యిష్టానుసారం ఆనందించేవారు. తమ భర్తలకు విధేయులుగా వుండేవారు కాదు. అయినప్పటికీ దీన్ని తప్పుగా భావించలేదు. అది ఆనాటి ఆచారం. దీన్నే యీ నాటికీ పక్షులు, జంతువులు ఏ అసూయ లేకుండా పాటిస్తున్నయ్. ఈ ఆచారాన్ని మహారుషులు కీర్తించారు. దీన్ని ఉత్తరాది కురువంశస్తులు నేటికీ గౌరవిస్తారు. స్త్రీలకుండే యీ అలవాటు పూర్వీకులు అనుమతించిందే." అనుశాసనపర్వంలో వున్న స్త్రీవర్ణన మరీ దారుణం. విదేహరాజైన జనకుని మనుమడు సుక్రతి యిలా ప్రకటించాడు, "స్త్రీలు వారి జీవితంలో ఏ దశలోనైనా స్వేచ్ఛగా వుండటానికి అర్హులు కారని వేదాలు ఘోషిస్తున్నయ్. ఉన్నతకులంలో పుట్టి తగిన రక్షణలో వున్నవారు కూడా తమకు విధించిన పరిమితుల్ని దాటిపోవాలనే కోరుకుంటారు. స్త్రీకంటే పాపపంకిలమైంది మరొకటి లేదు." ఆడపిల్ల పుట్టుకతోనే ఆమెపై కట్టుబాట్లు మొదలవుతయ్.

ఇటువంటి అమానుషమైన సాంఘికస్థితిగతులపై బుద్ధిస్టులు చేసిన తిరుగుబాటు విజయవంతమైందనటానికి, భిక్షుణి సంఘం కృషిగా చెప్పబడే 'థెరిగాథ' సాక్ష్యంగా నిలుస్తుంది. థెరిగాథ గురించి డా॥ రైస్ డేవిస్ అభిప్రాయం: "దీనిలో చాలా సుత్తాలు గొప్ప శైలి కలిగినవి. అంతేగాక, బుద్ధిస్టులు తమ ఆదర్శంగా చెప్పుకునే పరిపూర్ణమైన జీవితంలో ముఖ్యపాత్ర వహించే స్వీయభావన (self-culture) యొక్క అత్యుత్తమస్థితికి యివి సాక్ష్యంగా వున్నయ్. సంఘంలో చేరిన ఎందరో స్త్రీలు మేధోపరంగా, నైతికంగా ఉన్నత శిఖరాల్ని అందుకున్నారు. కొంతమంది భిక్షుణిలు ధర్మంలో లోతైన, సూక్ష్మమైన

అంశాలపై పురుషులకు బోధించినట్లు చెప్పబడింది. అంతేగాక వారు జ్ఞానశీలాల సమున్నతస్థాయితో మాత్రమే అందుకోగలిగిన నిర్వాణాన్ని పొందినట్లు చెప్పబడింది." భారతదేశంలో బుద్ధిజం బలంగా వున్నకాలంలో భిక్షుణి సంఘాలు విస్తృతంగా వుండేవి. వీటిలో చేరటం ద్వారా స్త్రీలు పురుషులపై ఆధారపడని స్వేచ్ఛాయుతమైన వ్యక్తులుగా ఎదిగారు.

పతనావస్థలో వున్న సమాజంపై బుద్ధిస్టు సంస్కరణ ఒక నైతిక తిరుగుబాటు అయినందున, స్త్రీ పురుష సంబంధాల విషయంలో జాగ్రత్త వహించాల్సిన అవసరం వుంది. ధ్యాననిష్టతో వుండేవారు కూడా స్త్రీల విషయంలో బలహీనతకు లోనయ్యే అవకాశాన్ని నిరాకరించలేం. అందుకే భిక్షువులు స్త్రీలతో, భిక్షుణిలు పురుషులతో నెరపే సంబంధాల విషయమై కఠినమైన నిబంధనల్ని రూపొందించారు. కాని యీ నిబంధనల్లో బుద్ధుడు స్త్రీ పురుషుల మధ్య వివక్షత పాటించలేదు. మౌద్గలాయన సారిపుత్రుల్లాగే ఖౌమ, ధమ్మదిన్న కూడా గౌరవించబడ్డారు. భిక్షువులతో పాటు భిక్షుణిలు కూడా ధర్మబోధ చెయ్యటానికి అనుమతించబడ్డారు. బుద్ధిజంలో విశాఖ నిర్వహించిన ప్రముఖమైన పాత్రను యితర మతాల్లో ఏ స్త్రీ నిర్వహించలేదు. బుద్ధిస్టు గ్రంథాల్లో పురుషుల పేర్లకు ముందు స్త్రీల పేర్లను చేర్చారు. స్త్రీ ఆకర్షణలో వున్న ప్రమాదం గురించి బుద్ధుడు భిక్షువులను తరచుగా హెచ్చరించినా, స్త్రీలు సహజంగా టక్కరి స్వభావం కలవారని ఆయన భావించలేదు. తనకు స్త్రీల పట్ల వ్యామోహం లేదని నిర్ధారించుకున్న ఉపాసకుడు లేదా భిక్షువు స్త్రీలతో కలసి మెలసి వుండవచ్చు. శరీర నిర్మాణంలో వుండే ఆకర్షణ కారణంతో బుద్ధుడు స్త్రీలను నిందించలేదు, కాని బలహీన మనస్కులైన పురుషుల్ని స్త్రీలు తమకు తెలియకుండా కలిగించే ప్రభావం పట్ల జాగ్రత్తగా వుండమని హెచ్చరించాడు.

తన బోధనల్లో బుద్ధుడు స్త్రీ పురుషుల్ని సమానంగా చూశాడు. కాని ఆచరణలో స్త్రీలు చాలా వెనుక నిలిచారు. వారిలో వుండే ప్రత్యేకతలు లక్ష్యాన్ని చేరుకోటానికి అడ్డంకిగా నిలిచాయి. నిర్వాణాన్ని పొందాలనుకునేవారు అన్నిరకాల శారీరక వ్యామోహాలను కఠోరమైన సాధనతో వదిలించుకోవాలి. పురుషుల్లో కొద్దిమంది మాత్రమే దీనిలో ప్రవేశిస్తారు, కాని చాలామంది అందుకు తగిన సామర్థ్యం కలిగివుంటారు. అనుభవాన్ని బట్టి చూస్తే, చాలామంది స్త్రీలు రకరకాల మోజుల్లో పడి ప్రజ్ఞలో వెనుకబడి వుంటారు. నిర్వాణాన్ని పొందేటందుకు కావలసిన, వ్యామోహాన్ని అదుపు చేసుకునే శక్తి వారిలో చాలా తక్కువమందికి వుంటుంది. దీని కారణంగానే, నిర్వాణాన్ని పొందగోరే స్త్రీలు మొదట పురుషులుగా జన్మించాలని కొందరు బుద్ధిస్టులు చెబుతారు. కాని సద్ధర్మం స్త్రీ పురుషులు లక్ష్యాన్ని సాధించేటందుకు సమానంగా అర్హులేనని చెబుతుంది. ధర్మమార్గాన్ని అనుసరిస్తే స్త్రీలు పురుషులవలె గమ్యాన్ని చేరుకోగలరు.

బౌద్ధసాహిత్యంలో బాల్యవివాహాల ప్రస్తావన కనిపించదు. జాతకకథల్లో వివాహితులైనవారంతా యుక్తవయసు వచ్చినవారే. ఆడపిల్లల విషయంలో పదహారేళ్ళ ప్రాయం వివాహానికి తగిందిగా భావించారు. భారతదేశంలో బ్రాహ్మణిజం ప్రభావానికి లోనుగాని క్రీ.పూ. 6వ శతాబ్ది ప్రజలు తమ స్వంత సాంప్రదాయాన్ని ఏర్పరచుకున్నారు. గృహ్యసూత్రాలు, స్మృతుల ప్రకారం నగ్నిక నియమం – అంటే పుష్పవతి కాని వయసులో నగ్నంగా తిరిగే ఆడపిల్లే సరైన భార్య – బ్రాహ్మణులు అనుసరించిన పద్ధతి. భారతదేశపు కథల్లో కనిపించే బ్రాహ్మణులు కాని స్త్రీలు – దమయంతి, సావిత్రి, ద్రౌపది, శకుంతల, మాళవిక – అందరూ మానసికంగా ఎదిగినవారే. స్వయంవర సాంప్రదాయం క్షత్రియుల్లోనేగాని బ్రాహ్మణుల్లో లేదు.

బుద్ధిస్టు దేశాల్లో స్త్రీలు విద్యావంతులవటానికి ఎటువంటి ఆటంకాలు లేవు. బర్మాలో ఎక్కువమంది స్త్రీలు, గ్రామాల్లో కూడ, చదవటం రాయటం నేర్చుకున్నారు. అక్కడ చాలా చిన్నవయసులోనే ఆడపిల్లలు స్కూలుకు వెళ్ళి బౌద్ధధర్మ సూత్రాల్ని నేర్చుకుంటారు. ఇది వారి చదువులకు గట్టి పునాదిని ఏర్పరుస్తుంది. మంచి–చెడ్డల విచక్షణ, శరీరం–మనసు యొక్క సహజలక్షణాలు, వీటితో పాటు పైస్థాయి బోధలైన విశ్వసనీయత, కరుణ, దయ గురించి నేర్చుకుంటారు. బర్మాలోని చిన్నతరహా వ్యాపారంలో అధికభాగం మహిళల చేతుల్లోనే వుంది. వీటి నిర్వహణ కోసం వారు స్వయంగా దూరప్రయాణాలు చేస్తారు. అక్కడ పురుషులు తమ భార్యల్ని సంప్రదించకుండా ముఖ్యమైన విషయాల్లో నిర్ణయాలు తీసుకోవటం చాలా అరుదు.చాలాకాలం క్రితమే శ్రీలంకలో స్త్రీలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు వున్నట్లు మహావస గ్రంథం ద్వారా తెలుస్తుంది. సియామిలో అన్ని తరగతులకు చెందిన పురుషులకు సామాజిక కార్యకలాపాల్లో స్త్రీలు సహకరిస్తుంటారు. సామాజిక వుద్యమాల్లో పురుషులతో సమానంగా స్త్రీలు పాలుపంచుకుంటారు. చివరకు లామాల అధీనంలో వున్న టిబెట్‌లో సైతం మహిళలకు వ్యాపార, వ్యక్తిగత విషయాల్లో చాలా స్వేచ్ఛ వుంది.

బుద్ధిస్టుల్లో వివాహం ఒక సాధారణమైన కార్యం. సంక్లిష్టతతో కూడిన మూఢాచారాలకు దీనిలో చోటులేదు. శ్రీలంక, టిబెట్, మంగోలియా, జపాన్ మరి యితర బుద్ధిస్టు దేశాల్లో పెళ్ళి తల్లిదండ్రులు, బంధువులు, మిత్రుల సమక్షంలో జరిగే ఒక సాంఘిక ఒప్పందం. బర్మాలో పెళ్ళయిన అమ్మాయి తన పేరును మార్చుకోదు, పెళ్ళయినట్లు తెలిపే తాళి, వుంగరం లేదా బురఖా వంటి గుర్తులేవీ వారి వంటిపై వుండవు. భార్య ఆస్తిపై భర్తకు ఏవిధమైన అధికారం వుండదు. హిందువుల్లో స్త్రీ ఎప్పుడూ పరాధీనురాలే. బాల్యంలో తల్లిదండ్రుల, పెళ్ళయినాక భర్త, ముసలితనంలో పిల్లల అదుపులో వుండాల్సిందే. బర్మాలో స్త్రీలు పెళ్ళయిన తరువాత కూడ తమ స్వేచ్ఛను

కోల్పోకుండా భర్తలకు సహచరిణిగా వుంటారు. సర్ టి.జి. స్కాట్ "ఈనాడు యూరప్‌లోని స్త్రీలు తమకు కావాలని కోరే ఎన్నో హక్కులు బర్మాలోని స్త్రీలు ఏనాడో సొంతం చేసుకున్నారు" అని అన్నప్పుడు అందులో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

వ్యక్తి స్వేచ్ఛకు అత్యున్నతమైన ప్రాముఖ్యతనివ్వటం బౌద్ధధర్మానికి మూలబిందువు. మైత్రి ప్రధానంగా కలిగివున్నందువల్ల ఒకరు మరొకరికి అణిగి వుండటానికి యిది వ్యతిరేకం. బుద్ధిస్టు విహారాల్లో వున్న నియమం స్వేచ్ఛ. భిక్షువు పాటించే ఏ నియమమైనా తనకు తాను విధించుకునేదే. విహారాల్లో నాయకుల ఆధిక్యత కేవలం వారి అధ్యయనంలోనే. సంఘంలో చేరే భిక్షువు చేసే ప్రమాణాల్లో తన పైవారికి విధేయుడిగా వుండాలనే నియమమేమీ లేదు. ఇటువంటి మతం వివాహాన్ని విడదీయరాని బంధంగా ఎలా చేయగలిగింది? అన్ని బుద్ధిస్టు దేశాల్లో పెళ్ళి అనేది ప్రేమ, అనురాగంతో కూడిన భాగస్వామ్యం. అవి లేనప్పుడు పెళ్ళి కూడా అంతరించినట్లే. బర్మాలో తగిన కారణం చూపి భార్యాభర్తల్లో ఎవరైనా వివాహాన్ని రద్దుచేసుకోవచ్చు. తాగుడు, మత్తుమందులకు బానిసవటం, మాట అదుపులో లేకపోవటం, అతిగా ఖర్చుచెయ్యటం వంటివి రుజువయితే వివాహాన్ని రద్దుచేసుకోవచ్చు. ఇంత స్వేచ్ఛ వున్నా బర్మాలో విడాకులు తీసుకునేవారి సంఖ్య చాలా తక్కువ. విడాకులు పొందే స్వేచ్ఛ భార్యాభర్తలు ఒకరిపట్ల మరొకరు సంయమనంతో ప్రవర్తించేటందుకు తోడ్పడింది.

ధర్మాన్ని పూర్తి స్థాయిలో ఆచరించగోరేవారు పెళ్ళిచేసుకోరని, అప్పటికే పెళ్ళయి వుంటే భార్యాబిడ్డల్ని వదలిపోతారనే ఆరోపణ బుద్ధిజంపై వుంది. ఇది కొత్త ఆరోపణ కాదు. రాజగృహలో ప్రజలు యీ విషయమై బౌద్ధభిక్షువులను నిందించినట్లు బౌద్ధగ్రంథాల్లో వుంది. ఈ విషయాన్ని తనకు తెలియజేసిన భిక్షువులతో బుద్ధుడు యిలా చెప్పాడు, "ఓ భిక్షువులారా! ప్రజలు మిమ్మ్ము నిందిస్తే, తథాగతుడు సత్యబోధన ద్వారానే ముందు దారి చూపుతాడని చెప్పండి. ఆత్మనిగ్రహం, సత్యసంధత, హృదయ పవిత్రతలనేవి నేను చెప్పే ఆజ్ఞలు." వీటిని పొందాలంటే ప్రాపంచిక సుఖాల్ని సంపూర్ణంగా త్యజించటం, బ్రహ్మచర్యాన్ని పాటించటం ఎంతో అవసరం. బుద్ధిజమేగాక యితర మతాలు కూడా తరతమస్థాయిలో బ్రహ్మచర్యాన్ని అవసరంగా గుర్తించాయి. ఆధునిక నాగరిక సమాజం కూడా దీన్ని చిన్నచూపు చూడటం లేదు. విజ్ఞుల అభిప్రాయంలో పెళ్ళి అందరికి తప్పనిసరి నిబంధనేమీ కాదు. 'మరి మానవులందరూ దీన్ని పాటిస్తే మానవజాతి అంతరించిపోదా' అని అడగొచ్చు. నిజంగా మానవులంతా పవిత్ర హృదయంతో, నిస్వార్థపరులై దీన్ని పాటిస్తే, 'మారుని రాజ్యాన్ని' అంతంచేసి సద్ధర్మ రాజ్యం నెలకొల్పబడదా! మానవులు యుద్ధాల్లో, కరవుకాటకాలవల్లనో, భూకంపాల వల్లనో, వినాశకరమైన జబ్బులవల్లనో అంతరించటం కంటే సద్ధర్మం వల్ల అంతరించటం వుత్తమమైంది కాదా!

## ఆరో అధ్యాయం

# నాలుగు ఆర్యసత్యాలు

**త**థాగతుని ధర్మంలోని ప్రధాన విషయాలు ఆయన ప్రతిపాదించిన నాలుగు ఆర్యసత్యాల (చత్వారి ఆర్యసత్యాని)లో సంక్షిప్తమై వున్నయ్. బౌద్ధధర్మం యొక్క తాత్విక, నైతిక భావనలు వీటిలో స్థూలంగా చెప్పబడ్డయ్.

చేతనాపూర్వకమైన జీవితపు అన్ని దశలు, పరిస్థితులు దుఃఖంతో కూడి వుంటాయనేది మొదటి ఆర్యసత్యం. మనిషి పుట్టుక, ఎదుగుదల, అనారోగ్యం, మరణం అన్నీ దు:ఖాన్ని కలిగించేవే. మనం కోరుకున్నది లభించకపోతే బాధ కలుగుతుంది. మనం వద్దనుకునేవాటితో కలిసి జీవించటం కూడా బాధ కలిగిస్తుంది. మనం ప్రేమించినవారు దూరమవటం మరింత బాధాకరం.

స్వార్థపూరితమైన సుఖాల కోసం పడే ఆరాటం లేదా తపన (తృష్ణ) దుఃఖానికి మూలకారణం (దుఃఖసముదాయొ) అని చెప్పేది ఆర్యసత్యాల్లో రెండవది. పరిసరాల సంపర్కంతో మనలో కలిగే స్పందనలు నేను, నాది అనే భ్రమను కలిగిస్తాయి. ఈ భ్రమ, సుఖ లాలసత్వం కోసం మనిషి పడే ఆరాటంలో వ్యక్తమవుతుంది. అందుకోసం మనిషి చేసే పనులు అతన్ని బాధ, దుఃఖంలో ముంచెత్తుతయ్. సుఖాల వెంటపడితే అది మన కన్నుగప్పి మనల్ని దుఃఖంవైపు యీడ్చుకుపోతుంది.

స్వార్థమయమైన తృష్ణను అంతమొందించటం ద్వారా దుఃఖవిముక్తి (దుఃఖనిరోధ)ని సాధించవచ్చని మూడవ ఆర్యసత్యం చెబుతుంది. స్వార్థపూరితమైన ఆరాటాన్ని అంతం చెయ్యగలిగితే దుఃఖం కూడా అంతమవుతుంది. ఆరాటం (తృష్ణ) కోరికల నుండి జనిస్తుంది. కోరికలు తీరకపోతే బాధ కలుగుతుంది. కోరిక తీరినప్పుడు లభించే తృప్తి కూడా ఎంతోసేపు నిలవదు. ఎందుకంటే అది కొత్త కోరికలకు దారితీసి, వాటితోపాటు కొత్త బాధల్ని తెచ్చిపెడుతుంది. మనిషి అంతులేని యీ దాహాన్ని విడనాడకుండా దు:ఖాన్ని ఎలా వదిలించుకోగలడు?

దుఃఖం నుండి సంపూర్ణమైన స్వేచ్ఛ పొందటానికి ఆర్య అష్టాంగమార్గం అనుసరించాలని చెప్పేదే నాల్గవ ఆర్యసత్యం. ధర్మాన్ని గ్రహించిన వ్యక్తి తప్పకుండా సరైన మార్గంలో నడుస్తాడు, అతను విముక్తిని పొందటం ఖాయం.

ఈ నాలుగు ఆర్యసత్యాలు బౌద్ధ ధర్మ సారం అని చెప్పవచ్చు. కాని యివి పరిశీలనకు అతీతంగా ఆమోదించాల్సిన పిడివాదసూత్రాలుగా ప్రతిపాదించబడలేదు. పరిశీలించటాన్నే నిరాకరించే పిడివాదం మనిషిని బుద్ధిస్టు గమ్యంవైపు నడిపించదు. అందుకు మారుగా అది మనిషిని తన బాధ్యతనుండి, సరైన మార్గంనుండి తప్పుకునేట్లు చేస్తుంది. అందుకే

తన బోధనల్ని పరీక్షించకుండా ఆమోదించమని బుద్ధుడు ఎక్కడా చెప్పలేదు. పైగా పరీక్షకు నిలువనిది, హేతుబద్ధంగా లేనిదేదీ తథాగతుని బోధన కాదని స్పష్టంగా చెప్పబడింది.

'ప్రతి మనిషి తన జీవితానికి తానే రూపకర్త, తనకు తానే రక్షకుడు' అని చెప్పినందున, మనిషి కర్తవ్యాన్ని నియంత్రించే మతభావాలతో బౌద్ధధర్మానికి పొంతన కుదరదు. మనిషికి మించి విశ్వసించదగినది ఏదో వుందనుకోవటం ఎదగని పిల్లలు చేసే ఆలోచన. మనిషి తనకే తెలియని అవసరాలు పురికొల్పటంవల్ల లేదా తర్కసహితమైన చైతన్యం వల్లగాని ఒక విషయాన్ని విశ్వసిస్తాడు. అన్నిటినీ మించి, మనిషి మనసు యొక్క సంకల్పం లేదా నిబద్ధత ఒక విషయంలో విశ్వాసానికి బలం చేకూరుస్తుంది. క్రైస్తవ సన్యాసులకు భిన్నంగా, బౌద్ధభిక్షువు ఎవరిపైనా విశ్వాసం ప్రకటించటంగాని, అనుసరించటం గాని చెయ్యడు. బుద్ధభగవానుడు తన మార్గంలో నడిచేవారికి 'బోధి'ని లక్ష్యంగా ప్రకటించినందున, దేన్నీ మూఢంగా నమ్మటం జరగదు. బౌద్ధధర్మసూత్రాలు విజ్ఞానశాస్త్ర సూత్రాలవలే నమోదు చెయ్యబడిన ఫలితాలు.

చేతనావస్థలో వున్న జీవితం దుఃఖంతో కూడినదనే వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. మనమంతా దురవస్థతో నిండిన ప్రపంచంలో బ్రతుకుతున్నాం. నిరంతరం జరుగుతున్న బతుకుతెరువు పోరాటం దురవస్థ కాక మరేమిటి? మానవుల్లో అత్యధికులు ఆకలి, భయంతో బతుకుతున్నారు. యిక జంతువుల గురించి చెప్పాల్సిన అవసరమే లేదు. ఆశావాదం కేవలం మనిషిని వూరడించటానికేనని చరిత్రతో పాటు, మన అనుభవం చెబుతుంది. అత్యంత ఆశావాది సైతం కళ్ళు తెరిచి చూస్తే, మన చుట్టూ ఆవహించివున్న బాధలు, దుఃఖం చూసి చలించిపోతాడు. భయంకరమైన అంటువ్యాధి పీడితులైన రోగులుండే ఆసుపత్రులు, మరణశిక్ష పడిన ఖైదీలుండే కారాగారాలు, మనుషుల్ని చిత్రహింసలు పెట్టే చీకటిగదులు, యుద్ధరంగాలు చూసి 'ఇదేనా మనం నిర్మించుకోగలిగిన ప్రపంచం!' అని మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సి వస్తుంది.

ఇంతటి తీవ్రమైన దురవస్థలో కూడా మనిషి నిస్పృహ చెందడు. అతని సహజస్వభావానికి తగినట్లు నిరంతరం తన అస్థిత్వం కోసం ప్రయత్నిస్తూనే వుంటాడు. నాగరిక మానవుడు చేసిన కృషి అంతా బాధల నుండి, దుఃఖం నుండి బయటపడాలనే. మనిషి ఆనందం, సుఖం, సంతోషం అని చెప్పుకునేదంతా తన బాధలు, అసంతృప్తి, అసంపూర్ణతల నుండి బయటపడాలనేదే తప్ప మరేమీ కాదు. ఆనందం కలిగించే ప్రతిదీ ఒక కోరికతో మొదలవుతుంది. ఆ కోరిక నెరవేరటంతో దానివల్ల కలిగిన ఆనందం కూడా అంతమౌతుంది.

అన్ని కోర్కెలు తీర్చుకోగలిగినా ఒక్క కోరిక మాత్రం మనిషి తీర్చుకోలేదు. మనిషిలో

తన అస్థిత్వాన్ని కాపాడుకోవాలనే సహజాతమైన లక్షణం అతనిలో మార్పు, మరణం లేని జీవితం కావాలనే ఆశను కలిగించింది. వృద్ధాప్యం, చావునుండి తప్పించుకోవాలని కోరుకొనేట్లు చేసింది. మరి యీ కోర్కెను సాధించటం ఎలా? అనివార్యమైన మరణాన్ని జయించటం ఎలా? అస్థిత్వం కోసం జరిగే పోరాటంలో, నిరంతరం మారుతున్న ప్రపంచంలో నిలకడగా కొనసాగటం ఎలా? ఇదే ప్రతిచోట మానవుని మేధస్సును వేధించిన ప్రశ్న. ఎక్కడైతే మనిషి పరిసరాలను తనకు అనుకూలంగా మలుచుకోవటం సాధ్యపడక, తప్పనిసరై తానే వాటికి అనుకూలంగా మారవలసి వస్తుందో అక్కడే మతం పుడుతుంది.

దాని నిజమైన అర్థంలో మతానికి యీ ప్రపంచం యొక్క ఆది, అంతం, సృష్టి వెనుక వున్న వుద్దేశంతో ప్రమేయం లేదు. ప్రొఫెసర్ లీబా చెప్పినట్లు అంతిమ పరిశీలనలో మానవుని జీవితం, మరింత 'జీవితం', సంతృప్తిని కలిగించే జీవితమే మతం యొక్క లక్ష్యం, అంతేగాని దైవంకాదు. నిజమైన అంతఃదృష్టితో, వివేకంతో బుద్ధుడు యిలా ప్రకటించాడు: "ఈ విశ్వరహస్యాలను వివరిస్తానని నేను మీకు హామీ యివ్వలేదు. దానికి పూర్తి భిన్నంగా దుఃఖం, దుఃఖకారణం, దానినుండి విముక్తి పొందే మార్గం గురించి మాత్రమే నేను చెప్పేది. సువిశాలమైన మహాసముద్రంలో నీరు ఏ విధంగా ఒకే రుచి కలిగివుంటుందో, అలాగే ఓ భిక్షువులారా! నేను బోధించే యీ ధర్మం కూడా ఒకే రుచి కలిగివుంటుంది. అదే విముక్తి."

మతభావాల ప్రాముఖ్యత విశ్వరహస్యాలను వివరించటంలో లేదు. ప్రపంచం శాశ్వతమా లేక అశాశ్వతమా? అది అనంతమా లేక పరిమితమా? ఆత్మ, శరీరం ఒక్కటేనా లేక వేరువేరా? అనేవి మనం ఎంత ఆలోచించినా, తీవ్రంగా వాదించినా పరిష్కరించ సాధ్యంకాని (అవ్యాకతాని) ప్రశ్నలు. వాటిని పరిష్కరించాలని చేసే ప్రయత్నాలు పనికిరాని వూహాగానాలే.

దుఃఖం, మరణం లేని జీవితంకోసం తాను చేసే ప్రయత్నంలో మనిషి, అజ్ఞానం వల్ల, తాను సృష్టించుకున్న భ్రమల్లో తానే బలైపోయాడు. మరణం లేని జీవితాన్ని పొందాలనే కోరికతో, చనిపోయిన తరువాత కూడా నిలిచివుండే ఆత్మను కల్పించాడు. తనకు తెలిసిందాన్ని తెలియనిదానితో జోడించి ప్రపంచాన్నంతా తనకంటే శక్తివంతులైన దేవుడు, ఆత్మలతో నింపేశాడు. దేవుళ్ళను ప్రసన్నం చేసుకోటానికి, వారి కోపాన్నుండి తప్పించుకోటానికి మనిషి ప్రార్థనలు, మంత్రాలు, మాయలు, రక్తపాతంతో కూడిన బలులు కనిపెట్టాడు. మతానికి యిటువంటి వాటితో పనిలేదనే విషయాన్ని బుద్ధభగవానుడు స్పష్టంగా చూడగలిగాడు. అందుకే వాటిని తటపటాయింపు లేకుండా నిరాకరించాడు. దేవుళ్ళు మనిషిని విముక్తి చెయ్యలేరని స్పష్టం చేశాడు. అజ్ఞానం (అవిద్య)

వల్ల మనిషి తన స్వభావాన్ని, పరిసరాలను అర్థం చేసుకోలేకపోవటం వల్ల బాధలు, దుఃఖం వచ్చాయిగాని, దేవుని ఆగ్రహం వల్ల కాదు. మనిషికి మరణం కూడా పాపకారణంగా వచ్చేది కాదు. చావుబ్రతుకులు ఒకదాన్నుండి మరొకటి విడదీయలేనివి. జీవితం అంటేనే మార్పు; మార్పంటే వున్నది నశించటం. మనిషి మరణమంటే భయపడతాడు, అయినా మరణం, జీవితం విడదీయరానివి. జీవితం యొక్క అనివార్యమైన దశే మరణం. తన జీవితపు చరమాంకంలో బుద్ధుడు చెప్పిన మాటలు యీ విషయాన్నే స్పష్టం చేస్తున్నయ్: "సంఘటితమై రూపొందిన ప్రతిదీ విఘటనం చెందక తప్పదు; జన్మించిన ప్రతి జీవి మరణించటం తథ్యం."

ప్రపంచం క్రమక్రమంగా పరిణామం చెందుతూ ఏర్పడిందే కాని, ఒక్కసారిగా అస్థిత్వంలోకి వచ్చింది కాదు. అది అంతర్గత శక్తుల నుండి, అస్పష్టమైన సాధ్యా సాధ్యాలనుండి, 'ఖచ్చితంగా దీని నమూనా యిదీ' అని చెప్పలేని స్థితినుండి ప్రారంభం ఐంది. స్వీయ-చేతన (self-consciousness) కలిగిన మానవుడు అవతరించే నాటికే భూమ్మీద పారంపర్యంగా వచ్చిన ఎన్నో ధోరణులు రూపొందివున్నయ్. మనిషి జంతువు నుండి రూపాంతరం చెందాడనేది నిస్సందేహం.

జీవశాస్త్ర దృష్టికోణంతో చూస్తే, మనిషి కోతికి చాలా దగ్గరివాడు. మరింత మెరుగైన మెదడు, తెలివితేటలతో వానర- మానవునికి పుట్టిన సంతానం మనిషి. దీని ఫలితంగానే నైతికజీవనం అవసరం లేని సహజాతమైన లక్షణాలు మనిషిలో మిగిలివున్నయ్. కాని అతనిలో జరిగిన అభివృద్ధి తన తోటివారితో కలిసి మెలిసి బ్రతకటాన్ని అనివార్యం చేసింది. దీని ఫలితమే కుటుంబం, నైతికతతో కూడిన సాంఘికజీవితం. వ్యక్తి తన జీవిత అవసరాలకు పరిమితమై చేసే పనులు సాంఘిక, నైతిక అవసరాలతో పొసగటం లేదనే చైతన్యమే 'పాపం' అనే భావన, అది అంతకుమించి మరేమీ కాదు.

అత్యున్నతమైన బోధి దశ చేరేవరకు పదార్థం, వృక్షాలు, జంతువులు అన్నిటిలో పరిణామం జరుగుతూ వుంటుంది. గత, వర్తమాన కర్మల ఫలితంగానే జీవులన్నీ యిప్పటి స్థితిలో వున్నయ్.

అత్యున్నతమైన ప్రజ్ఞకు సంబంధించిన మూలబీజం (నిర్వాణ ధాతువు) మొదట ప్రతిస్పందనాచర్య (reflex activity)గా మొదలై, చేతనావస్థలో ఎదుగుతూ క్రమంగా స్వీయ-చేతనతో కూడిన వివేచనాచర్య (rational reaction) గా రూపుదిద్దుకుంటుంది. ప్రారంభదశలో యిది అంతర్గతమైన ప్రతిస్పందనతో యాంత్రికంగా సవ్యమైన పనులు చెయ్యగలుగుతుంది. ప్రతిస్పందనా చర్యలో స్వేచ్ఛ, మంచి-చెడుల ప్రేరణ వుండవు. మధ్యస్థితిలో చేతన వల్ల జీవి యితరుల నుండి విడివడి, వాటితో భేదించి అందరికంటే తాను ఎక్కువ తృప్తిచెందాలని ప్రయత్నిస్తుంది. ఈ దశలో తనకు తెలియకుండా మంచి

చేసే నైజాన్ని కోల్పోయినా, స్వేచ్ఛను సొంతం చేసుకుంటుంది. ఇప్పుడది నిరంతరం చెడువైపు మొగ్గుచూపినా, తాను చెడుచేస్తున్నట్లు తనకు తెలియదు.

అంతిమస్థితి అయిన స్వీయ-చేతనావస్థలో జీవితసమరంలో ప్రవేశించి తన సుఖం, తన సౌఖ్యం కోసం యితరుల ప్రయోజనాలను దెబ్బతీస్తుంది. కాని, యిది చేసేటప్పుడు, తాను తప్పు చేస్తున్నాననే భావన మొదలవుతుంది. చేతన విశ్వపరిణామానికి పుట్టిన బిడ్డ అయినా, అది దేని ద్వారా జనించిందో దాన్నే అదుపు చేయటం అవసరంగా భావిస్తుంది. హేతుబుద్ధి, ప్రేమ అనేవి సహజస్పందనలను, ఉద్రేకాలను అదుపులో పెట్టటం తమ హక్కు అని అనుకుంటయ్. క్రమంగా బాధ్యత అనే భావన మనిషి హృదయంలో పాదుకొని, స్వేచ్ఛాయుతమైన ఉద్వేగాలను అదుపుచేయటంగా మారుతుంది. ఉద్వేగాలను నిరంతరం అదుపుచేసే ప్రయత్నం, నైతిక భావన, అభివృద్ధికి సంబంధించిన ఆలోచన క్రమక్రమంగా బలపడతాయి. మనిషి తనలోని చెడు ధోరణులను రూపుమాపాల్సిన అవసరాన్ని గుర్తించి వాటిని అదుపు చెయ్యాలని నిర్ణయించుకుంటాడు. ఆ విధంగా పరిపూర్ణత(perfection) కు దారితీసే మార్గాన్ని తెలుసుకుంటాడు.

ఈ విధమైన చేతనతో కూడిన చర్యలు శక్తివంతమయేకొద్దీ, స్వేచ్ఛాయుతమైన చేతనలో వుంటూనే, వాటిని అచేతనంగా చేసే స్థితికి చేరుకుంటాడు. ఇకమీదట అతను మంచి తప్ప మరేమీ చెయ్యలేడు. అయితే మొదటి దశలో యాంత్రికంగా చేసిన పనిని యిప్పుడు తనంతట తానుగా స్వచ్ఛందంగా చేస్తాడు. ఉద్దేశపూర్వకంగా చేసే మంచి పనులవల్ల, ప్రాథమిక దశలోని లక్షణమైన ప్రతిస్పందనాచర్యను త్యాగం చేసినా, అతనికి బోధిని పొందే మార్గం సుగమం అవుతుంది. ఇప్పుడతను యీ మార్గంలో ముందుకు సాగటానికి అవసరమైన పరిస్థితుల్ని చూడగలుగుతాడు. నైతిక ప్రవర్తనను పెంపొందించే ప్రయత్నం చేస్తూ గమ్యాన్ని చేరటానికి అవసరమైన తదుపరి దశలనూ చూడగలుగుతాడు. అప్పుడు అంతిమలక్ష్యం సంపూర్ణమైన దుఃఖవిముక్తి పొందటం ఖాయం.

విముక్తిని త్వరితం చేసే మార్గం అతని సొంతమైనందువల్ల, యిక మిగిలే ప్రశ్న 'ఎంతకాలం?' అనేది మాత్రమే. అతను తనలోని అహంకార పూరితమైన ధోరణులను మరింత అదుపులో వుంచుకుంటూ బహుజనుల హితం కోసం పనిచేస్తాడు. ఎప్పుడైతే తన మనుసును పూర్తి స్వాధీనంలో వుంచుకోగలుగుతాడో, ఎప్పుడైతే తనతోటివారితో మాత్రమేగాక, వర్తమాన-భూత-భవిష్యత్ తరాలతో, యీ భూమిమీద నడిచే ప్రతి ప్రాణితో సంలీనమైన భావాన్ని పొందుతాడో, అప్పుడు అతని ప్రగతి సంపూర్ణమైనట్లు. అతను దుఃఖరహితం, అవ్యక్తమైన ప్రశాంతస్థితిని చేరుకున్నట్లే. వ్యక్తిగత ప్రపంచంతో వున్న బంధాల్ని తెంచుకొని సకల జీవరాశిలో అంతర్భాగమై, మృత్యురహితమైన శాశ్వత జీవితాన్ని పొందుతాడు.

# ఏడో అధ్యాయం

## బుద్ధిజం - ఆత్మపీడనా యోగం*

పురాతన భారతావనిలో వున్న మతం ప్రాకృతిక ధర్మం. అందులో పశుబలులు ప్రముఖస్థానం వహించినయ్. బహుశా, ప్రారంభదశలో మనిషి ఏ దేవుడి గురించి భయపడ్డాడో ఆ దేవుడి ఆగ్రహాన్ని చల్లార్చే వుద్దేశంతో జంతువుల్ని బలిచ్చాడు. కాలక్రమంలో అది, మనిషి తన కోర్కెల్ని దేవుడికి తెలియజేసే సాధనంగా మారింది. ప్రతి యజ్ఞంలో వెలిగించే మంట అగ్నిదేవుడి రూపంలో మనిషికి, దేవుడికి మధ్య వారధిగా భావించబడింది. యజ్ఞయాగాల్లో జంతువులను దేవుళ్ళకు అర్పించగలిగితే, వారు దీనికి ప్రతిగా మనిషి కోరిన కోర్కెల్ని తీర్చటం కూడా సాధ్యమే. ఈ విధంగా కాలక్రమంలో బలిదానాలు దేవుడితో బేరసారాలాడే తంతుగా రూపుదిద్దుకున్నయ్. "నువ్వు నాకిస్తావని, నేను నీకు అర్పిస్తున్నా" (దేహిమి దదామితే) అనేది వేదాల్లోని దాదాపు ప్రతి శ్లోకంలో వున్న సందేశం; అది బహిరంగంగా లేదా అంతరంగంగా వేదకాలంనాటి యజ్ఞయాగాల వుద్దేశం. జంతుబలి ఒక రకమైన బేరమాడే సాధనం అనే భావన చివరకు వాటితో మనిషి దైవాన్ని తనకు అనుకూలంగా లొంగదీసుకోగలడనే వరకు వెళ్ళింది. ప్రొ॥ సిల్‌వైన్ లెవి (Sylvain Levi) చెప్పినట్లు యీ తతంగంలో నైతిక ప్రవర్తనకు స్థానమే లేదు. దేవునితో మనిషి యొక్క సంబంధాన్ని నిలబెట్టే యజ్ఞం ఒక యాంత్రికమైన చర్య. ఏ శక్తులను ఆపాదించి దేవుళ్ళను గొప్పవాళ్ళను చేశారో, అవే శక్తులతో వారిని అదుపులో పెట్టగలిగారు. దేవుళ్ళకు యిష్టమున్నా, లేకపోయినా యజ్ఞయాగాలు నిర్వహించేవారికి పైలోకాల్లో స్థిరమైన స్థానం ఖాయమైంది!

సహజంగానే యజ్ఞయాగాలు ప్రజల దృష్టిలో గొప్ప స్థానాన్ని పొందాయి. చివరకు వాటిని నిర్వహించే పూజారులు ప్రజలపై ఆధిపత్యం నెలకొల్పుకోవటంలో విజయం సాధించారు. "దేవాధీనం జగత్ సర్వం, మంత్రాధీనం తద్దైవతం; తన్మంత్రా బ్రాహ్మణాధీనం, బ్రాహ్మణా మమ దేవత" అనేది ఒక ప్రసిద్ధ సంస్కృత శ్లోకం. ప్రపంచమంతా దేవుని అధీనంలో వుంది, దేవుడు మంత్రాల అధీనంలో వుంటాడు; యీ మంత్రాలు బ్రాహ్మణుల అధీనంలో వున్నయ్, కాబట్టి బ్రాహ్మణులే నిజమైన దేవుళ్ళు అని దీనర్థం. బ్రాహ్మణులు దేవతలు కానివారిని దేవతలుగా చెయ్యగలరు, వారు దేవతలను వారి స్థానంనుండి తొలగించగలరు. ఈ విధంగా బ్రాహ్మణులు బలవంతులు,

---

* ఆత్మపీడనాయోగం అంటే ఒక వ్యక్తి తన శరీరాన్ని ఆకలిదప్పులు, ఎండవానలకు, చిత్రహింసలకు గురిచేసి తద్వారా మోక్షం సిద్ధిస్తుందని చెప్పే కఠిన ఆచారం.

శక్తివంతులు అయ్యారు.

దేవుళ్ళకు అర్పించే బలిదానాల్లో మనిషిని బలివ్వటం అన్నింటికంటే గొప్పది. మనుషుల్ని బలివ్వటం భారతదేశంలో ఒకప్పుడు సర్వసాధారణమనటంలో సందేహం లేదు. "ఎవరెన్ని కథలు చెప్పినా, ఋగ్వేదకాలం తరువాత చాలాకాలంపాటు మనుషుల్ని బలివ్వటం కొనసాగింది" అని ప్రొ॥ ఇ.డబ్ల్యు. హాప్‌కిన్స్ చెప్పారు. ముసలివారిని చనిపోయే పరిస్థితుల్లో వదిలేసి వారిని 'అనాథ పురుష' అని పిలవటం గురించి బ్రాహ్మణ ధర్మశాస్త్రాల్లో వివరించారు. మానవబలి చాలా ఖరీదైనది, సాధారణంగా అందుకు 'వెయ్యి పశువుల'ను చెల్లించాలి. మానవ బలిదానం కొరకు యింత ఖర్చు భరించటం చాలా పుణ్యం కలిగిస్తుంది. బలివ్వబడే మనిషికి అంతకంటే ఎక్కువ పుణ్యం దక్కుతుంది. ఈ క్రమంలోనే దేహాన్ని కఠినమైన చర్యలతో బాధించి తన కోర్కెలు తీర్చే విధంగా దేవతలను లొంగదీయవచ్చనే ఆత్మపీడనా యోగ సిద్ధాంతం పుట్టుకొచ్చింది. కఠోరనియమాలతో చేసే దేహదండనవల్ల లభించే అద్భుతశక్తుల గురించిన కథలు హిందూమత గ్రంథాల్లో చాలా వున్నయ్. ఆత్మపీడనాయోగం ద్వారానే రావణుడు దేవతలకు, రాక్షసులకు దుర్భేద్యంగా మారాడు. కఠిననియమాలను ఆచరించటం వల్లే క్షత్రియుడైన విశ్వామిత్రుడు బ్రాహ్మణుడిగా ఎదిగాడు. చండాలుడైన మాతంగుడు ఆత్మదండనాయోగం ద్వారా దేవతలను సైతం వణికించాడు. ఒంటికాలి బొటనవేలిపై నిలబడి తపస్సు చేస్తున్న మాతంగుడు తన శరీరం చిక్కిశల్యమైనా చలించలేదు. అతన్ని కాపాడాలని దిగివచ్చిన ఇంద్రుడు చివరకు, అతని కోర్కెను కాదంటూనే, తాను కోరుకున్న జంతువు లేదా పక్షిరూపంలోకి మారే వరం యిచ్చాడు. ఆత్మపీడనాయోగం, దేహదండన యొక్క అద్భుతశక్తుల గురించి యిటువంటి గట్టినమ్మకాలు పురాతన భారతదేశ ప్రజల్లో నాటుకొని వుండేవి.

బౌద్ధధర్మం వెలుగుచూసేనాటికి ఆత్మపీడనాయోగంపై వుండే నమ్మకం అత్యంత తీవ్రస్థాయికి చేరినట్లు కనిపిస్తుంది. ధర్మాచరణ అంటేనే కఠినమైన దేహదండన అన్నట్లు పరిగణించబడింది. శాక్యముని కాలంలో బాగా విస్తరిస్తున్న బ్రాహ్మణ, జైన సాంప్రదాయాల్లో కఠినమైన శరీరదండన చాలా ప్రాముఖ్యత వహించేది. ప్రొ॥ జాకోబి చెప్పినదాని ప్రకారం, 'జైనులు అపరిశుభ్రత, శరీరహింసలను పుణ్యకార్యాలుగా భావించి, వీటిలో తాము బ్రాహ్మణుల్ని మించిపోయామని గర్వంగా చెప్పుకునేవారు.' విముక్తి, సాధన కోసం పన్నెండు సంవత్సరాల ఆత్మపీడన తప్పనిసరని జైనమతం చెబుతుంది. ఆదర్శవంతమైన జైనముని జీవనం గురించి ఆచార్యాంగసూత్రంలో క్రింది విధంగా వర్ణించబడింది:

"అతను తన యింటిని, ప్రపంచాన్ని త్యజించటమేగాక తాను ధరించే బట్టలను సైతం వదలి నగ్నంగా చరిస్తాడు. పలకరించినా, నమస్కరించినా బదులివ్వడు. పగలు,

రాత్రి ధ్యానం చేస్తూ చలించడు. జబ్బు చేసినా, గాయపడినా వైద్యం కావాలని కోరడు. విముక్తి మార్గం తెలుసుకున్న అతను స్నానం చెయ్యటం, పళ్ళు తోమటం, మందులు వాడటం వంటివాటికి దూరంగా వుంటాడు. కొన్నిసార్లు అతను పక్షం, నెలరోజుల పాటు నీరు త్రాగడు. కొన్నిసార్లు ఆరురోజులు లేదా పన్నెండు రోజులకు ఒకసారి మాత్రమే ఆహారం తీసుకుంటాడు. భిక్షలో వచ్చిన ఆహారం మంచిదైనా, చెడిపోయి వున్నా దాన్నే భుజిస్తాడు. అసలు ఆహారమే లభించకపోయినా అతను తన అదుపులో తాను వుంటాడు." తార్కికంగా చూస్తే, ఆత్మపీడన ఆత్మహత్యకు దారితీస్తుంది. ఏ కారణంతోనైనా జీవుల్ని చంపటాన్ని నిర్ద్వందంగా నిషేధించిన జైనధర్మం ఆత్మహత్యను సమున్నతమైన కార్యంగా కీర్తించింది.

సిద్ధార్థ గౌతముడు కూడా ఆత్మపీడనాయోగం ఉచ్చులో పడ్డాడు. కాని అదృష్ట వశాత్తు దాన్నుండి బయటపడగలిగాడు. ఆనాటి సాంప్రదాయాన్ననుసరించి సిద్ధార్థుడు తన యింటిని, కుటుంబాన్ని వదలి సత్యాన్వేషణ కోసం అడవులకు వెళ్ళాడు. ఆ కాలంలో అత్యంత మేధావులైన గురువుల వద్ద శిష్యరికం చేశాడు. వారు నేర్పిన విద్యలన్నీ నేర్చుకుని వారిని అనుసరించాలని ప్రయత్నించాడు. కఠోరమైన ఆచారాలతో, ఆకలిదప్పులతో, నగ్నంగా శరీరాన్ని బాధలకు గురిచేస్తూ మోక్షసాధన చేశాడు. ఆరు సంవత్సరాల పాటు ఉరువెల అరణ్యంలో తన సహజమైన అవసరాలన్నిటిని అణచేస్తూ ఆత్మపీడనను ఎలా కొనసాగించింది తానే స్వయంగా వివరించాడు. ఆయన అత్యంత కఠినమైన సన్యాస జీవితం గడిపాడు. రోజుకు ఒక్క అన్నం మెతుకు మాత్రమే తింటూ అతని శరీరం ఎముకల గూడులా మారింది. కాళ్ళు, చేతులు ఎండుకట్టెల్లా తయారయ్యాయి. పక్కటెముకలు పుల్లల్లా బయటకు పొడుచుకొచ్చాయి. ఈ కఠోర తపశ్చర్య గురించి విన్న జనం తండోపతండాలుగా ఆయన్ని చూడటానికి వచ్చారు. చివరకు ఆకలి, నిస్సత్తువతో స్పృహతప్పిపడిపోయాడు. తిరిగి స్పృహలోకి వచ్చిన సిద్ధార్థునికి తాను పాటించిన కఠినమైన తపశ్చర్యవల్ల తనకు లభించిన ప్రత్యేకజ్ఞానం ఏమీ లేదని తెలిసింది. ఆయన తన ఆకలిదప్పులు తీర్చుకుంటూ కోలుకొని తిరిగి శక్తి పుంజుకున్నాడు. ఆత్మపీడనాయోగం యొక్క ఫలితాలపై తీవ్రంగా ఆలోచించి, అది తానాశించిన దుఃఖ విముక్తిని కలిగించే మార్గం కాదని తెలుసుకున్నాడు. రాజప్రాసాదంలో వుండగా ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోవటం సుఖశాంతులకు మార్గం కాదని ఏ విధంగా గ్రహించాడో, అదేవిధంగా ఉరువెల అరణ్యంలో శరీరహింస కూడా మనిషిని విముక్తిమార్గంలో నడిపించలేదని గ్రహించాడు. దృఢమైన శరీరం లేకుండా అర్హతుడవటం సాధ్యం కాదు. "ఎవరైతే అన్నిరకాల తపశ్చర్యలు నిరుపయోగమని తెలుసుకుంటారో, ఎవరైతే బోధిని ఆశించి శీల, ధ్యాన, ప్రజ్ఞలను ఆచరిస్తారో వారే పరిపూర్ణతను పొందగలుగుతారు."

వారణాసి సమీపానగల జింకలతోట (హరిణివనం)లో పంచవర్గీయులకు చేసిన బోధనలో తథాగతుడు విముక్తికోసం సరైన **మధ్యమమార్గాన్ని** యీ విధంగా బోధించాడు:

"మాంసాహారం మానెయ్యటం, నగ్నంగా తిరగటం, జడలు పెంచుకోవటం లేదా గుండు గొరిగించుకోవటం; చిరిగిన మాసినబట్టలు ధరించటం, శరీరం నిండా మురికి పూసుకోవటం లేదా అగ్నికి ఆహుతవటం అనేవి అవిద్యతో నిండిన మనిషి మనసును శుద్ధి చెయ్యలేవు."

"వేదాలు వల్లెవేసినంతనే లేదా దేవతలకు బలులివ్వటం వల్లనో, తరచుగా ఉపవాసాలుండటం వల్ల లేదా నేలపై పడుకోవటం వల్ల, నిశరాత్రి జాగరణ వల్ల లేదా నిరంతరం భజనలు చెయ్యటంవల్ల దుష్ప్రవర్తన కలిగిన మనిషి పవిత్రుడు కాలేడు."

"పూజారులకు కానుకలివ్వటం వల్ల లేదా ఆచారాలను పాటించటం వల్ల కోరికలకు బానిసైన వ్యక్తి పునీతుడు కాలేడు.

"మనిషిని మలినపరిచేది మాంసాహారం కాదు. తాగుడు, కోపం, అసూయ, మోసం, ఆత్మడంబాచారం, పరులను కించపరచటం, దుష్టబుద్ధి, బహుభార్యాత్వం, మూర్ఖత్వం – యివి మనిషిని మలినం చేసేవి."

"ఓ భిక్షువులారా! రెండు రకాలైన విపరీతాలలకు దూరంగా వుండే మధ్యమమార్గాన్ని నేను బోధిస్తాను. చిక్కిశల్యమై దుర్బలుడైన వ్యక్తి మనసు అయోమయంలో, చవకబారు ఆలోచనలతో నిండివుంటుంది. ఆత్మపీడన ప్రాపంచిక జ్ఞానానికి కూడా తగింది కాదు, మరి జ్ఞానేంద్రియాలను అది ఎలా జయిస్తుంది?"

"తనదీపాన్ని నీటితో నింపినవాడు చీకటిని పారద్రోలి వెలుగు నింపలేడు, ఊలిపోయిన కట్టెల్ని రాపిడి చేసి అగ్ని పుట్టించాలనుకునేవాడు విఫలమవక తప్పదు."

"కఠోరమైన తపశ్చర్య బాధాకరం, నిరుపయోగం. తృష్ణను అంతమొందించలేని వ్యక్తి, శరీరాన్ని బాధించటం ద్వారా తననుండి తాను స్వేచ్ఛను ఎలా పొందగలడు?"

"స్వార్థమనేది ఇహ, పరలోక సుఖాలవైపు నడిపిస్తున్నంతకాలం అన్నిరకాల తపశ్చర్యలు వృధా కావలసిందే. కాని ఎవరైతే అహంకారాన్ని అంతమొందిస్తారో వారు కోర్కెలనుండి విముక్తి పొందుతారు; వారు ఇహలోక, పరలోక సుఖాల కోసం అర్రులు చాచరు. ప్రకృతి సహజమైన అవసరాలను తీర్చుకోవటం వారిని అపవిత్రులుగా చెయ్యదు. కాబట్టి జీవిత అవసరాల్ని తీర్చుకోవచ్చు."

"మరోవైపు కామసుఖాలు* మనిషిని నిర్వీర్యం చేస్తయ్. వాటిలో మునిగినవ్యక్తి ఉద్రేకాలకు బానిసవుతాడు, యిది అతన్ని అసమర్థుడిగా, నీచుడిగా మారుస్తుంది."

"కాని జీవితావసరాల్ని తీర్చుకోవటం పాపం కాదు. శరీరాన్ని వాతావరణం, క్రిమికీటకాలు, ఆకలిదప్పులనుండి కాపాడటం, అవసరమైన బట్టలు ధరించటం, క్లుప్తంగా

చెప్పాలంటే శరీరాన్ని ఆరోగ్యంగా వుంచటం మనిషి బాధ్యత. అలా చెయ్యనట్లయితే, మన మనసుల్ని పటిష్టంగా, స్పష్టంగా వుంచుకుని జ్ఞానదీపాన్ని వెలిగించటం సాధ్యం కాదు."

"భిక్షువులారా! రెండు విధాలైన విపరీతధోరణులకు దూరంగా వుండే మధ్యమమార్గం యిదే!"

పరాశరుని శిష్యుడైన ఒక బ్రాహ్మణసన్యాసికి బుద్ధుడు చేసిన బోధ యీ విధంగా వుంది: శీలవ్రతసూత్రాలను పాటించు, జ్ఞానేంద్రియ ద్వారాలను జాగ్రత్తగా సంరక్షించు; ఆహారంలో సమతౌల్యాన్ని పాటించు; ఎల్లవేళలా ఎరుకలో వుండు, ఆత్మనిగ్రహాన్ని పెంపొందించుకుంటూ హృదయాన్ని 'ఐదు నీవరణల'* నుండి ప్రక్షాళన చేసుకో; ధ్యానంలో ప్రీతిని పెంపొందించుకో.

"మనం చనిపోవటం ఖాయం, కాబట్టి తిని, తాగి సుఖాలు అనుభవించుదాం" అని చెప్పే ఇంద్రియ సుఖవాదుల (చార్వాకుల) తోనూ ధర్మం అంగీకరించదు. బౌద్ధధర్మ కఠినాచారాన్నే గాక, విలాసాల్ని కూడ వ్యతిరేకించింది. ధర్మాచరణ లక్ష్యం విజ్ఞానం, శాంతి గాని అనుభవించటం కాదు. కాబట్టి ఆరోగ్యాన్ని, సమర్థతను పెంపొందించకుండా కేవలం సుఖాన్ని మాత్రమే యిచ్చే జీవనవిధానం హేతుసమ్మతం కాదు. విలాసాలు దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని కలగజేస్తాయనటంలో సందేహం లేదు. విలాసవంతమైన అలవాట్లు మనిషిని శ్రమనుండి, సహనంతో నిలకడగా కృషిచేసే తత్వాన్నుండి దూరం చేస్తయ్.

సిరిసంపదలవల్ల శరీరానికి విశ్రాంతి, మనసుకు ప్రశాంతత, ఆదర్శాలను నెరవేర్చుకోటానికి తగిన శక్తి, సమయం లభిస్తాయనే అభిప్రాయం వుంది. కాని చాలా కొద్దిమంది విషయంలోనే యిది జరుగుతుంది. **జాతకమాలలో** చెప్పినట్లు, సిరిసంపదలకు ఒక మంచిలక్షణం వుంది. తోటివారికి మేలు చెయ్యాలనే తలంపున్నవారు దానమివ్వటానికి సంపద వుపయోగపడుతుంది. కాని చాలా కొద్దిమంది మాత్రమే యిటువంటి సదుద్దేశంతో సంపదను కోరుకుంటారు. చాలామంది సంపన్నులు ఖరీదైన బట్టలు, అందమైన భవనాలు, విలాసవంతమైన వసతిగృహాలు, గుర్రపుబగ్గీల వంటి విలాసాలను ప్రదర్శించటానికే ధనాన్ని వుపయోగిస్తారు, కాని సామాజిక ప్రయోజనం కోసం కాదు. సంపదను పొందాలనుకునే కోరిక, దాన్ని కోల్పోతామనే భయం మనిషిని పిరికివాడిగా, నీచుడిగా దిగజారేటట్లు చేస్తుంది. చాలా సందర్భాల్లో సంపద కోసం

---

* మానసిక ప్రగతిని కుంటుపర్చే ఐదు ఆటంకాలు: తీవ్రమైన కోరికలు, ద్వేషం, సోమరితనం, ఆందోళన, సంశయం.

పాటుపడేవాడు దానికి దాసుడైపోతాడు; ఎవరినైతే పేదరికం భయపెట్టదో అతను స్వేచ్ఛగా జీవిస్తాడు. తన వ్యక్తిగత పేదరికం పట్ల ఉపేక్షాభావంతో వుండటం, సత్యాన్వేషణలో వున్న మనిషికి బలం చేకూరుస్తుంది. ఈ కారణంగానే బౌద్ధభిక్షువు సంపదను త్యజిస్తానని ప్రమాణం చేస్తాడు.

పేదరికానికి సంబంధించిన ప్రమాణం లేదా మరే యితర ప్రమాణమైనా అత్యున్నతమైన లక్ష్యాన్ని సాధించటానికి తప్పనిసరేమీ కాదు. ఇంటిలో వుండి సాధారణమైన జీవితాన్ని జీవిస్తూ కూడా నిర్వాణశాంతిని పొందవచ్చు. కాని అటువంటి ప్రమాణాల్లో అంతర్గతంగా వుండే సుగుణాల కారణంగా, బోధిని పొందాలనుకునేవారు వాటికి విలువనిస్తారు. నాగసేనుడు **మిళిందప్రశ్నలు** అనే గ్రంథంలో నియమబద్ధమైన జీవితంవల్ల కలిగే ప్రయోజనాలను యీ విధంగా వివరించాడు: "అది ఒక సవ్యమైన జీవనవిధానం, దీని ఫలితంగా ప్రశాంతత లభిస్తుంది; అది నిందలేని జీవితం, యితరులకు హాని కలిగించదు; అది ప్రమాదాలకు దూరం, మనిషిలో మంచిని పెంపొందిస్తుంది, ఆత్మనిగ్రహం కలిగిస్తుంది, తృష్ణనుండి విముక్తిచేసి సొంత కాళ్లపై నిలబడేట్లు చేస్తుంది. అది అహంకారం, చెడు ఆలోచనల్ని, సంశయాలను, సోమరితనాన్ని, అసంతృప్తిని తొలగిస్తుంది. ఈ ప్రమాణాలను నియమబద్ధంగా పాటించేవారి జీవితం పవిత్రమౌతుంది; వారి మాటలు, చర్యలు జాగరూకత కలిగివుంటయ్, వారి సంకల్పం అచంచలమైంది; జనులందరి పట్ల ప్రేమనిండిన వారి హృదయాల్లో కోపం అంతరించిపోతుంది; వారు అందరిచేత గౌరవించబడతారు." తన లక్ష్యం పట్ల అపారమైన విశ్వాసం, దుష్కర్మలు చెయ్యటానికి సిగ్గుపడటం, నిరంతరం నేర్చుకోవాలనే జిజ్ఞాస కలిగి వుండటం, కష్టమైన పనులు చేపట్టాలనే సంకల్పం, కరుణాపూర్వకమై హృదయం లేనివారు యీ ప్రమాణాల్లో అంతర్గతంగా వుండే ప్రయోజనాన్ని పొందలేరు. బోధిని పొందటం సామాన్యజీవితం కన్నా, శుద్ధపాండిత్యం కన్నా చాలా గొప్పది. దీనర్థం – అధమస్థాయి విషయాల్ని త్యజించటం ద్వారా అత్యున్నతమైన వివేకాన్ని, తృష్ణనుండి సంపూర్ణమైన స్వేచ్ఛను పొందటం. కాబట్టి అందుకోసం బ్రహ్మచర్యాన్ని పాటించవలసి వుంటుంది.

బౌద్ధభిక్షువులపై తరచుగా వచ్చే మరో ఆరోపణ, వారు యితరులమీద ఆధారపడతారని. ఈ ఆరోపణ వాస్తవాలపై ఆధారపడింది కాదు. ప్రతి సంఘంలో కొందరు అనర్హులుండటం మామూలే. కాని బుద్ధిజం సోమరితనాన్ని మనోక్లేశం అని, శ్రమించటం విముక్తికి మార్గమని చెబుతుంది. బుద్ధుడు ఏనాడూ అక్రియావాదాన్ని బోధించలేదు. మనసా, వాచా, కర్మణా చెడ్డపనులుచెయ్యవద్దని, అన్నీ సరైనవి, మంచిపనులే చెయ్యాలని భగవానుడు బోధించాడు. **ఇతివృత్తకంలో** ఆయన యిలా

అన్నాడు: "ఓ భిక్షువులారా! మంచిపనులు చెయ్యటానికి ఎప్పుడూ వెనుకంజ వెయ్యొద్దు; మంచి పనులు సంతోషానికి మరోపేరు." సోమరితనానికి లోనుకావద్దని ఆయన భిక్షువుల్ని తరచు హెచ్చరిస్తుండేవాడు. **ధమ్మపాద**పై వ్యాఖ్యానంలో వివరించిన ఒక వృత్తాంతం యీ సందర్భంగా చెప్పదగింది. ఒక యింట్లో లేక లేక ఒక కొడుకు పుట్టాడు. అతన్ని ఎంతో ప్రేమతో పెంచిన తల్లిదండ్రులు, కొడుకు తమ కుటుంబానికి మంచిపేరు తెస్తాడని అతన్ని బడికి పంపారు. కాని అతను అజాగ్రత్త, అలసత్వంతో ఏమీ నేర్చుకోలేదు. తల్లిదండ్రులు అతన్ని యింటికి తీసుకెళ్ళి ఏదైనా పని నేర్చుకోమని చెప్పారు. కాని అతను సోమరిగా, పనికిరానివాడిగా తయారయ్యి, తల్లిదండ్రులకు శోకాన్ని మిగిల్చాడు. సాటి యువకులు, చుట్టుపక్కలవారు నిందించటమేగాక, తల్లిదండ్రులు కూడా అతన్ని ద్వేషించసాగారు. దీనితో మనస్తాపం చెంది పూజలు, పునస్కారాలు చేస్తూ మనశ్శాంతి కోసం ప్రయత్నించాడు. చివరకు బుద్ధుని వద్దకు చేరి తనకు సాయం చెయ్యమని ప్రార్థించాడు. అందుకు బుద్ధుడు యీ విధంగా బదులిచ్చాడు: "సంఘంలో చేరాలంటే అన్నిటికంటే ముందు నీ ప్రవర్తనను సంస్కరించుకోవాలి. కాబట్టి యింటికి తిరిగివెళ్ళి తల్లిదండ్రులకు విధేయుడవై నీ చదువును కొనసాగించు. రోజువారి పనులను సమర్థవంతంగా చెయ్యటం నేర్చుకో. సభ్యత, పరిశుభ్రత అలవర్చుకో. అలసత్వాన్ని నీ దరికి రానీయకు. వీటిని నేర్చుకున్న తరువాత తిరిగి వస్తే బహుశా నీకు సంఘం ప్రవేశం, తద్వారా భిక్షువుల సహచర్యం లభిస్తుంది." అలసత్వం అనే జబ్బు అన్నిరకాల నైతిక రుగ్మతలకు మూలం. ఈ జబ్బు నుండి బైటపడ్డవాడు మిగిలిన అన్నిరకాల నైతికమైన జాడ్యాలనుండి బయటపడగలడు.

శ్రమించే విషయాల్లో బౌద్ధభిక్షువులు ఆసక్తి చూపరని తరచు వింటుంటాం. విషయాల్ని చాలా సంకుచితమైన కోణంలో చూసిన ఫలితమే యీ ఆరోపణ. బౌద్ధభిక్షువులు వారున్న దేశాలకు అమూల్యమైన సేవలు అందించారు. బౌద్ధధర్మం వ్యాప్తిచెందిన అన్నిదేశాల్లో విద్యాలయాలు, నాగరికత అభివృద్ధికి మూలపురుషులు బౌద్ధభిక్షువులే. మధ్యయుగపు భారతదేశంలో నలందా, ఓదాంతపురి, విక్రమశిల, వల్లభి గొప్ప విద్యాకేంద్రాలుగా విలసిల్లాయి. నలందా విశ్వవిద్యాలయం అన్నిరకాల కళలు, శాస్త్రాల అధ్యయనానికి కేంద్రస్థానంగా వుండేది. చైనా యాత్రికుడు యువాన్‌చువాంగ్ నలందా విశ్వవిద్యాలయం గురించి తన అభిప్రాయాన్ని యిలా చెప్పాడు: "నలందాలోని వేలమంది భిక్షువులు ఎంతో ప్రతిభ కలిగినవారు. వారి ప్రవర్తన మచ్చలేనిది, వేలెత్తి చూపలేనిది. ఎంతో విజ్ఞానవంతమైన ప్రశ్నలడగటం, జవాబులు చెప్పటంతో రోజువారి కార్యక్రమం నిండివుండేది. యువకులు, వయసుమళ్ళినవారు పరస్పరం సహకరించుకుంటూ ఉదయం నుండి రాత్రివరకు చర్చల్లో మునిగిపోయేవారు. త్రిపీటకాల్లో పాండిత్యం కలవారికి

ఎంతో గౌరవం దక్కేది, అది లేనివారు సిగ్గుతో తప్పుకు తిరిగేవారు. వివిధ నగరాల నుండి ఎందరో మేధావులు తమ సంశయాల్ని తీర్చుకునేందుకు యిక్కడికి వచ్చేవారు. దీనితో వారి ప్రతిభ నలుమూలలకు వ్యాపించేది."

సత్పరిపాలన సాగించే రాజు గురించి **జాతకమాలలో** యిలా వుంది: "స్నేహం సౌభ్రాతృత్వం అతని బలం, సైన్యం కాదు; అతనికి కోపం అంటే తెలియదు, పరుషవాక్యాలు పలుకడు; అతను సత్ప్రవర్తనతో తన రాజ్యాన్ని పాలిస్తాడు, కాని రాజకీయ చతురతతో కాదు. సుగుణశీలురైన వారిని ఆదరించటానికి అతని సంపద వుపయోగించబడుతుంది." అశోకచక్రవర్తి యిటువంటి ఆదర్శాలను పాటించాడని నిస్సంశయంగా చెప్పొచ్చు. తన మాటల్లో, చేతల్లో కూడా ఆయన తన ప్రజలను సుఖశాంతులతో పాలించటానికి ప్రయత్నించాడు. అశోకుని శిలాశాసనంలో యిలా రాసి వుంది: సత్యం, చిత్తశుద్ధి, దయ, కరుణ, దానశీలతలను ఆచరించటం ద్వారానే ధర్మం వ్యాప్తిచెందుతుంది.... ప్రజలంతా నా పిల్లలవంటివారే. వారి యోగక్షేమాలే నా ఆశయం.... ధర్మమార్గంలోనే పరిపాలన, ధర్మంతోనే అభివృద్ధి, ధర్మంతోనే సంరక్షణ అనేదే శాసనం." అశోకచక్రవర్తిని మించి భారతావనికి సేవచేసిన వ్యక్తి మరొకరు లేరు.

బుద్ధుడు మనకు రాజకీయాల గురించి ప్రత్యేకంగా బోధించనప్పటికి, ప్రజాసంక్షేమాన్ని పెంపొందించే మౌలిక పునాదిని ఆయన ఏర్పరిచాడు. హేతుదృష్టి, మానవుని పరిపూర్ణ వికాసం మూలసూత్రాలుగా కలిగిన బుద్ధిజం ప్రజలను గుడ్డిగా అనుసరించేవారిగా గాక చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతుంది. హేతుబద్ధమైన జీవనవిధానం స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, స్వావలంబనకు దారితీస్తుంది. ఇవే సుస్థిరమైన పరిపాలనకు మూలస్థంభాలు.

అదుపులేని విలాసజీవితాన్ని, కఠినమైన ఆత్మపీడనవాదాన్ని తిరస్కరించిన బౌద్ధధర్మం ఆరోగ్యకరమైన, సరళమైన జీవనవిధానాన్ని ప్రతిపాదిస్తుంది. పరిత్యాగమంటే జీవిత సంబంధాలను తెంచుకోవటం కాదు, అహంకారాన్ని సమూలంగా అంతమొందించటం. భిక్షుత అంటే తలగొరిగించుకోవటం, పసుపు వస్త్రాలు ధరించటం, శీలప్రమాణాలు చెయ్యటం, భిక్షకోసం తిరగటం కాదు. భిక్షుత అంటే హృదయాన్నుండి కోరికలు, వ్యామోహం, దురాశ, గర్వాతిశయాల్ని సమూలంగా పెకలించటం. ఒకానొక సందర్భంలో ఒక నిర్గ్రంధుడు (జైనమత అనుయాయి) బుద్ధభగవానుని యీ విధంగా ప్రశ్నించాడు: "సత్ప్రవర్తనాశీలుడనగా ఎవరు? జ్ఞాని అంటే ఎవరు? గౌరవింపదగిన వ్యక్తి ఎలా వుంటాడు? నిజమైన సౌందర్యం ఎలా వుంటుంది? నిజమైన శ్రమణుడు, భిక్షువు అనగా ఎవరు? ఎవరు నిజమైన జ్ఞానోదయం పొందినవాడు? ధర్మాచరణ సంపన్నుడనగా ఎవరు?" ఈ ప్రశ్నలకు భగవానుడు యిలా సమాధానం చెప్పాడు:

“ఎవడైతే నిరంతరం నేర్చుకోవాలనే జిజ్ఞాస కలిగివుంటాడో, ఎవడు ప్రజ్ఞాపాటవాలతో కూడిన ప్రవర్తన ఆశిస్తూ, అందుకోసం అన్వేషిస్తాడో వాడే నిజమైన సత్ప్రవర్తనాశీలుడు.

సున్నితమైన పద-అర్థ భేదాలపై ఆధారపడకుండా ఎవరైతే స్వేచ్ఛగా, నిర్భయంగా సత్యం పక్షాన నిలబడతాడో వాడే విజ్ఞానవంతుడు.

వయసుమీరి, నడుము వంగి, తల నెరసినంతనే ఒక వ్యక్తి గౌరవానికి అర్హుడు కాలేడు. ఇలా వున్నవాడు మూర్ఖుడు కూడా కావచ్చు; కాని ఎవరైతే ధర్మాన్ని అన్వేషిస్తూ, అవగతం చేసుకుంటారో; ఎవరు తన ప్రవర్తనను అదుపులో వుంచుకొని సంపూర్ణమైన కరుణ, శీల సంపన్నులౌతారో; ఎవరు నర్మగర్భ రహస్యాలను ఛేదించి, పవిత్రులుగా వుండగలుగుతారో వారే గౌరవానికి నిజమైన అర్హులు.

అలంకారప్రాయమైన పైపై మెరుగుల కోసం ఆరాటపడేవాడు నిజమైన సౌందర్యవంతుడు కాడు.ఎవరి మాటలు, చేతలు పరస్పర విరుద్ధాలు కావో; ఎవరు సకల మనోక్లేశాలను సమూలంగా ఛేదిస్తారో, ఎవరైతే ద్వేషాన్ని లేశమాత్రమైనా లేకుండా వదిలించుకుని విజ్ఞానవంతుడౌతాడో అతనే నిజమైన సౌందర్యవంతుడు.

అసత్యాలాడుతూ కోరికలకు బానిసైన వ్యక్తి గుండు గీయించుకున్నంత మాత్రాన శ్రమణుడు కాలేడు; ఎవరైతే తృష్ణను, స్వార్థపూరిత చింతనను అంతమొందించి ప్రశాంతమైన మనసును పొందుతారో వారే శ్రమణులు.

నిర్ణీతసమయాల్లో భిక్ష కోసం వెళ్ళుతూ, శీలవంతుడనిపించుకోవటం కోసం లేదా సంఘంలో చేరటం కోసం మాత్రమే ప్రవర్తనను మార్చుకునేవాడు భిక్షువు కాదు. అన్నిరకాల పాపాలకు మూలమైనవాటిని త్యజించి, ప్రజ్ఞతో ఎవరైతే సకలక్లేశాలను అంతమొందిస్తారో, ఎవరైతే ఆత్మనిగ్రహంతో పవిత్రజీవితాన్ని గడుపుతారో వారే నిజమైన భిక్షువులు.

ఎవరి హృదయం మైత్రి, కరుణలతో నిండివుంటుందో, ఎవరి హృదయం కల్మష రహితమౌతుందో అతనే జ్ఞాని. కేవలం మాటలతోగాక, ఆచరణలో ధర్మాన్ని పాటించేవాడు, నిరంతరం అప్రమత్తుడై ధర్మాన్ని కాపాడేవాడే ధర్మాచరణ సంపన్నుడౌతాడు.”

సుగుణశీలసంపన్నుడు, విజ్ఞానవంతుడు, సహనశీలి, మృదుస్వభావి, కరుణామయుడు అయినవాడే భిక్షువు; కఠినమైన దేహదండన సాగించేవాడు కాదు. అతను కండలు పెంచటం కోసం ఆహారం తినకపోవచ్చు, కాని ఆకలి తీర్చుకోవటం కోసం, దేహపోషణ కోసం ఆహారం భుజిస్తాడు. అతను ఆభరణాలు, పూలదండలు, సువాసనా ద్రవ్యాలు వాడకపోవచ్చు, కాని పరిశుభ్రంగా వుంటాడు. అతని పసుపువస్త్రాలు ఖరీదైన మేలిమిరకం కాకపోవచ్చు, కాని అవి సభ్యతతో కూడి, శరీరానికి అనువుగా వుంటయ్. అతను గొప్ప భవనాల్లో నివసించనప్పటికి, వాతావరణాన్నుండి రక్షణపొందే

నిమిత్తం అవసరమైన నివాసాన్ని పొందుతాడు. అతను ఆటపాటలకు వినోదాలకు దూరంగా వున్నా, సమాజంతో తెగతెంపులు చేసుకోడు. జనావాసాలకు దూరంగా నివసిస్తున్నా, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో వుంటాడు. అతను విశ్రాంతజీవితం గడుపుతూనే, నిరంతరం ధర్మప్రచారం చేస్తుంటాడు. అతను సంపూర్ణమైన స్వేచ్ఛ కలిగివున్నా, విచ్చలవిడిగా ప్రవర్తించడు. అతను యితరులపై పెత్తనం కోరుకోడు, కాని తన మనసును, ప్రవర్తనను అదుపులో వుంచుకుంటాడు. అతను హక్కులను, అధికారాలను కోరడు, కాని సహచరుల పట్ల తన విధులను నిర్వహిస్తాడు. అతను తన ప్రజ్ఞాపాటవాల వల్ల గాక పవిత్రత, మైత్రి, కరుణ, విజ్ఞతల ద్వారా గౌరవాన్ని పొందుతాడు.

## ఎనిమిదో అధ్యాయం

# బుద్ధిజం-నిరాశావాదం

షోపెన్‌హాయర్ తన ప్రధాన రచన, The World as Will and Idea, లో యీ విధంగా ప్రకటించాడు: "నేను నా ఫిలాసఫీనే నికరమైన సత్యంగా భావించవలసి వస్తే, మిగిలిన అన్ని మతాల కంటే బుద్ధిజాన్నే అంగీకరించాలి. ఏది ఏమైనా, యీ భూమ్మీది మెజారిటీ ప్రజలు అనుసరించే మతంతో నా బోధనలు సారూప్యం కలిగివుండటం నాకు సంతృప్తి కలిగించే విషయం." షోపెన్‌హాయర్ తన ఫిలాసఫి, బుద్ధిజం మధ్య సన్నిహిత సంబంధం వున్నట్లు అంగీకరించటం ఆయనకు సంతృప్తి కలిగించి వుండొచ్చు, కాని అది బుద్ధిజానికి దురదృష్టంగానే పరిణమించింది. అది బుద్ధిజం పట్ల తీవ్రమైన అపోహను కలిగించింది. బుద్ధిజం బోధించే జీవిత ఆదర్శం, షోపెన్‌హాయర్ చెప్పే నిరాశావాదం ఒక్కటేననే దురభిప్రాయానికి దారితీసింది. బుద్ధిజాన్ని నిరాశావాదంగా భావించటం సత్యదూరమైన ఆలోచన.

అంతరంగంలో పరస్పరం పొంతనలేనితనమే మానవనైజంలో మూలసూత్రం అని షోపెన్‌హాయర్ ఫిలాసఫీ చెబుతుంది. దీని ఫలితంగా చేతనలో వున్నంతకాలం మనిషి దుఃఖబాధితుడిగా వుండవలసిందే. "జీవితసమరం బాధలతోనే కూడివుంటుంది, రక్తపాతం లేకుండా అది అంతం కాకపోవచ్చు. ఏది ఏమైనా మనిషి దుఃఖించక తప్పదు" అని షోపెన్‌హాయర్ చెప్పాడు. దీనికి విరుద్ధంగా, బుద్ధిజం యొక్క లక్ష్యమే అంతరంగ సమతను సాధించటం, జీవితసమరం యొక్క సంకటం నుండి మహత్తరమైన శాంతిని సాధించటం. "ఎవరి అంతరంగం ప్రీతితో నిండివుంటుందో, ఎవరైతే ఒంటరిగా సమత, సంతోషాలతో జీవిస్తారో అతనే నిజమైన భిక్షువు" అని ధర్మపాదలో చెప్పబడింది. బాధపడొద్దు, రోదించవద్దు అనే మాటలు బుద్ధుని బోధనల్లో ఎక్కడ చూసినా కనిపిస్తయ్.

సారిపుత్రుని మరణ వార్త విని రోదిస్తున్న ఆనందునితో భగవానుడు అన్నమాటలివి: “ఆనందా, యిటువంటి విషయాల్లో రోదించటం సముచితం కాదని నీకు చాలాసార్లు చెప్పాను. మనల్ని తల్లిదండ్రులనుండి, తోబుట్టువుల నుండి, మనకు అత్యంత ప్రీతిపాత్రమైన వారినుండి విడదీయగలిగేవి రెండు వున్నయ్. అవి మనుషుల మధ్య ఉండే దూరం, మరణం. నేనెప్పుడూ యీ విధమైన బాధల్ని అనుభవించలేదని అనుకోవద్దు. బోధికోసం సాధన చేస్తూ అరణ్యాల్లో నేను ఒంటరిగా వుండలేదా. అప్పుడు నేను ఏడుస్తూ కూర్చుంటే నాకుగాని లేదా యితరులకు గాని ఏమైనా ప్రయోజనం కలిగేదా? అది ఒంటరినైన నన్ను ఊరడిస్తుందా? నేను వదలి వచ్చినవారికి ఏమైనా ఉపకరిస్తుందా? అది ఎంత భయంకరమైందీ, దుర్భరమైందీ ఐనప్పటికీ దుఃఖించి, రోదించి ప్రయోజనం లేదు, అది మనల్ని మరింత బలహీనుల్ని చేయటం తప్ప.”

నిరాశావాదులవలె, చిత్తశుద్ధితో బుద్ధుడు కూడా జీవితం దుఃఖమయం అనే విషయాన్ని గుర్తించినమాట నిజం. ఆయన కామసుఖాల్ని, కోర్కెల్ని, దురాశను, యీ జీవితాన్ని శాశ్వతం చేసుకోవాలనే ఆరాటాన్ని నిరసించిన మాట కూడా నిజమే. ఆయన మనం సాధారణంగా విలువైనవి, సహజమైనవి అనుకునేవాటిని విలువలేనివని ఖండించాడు. దీనికి కారణం అవి అత్యున్నతమైన లక్ష్యసాధనలో ఆటంకాలుగా వుండటమే. నిరంతరం మార్పుకు లోనయ్యే విషయాలపట్ల కోర్కెను పెంచుకోవటం చివరకు ప్రమాదంగా పరిణమిస్తుంది. ఈ ప్రపంచంలో మార్పుచెందనిదంటూ ఏదీ లేదు. ఆరోగ్యకర దీర్ఘకాలం కొనసాగినా చివరకు అది అనారోగ్యం, మరణంలో అంతం కావలసిందే. సిరిసంపదలు, సుఖం, అధికారం, కీర్తిని పెంపొందిస్తాయని మనం వాటి కోసం ఆరాటపడతాం. ఇవి శాశ్వతమైనవని ఎవరూ చెప్పరు.

జీవితం కేవలం జీవించటం కోసమే ఐతే దానికి విలువలేదు. జీవించటమే మనకు సంతృప్తిని కలిగిస్తే, మనం యిక కోరుకొనేదేమీ వుండదు. దీనికి భిన్నంగా, మనిషి తన కోర్కెలను తీర్చుకొనేటందుకు చేసే పోరాటంలోనే ఆనందాన్ని పొందుతాడు. తాను పొందవలసిందేమీ కనిపించనప్పుడు నిరాశ, నిస్పృహలకు లోనౌతాడు. మనిషి కొత్తదనం కోసం పడే ఆరాటంలోనే, యిప్పుడున్న సాధారణ జీవితం ఎంత వెలితిగా వుందో అర్థమౌతుంది. నాణ్యతలేక దీర్ఘకాలం బ్రతికే బ్రతుకు నిరర్థకం. తాత్వికజిజ్ఞాస, సాంస్కృతిక పరిణతితో నిండిన సమున్నతమైన, ఉత్తమమైన జీవితమే నిజంగా జీవించదగింది. బౌద్ధధర్మగ్రంథాలు యిటువంటి జీవితం యొక్క అవసరాన్ని నొక్కి చెబుతాయి. **నాలుగు పారమితల** (Perfections) సూత్రం బోధిని పొందగోరే వ్యక్తి గురించి యీ విధంగా చెబుతుంది:

“బోధిసత్వుని ఆలోచనల ఫలితం ఏమిటి? - సమున్నతమైన శీలం, ఉన్నతసత్య

దర్శనం; మహోన్నతమైన ప్రేమ, కరుణ. కామ, క్రోధ, మోహం నుండి సంపూర్ణమైన స్వేచ్ఛ; చెదరని ప్రజ్ఞ; తుదికంటా సడలని సంకల్పం."

"అతను పాటించే నియమం ఏమిటి? – సమున్నతమైన సుగుణాలను కోరుకోవటం; అజ్ఞానంలో వున్నవారిని కించపరచకుండా వుండటం; అందరి పట్ల స్నేహభావం కలిగివుండటం; ముందు జన్మలనుండి ఏమీ ఆశించకపోవటం."

"అతను పొందేదేమిటి? – ధర్మాన్ని విని బుద్ధుణ్ణి దర్శించిన ఆనందం, అనుభూతిని పొందటం; సకల జీవుల హితాన్ని పెంపొందించి ఆనందపడటం."

"అతని ఆరోగ్యం ఎటువంటిది? – దృఢమైన శరీరం, నశించిపోయేవాటిపట్ల మమకారం లేని మనసు; ధర్మం షయంలో సంశయం లేకుండా వుండటం; సకలజనులను సమానంగా ఆదరించటం."

"అతను దేనికి నిబద్ధుడై వుండాలి? – ధ్యానం, ప్రజ్ఞ, కరుణ, జనహితానికి అతను బద్ధుడై వుండాలి."

సుఖం కంటే దుఃఖాన్నే ఎక్కువ కలిగిస్తున్న కారణంగా బుద్ధుడు మానవజీవితాన్నే మొత్తంగా తిరస్కరించలేదు. జీవితమంతా ఏదో రకమైన పోరాటమే. జీవించటం కోసం పోరాటం తప్పదు. క్రైస్తవం చెప్పినట్లుగా యీ జీవితం పాప ఫలితమా? ఇది పైనుండి శిక్షగా మనకు విధించబడిందా? యీ ప్రపంచం అన్నిటికంటే అధమమైందని మనం నిరాశావాదంలో మునిగిపోవాలి. కాని జీవనసమరంలోని దుఃఖం మనం జీవితాన్ని చూసే దృష్టినుండి వుత్పన్నమౌతుందని ధర్మం చెబుతుంది. మనం అంతరంగంలో నిబిడీకృతంగా వున్న కోరికలపై ఆధారపడి జీవితాన్ని అంచనా వేస్తాం. స్వార్థపూరితమైన అవసరాలపై ఆధారపడి జీవితపోరాటాన్ని సాగిస్తామేగాని, సత్యం కోసం, సత్ప్రవర్తన కోసం కాదు. సిరిసంపదలు, అధికారం, కీర్తిప్రతిష్ఠలను ఆశించి పగ, ద్వేషం, ఆరాటంతో పాకులాడే వ్యక్తి సంతోషంగా ఎలా వుండగలడు? తన వ్యక్తిగత సంతోషం కోసం ఆందోళనచెందేవాడు భయం గుప్పెట్లో చిక్కక తప్పదు. అతను తనకు కావలసినవన్నీ పొంది, యితరుల బాధల్ని పట్టించుకోకపోవచ్చు. కాని అందరి జీవితం ఒకే విధంగా ముగుస్తుందనే వాస్తవాన్నుండి తప్పించుకోలేడు. జీవితం, మరణం ఒకే విధమైనవని తెలుసుకున్నవాడే నిజమైన సంతోషాన్ని పొందగలడు.

మనిషి తనను తాను ఎన్నిరకాలుగా మభ్యపెట్టుకున్నా, అనుభవం చెప్పేదేమంటే మనుషులు ఆశావాదులైనా, నిరాశావాదులైనా మరణం పట్ల తిరస్కారభావమే వుంటుంది. ప్రముఖ ఫ్రెంచ్ తత్వవేత్త చార్లెస్ రినౌ తాను చనిపోయే నాలుగురోజుల ముందు రాసిన మాటలు యివి: "నా స్థితి గురించి నాకేమీ భ్రమలు లేవు. ఒకటి రెండు వారాల్లో నేను చనిపోతానని నాకు తెలుసు... నేను చెయ్యవలసిన కర్తవ్యాన్ని మధ్యలో వదలి

వెళ్ళాల్సిందే. ఇది అన్నిటికంటే విచారాన్ని కలిగించే విషయం... అంతేకాదు. ఒకడు ముసలివాడై, జీవించటానికి అలవాటు పడిపోతే మరణించటం మరింత బాధను కలిగిస్తుంది. యువకులు వృద్ధులకంటే సులభంగా మరణం అనే భావనను జీర్ణించుకోగలరని నేను నమ్ముతాను.... నేను చనిపోబోతున్నానని నాకు తెలుసు. నాలోని తత్వవేత్త అందుకు సిద్ధంగానే వున్నా, యీ ముసలివాడికి మృత్యువును ఎదుర్కొనే సాహసం లేదు. ఏది ఏమైనా జీవితాన్ని విరమించక తప్పదు." మనుషులు జీవితంకోసం ఎంత గుడ్డిగా తపిస్తారో తెలియజేసే మాటలివి. ఆత్మభావనను అంతమొందించకుండా యీ తపనను తొలగించటం సాధ్యంకాదు. కాబట్టి సద్ధర్మం ప్రకారం మనం ప్రయత్నించవలసింది శాంతికోసం, దీర్ఘజీవితం కోసం కాదు.

తథాగతుడు అనివార్యమైన మరణం, దుఃఖం గురించి మాత్రమే గాక నిజమైన సుఖసంతోషాలను పొందే మార్గాన్ని కూడా బోధించాడు. ప్రపంచం ఏదో ఒక రూపంలో సంతోషం కోసం ప్రాకులాడుతూ వుంటుందనే వాస్తవాన్ని ఆయన గుర్తించాడు. అదే సమయంలో సుఖసంతోషాల కోసం నేరుగా ప్రయత్నిస్తే అవి మనకు అందవని చెప్పాడు. కేవలం వ్యక్తిగత కోర్కెలను తృప్తిపరచటమే లక్ష్యంగా కలిగిన జీవితం జీవించతగింది కాదని ధర్మం చెబుతుంది. వైయక్తిక అనందమే మానవ జీవితాదర్శం అయితే మనం ఆదిమానవుడి స్థితికి మరలటమే మేలు. నాగరిక మనవుడి కంటే ఆదిమ మానవులు, జంతువులు మరింత సంతోషంగా వుంటాయనే విషయాన్ని కాదనగలమా? నాగరికత మన జీవితంనుండి ఎన్నో చెడుగులను తొలగించి, ఎన్నో సౌలభ్యాలను అందించింది, వాటితో పాటు క్రితం మనకు తెలియని ఎన్నో బాధల్ని కూడా తెచ్చిపెట్టింది. జంతువులు వాస్తవంగా వుండే బాధల్ని మాత్రమే అనుభవిస్తయ్, కాని మనిషి యొక్క హేతుబుద్ధి బాధల్ని గురించి ముందుగా వూహించి, తరువాత లోతుగా ఆలోచింపచేసి వాటిని మరింత ఎక్కువ చేస్తుంది. జంతువు తన సహజాత లక్షణాలతో సంతోషంగా వుంటుంది. సోక్రటీస్ వంటి మేధావికి మాత్రం బాధలు తప్పవు. అందువల్లే, సద్ధర్మం మానవుని ముందు వుంచే లక్ష్యం పరిపూర్ణతేగాని, సంతోషం కాదు. "ఎవరు పరిపూర్ణతను అందుకోగలరు? ఆనందం కోసం అర్రులు చాచేవారా లేక కష్టాలకు సిద్ధపడేవారా? దీనికి సరైన జవాబు: కష్టాలను ఎదుర్కొనేవారే, వాటిని తప్పించుకోగోరేవారు కాదు." ఎవరైతే పరిపూర్ణతను పొందగలుగుతారో వారే దాన్నుండి కలిగే మహత్తరమైన ఆనందానుభూతిని పొందగలరు. "ఈ ప్రపంచంలో సంతోషంగా జీవించేవారిలో నేను కూడా ఒకణ్ణి" అని భగవానుడు ఒక సందర్భంలో చెప్పాడు. **ధర్మపాద**లో చెప్పినట్లు, ఎవరైతే బుద్ధుని మార్గంలో నడుస్తారో వారు హృదయ మాలిన్యం, దురాశ, ద్వేషం నుండి విముక్తులై సంతోషంగా జీవిస్తారు. సకల క్లేశాల నుండి విముక్తుడైనవాడు

మబ్బులు వీడిన చంద్రుడి వలె జగత్తును కాంతిమయం చేస్తాడు.

చెట్టు గొప్పతనం అది కాసే కాయలవల్ల తెలుస్తుంది. కొంతమంది రచయితలు బుద్ధిజంకు పలాయనవాదం, నిరాశావాదం అనే ముద్రవేసే ప్రయత్నం చేశారు. అదే నిజమైతే బౌద్ధ అనుయాయులు సుఖసంతోషాలు, జవజీవాలు లేనివారుగా విచారవదనులుగా ఉండాలి. కాని వాస్తవం ఏమిటి? బర్మా బుద్ధిస్టులను మించి జీవకళ, సంతోషం తొణికిసలాడే మనుషులు యీ భూమండలంపై ఎవరైనా వున్నారా. స్కాట్ ఓ కానర్ తన The Silken East అనే పుస్తకంలో యిలా రాశాడు: "ఈ భూతలం మీదున్న ప్రజలందరికంటే బహుశా బర్మాదేశీయులు అత్యంత సంతోషంగా జీవిస్తున్నారు. ఆధునిక ప్రపంచం కలలు కనే విశ్రాంతి, స్వేచ్ఛ, సమానత్వం వీటన్నిటికి తోడు తీవ్రమైన అననుకూల పరిస్థితుల్లో కూడా చిరునవ్వులు చిందించే స్వభావం వారి స్వంతం. ప్రపంచంలో వీటిలో కొన్నింటినైనా తమ స్వంతం చేసుకోవాలని కోరుకోనివారు ఎవరుంటారు?" సియామి, జపాన్ ప్రజలను గురించి యిదే విషయం చెప్పవచ్చు. బుద్ధిజాన్ని అనుసరిస్తున్న ప్రజల్లో నిరాశావాదాన్ని బోధించే మతలక్షణాలు మచ్చుకైనా కనపడవు. మనిషిని పరాధీనత నుండి విముక్తి చేసి, సమున్నతమైన మానవుడిగా మలిచేదే నిజమైన మతం. సద్ధర్మం మనిషి తనను తాను ప్రక్షాళన చేసుకొని, తనపై అదుపు సంపాదించి సమున్నతుడిగా ఎదిగేటట్లు చేస్తుంది.

మానవుడు వ్యక్తిగత ప్రయోజనాన్ని ఆశించి తనకు తెలియకుండానే పరిణామాన్ని ముందుకు నడిపాడు. కాని ధర్మం 'యీ పనిని ఉద్దేశపూర్వకంగా, క్రమబద్ధంగా చెయ్యటం మానవుని కర్తవ్యం' అని బోధిస్తుంది. కేవలం స్వార్థపూరిత సుఖాల కోసం యీ జీవితసంకటాన్ని భరించటంలో అర్థం లేదని బుద్ధిజం అంగీకరిస్తుంది. అందువల్లే అది వైయక్తిక జీవితపు యిరుకైన పరిధుల్ని ఛేదించి ఉన్నతమైన ఆదర్శాలను మానవుడి ముందుంచింది. జీవితంలో యిప్పుడున్న దుఃఖాన్ని తొలగించటం మాత్రమే గాక, అసలు దుఃఖానికి తావేలేని ప్రపంచాన్ని సృష్టించటం బౌద్ధధర్మ లక్ష్యం.

## తొమ్మిదో అధ్యాయం

# మహోన్నత అష్టాంగమార్గం

"సంబోధి కోసం ప్రయత్నించేవారు రెండు విపరీతధోరణులను విడనాడాలి. ఏవి ఆ రెండు? – కామసుఖాల్లో మునిగిపోవటం, కఠోరమైన ఆత్మపీడనా యోగం. మొదటిది మనిషిని శక్తిహీనుణ్ణిచేసే చవకబారు, పనికిమాలిన మార్గం కాగా, రెండవది బాధాకరం, నిష్ప్రయోజనకరం. ఈ రెండు విపరీతాలను నిరాకరించి తథాగతుడు అంతఃదృష్టి,

జ్ఞానం, ప్రజ్ఞ, శాంతి, నిర్వాణాలకు దారితీసే మధ్యమమార్గాన్ని (మధ్యమ ప్రతిపాద) కనుగొన్నాడు. ఆ మధ్యమ మార్గం ఏది? - అదే మహోన్నత అష్టాంగమార్గం (ఆర్య అష్టాంగమార్గం).

ఈ అష్టాంగమార్గంలో ప్రవేశించనివారు తాము బుద్ధిస్టులమని చెప్పుకోటానికి అర్హులు కారు. అష్టాంగమార్గాన్ని అనుసరించకుండా కేవలం బుద్ధుని బోధనల్ని అధ్యయనం చేస్తూ, పరిశోధిస్తూ వుండేవారిని **బుద్ధిస్టులు** అని పిలవకూడదు. ఈ మార్గం బుద్ధిజం శీలాన్ని ప్రతిబింబిస్తుంది, శీలవ్రతం బుద్ధుని బోధనల్లో ప్రధాన అంతర్భాగం. కేవలం ధర్మాన్ని తెలుసుకుని తన జీవితాన్ని, ఆలోచనల్ని తదనుగుణంగా మలుచుకోని వ్యక్తి, రుచికరమైన వంటకాల గురించి పుస్తకాల్లో చదివి వాటిని తిన్నట్లు భావించేవాడితో సమానం.

సువిశాలమై, సూటిగా సాగే యీ మార్గంలో ఎనిమిది అంగాలు వున్నయ్. అవి:

| | |
|---|---|
| **సమ్యక్ దృష్టి** | **(సమ్మా దిట్ఠి)*** |
| **సమ్యక్ సంకల్పం** | **(సమ్మా సంకప్ప)** |
| **సమ్యక్ వాక్కు** | **(సమ్మా వాక్)** |
| **సమ్యక్ కర్మ** | **(సమ్మా కమ్మా)** |
| **సమ్యక్ జీవనము** | **(సమ్మా ఆజీవ)** |
| **సమ్యక్ వ్యాయామం** | **(మమ్మా వాయామా)** |
| **సమ్యక్ స్మృతి** | **(సమ్మా సతి)** |
| **సమ్యక్ సమాధి** | **(సమ్మా సమాధి)** |

మానవుడు సాధించిన ప్రగతి యొక్క నిజమైన చరిత్ర తెలుసుకోవాలంటే అతని విశ్వాసాలను పరిశీలించాలి. కళలు లేదా శాస్త్రవిజ్ఞానం, సమాజం లేక మతం అది ఏదైనా, చరిత్ర మనిషి యొక్క విశ్వాసాలు వాటి ఎదుగుదలపై ఆధారపడివుంటుంది. ఎందుకంటే, మానవులు చేసే పనులు ప్రధానంగా వారి విశ్వాసాలపై ఆధారపడి వుంటయ్. మూఢమైన ఆచారాలు, సాంప్రదాయాలు, అహేతుకతతో కూడిన మానసికస్థితి యొక్క ఫలితమే. కాబట్టి, సహజంగానే, పవిత్రతను చేకూర్చే ఉత్తమమార్గంలో నడవాలనుకునేవారికి సరైన దృష్టి ఎంతో ప్రాథమికమైంది. ఎంచుకున్న వుద్దేశం లేదా లక్ష్యం మనిషి చేసే చర్యలకు మూలాధారం. ఆ ఉద్దేశానికి ప్రేరణ అతను నమ్మే విశ్వాసాలు. మనం వేసే తొలి అడుగు మన లక్ష్యానికి దిశానిర్దేశం చేస్తుంది. కాబట్టి

---

* బ్రాకెట్లలో యిచ్చినవి పాళీ ఉచ్చారణ.

సరైన దృష్టి లేదా దృక్పథం సరైన ఆచరణకు దారితీస్తుంది.

విశ్వంయొక్క ఆది-అంతాల గురించిన ఆలోచన, అతీంద్రియశక్తుల్లో విశ్వాసం ధార్మికచింతనను పక్కదోవ పట్టించాయి. మనిషి నిజజీవితంలోని బాధలు, అసంతృప్తి, దుఃఖంతోనే తత్వచింతన ప్రారంభం కావాలి. వీటిని తొలగిస్తామని అన్ని మతాలు ప్రతిపాదించాయి. దుఃఖం యొక్క అస్థిత్వాన్ని, దానికి మూలమైన కారణాల్ని సరిగ్గా అర్థం చేసుకున్నప్పుడే దాన్ని తొలగించే విధానాన్ని కనుగొనటం సాధ్యమౌతుంది. దీనికి మారుగా, శాశ్వత ఆత్మలో నమ్మకం, అతీంద్రియ శక్తులపై ఆధారపడటం వంటివి మనిషిని నిర్వీర్యం చేసే తప్పుడు మార్గానికి దారితీస్తయ్.

విద్యావంతుణ్ణి - విద్యలేనివాడిని, చింతనాపరుణ్ణి - అనాలోచితంగా వ్యవహరించేవాడిని వేరు చేసేది వారి విశ్వాసమే. మనుషులు తమ విశ్వాసాలను వివిధ పద్ధతుల్లో ఏర్పర్చుకుంటారు. కొందరు ఒక విశ్వాసాన్ని ఆశ్రయించి అందులో తృప్తిపొంది, తమ విశ్వాసాలకు భిన్నమైన విశ్వాసాలు కలిగినవారిపట్ల తిరస్కారం, పాపభీతి, ఆందోళన కలిగివుంటారు. తరచుగా కొన్ని నమ్మకాలు మనుషులపై బలవంతంగా రుద్దబడతయ్. దీనికి చాలామంది సులభంగా లొంగిపోయినా, చింతనాపరులైనవారు దీనిలోని బూటకాన్ని అర్థం చేసుకుని సరైన దృక్పథం కోసం ప్రయత్నిస్తారు. తమపై రుద్దబడ్డ విశ్వాసాలను ఛేదించినవారు కూడా తమ కోరికలకు, అవసరాలకు అనువుగా వున్నవాటి వలలో చిక్కుకుంటారు. ఇటువంటి మానసికస్థితి వికాసానికి అడ్డంకిగా మారుతుంది. తన కోరికల్ని, అవసరాల్ని సైతం నిశితంగా పరిశీలించి, వాటిలో సహేతుకంగా వున్నవాటికి విలువనివ్వటం ద్వారానే మనిషి సత్యాన్ని చేరుకోగలడు. అధీకృతమైన లేదా అంధవిశ్వాసాలపై కాకుండా బుద్ధిజం హేతుదృష్టికి, శాస్త్రీయదృక్పథానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. నిరుపయోగమైన ఆశలు, ఆశయాలను పక్కనబెట్టి ఆలోచించినప్పుడు దుఃఖనిరోధానికి మనిషి చేసే ప్రయత్నం చాలా సహజమైనదనే విషయాన్ని అర్థం చేసుకోగలం. హేతుబద్ధత, శాస్త్రీయ దృష్టి మాత్రమే సరైన ఆలోచన, సరైన ఆచరణను సంరక్షించగలిగే సాధనాలు.

దుఃఖం, దుఃఖకారణం, దుఃఖ నివారణ గురించి సరైన దృక్పథం గల వ్యక్తి చవకబారు సుఖలాలసత్వంలో సంతృప్తిని ఎలా పొందగలడు? భోగాల కోసం వెంపర్లాడటమే బాధల్ని కొనితెచ్చుకోవటమని అతనికి తెలుస్తుంది. వాస్తవాన్ని వాస్తవంగా చూడగలిగినవాడు సిరిసంపదల, స్వార్థప్రయోజనాల వెంట పరుగెత్తడు. పరిపూర్ణతను పొందగోరేవాడు అలసత్వంలో ఆనందాన్ని ఎలా పొందగలడు? అతని మనసు ఎప్పుడూ సంబోధిని పొందే లక్ష్యం వైపే నిలిచివుంటుంది. మనసును వైరుధ్యాలు, సంశయాల నుండి దూరం చేసి, గమ్యంవైపు నడవటమే అతని ఆశయం. ధర్మాన్ని శోధించి, దానికి

అనుగుణమైన ఆచరణను అలవరచుకొని, దుఃఖసాగరంలో మునిగివున్న తన, తనతోటివారి రక్షణ కోసం అవసరమైన మార్గంలో పయనించటమే అతని కర్తవ్యం.

స్థిరమైన సంకల్పం లేనిదే ఎంత గొప్ప ఆశయమైనా నిరుపయోగమౌతుంది. ఆచార్య నాగసేనుడు చెప్పినట్లు బోధి, కరుణ, మైత్రి అనే లక్ష్యాలు అచంచలమైన సంకల్పంగా రూపుదిద్దుకుంటయ్. ఈ సంకల్పం దురాశ, కీర్తికండూతి, స్వర్గసుఖప్రాప్తి లేదా వ్యక్తిగత సుఖాలపైగాక బహుజన హితం – బహుజన సుఖం అనే లక్ష్యంపై ఆధారపడాలి. ఈ విధమైన సంకల్పం కలిగిన వ్యక్తి మనసులో యిలా అనుకుంటాడు: "సకల జీవరాశిని దుఃఖసాగరం ఆవలివడ్డుకు చేర్చే యీ సంకల్పం తిరుగులేనిది. ఇక అలసత్వం నా దరిచేరదు. నేనిక వెనుదిరిగే ప్రశ్నే లేదు." సంబోధిని పొందాలనే యిటువంటి స్థిరసంకల్పంతోనే సాధకుడు ఆత్మనిగ్రహం, మనోశుద్ధి కలిగించే మహత్తర అష్టాంగమార్గంలో పయనించాలి. సత్‌సంకల్పం అనేది సరైన వాక్కు, సరైన కర్మ, సరైన జీవనవిధానంలో వ్యక్తం కావాలి.

అబద్ధాలాడటం, చాడీలు చెప్పటం, సరదా కబుర్లతో కాలం గడపటం, పరుషంగా మాట్లాడటం వంటివాటికి దూరంగా వుండటమే సరైన వాక్కును పాటించటం. సంబోధిని పొందగోరు వ్యక్తి మాటలు సూటిగా, స్పష్టంగా, మృదువుగా, సత్యవంతంగా వుండాలి; యితరులకు సహకరించే విధంగా, ప్రోత్సహించేట్లుగా వుండాలి; వాటిలో గర్వాతిశయం, కటువుతనం కూడదు. అతను విందువినోదాలు, విలాసాలు, స్త్రీలు, తగవులు తదితరమైనవాటి గురించి కాలయాపన కోసం మాట్లాడకూడదు. అతను ఏది మాట్లాడినా అది దయ, పవిత్రత కూడినదై వుండాలి.

సరైన వాక్కును అనుసరించి చేసే పనులు (కర్మలు) కూడా మలినరహితమై వుండాలి. సత్కర్మల లక్ష్యం దాన్నుండి లభించే వ్యక్తిగత సంతోషం కాదు. ఉత్తమమైన జీవితానికి విరుద్ధమైన అన్ని పనులు త్యజించాలి. మంచిని పెంపొందించే ఏ పనైనా చెయ్యటానికి వెనుకాడరాదు. బలిదానం, ప్రార్థన, మంత్రాలను ఉచ్చరించటం వంటివి పుణ్యాన్ని కలిగించవు. కాబట్టి వీటిని విసర్జించాలి. 'బాహుకనదిలో స్నానం చేసినవారి పాపాలు నశించి వారికి పుణ్యం లభిస్తుంద'ని ఒక బ్రాహ్మణుడు బుద్ధునితో చెప్పగా, అందుకు ఆయన యిలా బదులిచ్చాడు: "అది బాహుక లేదా అధిక, గయ లేదా సరస్వతి ఏ నదిలో ఎన్నిసార్లు మునిగినా పాపం చేసినవాడు పవిత్రుడిగా మారలేడు. నది ఏదైనా దుర్బుద్ధి కలవాణ్ణి, దుష్కర్మలు చేసినవాణ్ణి, నేరస్తుణ్ణి వాటినుండి ప్రక్షాళన చెయ్యలేదు. చెడు మాటలు పలకని, చెడ్డపనులు చెయ్యనివాడికి ఏ నీరైనా గయవంటిదే." నైతికత పంచశీలను పాటించటంపై ఆధారపడివుంటుంది. చెడు పనులు చేసే అవకాశం, అవసరం వున్నా వాటిని తిరస్కరించేవారు మాత్రమే శీలాన్ని పాటించగలరు.

బౌద్ధధర్మంలో నైతికప్రవర్తన చాలా ప్రాముఖ్యత గలది. నిర్వాణాన్ని చేరటానికి సోపానాలైన పారమిత (perfection)ల్లో శీలపారమిత చాలా ముఖ్యమైంది.

బుద్ధిస్టు ఐన ప్రతి ఒక్కరు తన తోటివారికి ధర్మాన్ని బోధించాలి. అశోకుని ఒక శాసనంలో "అన్ని దానాల్లో ధర్మదానం గొప్పది, స్నేహాలన్నింటిలో ధర్మంలో స్నేహం గొప్పది" అని ప్రకటించబడింది. ధర్మాచరణలో నడిచేవారికి దాన్ని యితరులకు అందించటం ఒక బాధ్యత అవుతుంది. ధర్మాన్ని బోధించటంలో మహోపాధ్యాయుని ఉద్దేశం దాన్ని విశ్వవ్యాపితం చెయ్యాలనేదే. శీలభద్రుడు యువాక్ చువాంగ్‌ను యిలా కోరాడు: "నువు బుద్ధభగవానునికి కృతజ్ఞత చూపాలనుకుంటున్నావు; కాబట్టి నువ్వు సద్ధర్మాన్ని ప్రచారం చెయ్యి; అది నీ బాధ్యత. జయాపజయాలతో సంబంధం లేక మహోపాధ్యాయుని బోధనల్ని ప్రజలందరికి అందించు."

తర్కసహితంగా ఆలోచిస్తే, సమ్యక్ కర్మ యొక్క కొనసాగింపే సమ్యక్ జీవనం. బోధిని పొందగోరువారు ఏదో ఒక వ్యాపకంతో జీవిస్తుండటం సహజం. ప్రతి ఒక్కరు తమ సామర్థ్యానికి అనువైనపనిని చేస్తూ, తన తోటివారికి కూడా వుపయోగపడుతుండాలి. అలా చేపట్టే వృత్తి యితరులకు హాని కలిగించనిదై వుండాలి. అబద్ధాలు, మోసంతో కూడిన వృత్తులు - జాతకాలు చెప్పటం, అద్భుతశక్తుల ప్రదర్శన, జంతుబలులు నిర్వహించటం, మంత్రతంత్ర విద్యలు - చేపట్టకూడదు. అదేవిధంగా మత్తు పానీయ, ఆయుధ వ్యాపారాలు చెయ్యకూడదు.

అన్నిరకాల క్లేశాలను* అంతమొందించే ధర్మాచరణ పాటించేవారు కేవలం బాహ్యప్రవర్తన మార్చుకోవటమేగాక మనోక్లేశాలనూ తొలగించుకోవాలి. అంతర్గతమైన యీ ప్రక్షాళన సరైన కృషి, సరైన మానసిక సమతతోనే సాధ్యమౌతుంది. సరైన కృషి అంటే దురాలోచనలు తలెత్తకుండా అదుపులో వుంచటం, యిప్పటికే తలెత్తినవాటిని తొలగించటం; మంచిపనులు చేయ సంకల్పించటం, యిప్పటికే వున్న మంచిని పెంపొందించటం. తనపై తాను అదుపు సాధించగలిగే దృఢసంకల్పాన్ని వృద్ధిచెయ్యటం సమ్యక్ వ్యాయామం యొక్క అసలు వుద్దేశం. మనల్ని నిరంతరం వెంటాడే అవాంఛిత లక్షణాలను తొలగించేటందుకు ఐదు విషయాల్ని క్రమపద్ధతిలో ప్రయత్నించమని శాక్యముని సలహా యిచ్చాడు. "1) ఒక మంచి భావనను ఆహ్వానించు; 2) చెడు ఆలోచన ఆచరణగా రూపొందటం వల్ల జరిగే అనర్థాన్ని అవలోకించు; 3) చెడు భావనల్ని మొగ్గలోనే తుంచెయ్; 4) తద్వారా కలగబోయే పరిణామాలను విశ్లేషించి దాన్ని ప్రేరేపించేవాటిని తొలగించెయ్; 5) శారీరకపరమైన వత్తిడితో మనసును అదుపు చెయ్."

---

* క్లేశం అంటే మనసులోని మలినం లేదా చెడు లక్షణం

వీటిని దేహదండనగా అర్థం చేసుకోకూడదు.

**ఇంద్రియభావనసుత్తం**లో "మీ గురువు ఇంద్రియాలను వృద్ధిపరచటానికి చెప్పే పద్ధతి ఏమిటి?" అని బుద్ధుడు పరాశరుని శిష్యుణ్ణి ప్రశ్నిస్తాడు. "కంటితో దేన్నీ చూడకుండా, చెవులతో ఏదీ వినకుండా" అని వచ్చిన జవాబు విని బుద్ధుడు యీ విధంగా చెప్పాడు: "అలా అయితే గుడ్డివారికి, చెవిటివారికి అందరికంటే మెరుగైన యింద్రియజ్ఞానం వుండి వుండాలి." దీనితో నిరుత్తరుడైన యువకుని, ప్రక్కన వున్న ఆనందుని చూసి, అత్యుత్తమమైన యింద్రియభావన అష్టాంగమార్గంలో ఎలా వుంటుందో వివరిస్తాడు. ఈ మార్గంలో నడిచేవారు ప్రతిక్షణం యింద్రియజ్ఞానాన్ని విచక్షణతో గమనించి అది సుఖాన్ని కలిగిస్తుందా లేక బాధను కలిగిస్తుందా అని తెలుసుకుంటారు. అది మానసికమైందని, నిరంతరం మారుతుంటుందని తెలిసి ఉపేక్షాభావంతో ఉంటారు. ఈ విధంగా అన్నిరకాల మానసిక భావనల పట్ల ఎరుకతో వుంటూ, విశ్లేషిస్తూ వారి చేతన మనసును అదుపుచేసే శక్తిని పొందుతుంది.

ఉత్సాహంతో నిలకడగా ప్రయత్నించటం ద్వారానే ఆత్మనిగ్రహం పొందగలం. 'ఆత్మవిశ్వాసం, వీరోచిత ప్రయత్నం లేకుండా సంబోధిని పొందలేమ'ని 'బోధిచర్యావతారం' చెబుతుంది. ఒకవిధంగా చెప్పాలంటే బోధిని పొందగోరే వ్యక్తి ఒక సైనికునిలా వుండాలి. సాహసం, దృఢత్వం, వ్యక్తిగత ప్రయోజనాల్ని త్యజించటం, క్రమశిక్షణ వంటి లక్షణాలు సైనికునికి ఎంత అవసరమో బోధినాశించేవారికి అంతే అవసరం. క్రోధం, అసూయ, అహంభావం, లౌకిక సుఖవ్యామోహాలను అంతమొందించాలంటే అప్రమత్తత కలిగిన నిరంతర కృషి తప్పదు. సలహాలు సూచనలు ఉపకరించవచ్చు, నైతికసంకల్పం ప్రేరణ నివ్వవచ్చు. కాని శక్తివంతంగా, నిలకడగా ప్రయత్నించటం అనేది అలవాటుపై ఆధారపడి వుంటుంది. అలవాటు మన ఆలోచనల్ని క్రమబద్ధీకరించటమేగాక, చేసే పనిని నిలకడగా కొనసాగించటానికి దోహదపడుతుంది. నిజమైన నైతిక జీవనం, మనోవికాసం పొందే దృష్టితో ప్రతినిత్యం ఎరుకతో పనిచెయ్యటంపై ఆధారపడివుంటుంది. కాబట్టి కేవలం సలహా సంప్రదింపులతో సరిపెట్టక మన పరిసరాల్ని, ఉద్దేశాలను క్రమంగా మార్చుకుంటూ సంకల్పాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. అనుభవం, శిక్షణ, జ్ఞానసముపార్జన ద్వారా మాత్రమే ఆత్మవిశ్వాసాన్ని పొందగలం. సంకల్పబలానికి విడిగా అస్థిత్వం లేదని, అది మనం ఎంచుకున్న లక్ష్యంపై ఆధారపడివుంటుందని గుర్తుంచుకోవాలి.

బౌద్ధధర్మం సంకల్పాన్ని దానికదే స్వతంత్రమైందిగా చూడదు. సంకల్పం అనేక శారీరక, మానసిక స్థితిగతుల సంక్లిష్ట మిశ్రమ ఫలితంగా ఏర్పడే మానసికస్థితి; ఆయా శారీరక మానసిక స్థితులు ఒక చర్య జరపటానికి లేదా నిరోధించటానికి సంయుక్తంగా

చేసే వ్యక్తీకరణ. పుట్టుక (heridity) పరిసరాల ప్రభావం, విద్య, అనుభవ సమ్మేళనంగా రూపొందే మనిషి మానసిక నైతిక లక్షణాలు దీనిలో ప్రధానపాత్ర వహిస్తయ్. ఆలోచన రూపంలో మనిషి చేసే ప్రయత్నం ద్వారా మానసికపరమైన చర్యలో కొంతభాగం మాత్రమే చైతన్యంగా రూపొందుతుంది. తద్వారా మనిషి చేసే చర్యలు భావోద్రేకాలు, భావనలు, కల్పనల ద్వారా నేరుగా ప్రభావితం అవుతయ్. కనుక 'ఎంపిక' అనేది యితర విషయాలపై ఆధారపడే ఫలితమేగాని, దానికదే ఒక కారణం కాదు. మన నిర్ణయాలు రకరకాల ఉద్దేశాల వల్ల ప్రభావితం అవుతయ్. వాటిలో అన్నిటికంటే బలమైంది పై చేయి సాధిస్తుంది. మనం ఎంచుకునేవి మనం ఆశించే సుఖం, వదిలించుకోవాలనే బాధల వల్ల ప్రభావితం అవుతాయనే విషయం ఎవరు కాదనగలరు? తనకు బాధ, దుఃఖం కలిగించేదాన్ని ఎవరూ కోరుకోరు. **బోధిచర్యావతారంలో** చెప్పినట్లు మనిషి కోరుకున్న విధంగానే అంతా జరిగితే, యీ లోకంలో దుఃఖమనేదే వుండదు. మానవుని నైతికజీవనం ప్రకృతి, సమాజంతో విడదీయలేనిది.

స్వేచ్ఛాసంకల్పం (free will) అధిభౌతికవాదుల, మతవాదుల వూహల్లోనే తప్ప దానికి నిజంగా అస్థిత్వం లేదు. వారు కూడా యితరుల చర్యలకు ఏదో కారణం వుంటుందనే భావిస్తారు. అలా కానప్పుడు వారు మనుషులు చేసే చర్యలను ప్రభావితం చెయ్యటానికి ప్రయత్నించరు. అంటే కొన్ని కారణాలు కొన్ని చర్యలకు దారితీస్తాయని వారు నమ్ముతారు. ప్రతి ఒక్కరూ మనుషులు నియమిత పరిస్థితుల్లో నియమితమైన ప్రవర్తన ప్రదర్శిస్తారని, దాన్ని ఏదో మేరకు ముందుగా అంచనా వెయ్యవచ్చనే నమ్మకంతోనే ప్రవర్తిస్తారు. దీన్ని నిరాకరించటమంటే మనిషికి, మనిషికి మధ్య సంపర్కాన్నే నిరాకరించటం. ఒక వ్యక్తి నియమిత పరిస్థితుల్లో, నియమిత పద్ధతిలో ప్రవర్తించటానికే మొగ్గు చూపుతాడని జనం అనుకుంటారు. ఎందుకంటే వారి అనుభవంలో ఆ వ్యక్తి అదేరకమైన పరిస్థితుల్లో అదేవిధంగా ప్రవర్తించటం, లేదా వివిధ వ్యక్తులు ఒకే పరిస్థితుల్లో ఒకే రకంగా ప్రవర్తించటం చూసివుంటారు.

వ్యక్తి సంకల్పం స్వతంత్రమైనదైతే అతని ప్రవర్తనను విద్య ద్వారా మార్చటం సాధ్యం కాదు. మనిషి ప్రవర్తన అనేక లక్షణాల కలయికని, దాన్ని ప్రయత్నపూర్వకంగా మార్చటం సాధ్యమేనని అనుభవం చెబుతుంది. ఈ విషయమై తథాగతుడు చెప్పిన మాటలు ఎంతో విలువైనవి. ఆయన యిలా అన్నాడు: "కారణం లేకుండానే మనిషిలో ఆలోచనలు వచ్చి పోతుంటాయని భావించే శ్రమణులు, బ్రాహ్మణులు దారుణంగా మోసపోతారు... విద్యవల్ల కొన్ని భావాలు ఉత్పన్నమవటం, మరికొన్ని నిరాకరించబడటం జరుగుతుంది."

సంకల్పం తగిన కృషి ద్వారా పెంపుదల, అదుపుచెయ్యబడుతుంది. కాని భావం, సంకల్పం, ఆలోచన ఒకదానితో మరొకటి స్వతంత్రంగా వుండవు కనుక సరైన కృషి

సరైన ఆలోచనతో ముడిపడి వుండక తప్పదు. అందువల్ల మనసును సరైన ఆలోచనలో నడిపించాలి. కుశల, అకుశల కర్మలకు దారితీసే భయం, దుఃఖం ఉత్పన్నం చేసేది మనసే. భగవానుడు చెప్పినట్లు 'సరైన దిశానిర్దేశం లేని మనసుతో ఎంత నియమబద్ధంగా, ఎంత దీర్ఘకాలం కొనసాగించిన ఆచరణ ఐనా అది నిష్ప్రయోజనమే."

**చిత్తం యొక్క అధీనంలో ధర్మం, ధర్మం యొక్క అధీనంలో బోధి వుంటాయి.**

**"మనోస్థితులన్నింటికి మనసే మూలం**
**మనసే ముఖ్యం, మనసు మయం**
**కలుషితమైన మనసుతో**
**పలికిన మాటలు, చేసిన చేతలు ఫలితంగా**
**దుఃఖం, ఎద్దుగిట్టలను అనుసరించే**
**బండిచక్రంలా, వెంట తరుమును."**

**"మనోస్థితులన్నిటికి మనసే మూలం**
**మనసే ముఖ్యం, మనసు మయం**
**నిర్మలమైన మనసుతో**
**పలికిన మాటలు, చేసిన చేతలు ఫలితంగా**
**సుఖసంతోషాలు నీడలా వెన్నంటిసాగును."**

కావున చెడు ఆలోచనల బారిన పడకుండా మనసును పరిరక్షించాలి. మనిషి నిరంతరం మంచి ఆలోచనల్ని సాధన చెయ్యాలి. ఏది చెయ్యదగిందో, ఏది చెయ్యకూడనిదో తెలుసుకోవాలి. ఎల్లప్పుడు శరీరం, మనసు చేసే చర్యల పట్ల గమనికలో వుండాలి. ప్రజ్ఞ, అంతఃదృష్టి కలిగినప్పుడే సరైన ఆలోచన చెయ్యటం సాధ్యం. అంతః దృష్టి అంటే మానవుని జీవితంలో అత్యంత విలువైన సత్యాలసారాన్ని గ్రహించగలిగే శక్తి. ప్రజ్ఞ అంటే కార్యకారణ నియమాన్ని, మనోశరీర నిజస్వభావాన్ని, వేదనల్ని, అస్థిత్వంలోని అన్ని విషయాల నిజస్వరూపాన్ని 'ఉన్నది ఉన్నట్లు' (యధాభూత) గ్రహించటం. ప్రకృతిలోని ప్రతిదీ వివిధ కారణాల ఫలితంగానే అస్థిత్వంలోకి వస్తుంది; అస్థిత్వాన్ని పొందిన ప్రతిదీ మార్పుచెందక తప్పదు; జీవాత్మ, పరమాత్మ అనేవి లేవు; అవిద్య కారణంగానే జనులంతా శారీరక, మానసిక దుఃఖాలు అనుభవిస్తున్నారు. ఈ జ్ఞానం బోధిసత్వునిలో సకలజనుల పట్ల కరుణ, మైత్రిని మేల్కొల్పుతుంది. వారిని దుః ఖంనుండి విముక్తి చెయ్యటానికి నిరంతరం శ్రమించేటందుకు పురికొల్పుతుంది.

మనిషి విముక్తి చెందాలంటే బుద్ధి పరిపక్వత తప్పనిసరని చెప్పిన ఖ్యాతి బుద్ధుడిదే. బౌద్ధంలో శీలం, ప్రజ్ఞ ఒకదాన్నుండి మరొకటి విడదీయరానివి. కార్య–కారణ సిద్ధాంతాన్ని

(ప్రతీత్య సముత్పాదం) అర్థం చేసుకోకుండా ఎవరూ బోధిని ఆశించలేరు. ఈ విషయంలో బౌద్ధధర్మం మిగిలిన అన్ని మతాలకు భిన్నమైంది. దైవిక మతాలన్నీ కొన్ని ప్రతిపాదనలతో మొదలవుతయ్. జ్ఞానం అభివృద్ధి చెందే క్రమంలో యీ ప్రతిపాదనల్లో వైరుధ్యం పొడచూపగానే 'ఎవరైతే జ్ఞానాన్ని వృద్ధి చేస్తారో వారు దుఃఖించక తప్పద'ని పశ్చాత్తాపం ప్రకటిస్తయ్. బుద్ధిజం ప్రతిపాదనలతో ప్రారంభించదు. అది వాస్తవాలపై స్థిరంగా నిలబడుతుంది, కాబట్టి అది ఎప్పుడూ జ్ఞానాన్ని తిరస్కరించదు. కొందరు అద్వైత వేదాంతాన్ని బౌద్ధధర్మం సరసన నిలబెట్టే ప్రయత్నంచేశారు. ఎందుకంటే అద్వైతం కూడా విముక్తికి జ్ఞానమే మార్గమని చెబుతుంది కనుక. కాని వేదాంతం చెప్పే జ్ఞానం, బౌద్ధం చెప్పే ప్రజ్ఞ పూర్తిగా భిన్నమైనవి. ప్రజ్ఞ అంటే పరిశీలన, అనుభవంపై ఆధారపడిన తర్కబద్ధ జ్ఞానం. వేదాంతం చెప్పే బ్రహ్మజ్ఞానానికి దీనితో సంబంధం లేదు. వేదాలు చెప్పాయి కాబట్టి సృష్టికి మూలం పరబ్రహ్మ అని ఒప్పుకోవాలి, దీనికి పరిశీలన, అనుభవంతో పనిలేదు.

జ్ఞానం, ప్రజ్ఞ ఎంతో విలువైనవి ఐనప్పటికి, అవి మనసులో అలజడి సృష్టించకుండా అదుపు చెయ్యాలి. కావున బోధిని ఆశించేవారు ప్రజ్ఞను పెంపొందించటంతో పాటు మనసును నిశ్చల సమతాస్థితిలో ఉంచే **ధ్యానాన్ని** కూడా సాధన చెయ్యాలి. **సమ్యక్ సమాధి** మాత్రమే మనసును ఆందోళన రేపే స్థితినుండి దూరం చేసి సమతాస్థితిలో వుంచగలదు. జీవిత వాస్తవాలను సమున్నత ప్రమాణాలపై ఆధారపడి శోధించే **ధ్యానం** బుద్ధిజంలో చాలా ప్రధానమైంది. విముక్తి కోసం ప్రార్థనను ఒక మార్గంగా అంగీకరించదు. మనిషి చేసే చెడుపనుల ఫలితం అభ్యర్థన, ప్రార్థనవల్లగాక, చిత్తశుద్ధితో, పశ్చాత్తాపం వల్లనే నివారించటం సాధ్యం. శిక్ష తప్పదనే భయంతో గాక సత్యం, సత్ప్రవర్తన పట్ల గల ప్రేమ, గౌరవంతోనే మార్పు జరగాలి. అంతరంగాన్ని సూక్ష్మస్థాయిలో శోధించి, మనిషి తనను తాను లోతుగా అర్థం చేసుకోటానికి ధ్యానం ఒక సాధనం. **చంద్రదీ సమాధి సూత్రం** ధ్యానసాధన ప్రయోజనాలను క్రింది విధంగా వివరించింది

1. **నియమబద్ధంగా ధ్యానాన్ని సాధన చేసే వ్యక్తిలో అలజడి తగ్గి జ్ఞానేంద్రియాలు సమతాస్థితిని పొందుతాయి. తనకు తెలియకుండానే సాధన ఆనందకరంగా, అలవాటుగా మారుతుంది.**
2. **సాధకుని హృదయం కరుణ, మైత్రితో నిండి పాపచింతన నుండి స్వేచ్ఛను పొంది జనులందరి పట్ల ఆదరణ పెంపొందుతుంది.**
3. **క్రోధం, ద్వేషం, అసూయ తదితర విషపూరిత ఉద్వేగాలు క్రమంగా మనసునుండి దూరమవుతాయి.**

4. **మనోక్లేశాలపై నిశితమైన దృష్టి సారించటం ద్వారా ధ్యానం వాటిని మనసులో చొరబడకుండా నిరోధిస్తుంది.**
5. **ధ్యానసాధకుని హృదయం పవిత్రత, ప్రశాంతతతో నిండి చవకబారు, నీచమైన కోరికలకు లొంగదు.**
6. **మనసు సమున్నతమైన ఆలోచనలపై కేంద్రీకరించబడి అన్ని రకాల బంధాలు, అహంభావం దూరం అవుతాయి.**
7. **సాధకుడు వ్యక్తిగత ప్రతిష్ఠలోని డొల్లతనాన్ని గ్రహించినా, అనైతికవాదం వలలో చిక్కుకోడు.**
8. **చావు పుట్టుకల చిక్కుముడులు ఎంత తికమకపెట్టినా, సాధకుడు వాటినుండి విముక్తి పొందే మార్గం స్పష్టంగా తెలుసుకుంటాడు.**
9. **ధర్మసాగరం లోతును అందుకున్న సాధకుడు గంభీరమైన బుద్ధప్రజ్ఞలో నిశ్చలంగా నిలిచివుంటాడు.**
10. **అల్పమైన కోర్కెలకు చలించకపోవడంవల్ల బంధవిముక్తుడై స్వేచ్ఛగా విహరించ గలుగుతాడు.**

దీనిద్వారా స్పష్టమయ్యేదేమంటే ధ్యానం రాగ, ద్వేష, మోహ రహితమైన దృష్టితో సమస్త విశ్వాన్ని సాక్షాత్కరింపజేసే తేజోమయమైన మనసును ఆవిష్కరించగలిగే మార్గం.

బుద్ధిస్టులు ఆచరించే **ధ్యానం** అచేతనాస్థితిని పొందేటందుకు కాదు. దీనికి భిన్నంగా, అది చేతనను అలవాటుగా మార్చే అంతరంగ సాధన. దీని ద్వారా అధమస్థాయి స్పందనల్ని క్రమంగా తొలగించి, ఉత్తమమైనవాటిని పెంపొందించగలం. ఇది ఆలోచన, సంకల్పం ద్వారా ప్రవర్తనను క్రమబద్ధం చేసే ప్రక్రియ కాబట్టి, ధ్యానం అంటే అన్ని విషయాల్ని స్థిరచిత్తంతో పరిశోధించి అహంభావాన్ని పెకలించివెయ్యటం. ఇది అస్థిత్వంలోగల ప్రతిదానితో మనసును అనుసంధానించి, తద్వారా ప్రకృతిలో ప్రతి వస్తువు యొక్క సముచిత స్థానాన్ని గుర్తెరిగి, వాటిపట్ల మన చర్యలను సరైన మార్గంలో నడిపించటం. కాబట్టి ధ్యానానికి, తంత్రవాదులు (misticism) చెప్పే అతీంద్రియశక్తుల సాధనకు ఏ మాత్రం పొంతన లేదు. కొన్ని సందర్భాల్లో బౌద్ధధ్యానాన్ని **అనుత్తరయోగ** అని పిలుస్తారు. ఈ కారణంగా దీన్ని బ్రాహ్మణవాదుల **యోగ** అని పొరపడొద్దు. యోగ ప్రధానంగా నైతిక, మేధోపరమైంది. మనసు యొక్క వాస్తవ స్వభావాన్ని, తద్వారా మనిషిని అర్థం చేసుకోవటమే దీని అసలు లక్ష్యం. బౌద్ధ ధ్యానం యొక్క ఉచ్ఛస్థితిలో సాధకుడు మైత్రి, కరుణ వంటి పారమితలను* సాధన చేస్తాడు. కాని బ్రాహ్మణయోగి పరమాత్మలో ఐక్యం కావాలని ప్రయత్నిస్తాడు.

ధ్యానసాధన ప్రజ్ఞతో జోడించబడ్డప్పుడు మనసు ఆందోళన, అలజడి నుండి స్వేచ్ఛ పొందటమేగాక, అది అహంకారానికి మూలమైన ఆత్మమోహం నుండి కూడా విముక్తం అవుతుంది. అహంకారాన్ని అంతమొందించటం వల్ల బోధిసత్వుడు అన్నిరకాల దు:ఖం, ఆటంకాల నుండి విముక్తుడౌతాడు. ఆత్మనిగ్రహం, మనోబలంతో జనులందరి పట్ల కరుణామయ హృదయంతో సత్కర్మలు చేస్తూ ఆనందాన్ని పొందుతాడు.

అష్టాంగమార్గాన్ని సాధన చేసేవారికి ఎదురయ్యే ప్రతిబంధకాలు లేదా అడ్డంకులు (సంయోజనలు) పది వున్నయ్. వీటిలో అన్నిటికంటే ముఖ్యమైంది శాశ్వతమైన ఆత్మ వుందనే నమ్మకం (సత్కాయదృష్టి). ఈ భ్రమాజనితమైన భావన అనేక రూపాల్లో వుంటుంది. కొన్నిసార్లు అది శరీరాన్ని ఆత్మగా భావిస్తుంది. కొన్నిసార్లు మరణసమయంలో శరీరాన్నుండి విడిపోయే అదృశ్యశక్తిగా, మరికొన్నిసార్లు మనిషిని పట్టి పీడించే వ్యక్తివాదంగా వుంటుంది. అది ఏ రూపంలో వున్నా, మనిషి తాను వివిధ స్కంధాల (భౌతిక, మానసిక) సమ్మేళనం మాత్రమేనని తెలుసుకోనంత కాలం సాధనలో ప్రగతి సాధించటం సాధ్యపడదు. మనిషి మరణానంతరం స్వర్గం లేక నరకం చేరే శాశ్వత ఆత్మ లేదని తెలిసినప్పుడు సుఖవాదానికి చేరువయ్యే ప్రమాదం పొంచి వుంటుంది. అందువల్ల పరిపూర్ణ వికాసాన్ని సాధించటంలో నమ్మకం ఎంతో అవసరం. ఈ మార్గంలో తొలిదశలో వున్న సాధకునికి కలిగే మరో ప్రతిబంధకం కుశంక (విచికిత్స). ప్రతిదాన్నీ శంకించే విచికిత్స ఒక మానసిక, నైతిక జాడ్యంగా మారి సాధకుని ప్రయత్నాలన్నిటిని నీరుగార్చుతుంది. కుశంక (విచికిత్స) ఒక ఆలోచనా ధోరణి కాదు, అది ఒక మానసిక బలహీనత. ఈ జాడ్యం మనిషిని కోలుకోనివ్వదు; అది అంతమొందిస్తుందేగాని జవసత్వాలనివ్వదు. ఒక నూతనమైన ఆదర్శం, సమున్నతలక్ష్యంలో వుండే విశ్వాసం మాత్రమే మనిషిని ముందుకు నడిపిస్తుంది. అష్టాంగమార్గం మనిషి ముందుంచే లక్ష్యం సంపూర్ణంగా తెలియాలంటే ఆ మార్గంలో ప్రవేశించాలి. ఇందుకోసం మనపై మనకు అచంచలమైన విశ్వాసం వుండాలి.

పుణ్యం వస్తుందని యధావిధిగా చేసే ఆచారాల్లో నమ్మకం మూడవ సంయోజనం. వైదికమతం యిటువంటి ఆచారాలకు పుట్టినిల్లు. తదనంతర కాలంలో యీ మూఢాచారాలు బలపడి మతం అంటే అర్థం కాని మాయావాదం అనేస్థితికి దిగజారింది. మానవాతీత శక్తుల్లో విశ్వాసం లేకపోవటంవల్ల బౌద్ధధర్మంలో మొక్కుబడిగా చేసే ఆచారాలకు తావు లేదు. ఎంత నిష్ఠతో యిటువంటి ఆచారాల్ని పాటించినా రాగ, ద్వేష, మోహాలనుండి బయటపడటం సాధ్యం కాదు. గంగలో ఒక్కసారి మునిగితేనే పాపాలు నశించి పుణ్యం వచ్చేట్లయితే, ఆ నదిలో రోజూ చేపలు పట్టే జాలరులకు మించి పుణ్యాత్ములు వుండరు, యిక రాత్రి పగలనక గంగలో యీదులాడే చేపలు

తదితర జీవుల విషయం చెప్పనవసరం లేదు.

పైన చెప్పిన మూడు ప్రతిబంధకాల్ని అధిగమించటం మహా అష్టాంగమార్గంలో మొదటి దశ, **శ్రోతాపన్నా**. ఈ దశను చేరుకున్నవారు తిరోగమించరని హామీ ఏదీ లేదు. కాబట్టి కామసుఖాలు, ద్వేషభావన అనే ఆటంకాలను దాటాలి. దీనితో సాధకుడు రెండవ దశ, **సకదగామి** చేరుకుంటాడు. అప్పుడతను సరైన దిశలో పయనించి రాగ, ద్వేషాలను సమూలంగా అంతమొందించి **అనాగామి** అవుతాడు. ఇక అతను వెనుదిరిగే అవకాశం వుండదు కాని, అధిగమించాల్సిన అవాంతరాలు యింకా మిగిలివుంటయ్. అతను రూపరాగం, అరూపరాగాలను యిహ-పర-లోక సుఖాలపట్ల వుండే ఆరాటాన్ని (తృష్ణ) జయించాలి. అవిద్యను విడనాడి **యథాభూత** జ్ఞానాన్ని పొందాలి. ఈ బంధాలన్నీ ఛేదించి అష్టాంగమార్గంలో స్వేచ్ఛగా పయనించే వ్యక్తికి సర్వం దాని వాస్తవసంబంధాల్లో ఆవిష్కృతమౌతుంది. అటువంటి వ్యక్తి పరిపూర్ణతను పొంది **అర్హతుడు** అవుతాడు, నిర్వాణ సుఖాన్ని పొందుతాడు. సమ్యక్ సంబోధిని పొందిన అర్హతుడు ప్రపంచం పట్ల తిరస్కారభావంతో వుండడు, అది అతనికి సమత, శాంతితో కూడిన బోధి విలసిల్లే ప్రపంచంగా కనిపిస్తుంది.

బౌద్ధధర్మం సంబోధిని అత్యున్నత లక్ష్యంగా చెప్పిన కారణంగా, 'అది మేధోపరమైన విషయాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి శీలాన్ని (సత్ప్రవర్తన) అలక్ష్యం చేసిందనే విమర్శ ఒకటుంది. మహోన్నత అష్టాంగమార్గాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే పైవిమర్శ ఆధారరహితమైందని తెలుస్తుంది. ఆచార్య నాగార్జునుడు తన **సుహృల్లేఖ** గ్రంథంలో 'శీలగుణం అన్ని రకాల ప్రతిభకు పునాది వంటిది' అని చెప్పాడు.

మహారాజు ప్రసేనజిత్తుతో బుద్ధభగవానుడు యిలా చెప్పాడు: "జ్ఞానం కంటే శీలం ప్రధానమైనది. విచ్ఛిన్నకర శక్తులనుండి విముక్తిని సాధించటానికి వుపయోగపడని జ్ఞానం ఎంత నేర్చుకున్నా ఏం లాభం? ఒక సత్యాన్ని తెలుసుకోవటం, దాన్ని ఆచరించటానికి లోతుగా అర్థం చేసుకోవటం, యిదే విముక్తికి మార్గం." అంతిమ పరిశీలనలో **బోధిచిత్తం** యొక్క సారాంశం రెండు ప్రధానమైన గుణాలుగా చెప్పవచ్చు. ఒకటి ప్రజ్ఞపారమిత, రెండవది శీలపారమిత*. ఈ రెండింటి ఆధారంగానే మిగిలిన పారమితలు రూపొందుతయ్. ప్రారంభంలో యివి పరస్పరపూరకాలుగా వున్నా, తుది దశలో రెండూ ఒక్కటిగా రూపొందుతాయి. అత్యున్నతమైన జీవితానికి మేధోవికాసం తప్పనిసరి. మేధోవికాసాన్ని పొందటానికి కరుణ, మైత్రి, శీలం కూడా అంతే అవసరం.

---

* పారమిత: అత్యున్నత స్థితి లేదా దశ

## పదో అధ్యాయం

# అంతుచిక్కని ప్రపంచం

ప్రపంచమంతా చర్య (కర్మ)ల ఫలితమే (కర్మజం లోకవైచిత్ర్యం). ప్రతిదీ నిరంతరం మార్పుచెందుతూ వుంటుంది. సృష్టి లేదు, నాశనం లేదు; ఆది లేదు అంతం లేదు. అయినా ఏదీ కారణం లేకుండా జరగదు. ఏదీ తనంతట తానే అస్థిత్వంలో వుండదు. ప్రతిదీ మరొకదానిపై ఆధారపడుతుంది, యీ ఆధారమైన మరొకటి యింకొకదానిపై ఆధారపడివుంటుంది.

ప్రతి మార్పు అనేక పరిస్థితులవల్ల నిర్ణయించబడుతుంది. వీటిలో అత్యంత ప్రధానమైనదాన్ని కారణంగా చెబుతాం. నిజానికి ఏ మార్పుకైనా కారణం (ప్రత్యయం) అందుకు అవసరమైన అన్ని పరిస్థితుల సమాహారం. వీటిలో అత్యంత ప్రతిభావంతమైన దాన్ని హేతువు లేదా కారణం అంటాం. ఒక విత్తనం మొక్కగా మారటంలో విత్తనాన్ని హేతువు అని, దానికి అవసరమైన నేల, నీరు, గాలి, వెలుతురును దోహదకారులని పిలుస్తాం. అదేవిధంగా విజ్ఞానబీజం (విత్తనం) అనేది వ్యక్తి (నామ-రూపం) రూపొందటానికి మూలం (హేతువు) అయితే తల్లిదండ్రులు, పరిసరాలు దోహదకారులు.

ఏదీ దానంతటదే జరగదు. ప్రతి మార్పు మరొకదానితో సంబంధం కలిగివుండి పలితంగా మూడవదానికి కారణమౌతుంది. ప్రపంచంలో జరిగే మార్పులన్నీ కొద్దో గొప్పో యితరవాటిపై ఆధారపడతయ్. జీవితానుభవం అంతటా కనిపించే యీ కార్యకారణ అల్లిక సద్ధర్మంలో **ప్రతీత్యసముత్పాదం** అని పిలవ బడుతుంది. 'ఆది అంతాలు లేక విశ్వంలోని ప్రతిదీ యితరవాటి ఆధారంగా రూపొందిందే'నని చెప్పే ప్రతీత్య సముత్పాదాన్ని అర్థం చేసుకోవటం బౌద్ధధర్మంలో అత్యంత ప్రాముఖ్యత గల విషయం. "ఎవరు ప్రతీత్యసముత్పాదాన్ని గ్రహిస్తారో వారు ధర్మాన్ని గ్రహిస్తారు; ఎవరు ధర్మాన్ని అవగతం చేసుకుంటారో వారు తథాగతుణ్ణి అవగతం చేసుకుంటారు."

ప్రతిమార్పుకు ఒక కారణం వుండి, ఆ కారణానికి మరొకటి కారణమైతే, మరి అంతిమంగా మార్పులేని మొట్టమొదటి కారణం ఏదీ లేదా? దీనికి బుద్ధుడు చెప్పిన సమాధానం యిది: "ఒకడు 'యీమె నా తల్లి, యీమెకు తల్లి వుంది, ఆ తల్లికి తల్లి వుంది' అంటూ లెక్కించుకుంటూ ఎంత దూరం వెళ్ళినా దీనికి అంతం వుండదు. ఎందుకంటే ఆది, అంతం లేనిది యీ ప్రపంచ-ప్రక్రియ." మరో సందర్భంలో ఆయన యిలా అన్నాడు: "ఒక పండు దానంతటదే పుట్టదు, లేక మరొకదాన్నుండి వూడిపడదు. దాని పుట్టుకకు మూలమైన పరిస్థితుల వల్ల అది అస్థిత్వంలోకి వచ్చి, ఆ పరిస్థితులు

అంతరించినప్పుడు అది నశిస్తుంది." కాబట్టి మొదటి కారణం అనేది లేదు. సైన్సుకు మొదటి కారణం అనేది తెలియదు. హేతుబద్ధమైన పరిశీలనపై ఆధారపడి దీన్ని నిరూపించగల శాఖ ఏదీ సైన్సులో లేదు. కాబట్టి ప్రతీత్యసముత్పాదంకు ప్రారంభంగాని, అంతంగాని లేదు; అది ఒక ప్రవాహంలా నిరంతరం కొనసాగుతూనే వుంటుంది. దీనిలో జీవాత్మగాని, దీన్ని పైనుండి నడిపే పరమాత్మగాని లేదు.

మరి అటువంటప్పుడు ఈశ్వరుడు (దేవుడు) లేడా? అనాథ పిండకునితో జరిగిన ఒక సంభాషణలో బుద్ధుడు యీ విధంగా చెప్పాడు: "ఈశ్వరుడు యీ ప్రపంచాన్ని సృష్టించివున్నట్లయితే, అతన్నుండే అన్నీ వచ్చివుంటే అవి మార్పు చెందటం, నాశనమవటం జరగదు. లోకంలో బాధలు, దుఃఖం వుండేవి కావు. అలాగాక మనుషుల్లో వుండే సుఖదుఃఖాలు, రాగద్వేషాలు ఈశ్వరుని సృష్టే ఐతే ఆయన కూడా సుఖదు:ఖాలకు, రాగద్వేషాలకు అతీతుడు కాడు. ఇవన్నీ కలిగినవాడు పరమాత్మ ఎలా అవుతాడు? ఈశ్వరునిచే సృష్టించబడి, ఆయన అదుపు ఆజ్ఞల్లోనే సర్వం జరుగుతుంటే పుణ్యకార్యాలు చెయ్యాల్సిన అవసరం ఏముంది? దుఃఖాన్ని, బాధల్ని ఈశ్వరుడు సృష్టించనట్లయితే మిగిలిన వాటిని ఆయనే సృష్టించాడని ఎలా చెప్పగలం? ఈశ్వరుడే అందర్నీ పుట్టించి వుంటే ఆయన్ని అందరూ సహజంగానే పూజించాలి. కాని అవసరమైనప్పుడు మాత్రమే ఎందుకు ప్రార్థిస్తున్నారు. భిన్నమైన దేవుళ్ళను ఎందుకు పూజిస్తున్నారు? ఈ విధంగా హేతుబద్ధంగా చూసినప్పుడు ఈశ్వరుడనే భావన తప్పని నిరూపించబడుతుంది." –అశ్వఘోషుని బుద్ధచరిత.

మనం నివసించే యీ ప్రపంచంలో ప్రతిదీ ఒక నియమానుసారం జరగటం లేదా? ఈ నియమాల్ని రూపొందించటానికి ఒక విధాత వుండాలి కదా! అని అడగటం సహజం. దీన్ని గురించి **బోధిచర్యావతారం**లో యిలా వుంది: "మొక్కను, ముల్లును తయారు చేసిందెవరు? పూలను అందంగా తీర్చిదిద్ది రంగులద్దిందెవరు? పక్షికి ఎగరటం, చేపకు యీదటం నేర్పిందెవరు? అది వాటి **స్వభావం!** అంతేగాని అది ఒకరి ఇచ్ఛ (కోరిక)తో జరుగుతున్న సృష్టి కాదు. సృష్టే లేనప్పుడు సృష్టికర్త లేనే లేడు."

ప్రకృతిలో జరిగే సంఘటనల క్రమానికి ఏ ప్రకృతి నియమం కారణం (హేతువు) కాదు. సంఘటనల్లో జరిగే మార్పు ఏ పరిస్థితులపై ఆధారపడి వుంటుందో వివరించటమే ప్రకృతి నియమం చేసే పని. 'గురుత్వాకర్షణ నియమంవల్ల వస్తువులు నేలపై పడవు. స్వేచ్ఛగా వదలిన వస్తువుకు ఏమి జరుగుతుందో వివరించటం మాత్రమే దాని పని. ప్రకృతి నియమం ఒక సంఘటన 'యిలా జరగాల్సిందే' అని ఆదేశించదు. అది ఎలా జరుగుతుందో వివరిస్తుంది. కాని ఒక సాంఘికనియమం (చట్టం, రూలు)లో ఆదేశం, బాధ్యత కలగలసి వుంటయ్. మనకు తెలిసిన సందర్భాలన్నిటిలో ఒక నియమం

నిజమైనప్పుడు, సహజంగానే, యికముందు జరగబోయే అదే విధమైన సందర్భాల్లో ఆ నియమం నిజమౌతుందని ఆశిస్తాం. ఎన్ని ఎక్కువ సందర్భాల్లో ఒక నియమం సరైనదని ఋజువైతే అది విశ్వజనీన సత్యం అయ్యే అవకాశం అంత ఎక్కువగా వుంటుంది. ఉదాహరణకు గత ఐదువేల సంవత్సరాలుగా సూర్యుడు ఉదయిస్తున్నట్లైతే, రేపు సూర్యుడు ఉదయిస్తాడని కచ్చితంగా చెప్పే అవకాశం వుంటుంది. ఈ విధంగా ప్రతి ప్రకృతి నియమం మన ఆలోచనల్లో వుండే పరిమితిని తెలియజేస్తుంది.

మన ఆలోచనలకు జ్ఞానేంద్రియాల ద్వారా అందే వాస్తవాలపై ఎంత ఎక్కువ ఆధారపడితే, వాటికి అంత ఎక్కువ పరిమితులు ఏర్పడే అవకాశం వుంది. అలాగే సంఘటనలు క్రితం జరిగినట్లే జరగాలనే ధోరణి బలపడుతుంది. ఈ అర్థంలో మాత్రమే ప్రకృతిలో జరిగే సంఘటనల్లో సారూప్యత వుందని చెబుతాం.

మనిషి చేసే మంచిచెడుల ఆధారంగా వరాలు, శిక్షలు ప్రసాదించే ఈశ్వరుడు లేనప్పుడు నైతిక ప్రవర్తనకు విలువ లేదా! నైతిక నియమాలను పాటించటం మానవజాతికి ఎంతో ప్రాముఖ్యత గల విషయం అనటంలో సందేహం లేదు. దీనికి ఈశ్వరుడు,పై పునర్జన్మలో వుండే నమ్మకంతో పనిలేదు. శాశ్వత జన్మ పరంపర లేనప్పుడు మానవజీవితానికి విలువ లేదనుకునేవాడు, తాను పెరిగి పెద్దయిన తరువాత కూడా ఆటపాటలతో వుండే జీవితాన్ని మాత్రమే కోరుకునే పిల్లవాడివంటివాడు. భవిష్యత్తులో కలగబోయే ఫలితాలను ఆశించి మాత్రమే నీతి నియమాలను పాటించేవారిని సుగుణశీలుడని అనలేం.

నైతికజీవనానికి, దేవుడిపై నమ్మకానికి ఉన్న సంబంధం ఏమిటి? నైతికజీవనం యొక్క సాధికారత, విలువ జీవితవాస్తవాల్లో వుంది కాని భ్రమలు, భయం, ఊహల్లో కాదు. మనిషి తాను జీవించటానికి అవసరమైన మానవసంబంధాలనుండే నైతికజీవనం పుట్టింది. సాటి మనుషులు మాత్రమే తీర్చగల వ్యక్తి భౌతిక, మానసిక అవసరాల్లో అది తన మూలాల్ని కలిగివుంది. లోతుగా పరిశీలిస్తే, మానవుడు జ్ఞానేంద్రియాలపై ఆధారపడిన భావాలు, భావోద్రేకాలు, సంకల్పం ప్రధానంగా గల జీవి. అవి హేతుజ్ఞానాన్ని, ప్రజ్ఞను క్రమంగా అభివృద్ధి చెందిస్తయ్. మన జీవితంలో అత్యంత విలువైనవి అనుకునే భావోద్రేకాలు, సంకల్పం యొక్క మూలం రక్తసంబంధీకులను దగ్గర చేసే సహజాతమైన అనురాగం, అనుబంధంలోనే వుంది.

మనిషి నిజాయితీ, న్యాయం, తోటివారిపట్ల దయ, ప్రేమ, క్షమాగుణం కలిగివుండాలి. చెడ్డపనులు మాని మంచిని పెంపొందించాలి. ఇదంతా దేవుడి పట్ల భయంతోనో, భక్తితోనో కాదు, అవి లేకుండా మానవసమాజం మనుగడ సాధించలేదు కనుక. ఇతరుల్ని నాశనం చెయ్యాలనే స్వార్థగుణం, తనలో వున్న అంతర్గత వైరుధ్యం



గ్రంథాలయ
91932

వల్ల, తనను తానే అంతమొందించుకుంటుంది. జీవితాన్ని పరిపుష్టం చెయ్యాలంటే దాన్ని మరింత సుఖవంతం, సంతోషమయం చెయ్యి; అప్పుడు స్వార్థపరత్వం క్రమంగా బలహీనపడి అంతరించిపోతుంది. మనిషి నిజాయితీతో తన పట్ల, యితరుల పట్ల నిర్వర్తించాల్సిన కర్తవ్యం, మానవజాతి మనుగడ కొనసాగించటానికి అవసరమైన మూలాల్లోనే సానుభూతి, ప్రేమ అనేవి దాగివున్నయ్. మనిషి యితరులతో నిమిత్తం లేకుండా తన సుఖసంతోషాల కోసమే వున్నట్లు అనిపిస్తుంది. చరిత్ర లోతుల్లోకి వెళ్ళి చూస్తే, మనిషి యితరులతో కలిసి మాత్రమే మనుగడ సాగించగలిగిన జీవి అని తెలుస్తుంది. మనిషి మనిషిగా జీవించటానికి ప్రేమ, సహజీవనంతో కూడిన సంఘజీవితం తప్పనిసరి. ఒంటరిగా వున్న మనిషి మనిషి కాలేడు.

అత్యధిక సంఖ్యలో ప్రజలు దేవుడున్నాడని నమ్ముతున్నప్పుడు, దేవుణ్ణి ఎలా నిరాకరించగలం అనేది ఒక వాదన. పరిశీలిస్తే యీ వాదనలోని డొల్లతనాన్ని సులభంగానే అర్థం చేసుకోవచ్చు. ఎక్కువమంది నమ్ముతున్నారనే కారణంతో ఏదీ వాస్తవం కాదు. ఈనాడు మనం తప్పని వప్పుకుంటున్న అనేక విషయాలు గతంలో ఎక్కువమంది సరైనవని నమ్మినవే. ఉదాహరణకు, భూమిచుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడనేది తరతరాలుగా జనం నమ్మిందే. శాస్త్రీయదృక్పథం లోపించటం, లోపభూయిష్టమైన దృష్టివల్ల యిటువంటి వాటిని ప్రజలు నమ్మారు. శాస్త్రజ్ఞానం అభివృద్ధి చెందటం, ముందున్న నమ్మకాల్లోని తప్పుల్ని గుర్తించటం వల్ల యీ నమ్మకాలు క్రమంగా తొలగిపోతున్నయ్.

మరో విషయం- ఎంతోమంది దేవుణ్ణి నమ్ముతున్నా వారందరి దేవుడు ఒకేరకంగా వుండడు. కాలాన్నిబట్టి దేవుడనే భావనలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నయ్. పైగా ఏ యిద్దరూ దేవుడంటే ఒకే రకమైన అభిప్రాయం కలిగివుండరు. 'నీ దేవుడు నాకు దయ్యం!' అని వెస్లీ చెప్పిన మాటల్లో ఆశ్చర్యకరమైందేమీ లేదు. వ్యక్తి స్వభావం, విద్య, పరిసరాలపై అతని దేవుడి భావన ఆధారపడి వుంటుంది. మనిషి జ్ఞానం అభివృద్ధి చెందే కొద్దీ అతని దేవుడి భావనలో గాఢత తగ్గుతుంది. అనాగరిక మానవుడు చెట్టులో పుట్టలో దేవుణ్ణి చూస్తే, తత్వవేత్త ఏ లక్షణాలూ లేకపోవటమే దేవుడి లక్షణం అంటాడు.

ఈ మధ్యకాలంలో కొంతమంది దేవుడిపై నమ్మకం వల్ల కలిగే ఫలితాలపై ఆధారపడి దేవుడి అస్థిత్వాన్ని సమర్థింపజూస్తున్నారు. వీరు చెప్పేదేమంటే వాస్తవాల పరిశీలన, నిరూపణలపైగాక నమ్మకం వల్ల కలిగే ప్రయోజనంపై ఆధారపడి సత్యాన్ని నిరూపించాలి. సత్యాలను రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి ప్రత్యక్ష సత్యం. దీన్ని మన రోజువారి అనుభవంతో నిరూపించటానికి వీలుంటుంది. ఎప్పుడైనా, ఎక్కడైనా యిటువంటి సత్యాలు వర్తిస్తాయి. దీనికి భిన్నంగా, కొన్ని సత్యాలను పరోక్షంగా నిరూపించటం మాత్రమే సాధ్యమౌతుంది. కొన్ని అసలు నిరూపించటమే సాధ్యం కాకపోవచ్చు. కొన్నిటి నిరూపణలో

మనిషికి ఆసక్తి లేకపోవచ్చు.

మనిషికి అవసరమైనవాటిని నమ్మటానికి మధ్యంతర దశలు, ప్రతిపాదనలను పరోక్షసత్యం అంటాం. పరోక్షసత్యాలు అసలు అవసరం లేదని చెప్పలేం. అవి మానవసంకల్పానికి బలం చేకూర్చవచ్చు. కాని ప్రత్యక్ష సత్యాలే వాస్తవ జీవిత అవసరాలకు ముఖ్యమైనవి. పరోక్ష సత్యాలు చాలా తక్కువ ప్రభావం చూపుతాయి. చాలామంది తమకే తెలియని లోకాల్నుండి మనిషి జీవితాన్ని నిర్దేశించే దేవుడిపై బలమైన నమ్మకాన్ని ప్రకటిస్తారు. కాని వారు తమ రోజువారి జీవితంలో అటువంటి నమ్మకం ఏదీ లేదన్నట్లు ప్రవర్తిస్తారు. వారు చెప్పే 'సత్యం' వారిపై ఎటువంటి ప్రభావం కలిగించటం లేదనటానికి యిదే రుజువు. వారు అవసరం వచ్చినప్పుడు తమ నమ్మకానికి పూర్తి విరుద్ధమైన ప్రత్యక్ష సత్యాలపై ఆధారపడతారు. జబ్బు చేసినప్పుడు డాక్టరు దగ్గరికి వెళ్ళకుండా గుళ్ళూ గోపురాల చుట్టూ తిరిగితే ఏం జరుగుతుందో అందరికి తెలుసు. మన నిజజీవితంలో వుపయోగించనంత కాలం మనం నిరూపించలేని పరోక్ష నమ్మకం వల్ల నష్టం వుండదు. ప్రత్యక్ష నిరూపణకు నిలబడాల్సి వచ్చినప్పుడే వాటివల్ల ముప్పు. కాబట్టి ఫలితాలపై ఆధారపడి అన్ని నమ్మకాల్ని అంగీకరించలేం, కేవలం ప్రత్యక్ష సత్యాలను మాత్రమే అలా స్వీకరించగలం.

ఈ ప్రపంచాన్ని ఈశ్వరుడు సృష్టించి వుండకపోతే, అది జరామరణాలు లేని అజ్ఞాతశక్తి, పరమాత్మ రూపం కాదా? శాక్యముని అనాధ పిండకునితో యీ విషయమై చెప్పిన మాటలు: "పరమాత్మ దేనిపైనా ఆధారపడని, ఎవరూ తెలుసుకోలేనిదైతే హేతు విద్యాశాస్త్రం ద్వారా ఆయన వున్నాడని చెప్పటం సాధ్యపడదు. అస్థిత్వంలోగల దేనితోనూ సంబంధం లేనిదాన్ని గురించి మనం ఎలా తెలుసుకోగలం? విశ్వంలో సమస్తం ఒకదానితో మరొకటి పరస్పర సంబంధంలో వుంది. దేనిపైనా ఆధారపడని, దేనితోనూ సంబంధం లేని పరమాత్మ పరస్పర సంబంధమైన, పరస్పరాధారమైన సృష్టిని ఎలా చెయ్యగలడు? పరమాత్మ ఎటువంటి లక్షణాలు లేని (నిర్గుణ)వాడైతే ఆయన సృష్టించేవి కూడా ఏ లక్షణాలు లేకుండా వుండాలి. కాని ప్రపంచంలోని ప్రతి వస్తువు, జీవి దాని స్వంత లక్షణాలు కలిగివుంది. కాబట్టి ప్రపంచం పరమాత్మ సృష్టని చెప్పలేం. పరమాత్మ మార్పులేనివాడైతే, నిరంతరం మారుతూ వుండే ప్రపంచాన్ని సృష్టించలేడు. పరమాత్మ అన్నిటిలో వుంటే మనం విముక్తి కోసం ప్రయత్నించాల్సిన అవసరం ఏముంది?" (అశ్వఘోషుని **బోధిచర్యావతారం**).

భిన్నమైన స్థల, కాలాల్లో అతీంద్రియజ్ఞానాన్ని పొందటానికి భిన్నమైన పద్ధతులు వున్నాయని చెప్పారు. స్థూలంగా వీటిని మూడు రకాలని చెప్పవచ్చు. వీటిలో మొదటిది, ఒక అతీంద్రియశక్తి - దేవుడు లేదా ఆయన దూతలు దేవతలు, గంధర్వులు - తాను

ఎంచుకున్న మనిషి ముందు ప్రత్యక్షమై దివ్యమైన వాక్కును వినిపిస్తాడు. తాను ఎంపిక చేసుకున్న మనిషికి అతీంద్రియశక్తి ఆవహించి దివ్యవాణిని వినిపించటం రెండవరకం. ఇక మూడవదానిలో మనిషి ధ్యానస్థితిలో అతీంద్రియశక్తులతో నేరుగా సంబంధం ఏర్పరచుకొని దివ్యజ్ఞానాన్ని పొందుతాడు. ఆధునిక ప్రపంచంలో నాగరిక మానవుడికి మొదటి రెండూ నమ్మలేనివిగా వున్నా, మూడవదైన తాదాత్మ్య లేదా అలౌకిక స్థితి యింకా చాలామందికి నమ్మదగిందిగా అనిపిస్తుంది. దీన్ని ఆధునిక మనస్తత్వ శాస్త్ర ఆధారంగా సమర్థించి, ప్రచారం చేస్తున్నారు.

ఈ తాదాత్మ్య స్థితిలో మనసును శరీరాన్నుండి వేరుచేసి దేవుడితో నేరుగా సంభాషించటం లేదా వ్యక్తి తన పరిధిని అధిగమించి బ్రహ్మలో ఐక్యం అవటం జరుగుతుంది. దీనికోసం సాధారణంగా అనుసరించే పద్ధతి యిది: సుదీర్ఘమైన, తీవ్రమైన ఏకాగ్రత (concentration)తో ఆలోచనల్ని ఒక స్థిరమైన మార్గంలో ప్రసరింపచెయ్యటం ద్వారా మనసును సాధారణ చేతన నుండి విడదీసి, హేతుజ్ఞానాన్ని తాత్కాలికంగా విరమింపజేసి, సంక్లిష్టమైన ఉద్విగ్నభావనతో నింపెయ్యటం. ఇలా మనిషి మామూలు ప్రవర్తనను నిరోధించటం అలౌకిక అనుభవంగానూ, వ్యక్తి చేతనను కోల్పోవటాన్ని బ్రహ్మలో ఐక్యం పొందటంగానూ, సత్యాన్ని కనుగొనటంగానూ చెబుతారు. ఇటువంటి శారీరక మానసిక స్థితి మత్తుపదార్థాలవల్ల లేదా తీవ్రమైన జబ్బులవల్ల వికటించిన భావోద్రేకస్థితికి భిన్నమైంది కాదు. టెలిపతి తదితరమైన శక్తులు మనిషికి సాధ్యమేనని ఒప్పుకున్నా, మనిషి చేతన లౌకిక, అలౌకిక విషయాలతో వ్యవహరించే రెండు భిన్నమైన స్రవంతులుగా వుంటుందని ఎలా చెప్పగలం?

ప్రపంచం ఈశ్వరుని లేదా బ్రహ్మ సృష్టి కాకపోతే అది ఆత్మస్వరూపం కాదా? ఆత్మ ప్రపంచాన్ని రూపొందించిందని చెప్పే వాదనలోని అసంబద్ధత (obsurdity)ని బుద్ధుడు యీ విధంగా వివరించాడు: "ప్రపంచం ఆత్మచే సృష్టించబడిందనుకుంటే, ఆత్మ ప్రతిదాన్ని ఆనందకరంగా సృష్టించి వుండాలి. కాని యీ ప్రపంచంలో ఆనందకరం కానివి ఎన్నో వున్నయ్. అటువంటప్పుడు ప్రపంచం ఆత్మచే సృష్టించబడిందని ఎలా చెప్పగలం? ఆత్మ అన్నిటిని సృష్టించిందని ఒప్పుకుంటే కనీసం అకుశలకర్మలు వుండకూడదు. కాని మనం చేసే పనులు మంచి, చెడు ఫలితాలనిస్తాయనేది మనకు తెలిసిందే. కాబట్టి యీ ప్రపంచం ఆత్మసృష్టి అని చెప్పలేం (అశ్వఘోషుని **బుద్ధచరితం**).

చూసే వ్యక్తి జ్ఞానేంద్రియాలపై ఆధారపడి వుంటుందనేదానిపై ఆధారపడి పైవిధంగా చెప్పబడింది. పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది. ఈ నిజం సామాన్యుడికి కూడా తెలిసినా, అతను యీ ప్రపంచం తన జ్ఞానేంద్రియాల సృష్టి అని భావించడు. ప్రపంచంలో ఆత్మ తప్ప మరేదీ వాస్తవం కాదని చెప్పే అధిభౌతికవాది కూడా వాస్తవ

జీవితంలో అలా ప్రవర్తించడు. విందుభోజనాన్ని వూహించుకుని తన ఆకలిని తీర్చుకోవాలని ప్రయత్నించడు. మనసే అన్నిటిని సృష్టించి వుంటే సిద్ధాంతానికి, ఆచరణకు యింత భేదం వుండదు. నిజానికి ప్రపంచంలో దుఃఖమనేది వుండేది కాదు. భావవాదంలోని అసంగతమైనదాన్ని ఎత్తి చూపటానికి బుద్ధుడు పైవిధంగా చెప్పాడు.

ఈ విమర్శల అనంతరం మౌలికతాత్విక సమస్యలపై బుద్ధుడు ఏమి చెప్పాడనేదాన్ని చూద్దాం. బుద్ధుడు నైతికత గురించి నిరంతరం నొక్కి చెప్పినందువల్ల జ్ఞానసిద్ధాంతం (epistomology)కు సంబంధించిన సమస్యలను పట్టించుకోలేదని సాధారణంగా వింటుంటాం. బుద్ధుడు ప్రపంచం యొక్క ఆది అంతాలకు సంబంధించిన ప్రతిపాదనలు చెయ్యని మాట వాస్తవమే; దీనిపై తన అభిప్రాయాలకు ఒక నిర్దిష్టరూపం కూడా యివ్వలేదు. కాని సూత్ర, అభిధర్మ పీటకాల్లో యీ విషయమై ఆయన దృష్టి ఎలా వుందో తెలుసుకోగలం. బుద్ధుడు ఎప్పుడూ వినేవారి స్థాయికి తగినవిధంగానే బోధించాడు. ఆయన సామాన్యులకు చేసే బోధనల్లో, సహజంగా, ఒక వాస్తవవాది (సర్వాస్థవాది)గా కనిపిస్తాడు. అటువంటి బోధనలపై ఆధారపడి **వైభాషిక, సౌత్రాంతిక** వాదులు తమ భౌతికవాద సిద్ధాంతాల (అణుసిద్ధాంతం)కు రూపకల్పన చేశారు.

ప్రపంచం (సంసారం) నిరంతరం మార్పుచెందే స్రవంతి అనేది మౌలికంగా బుద్ధిస్టులంతా అంగీకరిస్తారు. కొందరు బుద్ధిస్టులు, మనిషి పంచస్కంద సముదాయమైనట్లే, ప్రపంచం అశాశ్వతమైన అణుసముదాయమని భావిస్తారు. వైభాషిక, సౌత్రాంతికులిద్దరూ ప్రపంచానికి ఆవల చేతనయొక్క అస్థిత్వం వున్నట్లు అంగీకరిస్తారు.

అసంగుని అనుయాయులైన **యోగాచారులు** భావవాదులు **(విజ్ఞానాస్థిమాత్రవాదులు).** వీరు బాహ్య ప్రపంచం యొక్క స్వయం అస్థిత్వాన్ని నిరాకరిస్తూ, అది స్వయం-అస్థిత్వం కలిగిన చేతన (ఆలయవిజ్ఞానం) యొక్క సృష్టి అని అంటారు. ఇటువంటి ఆలోచనలు పుట్టటానికి బుద్ధుని బోధనల్లో అవకాశం వుండివుండొచ్చు. కాని ఆయన స్వయంగా యిటువంటి దృక్పథాన్ని బోధించలేదు. ఆయన పదార్థంనుండి చైతన్యం పుట్టిందనే భౌతికవాదిగాని లేక చైతన్యం నుండి ప్రపంచం పుట్టిందనే భావవాదిగాని కాదు. ఆయన ఆలోచనల్లో, ఆచరణలో **మాధ్యమికవాది.** అటు పదార్థంగాని, యిటు చేతనగాని లేని వాస్తవికతను ఆయన నిరాకరించాడు. అదేవిధంగా అస్థిత్వానికి అతీతమైనవని చెప్పే జీవాత్మ, పరమాత్మలనూ తిరస్కరించాడు. అందుకే ఆయన్ని కొందరు **శూన్యవాది** అని పిలుస్తారు.

ఆయన ఎక్కడా భౌతికప్రపంచాన్ని, వ్యక్తి (నామ-రూపం)ని నిరాకరించలేదు. బుద్ధుడు నిరాకరించ వీలులేని అద్వయవాదాన్ని (అద్వైతంగా పొరపడకూడదు) స్థిరంగా బోధించాడు. అందుకే ఆయన్ని అద్వయవాది అని పిలుస్తారు.

మనిషి అనుభవంలోకి వచ్చేదంతా అతని చేతన ఫలితమేనని నేటి తత్వవేత్తలందరూ అంగీకరించే విషయమే. ఏదైతే చేతనకు అందుబాటులోకి రాదో అది వ్యక్తి జ్ఞానపరిధిలో చేరదు. చైతన్యం క్షణక్షణం మారుతున్నప్పటికి, ఆ క్షణికమైన విషయం యిచ్చే ప్రత్యక్ష అనుభవం వల్ల దాన్ని లేదని చెప్పలేం. చైతన్యంలోకి వచ్చే విషయం ఆ క్షణంలో మాత్రమే విలువ కలిగివున్నా అది వ్యక్తికి యితర సమయాల్లో, అలాగే యితరులకు వుపయోగంలోకి వస్తుంది. మనం తెలుసుకోగలిగిందంతా మానసికమైన విషయమనేదాన్ని మర్చిపోకూడదు. అతీంద్రియమైన లేదా అధిభౌతికమైనదేదీ లేదు. వాస్తవికత చేతనలో యిమిడివుంటుంది. ఈ మౌలిక విషయాన్ని అలక్ష్యం చెయ్యటం వల్లనే అన్ని రకాల ఆత్మ, పరమాత్మకు సంబంధించిన సమస్యలు తలెత్తాయి.

(చైతన్యంలో వుండే ప్రతి విషయానికి దాని ప్రత్యేక లక్షణాలు వుంటయ్. ఏ రెండు విషయాలు అచ్చు ఒకే రకంగా వుండవు. చేతనలో ఒక మౌలిక లక్షణమైన జ్ఞాపకం భిన్నమైన విషయాలను క్రమంలో అమర్చి వాటి పోలికల్ని, తేడాలను గుర్తించేటట్లు చేస్తుంది. అనుభవాన్ని రూపొందించే భిన్నమైన అంశాల అంతర సంబంధాన్ని విశ్లేషించేట్లు చేస్తుంది. ఆయా సమయాల్లో వ్యక్తమయ్యే చైతన్యం యీ అనుభవమేగాని విడివిడి అంశాలు కాదు. ఈ అంశాలను సాధారణీకరించే (abstraction) క్రమంలో తెలుసుకుంటాం. ఈ అంశాలు జ్ఞానేంద్రియాలపై కలించే ముద్రలు (sense impressions) వాటి జ్ఞాపకాలు. ఇతర మానసికవిషయాలన్నీ వీటిద్వారానే నిర్మాణమవుతాయని సైకాలజీ చెబుతుంది.)

'నేను', 'బాహ్యప్రపంచం' అనే భేదం పాటించటానికి ఒక ప్రయోజనకరమైన మూలం వుంది. అంతర్గత అనుభవం, బాహ్య అనుభవం అనేవాటిని అర్థం చేసుకోడానికి ఒక వుదాహరణను పరిశీలిద్దాం. ఒక సూదిని చూసినప్పుడు మనకు గతంలో అనుభవంలోకి వచ్చిన రంగు, రూపం వల్లే సూది యొక్క వాస్తవికతను మనం గుర్తించగలుగుతాం. సాధారణంగా రంగు, రూపం అనేవి బాహ్యలక్షణాలుగా చెబుతాం. కాని మన శరీరం మీద సూదితో గుచ్చినప్పుడు కలిగే నొప్పి అంతర్గత లక్షణం. అయినా రంగు, రూపం వల్లే సూది గుచ్చినప్పుడు కలిగే నొప్పి కూడా చేతనలో చేరుతుంది. అటువంటప్పుడు యీ రెంటికి తేడా ఏమిటి? సుఖం లేదా బాధ (వేదన) అనేవి రాగద్వేషాల వుత్పన్నం చేసి, తన సుఖం మాత్రమే కోరుకునే చైతన్యాన్ని ఉపాదానం రూపొందిస్తుంది. ఆ విధంగా చైతన్యంలో అనుభవం, ఆ అనుభవానికి దోహదంచేసే విషయాల మధ్య భేదం ఏర్పడుతుంది. కాని అష్టాంగమార్గంలో సాధన చేసేవారికి ఉపాదానం నశించి, యధాభూతజ్ఞానం కలిగి నిర్వాణప్రవేశం లభిస్తుంది.

## పదకొండో అధ్యాయం

# మూర్తిమత్వం

**మ**నిషి మూర్తిమత్వం లేక వ్యక్తిత్వం (personality), యొక్క స్వభావం, గమ్యం గురించి చెప్పే రకరకాల సిద్ధాంతాలున్నయ్. ఆదిమానవుడు జంతువులు, మనుషుల్లో మనకు కనిపించని మరో జంతువు, మనిషి వుంటారని అనుకున్నాడు; ఈ జంతువు లోపలి జంతువు, మనిషి లోపలి మనిషే ఆత్మ. బ్రాహ్మణిజం, జైనం, క్రైస్తవం, ఇస్లాం మతాలు ఏదో ఒక రూపంలో ఆత్మ వుందని అంగీకరిస్తయ్. ఈ మతాలు మనిషి మూర్తిమత్వం లేక వ్యక్తిత్వం అంటే, పుట్టినప్పుడు శరీరంలో చొరబడి, చనిపోయినప్పుడు శరీరాన్ని వదలి వెళ్ళే ఆత్మ అని చెబుతాయి. ఆత్మ అంటే మనకు కనిపించని అభౌతిక 'అహం' అని చెప్పబడింది. ఈ 'నేను' (అహం) అనేది మార్పు చెందే పరిసరాల మధ్య మార్పు లేకుండా వుంటుంది. ఇది జ్ఞానేంద్రియాల ద్వారా జ్ఞానాన్ని పొందుతుంది. శరీరంలోని వివిధ అంగాల కార్యకలాపాల్లో దీని చురుకైన పాత్ర వుంటుంది. ఇది మనిషి శరీరాన్నే గాక మనసును కూడా నడిపిస్తుంది. దీన్ని కంటితో చూడలేం, మనసుతో గ్రహించలేం. కాని దీని అస్థిత్వాన్ని విశ్వాసంతో తెలుసుకోగలం. "మాటలతో, ఆలోచనతో, చూపుతో దీన్ని (ఆత్మను) అర్థం చేసుకోవటం సాధ్యం కాదు; 'అది ఉంది' అనే మాటతో మాత్రమే దీన్ని అర్థం చేసుకోగలం. ఎవరైతే ఆత్మ వుందని నమ్ముతారో వారే దాన్ని అర్థం చేసుకోగలరు. వారికే ఆత్మ తన స్వభావాన్ని బహిర్గతం చేస్తుంది" అని కాథక ఉపనిషత్ చెబుతుంది. ఆత్మ లేకుండా అమరత్వం (శాశ్వతత్వం) లేదు, అమరత్వం లేకుండా యీ జీవితం జీవించదగింది కాదు. ఆత్మ మాత్రమే మనిషి చేసే చర్యల ఫలితాన్ని అతనికి అందిస్తుంది; ఆత్మ లేకుండా స్వర్గంలో భోగాలు, నరకంలో బాధలు వుండవు. ఆత్మ లేకుండా పునర్జన్మ లేదు; పునర్జన్మ (ఆత్మసంక్రమణం) లేకుండా మనిషికి మనిషికి మధ్య సంపద, గుణగణాలు, స్థాయి, విధిరాతల్లో వుండే తేడాలను ఎలా వివరించగలం?- క్లుప్తంగా ఇదీ, ఆత్మ ఉందనేవారి వాదం.

శాశ్వత ఆత్మలో నమ్మకం 'అత్యంత ప్రమాదకరమైన దోషం, అత్యంత మోసపూరితమైన భ్రమ' అని గౌతమబుద్ధుని ధర్మం చెబుతుంది; ఇది తిరిగి కోలుకోలేనంతగా మనిషిని పక్కదోవ పట్టించి, దుఃఖసాగరంలోకి నడిపిస్తుంది. ఆత్మ సిద్ధాంతంలో నమ్మకం సహజంగానే దానిపట్ల అనురక్తిని కలిగిస్తుంది, యిది అనివార్యంగా 'అహం'భావానికి, తద్వారా యిహపరలోక సుఖాల కోసం వెంపర్లాడేట్లు చేస్తుంది. కాబట్టి

'ఆత్మ'సాక్షాత్కారం దుఃఖ విముక్తికి మార్గం కాదు. ఆత్మకోసం వెదుకులాడటమే పెద్ద తప్పు. తప్పుతో ప్రారంభించిన పని తప్పుడు మార్గానికే దారితీస్తుంది. ఈ విషయమై మహారాజు బింబిసారునితో బుద్ధుడు యిలా చెప్పాడు: "ఎవరు తన స్వభావం గురించి, తన జ్ఞానేంద్రియాలు పనిచేసే తీరుతెన్నుల గురించి తెలుసుకుంటాడో అతను 'ఆత్మ' భావనకు ఆధారం లేదని తెలుసుకుంటాడు. ప్రపంచమంతా 'ఆత్మ'ను పట్టుకు వేళ్ళాడుతుంది, దీనినుండే తప్పుడు అవగాహన మొదలవుతుంది. మరణానంతరం ఆత్మ నిలిచి వుంటుందని కొందరు, అది అంతరిస్తుందని మరికొందరు వాదిస్తారు. ఇరుపక్షాలవారు తీవ్రమైన దోషంలో చిక్కుకున్నారు. ఆత్మనాశనం పొందేదైతే వారు ఏ ఫలితం కోసం శ్రమిస్తున్నారో అది కూడా అంతరిస్తుంది. అప్పుడు విముక్తి అనేదానికి అర్థమే లేదు. మరి యితరులు చెప్పినట్లు ఆత్మ మార్పులేనిది, శాశ్వతమైనది ఐతే, నైతికత, విముక్తి అనేవి అనవసరం. మార్పుచెందనిదాన్ని మార్చాలని ప్రయత్నించటంలో అర్థం లేదు. కాని సుఖదుఃఖాలతో ప్రపంచం నిండి వుంది. అటువంటప్పుడు శాశ్వతమైన జీవి గురించి ఎలా చెప్పగలం?"

ఆత్మ వుందనే విశ్వాసం విస్తృతంగా వ్యాపించివుంది. వివిధ అంశాలు కలగలిపి వున్నప్పుడు వాటిని ఒక్కటిగా భావించే తప్పుడు దృష్టిలో దీని మూలం దాగివుంది. ఒక వస్తువును దాని లక్షణాల నుండి వేరుచేసినప్పుడు ఆ వస్తువు అస్తిత్వంలో వుండగలదా? ఉదాహరణకు పునాదులు, గోడలు, కప్పు విడదీస్తే యిల్లు అనేది వుంటుందా? కొన్ని విడిభాగాలను కూర్చి ఒక ప్రత్యేక పద్ధతిలో ఒక్కటి చేస్తే యిల్లు ఏర్పడినట్లే, మనిషి యొక్క వివిధ శరీరాంగాలు, ఆలోచనలు, భావాలు, సంకల్పాలు కలసి ఒక నిర్ణీతపద్ధతిలో వ్యక్తమయ్యేదే మూర్తిమత్వం. **విశుద్ధిమగ్గ** (విశుద్ధి మార్గం)లో ఆచార్య బుద్ధఘోషుడు చెప్పినట్లు, "రథం అనేది చక్రాలు, యిరుసు, కాడి తదితర భాగాలను ఒక క్రమంలో అమర్చటంవల్లే ఏర్పడుతుంది. కాని ఒక్కొక్క భాగాన్ని విడివిడిగా చూస్తే రథం అనే భావనే వుండదు. సరిగ్గా యిదేవిధంగా మనిషి పంచస్కంధాల (శరీరం, వేదన, భావాలు, సంకల్పం, విజ్ఞానం) కూర్పు, వాటిని విడదీసి చూస్తే వ్యక్తి అనే భావనే వుండదు."

ప్రపంచం దాని స్వభావం (స్వధర్మం) ప్రకారం అది నడుస్తుందని చెప్పే బుద్ధిజం సహజంగానే ఆత్మయొక్క అస్థిత్వాన్ని నిరాకరిస్తుంది. కాని అది అనుభవం యొక్క వివిధ అంశాలు, వాటి పరస్పర సంబంధం ద్వారా నిర్మితమైన వ్యక్తిని, మూర్తిమత్వాన్ని నిరాకరించదు. "మూర్తిమత్వం, మూర్తిమత్వం అంటుంటారు గదా, మరి బుద్ధభగవానుడు దీని విషయమై ఏమి చెప్పాడు" అని ఒక భిక్షువు ధమ్మదిన్న అనే భిక్షుణిని ప్రశ్నించాడు. అందుకు ఆమె యిచ్చిన సమాధానం: "వ్యక్తి అంటే మనిషిలోని ఐదు ధాతువులు అని భగవానుడు చెప్పాడు." మనిషి శరీరం, వేదన, విజ్ఞానం, సంజ్ఞ,

సంకల్పం (సంఖార) అనబడే ఐదు స్కందాల నిర్మాణం. రూపం అనేది శరీరాంగ సముదాయాన్ని తెలియజేస్తుంది; వేదన అంటే క్షణికమైన భావోద్వేగ స్థితి; విజ్ఞానమంటే ఆలోచనలు; సంజ్ఞ అంటే వివిధ విషయాలను చూసే దృష్టికోణం; సంఖార అంటే మనం విషయాల పట్ల స్పందించే తీరు, సంకల్పం. నామ-రూపం అనే దానిలో "బాహ్యంగా వ్యక్తమయ్యే స్థూలమైనది రూపం, అంతర్గతంగా సూక్ష్మరూపంలో వుండేది నామ" అని మిళిందప్రశ్నలు అనే గ్రంథం చెబుతుంది. ఆధునిక సైకాలజీ కూడా 'నేను' ("I") అనబడేది భౌతిక మానసిక అంశాల సంక్లిష్ట కలయిక అని చెబుతుంది. Outlines of Psychology అనే గ్రంథంలో ప్రొఫెసర్ టిచ్‌నేర్ "మనిషి సంక్లిష్టమైన అనేక భౌతిక, రసాయన చర్యల ఫలితం. మనసు, మేధస్సు, భావన (feelings), సంకల్పం (will) వంటి వివిధ అంశాల కలయికగా తప్ప మనిషిని వీటికి ఆవల వుండేదిగా చూడలేం" అని చెప్పాడు.

మనకు తెలిసిందంతా రంగు, రుచి, శబ్దం, పీడనం, ఉష్ణోగ్రత తదితరమైన వాటి కలయిక మరియు వాటికి అనుగుణమైన, అనుసంధానమైన భావాలు, భావోద్రేకాలు, కోరికలు, జ్ఞాపకాలు మొదలైనవి. వీటిలో కొన్ని ప్రముఖమైనవిగా ముందుకొచ్చి మిగిలినవాటికంటే స్థిరమైనవిగా, శాశ్వతమైనవిగా ముద్రవేసి, వ్యక్తీకరణలో చోటు చేసుకుంటయ్. ఒక వస్తువు మనకు దానితో పనిలేనంత వరకే మార్పు లేనిదిగా కనిపిస్తుంది. కచ్చితత్వంతో పనిలేనప్పుడు భూమి గోళాకారంగా వుందని అంటాం. కాని మరింత లోతైన పరిశీలన చేసేటప్పుడు, భూమిపై వుండే ఎత్తుపల్లాల్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే అది గోళంగానే వుండదు. అదేవిధంగా మనిషి మూర్తిమత్వం నిర్దిష్టమైన స్పందనలు, భావాలు, ఉద్రేకాలు, సంకల్పాలు కలగలసిన రూపం. దానిలోని వివిధ అంశాలు నిరంతరం మార్పు చెందటంవల్ల మూర్తిమత్వం కూడా మార్పుచెందుతూ వుంటుంది. దానిలో కనిపించే సాపేక్షమైన నిలకడకు కారణం దానిలో జరిగే మార్పు నెమ్మదిగా వుండటమే.

జీవితవాస్తవాలను వివరించటానికి మనోవిజ్ఞాన శాస్త్రానికి కావలసింది, భిన్నంగా వుంటూ పరస్పర సంబంధంగల చేతనా ప్రక్రియల స్రవంతి. ఈ స్రవంతికి ఆవల (బయట) ఆత్మ వుందని చెప్పటానికి యిసుమంతయినా ఆధారం కనిపించదు. 'నేను' అనే చేతన పెంపొందటానికి శాశ్వతమైన ధాతువులతో పనిలేదు. దానికి కావలసిందల్లా యితర వాటికంటే తక్కువ వేగంగా మార్పుచెందే, సాపేక్షంగా దీర్ఘకాలం మనగలిగే మూలాలు. ఈ మూలాలు శారీరకస్పందనల్లో, అలవాటుగా రూపొందిన భావోద్వేగాల్లో వుంటయ్; యివి గతంలోని మానసికచర్యల ఫలితంగా మనకు సంక్రమిస్తయ్. నిజం చెప్పాలంటే యివేవీ మార్పులేనివి, శాశ్వతమైనవి కావు. బాల్యంలో మొదలయ్యే యీ

స్పందనలు ఎదిగి పెద్దవారయిన తరువాత, ముసలితనంలో ఒకే రకంగా వుండవు. ఏ స్పందన, భావోద్రేక తీవ్రత, మానసిక నడవడిక కూడా మొదటినుండి చివరివరకు ఒకే రకంగా వుండదు. కాని మామూలు స్పందనలతో పోల్చినప్పుడు పుట్టుకతో వచ్చే జైవికస్పందనలు, భావోద్రేకాలు చాలా నెమ్మదిగా మార్పు చెందుతయ్. సాపేక్షంగా ఎక్కువ కాలం కొనసాగే కారణంగా యివి శాశ్వతమనే భ్రమను కలిగిస్తయ్. ఈ భ్రమే 'నేను' అనేది శాశ్వతమనే నమ్మకాన్ని కలిగిస్తుంది. ఈ సందర్భంలో ప్రముఖ సైకాలజిస్ట్ ప్రొఫెసర్ జేమ్స్ ఏమన్నారో చూద్దాం: ఆలోచనాస్రవంతిలో 'నేను' అనేది గుర్తుంచుకో గలిగిన ఎన్నో భాగాలు, భావనలు వుంటయ్; వాటిలో యీ 'నేను' అని భావించటానికి అవసరమైన విషయాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి కాపాడటం జరుగుతుంది. 'నేను' అనే భావనకు అస్థిత్వంలో గల శరీరం కేంద్రకం వంటిది. 'నేను'కు సంబంధించిన పాత జ్ఞాపకాలు కూడా 'నేను' అనేదానిలో భాగమైపోతయ్. 'నేను భావనతో సన్నిహితంగా చూడబడే బాహ్యావిషయాలు – బట్టలు, తదితర వస్తువులు, స్నేహితులు, బంధువులు, గౌరవప్రతిష్ఠలు – 'నేను', 'నాది' అనేదానిలో అంతర్భాగమైపోతాయి. ఈ 'నేను' అనేది అనుభవపూర్వకంగా తెలుసుకున్న వస్తుసమ్మేళనం. మనోవిజ్ఞానశాస్త్ర అధ్యయనానికి యీ అనుభవాన్ని పొందే మార్పులేని ఆత్మతో పనిలేదు. ప్రతిక్షణం మారుతూ కొనసాగే ఆలోచనాస్రవంతిలో ఒక ఆలోచన తనకంటే ముందు వచ్చి వెళ్ళినదాన్ని 'నా' సొంతం అనుకుంటుంది. అనుభవంలోకి వచ్చే అన్ని వాస్తవాలు మినహాయింపు లేకుండా యీ వివరణలో యిముడుతాయి. విసుద్ధిమగ్గలో ఆచార్య బుద్ధఘోషుడు యిదే విషయాన్ని యిలా నొక్కిచెప్పాడు: "కచ్చితంగా చెప్పాలంటే చేతనావస్థలో వుండే మనిషి జీవితం క్షణికమైంది. అది ఒక ఆలోచన కొనసాగినంత సమయం మాత్రమే వుంటుంది. ఆలోచన అంతమైన వెంటనే జీవితం అంతరిస్తుంది. తదుపరి ఆలోచనతో కొత్తజీవితం మొదలవుతుంది. గతంలో అస్థిత్వంలో వున్న వ్యక్తి వర్తమానం, భవిష్యత్తులో మనుగడలో వుండదు. ఇదేవిధంగా ఒక దశలో మనుగడలో వున్న వ్యక్తి యితరదశల్లో జీవించడు."

పై అభిప్రాయాన్ని హెర్బర్ట్ స్పెన్సర్, డెకార్ట్, కాంట్ తదితరులు వివిధ రూపాల్లో వ్యక్తం చేశారు. 'నేను' అనే భావన సరళమైంది కాదు. అది ఎరుకలోకి వచ్చిన వెంటనే "నేను కానిది" "నాది కానిది" అనే భావన కూడా తలెత్తుతుంది. బాహ్యమైన వాస్తవికత ఎరుకలోకి రాకుండా అంతరంగ చేతన ఎరుకలోకి రాదు. అంతర్, బహిర అనుభవాలు ఒకదాన్నొకటి అంటిపెట్టుకునే వుంటయ్. ఈ అనుభవాలు నేరుగా గాక వాటి పరస్పరాధారమైన చేతన ద్వారానే మనిషికి అందుబాటులోకి వస్తయ్. 'నేను' 'నాకు వెలుపలిది' అనే భావనలు పరస్పర ప్రభావితాలు. వీటిలో ఒకటి లేకుండా మరొకటి ఆలోచనకు అందదు.

ఇది 'నేను' అని గుర్తెరిగే వ్యక్తి పంచస్కందాల సంక్లిష్ట సమ్మేళనం. వీటిని తనలో కలిగివుండే శాశ్వతమైన ధాతువు ఏదీ లేదు. 'నేను' అనే పదం మాత్రమే కొనసాగుతుంది. దాని నిజమైన సారాంశం నిరంతరం మారుతుంటుంది. అది బాల్యంలో 'నేను' అను చేతన కలగటంతో ప్రారంభమౌతుంది. అటు తరువాత యువకుడు, వయోజనుడు, వృద్ధుడిగా రూపాంతరం చెందుతుంది. ఈ దశలన్నిటిలో కొనసాగే 'నేను' అనే గుర్తింపు చాలా పరిమితమైన అర్థంలో వుంటుంది. **కూటదంతసూత్రంలో** తథాగతుడు చెప్పినట్లు 'నదిలో నీరు మారుతున్నప్పటికి దాన్ని ఒకే పేరుతో పిలుస్తాం. అలాగే ఒకే వ్యక్తిగా గుర్తించబడే మనిషిలో నిరంతరం మార్పు జరుగుతూనే వుంటుంది." క్లుప్తంగా చెప్పాలంటే మనిషిలో కలిగే భావాలు, భావనల సమ్మేళనం యొక్క కొనసాగింపునే 'నేను' అనేది తెలియజేస్తుంది. ఈ ప్రమాణాన్నే ఒక వ్యక్తి నా శరీరం, నా ఆత్మ అని అనుకుంటాడు. మార్పులేని స్థిరమైన సమ్మేళనం భ్రమ మాత్రమే. మార్పు చేతనలో కూడా వుండే అంతఃసూత్రం.

మూర్తిమత్వం ఒక హేతువు, ప్రతి మానసిక చర్య తప్పనిసరిగా ప్రయత్నపూర్వకమైందే. ప్రతి ఆలోచన మనిషి సంకల్పం వల్లే జరుగుతుంది. వ్యక్తి లేక 'నేను' చేసే ఆంతరంగికమైన చర్యలు తన చేతనలో భాగమైన విషయాలను నియంత్రించటం జరుగుతుంది. అంటే, వాటిని పరిశీలనకు స్వీకరించటం లేదా నిరాకరించటం, వాటిని విశ్లేషించటం, పోల్చిచూడటం మొదలైనవి... వాస్తవానికి జ్ఞానేంద్రియాలపై కలిగే ప్రభావాలను ఉద్దేశపూర్వకంగా యిముడ్చుకున్నప్పుడే, అవి ఆ వ్యక్తి సొంతం అవుతయ్. ఈ విధంగా చూసినప్పుడు మనిషి తనది అని నిజంగా చెప్పుకోగలిగేది తన సంకల్పం మాత్రమే. మనిషి గ్రహించేదంతా పరిసరాల క్రమం, అది చేతనపై కలిగించే ప్రభావం మాత్రమే. మన భావాలపై పనిచేసి, వాటిని ప్రభావితం చేయగలిగే 'సంకల్పం' వేరుగా అస్థిత్వంలో వుండదు.

చేతనలో యిప్పటికే అస్థిత్వంలో వున్న అంశాల ఆధారంగా కొత్తవాటిని ఉత్పత్తి చేయటమే 'సంకల్పం' లేదా 'నేను' చేసే కార్యకలాపం. ఈ విధంగా చూసినప్పుడు చేతనలోని అంశాలను రెండుతరగతులుగా విభజించవచ్చు: వాటంతటవే చోటుచేసుకునే అంశాలు, మనం ఉద్దేశపూర్వకంగా సృష్టించే అంశాలు. చేతనలో వాటంతటవే చేరే అంశాలను తుడిచివెయ్యటం లేదా ఉద్దేశపూర్వకంగా మార్చటం సాధ్యం కాదు. నేనొక పచ్చని చెట్టుముందు నిలబడితే, నాకు యిష్టం వున్నా లేకపోయినా, పచ్చని చెట్టే నాకు కనిపిస్తుంది. ఆ చెట్టును ఏ విధమైన లక్షణాలతో నేను గుర్తుంచుకుంటాననేది వేరే విషయం. దాన్ని గుర్తుంచుకోవటం, దాని గురించి వ్యక్తం చెయ్యటంలో సంకల్పం పాత్ర వుంటుంది. చేతనలోని మొదటి అంశం బాహ్యప్రపంచ రూపాన్ని నిర్మించుకునే

సామాగ్రి కాగా, రెండవది మనసు చేసే సృజన లేదా కల్పన. చెట్టును చూడటం, దాన్ని గుర్తుంచుకోవటం స్పష్టంగా రెండు వేరు విషయాలు, అవి రెండు రెండు స్థాయిల్లో జరిగే విషయాలు. రెండవది సంకల్పంతో జరిగినట్లే మొదటిదాని వెనుక కూడా మనకు తెలియని ఏదో శక్తి పనిచేస్తుందనుకోవటంలోనే అసలు సమస్య వుంది. ఎప్పుడైతే ప్రకృతిని అర్థం చేసుకోవటం, వివరించటం కష్టమౌతుందో, అప్పుడు అది భౌతికతను అరువు తెచ్చుకోవటం వల్ల అది ప్రకృతిని మరింత లోతుగా పరిశోధించే పనినుండి మనల్ని దూరం చేస్తుంది.

ముందు చెప్పినట్లుగా, మనిషి మూర్తిమత్వం అతని భావనలు, భావాలు, సంకల్పం, ఉద్రేకాలు, జ్ఞానం యొక్క వుమ్మడి వ్యక్తీకరణ. నిర్దిష్టమైన వీటి పొందికనే 'నేను' అనే భావంతో చూస్తున్నాం. ఈ భావన కంటే ముఖ్యమైంది దానిలోని వివిధ అంశాలు. వాటి వాటి పరస్పర సంబంధం. ఈ అవగాహనతో మనం సంతృప్తి చెందనప్పుడు, యీ భావనలు, సంకల్పాలు, జ్ఞానం ఎవరిలో లేదా దేనిలో వుంటయ్? అనే ప్రశ్న పుడుతుంది. దీనికి సమాధానంగా అనుభవాతీతమైన, శాశ్వతమైన ఆత్మ అనేదాన్ని కల్పిస్తాం. దీనిద్వారా మనం, విశ్లేషించ సాధ్యం కాని ప్రతిదాన్ని అవిభాజ్యమైందిగా చూసే ఆదిమానవుడి అలవాటులో కూరుకుపోతాం. పురాతనమైన మానవుని యీ అలవాటు మనోవిజ్ఞానంలో అనేక రూపాల్లో చోటుచేసుకుంది. మొదట్లో, నాడీమండలాన్ని శరీరంనుండి వేరుచేసి చూసి దాన్ని మానసిక కార్యకలాపాల స్థానంగా భావించారు. తదుపరి నాడీవ్యవస్థలో ముఖ్యభాగం అయిన మెదడును వేరుచేసి దాన్ని కేంద్రస్థానంగా భావించారు. అటు తరువాత యింకా ముఖ్యమైన పినియల్ గ్రంధి ఆత్మకు నివాసస్థానంగా భావించటం జరిగింది. ఇటువంటి భావనలు, ప్రతిపాదనలు వాస్తవవిరుద్ధమైనవని ఎంతోమంది నిరూపించారు.

మనిషి అర్థం చేసుకోటానికి అందుబాటులో వున్న విషయాల వెనుక ఏదో అంతు తెలియని ఆత్మ వుందనుకునేవారు ఎన్నో రకాల అంతర్వైరుధ్యాలను, అయోమయాన్ని ఎదుర్కొనక తప్పదు. కాని 'నేను' (ఇగో) అనేదాన్ని పరస్పరం గాఢమైన సంబంధంగల వివిధ అంశాలుగా చూడగలిగినప్పుడు యీ యిబ్బందులు రానేరావు. ఒక మనిషిని వ్యక్తిగా రూపొందించే అంశాలు ఒకదానిలో మరొకటి బలమైన సంబంధం కలిగి, యితరుల్లోని అదే అంశాలతో సాపేక్షంగా బలహీనమైన సంబంధాన్ని కలిగివుంటయ్. దీని కారణంగా వ్యక్తి తాను ఏకసాదృశ్యమైన, స్వతంత్రమైన వాడినని అనుకుంటాడు. తన జ్ఞానేంద్రియాల ద్వారా కలిగే అనుభవం, తన భౌతిక-మానసిక అవసరాల మీద తీవ్రంగా చేసే కేంద్రీకరణ వల్ల తాను యితరులతో వేరుపడి వున్నాననే భావనకు గురౌతాడు. వ్యక్తి-కేంద్రంగా జరిగే కార్యకలాపాల వల్లే నేను-నాది, నేను కానిది-నాది

కానిది అనే భేదభావం కలుగుతుంది. ఇది పరస్పర విరోధం, ఘర్షణద్వారా దుఃఖానికి దారితీస్తుంది. కాని, సమిష్టి జీవితం లేకుండా వ్యక్తి జీవితానికి అర్ధం లేదు. సత్యం, సౌందర్యం, మంచితనం వంటి మానవునిలో వుండే అంశాలు విశ్వవ్యాపితమైనవి. మానవుల మేధస్సు యొక్క సంగమం ద్వారా మాత్రమే వాటిని అందుకోవటం, సృష్టించటం సాధ్యమౌతుంది. వ్యక్తి పరిధుల్ని దాటి చైతన్యాన్ని విస్తృతపర్చటం ధార్మిక ప్రగతి కాగా, దాన్ని సంకుచిత స్థాయికి కుదించటం ధార్మిక పతనం. ప్రతి వ్యక్తి ఆంతరంగిక ప్రపంచానికి అవధులు వుంటయ్. దాన్ని వికసింపచెయ్యటం లేదా కుదించటం ఆ వ్యక్తి చెయ్యగలడు. వ్యక్తిత్వపు పునాదులు తగిన విస్తృతి కలిగివుంటే, అవి అతనికున్న పరిమితుల్ని అధిగమించి యితరులపై ప్రసరించగలుగుతాయి. వ్యక్తి అస్థిత్వ పరిధుల్ని అధిగమించటం ద్వారానే కళాకారుడు, పరిశోధకుడు, సంఘసంస్కర్తల వంటి బహుజనహితం కోరి పనిచేసేవారిలో అత్యున్నతమైన ఆనందం వికసిస్తుంది. మన జీవితంలో అత్యంత ఆనందకరమైన సమయాల్లో తగిన స్థాయిలో వ్యక్తి లేదా 'నేను' అనే భావన అదృశ్యమవటం గమనించవచ్చు. ఇదంతా వ్యక్తి అంటే పరిమితులకు లోబడటం అని, అది అనివార్యంగా సంతోషరాహిత్యానికి, కుంచించుకుపోవటానికి దారితీస్తుందని స్పష్టమౌతుంది. **మాలుక్యపుత్త సుత్తం**లో బుద్ధుని వచనం యిలా వుంది: "వ్యష్టిభావనను అంతమొందించే కృషిలో ఎవరైతే మనసు లగ్నం చేస్తారో వారి మనసు, పొంగి పారుతున్న గంగానదిని యీదినవాడి మనసువలె, సంతోషంగా, ఆనందంగా వుంటుంది."

ఆత్మను నిరాకరించటమంటే మానవుని వ్యక్తిత్వం లేక మూర్తిమత్వాన్ని నిరాకరించటం కాదు. కాని ఆత్మ లేదనే జ్ఞానం వ్యక్తినని సమున్నతస్థితికి చేరకుండా, నైతిక మేధోపరమైన ప్రగతికి ఆటంకంగా నిలిచే దోషపూరితమైన భావాలనుండి విముక్తి చేస్తుంది. ఆత్మలో నమ్మకం వల్ల కలిగిన వ్యక్తి అహంభావాన్ని తొలగించివేస్తుంది. మనిషి చేసే చర్యలు, ఆశయాలు అతని మూర్తిమత్వం కాబట్టి తనపై తనకు ప్రేమ వున్న వ్యక్తి చెడుపనులకు దూరంగా వుండాలి, సద్ధర్మాన్ని పాటించాలి.

## పన్నెండో అధ్యాయం

# మరణం, దాని తరువాత

**మా**నవుని సంపూర్ణ సారాంశం సంక్లిష్టమైన పంచస్కంద సంగమం. ఆలోచనల్లో మాత్రమే మనసు శరీరాల్ని వేరుచేసి చూడగలం. ఇది ఒకరి శరీరం, యిది అతని మనసు అని విడదీసి మాట్లాడతాం. అటువంటప్పుడు యీ దేహాన్ని, మనసును తనలో

కలిగివున్నది ఏమిటి? అదే సంక్లిష్టమైన స్కంద సముదాయం. 'వర్షం కురుస్తుంది' అని మనం అలవాటుగా అంటుంటాం, అదేదో కురవని వర్షం కూడా వున్నట్లు. అదేవిధంగా, ఒక వ్యక్తి శరీరం, మనసు కలిగి వుంటాడని, అతను కొన్ని పనులు చేస్తాడని, కొన్ని భావనలు పొందుతాడని మరెన్నో విషయాలు చెబుతాం. కాని నిజానికి వీటన్నిటి కలయికే మనిషి. అతను తన శరీరం, మనసుతో చేసే కార్యకలాపాలన్నీ ఆ వ్యక్తిలో భాగమే.

పంచస్కందాలు సంఘటితమై వున్నంతకాలం వ్యక్తి జీవించివుంటాడు; అవి విఘటనం చెందినప్పుడు అతను అస్థిత్వం కోల్పోతాడు, దీన్నే మరణం అంటాం. "కట్టెల్ని రాపిడి చేస్తే అగ్ని పుట్టినట్లే, చేతన (విజ్ఞాన - పాలీ) అనేది నిర్దిష్ట పరిస్థితుల ఆధారంగా పుడుతుంది. ఆ పరిస్థితులు అంతరించినప్పుడు వాటి కారణంగా వచ్చిన చేతన కూడా అంతరిస్తుంది. జీవుల్లోని జైవిక సంఘటన యొక్క కొనసాగింపు చేతనకు తప్పనిసరి అవసరం. శరీరంతో ముడిపడిన జీవుల లక్షణంగానే చైతన్యం మనకు తెలుసు. జైవిక ప్రక్రియపై ఆధారపడ్డవాటిగా మాత్రమే మానసిక కార్యకలాపాలు మనకు తెలుసు. చేతనావస్థలోని అన్ని స్థితిగతులకు మెదడు, నాడీమండలంలో మార్పులు తప్పనిసరి. నాడీవ్యవస్థలో రక్తప్రసరణ నిలిచిపోతే, వెనువెంటనే చేతనావస్థ స్తంభించిపోతుంది. పరిపక్వత కలిగిన మానసిక దశలు అనివార్యంగా మెదడు ఎదుగుదలపై ఆధారపడి వుంటాయ్. పిల్లవాడి మెదడులో ఎదుగుదల కుంటుపడితే అది అతని మేధస్సు ఎదగటానికి ప్రతిబంధకం అవుతుంది. జీవి బ్రతికివున్నంతవరకు జైవిక కార్యకలాపాలు కొనసాగుతాయి. కాని మనోకార్యకలాపాలు జీవి బ్రతికున్న కాలంలోనే అగుతూ, కొనసాగుతూ వుంటయ్. జైవిక చర్యలు అంతరాయం లేకుండా కొనసాగుతుంటే, మానసిక చర్యల్లో మధ్య మధ్య అవసరాన్ని బట్టి విరామం వుంటుంది. వైద్య అవసరాల నిమిత్తం మత్తు యివ్వబడ్డ శరీరంలో రక్తప్రసారం జరుగుతూ జైవిక కార్యకలాపం కొనసాగుతుంది. కాని చేతనావస్థ విరామంలో వుంటుంది. దీన్నిబట్టి జీవితం కోసం చైతన్యం వుంది కాని, చైతన్యం కోసం జీవితం లేదు అని చెప్పవచ్చు. "అవిద్యావంతుడైన మనిషి మనసును గాక నాలుగు ధాతువులతో కూడిన శరీరాన్ని ఆత్మగా భావించటం మేలైన విషయం. ఎందుకు నేనిలా చెబుతున్నానంటే, శరీరం ఒకటి, పది లేదా వంద సంవత్సరాలు మనుగడలో వుండవచ్చు. కాని మనసు, చేతన అనేవి రాత్రి పగలనక నిరంతరం మారుతూనే వుంటయ్" అని బుద్ధుడు తన శిష్యులకు స్పష్టంగా చెప్పాడు.

భౌతికశరీరంతో సంబంధం లేకుండా చైతన్యం (consciousness) అస్థిత్వంలో వుండదని మనోవిజ్ఞానశాస్త్రం నిరూపించింది. మానసిక రుగ్మతల్ని విశ్లేషించినప్పుడు యీ అభిప్రాయం మరింత బలపడుతుంది. ఒకే వ్యక్తిలో ఒకదానితో మరొకటి సంబంధం లేని వ్యక్తిత్వాలు కనిపించి అదృశ్యమవుతుంటయ్. బహుళ-వ్యక్తిత్వం (multiple per-

sonality), అస్థిర వ్యక్తిత్వం (Altering-personality) లకు సంబంధించిన వుదాహరణలు ఒకే వ్యక్తిలో వ్యక్తిత్వం మారుతుంటుందని నిరూపిస్తున్నయ్. వ్యక్తిత్వం ఉత్పన్నమై గతించిపోవటం నిరంతరం జరుగుతుందని ఈ అసాధారణ మానసిక లక్షణాలు తెలియజేస్తున్నయ్. నిత్యజీవితంలో శరీరంలో కలిగే మార్పులకనుగుణంగా వ్యక్తిత్వం మారుతుండటంవల్ల, శరీరం అంతరించినప్పుడు వ్యక్తిత్వం కూడా నిలిచిపోతుందని అనుకోక తప్పదు. శరీరానికి బయట మార్పుచెందని ఆత్మ వుందని చెప్పే ఆధారాలేవీ లేవు. గత ముప్పై సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధిచెందిన మనోవైజ్ఞానికశాస్త్రం, ఆత్మ వుందని చెప్పగలిగే ఆధారాలేమీ కనిపెట్టలేదు. దీనికి మారుగా, అజ్ఞానం కారణంగా, ఆత్మ వుందని భ్రమింపజేసే అనేక సంఘటనలను హేతుబద్ధంగా వివరించటానికి మనోవైజ్ఞానికశాస్త్రం దోహదం చేసింది. ఆత్మ వుందని నిరూపించటానికి ఎందరో వ్యక్తులు, సంస్థలు చేసిన ప్రయత్నాల్లోని బూటకాన్ని, మోసాన్ని, అజ్ఞానాన్ని బట్టబయలు చేసింది.

మరణానంతరం చైతన్యం కొనసాగుతుందనటానికి ఆధారాలు లేవని, అంతటితో మనిషి అంతమైపోతాడని సైన్సు చెబుతుంది. మరణం అంటే మనిషిలో వున్న వివిధ ధాతువుల సముదాయం, ఫలితంగా వుండే చేతన మొత్తంగా అంతరించటం అని ఆధునిక శరీర నిర్మాణశాస్త్రం చెబుతుంది. బుద్ధిస్టులు మరణానంతరం జరిపే క్రతువులు పఠించే వాక్యాల్లో పైవాస్తవం మరింత స్పష్టంగా తెలుస్తుంది: "నమో తస్స, భగవతో, అరహతో, సమ్మాసంబుద్ధస్స! జీవులన్నీ మరణించక తప్పదు, ఎందుకంటే జీవితం చావుతోనే అంతమవుతుంది; యిది జీవులన్నిటి సహజధర్మం. యువకుడైనా లేక వృద్ధుడైనా, జ్ఞాని లేక అజ్ఞాని అయినా ఎవరూ మరణాన్ని తప్పించుకోలేరు. గాలి, నేల, నీరు వున్నచోట విత్తనం మొలకెత్తినట్లు, పరిస్థితులు అనుకూలించగా జీవబీజం సర్వాంగసంగమమైన మనిషిని అస్థిత్వంలోకి తెస్తుంది. ఆ పరిస్థితులు అంతరించగానే మనిషీ అంతరిస్తాడు. ఏ క్షణాన జీవశక్తి, వేడిమి, చేతన శరీరాన్ని వదలిపోతాయో ఆ క్షణంలోనే శరీరం నిరుపయోగం అవుతుంది. లోతుగా పరిశీలించే కొలది శరీరంలోని డొల్లతనం మరింత స్పష్టమవుతుంది. వాస్తవానికి శరీరంతోనే దుఃఖం మొదలై శరీరం అంతరించటంతో అదీ అంతరిస్తుంది. సంఘటితమైన ధాతువులన్నీ అనిత్యాలే; సంఘటిత ధాతువులన్నీ దుఃఖకారకాలే; అస్థిత్వం గలవన్నీ ఆత్మరహితమైనవే. ఎవరు యీ సత్యాన్ని తెలుసుకుని, అవగాహన చేసుకుంటారో వారు దుఃఖవిముక్తి పొందుతారు; యిదే పవిత్ర జీవితానికి మార్గం."

మరణం అంటే శరీరం, మనసు అంతరించిపోవటం. అయినా దీనితో సమస్తం అంతరించినట్లు కాదు. తాను బ్రాహ్మణులవలె శాశ్వతవాదిని కానని, అలాగే చార్వాకులు, లోకాయతుల వలె ఉచ్ఛేదవాదిని కానని బుద్ధభగవానుడు ప్రకటించాడు. శాశ్వత ఆత్మను

నిరాకరించిన ధర్మం అదే సమయంలో **కర్మ** (మనిషి చేసే చర్యలు) యొక్క కొనసాగింపును నొక్కిచెప్పింది. మనిషి తాత్కాలికమైన **పంచస్కంద సంగమం** తప్ప మరేమీ కాదు; యీ సంగమం యొక్క మొదలు పుట్టుక కాగా, దాని అంతమే మరణం. స్కంద–సంగమం కొనసాగినంత కాలం బాధను తప్పించుకోవాలని, సుఖాలను పొందాలని చేసే ప్రయత్నంలో, యితరులతో జరిపే పరస్పర సంబంధాల్లో మనిషి తనను వ్యక్తపరుస్తుంటాడు. ఈ దృష్టితో చూస్తే, ప్రతి వ్యక్తి జీవితం సంక్లిష్టమైన కర్మ (చర్య)ల సముదాయం అని చెప్పవచ్చు. ఒకరు చేసే వివిధ చర్యల్లో పోలిక వున్న కారణంగా, జీవిత వ్యవహారాల నిమిత్తం, మనం అతన్ని ఒక వ్యక్తిగా గుర్తిస్తాం. వ్యక్తి సారాంశంగా నిలిచే యీ కర్మలు, అతను యితరులతో అవినాభావ సంబంధం కలిగివున్నందువల్ల, అవి కేవలం ఆ వ్యక్తికే పరిమితమైనవి కావు. వ్యక్తిచేసే వివిధ చర్యల ప్రభావం యితరులపై ప్రసరించటం వల్ల అతని మరణానంతరం కూడా వాటి ప్రభావం కొనసాగుతుంది. కాబట్టి మనిషి మరణిస్తాడు, కాని అతని కర్మలు యితరుల్లో జీవిస్తాయి. నేలలో నాటిన విత్తనం నశిస్తుంది, కాని మొలకెత్తి పెద్దదైన చెట్టు తన కాయల్లో మళ్ళీ విత్తనాన్ని కలిగివుంటుంది. విత్తనం నుండి చెట్టులోకి చేరే ఆత్మ అంటూ ఏదీ వుండదు. కాని రంగు, రూపం, రుచి మొదలైన లక్షణాలు కొత్త చెట్టుకాయలో పునర్నిర్మాణం పొందుతాయి. ఇదేవిధంగా మానవుడు ఆత్మ లేకుండానే పునర్జన్మ పొందుతాడు.

త్రిపిటకాల్లో అక్కడక్కడ ఒక జన్మనుండి మరో జన్మకు ఆత్మ ప్రయాణించటాన్ని బుద్ధుడు అంగీకరించినట్లు సూచించే భాగాలు కనిపిస్తయ్. కాని యిటువంటివి సామాన్య జనుల కోసం ఉద్దేశించిన జాతకకథల వంటివాటిలోనే కనిపిస్తయ్. దీన్నిబట్టి తెలిసేదేమంటే, బుద్ధుడు ఆయా సందర్భాల్లో సామాన్యజనానికి తగిన రీతిలో బోధిస్తున్నాడని. ఇటువంటి కథల్లో సామాన్యుడికి కూడా అర్థమయ్యే రీతిలో మనిషి చేసే చర్యలకు, వాటి ఫలితాలకి వుండే సంబంధాన్ని వివరించటమే మహోపాధ్యాయుని ఉద్దేశం. ఒక సందర్భంలో చైతన్యం (విజ్ఞాన–పాళీ) జననమరణ చక్రంలో కొనసాగుతుందని సాతి అనే భిక్షువు యితర భిక్షువులతో వాదిస్తాడు. బుద్ధుడు అతన్ని తన వద్దకు పిలిపించుకుని, "సాతి, విజ్ఞానం అంటే నువు ఏమనుకుంటున్నావు?" అని ప్రశ్నించాడు. అందుకు సాతి "భంతే! జన్మజన్మల పర్యంతం మంచి, చెడు కర్మల ఫలితాన్ని పొందేది" అని బదులిచ్చాడు. అప్పుడు బుద్ధుడు అతనికి యిలా చెప్పాడు: "నేను యిటువంటి ధర్మాన్ని బోధిస్తున్నానని ఏ మూర్ఖుడు చెప్పగా విన్నావు? విజ్ఞానం యితర విషయాలపై ఆధారపడి వుత్పన్నమవుతుందని ఎన్నో రకాలుగా నేను వివరించలేదా? తగిన పరిస్థితులు లేకుండా విజ్ఞానం అస్థిత్వంలోకి రాదని చెప్పలేదా?" వ్యక్తిత్వపు స్వభావాన్ని బుద్ధుని బోధనల వెలుగులో అర్థం చేసుకోకుండా, ఆయన చెప్పిన

కర్మ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవటం సాధ్యం కాదు. వ్యక్తిలో అసలు విషయం 'నేను' అనే భావన కాదు, అందులోని అంతఃసారాంశం. ఈ సారాంశం ఏ రెండు సందర్భాల్లో ఒకే రకంగా వుండదు. "నేను నిరంతరం ఒకే వ్యక్తిని అనేది భ్రమాజనితం" అని బోధిచర్యావతారం చెబుతుంది. నిజం చెప్పాలంటే ప్రతిక్షణం మనిషి మరణించి, కొత్తమనిషి పుడుతుంటాడు. అప్పుడే పుట్టిన కొత్తవ్యక్తిలో పాత లక్షణాలు కొనసాగుతున్నందువల్లే అతను 'అదే వ్యక్తి' అని అనుకుంటాం. ఇదేవిధంగా మనిషి భౌతికంగా మరణించినప్పుడు శరీరంలోని ధాతువులు యిక ఏ మాత్రం పాతపద్ధతిలో పనిచెయ్యవు. కాని అతని వ్యక్తిత్వపు సారాంశం పూర్తిగా అంతం కాదు, అది యితరుల్లో కొనసాగుతుంది. ఈ విధంగా కొనసాగుతున్న వ్యక్తి పూర్తిగా పాతవాడు కాదు, పూర్తిగా కొత్తవాడూ కాదు.

మనిషి దేనితోను సంబంధంలేని ఒంటరి జీవి కాదని సైన్సు చెబుతుంది. అతనిలో బహువిధమైన భౌతిక, మానసిక చర్యలు సమ్మిళితమై బయటకు ప్రసరిస్తుంటయ్. అతనికి వారసత్వం, అనుకరణ, విద్య ద్వారా అనేకం సంక్రమిస్తయ్. వీటిలోఏదీ క్రమపరిణామం చెందకుండా అస్థిత్వంలోకి రాదు. శరీరానికి మూలమైన బీజకణాలు అనేక ముందుతరాల పరిణామ ఫలితం. ఒక జీవి వ్యక్తిగత చరిత్ర తరతరాల తన వంశ పరిణామ ఫలితం. ఒక వ్యక్తి చరిత్ర అతని పుట్టుకతో ప్రారంభం కాదు, అది లెక్కకందని ఎన్నో తరాల ముందు ప్రారంభం అవుతుంది. తన ముందు తరాల మనుగడే లేనట్లు, మనిషి తన జీవితాన్ని మాత్రమే ప్రారంభించి, అభివృద్ధి చేసుకుంటాడనుకోవటం, నిజజీవిత వాస్తవాలకు పూర్తిగా విరుద్ధం. ఏ మనిషి ప్రకృతికి విడిగా జోడించబడ్డవాడు కాదు. దీనికి భిన్నంగా అంతకుముందున్న స్రవంతిలో భాగంగానే అతన్ని పరిగణించాలి. హక్స్‌లే చెప్పినట్లు, "మనలో ప్రతి ఒక్కరు మన తల్లిదండ్రుల, వారి ముందు తరాలకు సంబంధించిన స్పష్టమైన ముద్ర కలిగివుంటాం... కొత్తగా పుట్టిన శిశువులో యీ లక్షణాలు అంతర్గతంగా వుండి, క్రమంగా బాహ్యరూపం పొందుతాయి; చిన్ననాటినుండీ వయసు మళ్ళేవరకు యీ లక్షణాలు సోమరితనం లేక చురుకుదనం, బలం లేక బలహీనత, మోసకారితనం లేక సూటిదనం వంటి గుణాలు యితర లక్షణాలతో కలిసి క్రమంగా పెంపొందుతాయి.

ఏ వ్యక్తీ యితర మానవులతో సంపూర్ణంగా తెగతెంపులు చేసుకుని జీవించడు. సమాజంలో అవిభాజ్యమైన మానవుడు అతని బాహ్యవ్యవహారాల కోసమే గాక, అంతరంగంలో కూడా పరస్పరాధారంగానే జీవిస్తాడు. మనిషి తనను తాను ఒక వ్యక్తిగా గుర్తించటం కూడా యితరులతో సంబంధం లేకుండా సాధ్యం కాదు. వ్యక్తి మానసికజీవితాన్ని సైతం యితరులతో సంబంధం లేకుండా చూడలేం. అతను చుట్టూ

వుండే సమాజంచే నిరంతరం ప్రభావితుడౌతుంటాడు. అతను సమాజంలోని ఒక బృందం నుండి విడివడటం కూడా మరొక బృందంలో చేరటంగానే జరుగుతుంది. తమలో వున్న పరస్పర సంబంధాల ద్వారానే మనుషులు నాగరికులుగా, సాంఘిక నైతిక జీవులుగా మనగలుగుతారు. సమాజంలో సభ్యుడిగానే ఒక వ్యక్తి విద్య, విజ్ఞానం, కళలు, శాస్త్రం మొదలైనవాటికి వారసుడు కాగలుగుతాడు. అవి లేనినాడు మనిషి ఆదిమస్థాయిలోనే వుండిపోతాడు.

ప్రతి మనిషి పరిసరాలపై తనదైన ప్రభావాన్ని ముద్రిస్తాడు. అతను గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించవచ్చు లేక అదృష్టాన్ని పొందొచ్చు; అతనొక పుస్తకం రాయొచ్చు లేదా సిరిసంపదల్ని వదలి వెళ్ళవచ్చు. చివరకు పుట్టిన కొద్ది రోజులకే చనిపోయిన శిశువు సైతం తన తల్లిలో మార్పు తెచ్చే ఏదో ప్రభావాన్ని కలుగజెయ్యవచ్చు. ఈ ప్రభావాలు ఆయా వ్యక్తుల స్వభావంపై ఆధారపడి వుంటయ్. మరోవైపు అది యితరులపై ఎటువంటి ఎటువంటి, ఎంత ప్రభావం కలుగజేస్తుందనేది వాటికి గురయ్యే వ్యక్తులపై ఆధారపడివుంటుంది. ఈ ప్రభావాలు ఎంత బలంగా లేదా ఎంతకాలం పాటు పనిచేస్తాయనేది ఎలా వున్నా, అవి పనిచేస్తాయని కచ్చితంగా చెప్పగలం. మనుషులు భౌతికంగా వేరుగా వున్నా, వారు మానసికంగా వేరుగా వుంటారని అర్థం కాదు. మానసిక జీవితం భౌతిక శరీరపరిధుల్ని అధిగమించి సాగుతుంది. మనం చేసే ప్రతి పని, ఆలోచన, మాట్లాడే ప్రతి మాట మన మానసిక జీవితంలో భాగమే. ఒక దీపంతో మరో దీపాన్ని వెలిగించినట్లు, మన మానసికజీవితం నిరంతరంగా కొనసాగుతూనే వుంటుంది.

"మనం మరణించిన తరువాత జీవిస్తామా?" అని ప్రశ్నించిన ఒక ప్రముఖ రచయిత యీ విధంగా సమాధానమిచ్చాడు: "అవును మనం జీవిస్తాం. మన శరీరాలు గతించిపోతయ్, కాని జీవితం కొనసాగుతుంది. రక్తమాంసాలతో కూడిన జీవితం వాటి తదనంతరం మానవజాతి అనే పెద్ద జీవిలో అంతర్భాగమైపోతుంది. తద్వారా అది అమరత్వం పొందుతుంది. మనం చేసే ఏ పని, ఆలోచన, చివరకు చూసే చూపు కూడా వృథా అయిపోదు. అది మంచి అయినా లేక చెడయినా ఏదో ఒక రూపంలో కొనసాగుతుంది. అది మనకు గుర్తుండకపోవచ్చు. ఎక్కడా నమోదు కాకపోవచ్చు, దాన్ని మనం మిగిలిన జీవితం నుండి ప్రత్యేకంగా గుర్తించకపోవచ్చు. కాని అది మానవ జీవనస్రవంతిలో స్పందిస్తూ తరతరాలు కొనసాగుతుంది. మానవ జీవితమనే మహాసముద్రంలో అది చిన్న నీటిబిందువే కావచ్చు. ప్రతి మనిషి జీవితం, చేసే ప్రతి పని, ఆలోచన, పలికే ప్రతిమాట రాబోయే జీవితాల్లో ప్రతిస్పందిస్తూనే వుంటుంది. మనల్ని పసివారిగా లాలించి, పిల్లలుగా పెంచి, మనుషులుగా తీర్చిదిద్దిన మానవజాతి యీ జీవితాన్ని తనలో అంతర్భాగం చేసుకొని శాశ్వతత్వాన్ని ప్రసాదిస్తుంది."

గతంలోని సంఖారాల(సంకల్పాల) ఫలితమే వర్తమాన వ్యక్తి జీవితం. మరణానంతరం యివి యితరుల్ని ప్రభావితం చేస్తూనే వుంటయ్. నెమ్మదిగా జరిగే పరిణామంలో మన చర్యలు కొత్త వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుతయ్. గతంలో జరిగిన చర్యలు వర్తమాన జీవిత స్వభావంపై గాఢమైన ముద్ర వేస్తయ్. బుద్ధిజం చెప్పే కర్మసూత్రం యిదే. బుద్ధభగవానుడు బోధించిన 'అస్థిత్వంలో గల ప్రతిదీ అనిత్యం, ఆత్మరహితం' అనే భావనతో కర్మకు సంబంధించిన మరే విధమైన అన్వయం పొసగదు. వ్యక్తి ఎదుగుదలలో అతని ఆలోచనల, చర్యల ప్రభావాన్ని అర్థం చేసుకోవటం కష్టం కాదు. కాని ఆత్మ లేకుండా, మంచిచెడుల ఫలితం వ్యక్తి మరణానంతరం కొనసాగుతుందనే దాన్ని ఆ వ్యక్తికి మానవజాతితో వున్న సంబంధంనుండి గాక మరో విధంగా అర్థం చేసుకోలేం. భౌతికంగా చూస్తే, వ్యక్తి తన సంతతిలో కొనసాగుతాడు. నైతికంగా చూసినప్పుడు, వ్యక్తి మానసిక జీవితాన్ని అతను అంతర్భాగమైన సమాజంనుండి విడదీసి చూడలేం. విధులు, బాధ్యతలు సమాజానికి వెలుపల అర్థం లేనివి. ఇతరులతో సంబంధం లేకుండా ఒక వ్యక్తి కర్మను ఎలా పొందగలుగుతాడు? మనిషి పొందే సుఖదుఃఖాలు అన్నీ అతని వ్యక్తిగత కర్మ ఫలితం మాత్రమే కాదు. మానవజాతి మొత్తాన్ని పరస్పర అంతఃసంబంధం కలిగిన విశ్వవ్యాపితమైన మొత్తంగా చూడకపోతే కర్మసూత్రం యొక్క పూర్తి విలువను అర్థం చేసుకోజాలం. హంతకుడు, దొంగ సమాజానికి ఎంత బాధ్యత వహిస్తారో, అటువంటివారిని తయారుచేయటానికి సమాజం అంతే బాధ్యత వహించాలి.

పునర్జన్మకు సంబంధించిన యీ దృష్టిని కొంతమంది బుద్ధిస్టులు అంగీకరించక పోవచ్చు. అటువంటివారు కర్మ బదలాయింపులో అంతుబట్టని మిష్టరీ వుందని నమ్ముతారు. వీరు ఆత్మ అస్థిత్వాన్ని అంగీకరించరు కాని, ఒక రకమైన విజ్ఞానం (ప్రతిసంధి విజ్ఞానం) ఛనిపోయిన వ్యక్తినుండి అదే క్షణంలో పుట్టే శిశువులోకి ప్రవేశిస్తుందని భావిస్తారు. ఈ అభిప్రాయం కలిగిన ఒకరు యిలా చెప్పారు: "ఒక వ్యక్తి మరణించిన క్షణంలోనే అతని మానసికస్థితి స్పందనలతో ఎక్కడో ఒకచోట మరో వ్యక్తి జన్మిస్తాడు. అటువంటి విజ్ఞాన స్పందన లేకుండా, పుట్టిన 'కొత్త శిశువు మెదడులో జీవప్రక్రియ ప్రారంభం కాదు. ఆ క్షణంలో మరణయాతనలో వున్న శిశువు మెదడు కొత్తగా పొందిన జీవితంలోని అద్భుతాన్ని ఆస్వాదిస్తుంది. అతని హృదయం, శ్వాసకోశం జీవశక్తిని పొంది పనిచేయటం ప్రారంభిస్తాయి. బుద్ధిస్టు గ్రంథాలు చెప్పే 'ఒక దీపంతో మరో దీపం వెలిగించటం' అంటే యిదే." భౌతికవాదం, మాయావాదం (mysticism) కవల పిల్లలని చెప్పటానికి యిదొక చక్కటి వుదాహరణ. ఎప్పుడు మాయావాదం పట్టు తప్పుతుందో అప్పుడది భౌతికవాదంతో కూడిన కల్పనల్ని వూతకర్రగా చేసుకొని నడిచే ప్రయత్నం చేస్తుంది. ప్రతి సంధి విజ్ఞానం అనేది నిజంగా ఒక విజ్ఞానం, ఒక స్కందం ఐతే అది

ఒకచోటనుండి మరొక చోటకు వెళ్ళదు. అటువంటప్పుడు ఒక జీవినుండి మరొక జీవిలోకి ప్రవేశించేది ఏమిటి? ఈ సంకటం నుండి తప్పించుకోటానికి గర్భధారణ సమయంలో గర్భంలోకి ప్రవేశించే గంధబ్బ (గంధర్వ) అనే దాన్ని సృష్టించారు. ఈ గంధబ్బ భావన, బౌద్ధం నిర్ద్వందంగా తిరస్కరించిన ఆత్మకు మరో రూపం. బుద్ధభగవానుడు చెప్పింది స్పష్టంగా వుంది. "ధర్మాన్ని శరణుజొచ్చండి, ఆత్మను కాదు; మాటలపై కాకుండా వాటి నిజమైన అర్థంపై ఆధారపడండి; సుత్తాల సంపూర్ణ భావంపై ఆధారపడండి, వాటిని విడదీసి చూడొద్దు; జ్ఞానమే ఆధారపడదగింది, విజ్ఞానం కాదు."

బౌద్ధం చెప్పే కర్మ చాలా విస్తృతమైన అర్ధం కలిగింది. కర్మసూత్రం మానవావంశంలోనే కాదు ప్రపంచంలో అస్థిత్వంలో వున్న ప్రతిదానికి అన్వయిస్తుంది. తన "Outlines of Mahayana" అనే గ్రంథంలో Mr. కొరొదా బుద్ధిస్టు కర్మ యొక్క విస్తృతిని యీ విధంగా వివరించాడు: "సృష్టించేవారు, సృష్టించబడేవారు లేరు; మానవులు నిజమైన అర్ధంలో జీవులు కారు. తగిన పరిస్థితుల్లో అనేక కార్యాలు, కారణాల వల్ల వారు అస్థిత్వంలోకి వచ్చారు. మనుషులు సమ్మేళనం పొందిన పంచస్కంధ సముదాయం తప్ప మరేమీ కాదు. ఈ సమ్మేళనం యొక్కప్రారంభమే పుట్టుక, దాని అంతమే మరణం. ఈ సమ్మేళనం కొనసాగిన కాలంలో మంచి, చెడు కర్మలు జరుగుతాయి, అవి భవిష్యత్తులోని సుఖదుఃఖాలకు బీజాలవుతాయి. శాశ్వతమైన మనుషులు, వస్తువులు లేకపోయినా వాటి ప్రభావం వుత్పన్నమవుతూ, అంతరిస్తూ వుంటుంది." బౌద్ధం చెప్పే కర్మ బ్రాహ్మణిజం చెప్పే పునర్జన్మ సిద్ధాంతానికి పూర్తిగా భిన్నమైంది. ఒక శరీరంనుండి మరొక శరీరానికి ఆత్మ మారుతుందని బ్రాహ్మణిజం చెబుతుంది. బౌద్ధధర్మం కర్మ కొనసాగింపు గురించి చెబుతుంది. బ్రాహ్మణిజం చెప్పేదాని ప్రకారం, మనిషి ఒక యింటినుండి మరో యింటికి మారినట్లు ఆత్మ మనిషి, జంతువు, స్వర్గం, నరకాల మధ్య తిరుగాడుతూ వుంటుంది. అది యీ మధ్యలో చేసే పనుల (కర్మ)లకు శిక్షలు, వరాలు వుంటయ్. బుద్ధిజం మనిషి చేసే చర్యల ప్రభావం కొనసాగుతుందని మాత్రమే చెబుతుంది.

కొన్ని బుద్ధిస్టు గ్రంథాల్లో కూడా పునర్జన్మ, పది ప్రపంచాలు (స్వర్గం, నరకం, దేవతలు, గంధర్వులు, జంతు, మానవ, శ్రావక, ప్రత్యేక బుద్ధ, బుద్ధ) వున్నట్లు ప్రస్తావనలు వున్నమాట నిజం. కాని దీనర్థం ఒక జీవి ఒక ప్రపంచం నుండి మరో ప్రపంచానికి మారుతుందని కాదు. నిజమైన బుద్ధిస్టుకు స్వర్గనరకాలు వాస్తవాలు కావు. అవి అజ్ఞానం వల్ల పుట్టిన వూహాజనితాలు. బౌద్ధం చెప్పే అర్థంలో పునర్జన్మ అంటే కార్యకారణాలవల్ల కలిగే ప్రభావం. భౌతిక మానసిక పరిస్థితుల కారణంగా మనుషుల ప్రభావం, వ్యక్తిత్వం ముందు తరాలకు అందించబడుతుంది. కర్మ ఫలితం కొనసాగే విధానాన్ని సామాన్య

జనానికి అర్థమయ్యేట్లు వివరించటానికి మాత్రమే బుద్ధుడు 'పదిప్రపంచాల' ప్రస్తావన చేశాడు. 'పది ప్రపంచాలు' అంటే పదిరకాల మానసికస్థితులే.

గతంలో చేసిన కుశల, అకుశల కర్మల ప్రభావాన్ని నొక్కి చెబుతూనే బౌద్ధధర్మం మరోవైపు విద్య, స్వయం శిక్షణ, ఆత్మనిగ్రహం యొక్క శక్తిని అంతగానే నొక్కిచెబుతుంది. బుద్ధిజం అంతా విధిరాత అనే నిర్ణాయక వాదం కాదు. నిర్ణాయకవాదం మనిషి సంకల్పంతో సహా అన్నీ ముందుగానే నిర్ణయించబడి వుంటయ్' అని చెబుతుంది. దీని ప్రకారం మనిషి యొక్క గుణగణాల్ని విద్యద్వారా మెరుగుపర్చటం సాధ్యం కాదు. దీనికి భిన్నంగా, మనిషి కొన్ని కారణాలపై ఆధారపడి వుత్పన్నం అవుతాడు, కాబట్టి అతని సంకల్పం ముందుగా నిర్ణయించబడి వుండదని బుద్ధిజం చెబుతుంది. అందువల్ల తగిన శిక్షణ ద్వారా మంచిచెడులను నిర్ణయించే సంకల్పబలాన్ని మనిషి పెంపొందించుకోగలడు. విధి నిర్ణాయకవాదం ప్రకారం మనిషి చేసే పనులన్నీ తప్పనిసరైనవే, కాబట్టి వ్యక్తికి బాధ్యత అనేది లేదు. బుద్ధిజం చెప్పేదాని ప్రకారం మనిషి అంతర్గత లక్షణాల్ని మలచవచ్చు, కాబట్టి కర్మకు పూర్తిగా దాసోహం కావాల్సిన పనిలేదు. దానిని మార్చవచ్చు. అందువల్ల మనిషి చేసే పనులకు అతనే బాధ్యుడవుతాడు.

మనసు, శరీరం గతించిపోవటమే మరణం. అయినా మనిషి తాను చేసిన చర్యల్లో కొనసాగుతాడు. ఒకరు చేసిన పనులు అతని పిల్లలవంటివి; అవి అతని యిష్టాయిష్టాలతో సంబంధం లేకుండా కొనసాగుతాయి. ఎక్కడైతే మనిషి తన మనోవాక్కాయ కర్మలతో యితరుల్ని ప్రభావితం చేస్తాడో అక్కడ అతను పునరుజ్జీవం పొందినట్లే. జీవన కార్యకలాపాలు, మనిషి చేసే చర్యలు మాత్రమే నిజంగా నిలిచివుంటయ్, అవి తప్ప మరేదీ మిగిలివుండదు.

## పదమూడో అధ్యాయం

# బౌద్ధధర్మ పరమార్థం

**అ**నిత్య, అనాత్మ, నిర్వాణం - వీటిని బౌద్ధం యొక్క మూలస్తంభాలనటం ఎంతో సరైంది. అవి సద్ధర్మం యొక్క మూలసూత్రాలు. ఈ మూడు ప్రాథమిక సూత్రాల్ని అంగీకరించే ఆలోచనా విధానం ఏదైనా- దానిచుట్టూ అల్లుకున్న నమ్మకాలు, అచరణ ఎలా వున్నా దాన్ని బుద్ధిజంగా గుర్తించవచ్చు. కాని యీ మూడు సూత్రాల్ని అంగీకరించనివాటిని బుద్ధిజంగా పరిగణించలేం.

మరి యీ మూడు సూత్రాల అర్థం ఏమిటి? అనిత్య అంటే అశాశ్వతం అని అర్థం. "అస్థిత్వంలో వున్న ప్రతిది అశాశ్వతమైనది", ప్రతిది నిరంతరం మార్పు చెందుతున్న

ప్రవంతిలో భాగమే అని యీ సూత్రం నొక్కి చెబుతుంది. ఈ విశ్వంలో మార్పు తప్ప మరేదీ శాశ్వతం కాదు. ప్రాణమున్న జీవులయినా లేక పదార్థమైనా నిరంతరం మార్పు చెందటం వాటి స్వభావం. చివరకు శక్తి కూడా పదార్థంలో యిమిడిపోవటమో లేక బహిర్గతమవటమో జరుగుతూ వుంటుంది. శూన్యత మాత్రమే మార్పు లేనిదని చెప్పవచ్చు. మార్పులేని శాశ్వత వస్తువులు (substances) మన ఆలోచనల్లో మాత్రమే వుంటయ్, కాని వాస్తవంలో కాదు. అస్థిత్వంలో వున్నవన్నీ రంగు, శబ్దం, ఉష్ణం, కాలం, పీడనం, ఆలోచనలు, భావోద్రేకాలు, సంకల్పాలు మొదలైనవాటి సంక్లిష్ట సంబంధాలతో తయారవుతయ్. ఇవి నిరంతరం మారుతుంటయ్. కాబట్టి ప్రతిది క్షణికమైంది. కొన్ని, యితరవాటితో పోల్చినప్పుడు, సాపేక్షంగా దీర్ఘకాలం మనుగడలో వుంటయ్, కాని పరమశాశ్వతమైనదంటూ ఏదీ లేదు. ఈ విశ్వంలో శాశ్వతమైనది ఏదీ సైన్సుచే కనిపెట్టబడలేదు. అశాశ్వతమైనవాటిని, శాశ్వతమైనవిగా పొరబడటమే దుఃఖానికి మూలకారణం.

కొంతమంది భావించినట్లు, అనిత్యమైన ప్రపంచం అంటే, అది మిథ్య లేదా భ్రమ అని కాదు. అనిత్యమైనదాన్ని శాశ్వతమైందిగా పొరబడితే అది దుఃఖకారణం అవుతుంది. అయితే ఒక్క అంశంలో మాత్రమే కలిగే చైతన్యం సహజంగా పక్కదోవ పట్టిస్తుంది. అందుకే యితర అంశాల్లో కూడా సమగ్రమైన చైతన్యం అవసరం. ఒకరు తాడును పాముగా భావించిన సందర్భంలో ఆ చైతన్యం పూర్తిగా తప్పుకాదు. పాముగా భావించదగిన లక్షణాలు తాడులో నిజంగానే వుంటయ్. కాని చైతన్యాన్ని తుదికంటా తరచి చూడకపోవటం వల్ల భ్రమ అనేది కలుగుతుంది. జీవితానుభవాలు అన్నీ భ్రమలైతే, అసలది భ్రమ అని తెలుసుకోటం ఎలా? భ్రమలు, వాస్తవాల మధ్య తేడాని గుర్తించ గలుగుతున్నాం. అంటేనే మన అనుభవం అంతా భ్రమ కాదన్నమాట. అలాగే కలగంటూ వాస్తవసంఘటనలపై అనుమానం వ్యక్తం చెయ్యం. ఈ రెండు స్థితుల్లో వుండే తేడా చాలా స్పష్టంగా వుంటుంది. కనుకే సాధారణ మానవుడు ఒకదాన్ని మరొకటిగా పొరపడడు. అంతా మిథ్య, మాయ అనే వేదాంతి కూడా మేలుకుని వున్నప్పటి స్థితిపై ఆధారపడి కలల్లో వుండే స్థితిని నిరాకరిస్తాడు. అనిత్యసూత్రం యొక్క తార్కికమైన కొనసాగింపే అనాత్మత. అది అత్యంత స్థూలమైనదైనా లేక అతి సూక్ష్మమైనదైనా అసలు మార్పే లేని వస్తువు ఏదీ యీ విశ్వంలో లేదని యీ సూత్రం తెలియజేస్తుంది. ఒకదానితో మరొకటి బహువిధ సంబంధం గల స్పందనలు, భావావేశాలు, సంకల్పాలు మొదలైన ఎన్నో తనలో కలిగిన మహాస్రవంతి యీ ప్రపంచం. క్షణక్షణం మారుతున్న యీ ప్రవంతి, సాపేక్షంగా శాశ్వతత్వం కలిగిన స్థాయికి ఎదుగుతుంది. మన జ్ఞాపకాలపై అటువంటి ముద్రవేసి, భాషలో వ్యక్తీకరణ పొందుతుంది. వీటిలో కొన్నిటిని వస్తువులని,

ఆ వస్తువుల్ని కొన్ని ప్రత్యేకమైన పేర్లతో పిలుస్తాం. కాబట్టి రంగు, రుచి, శబ్దం తదితరాలు వస్తువులచే వుత్పత్తయేవి కావు, వివిధ స్పందనలు వాటిని తయారుచేస్తయ్. వస్తువుల్ని మనం యీ స్పందనల ద్వారా గుర్తించం; వస్తువనేది సాపేక్షంగా స్థిరంగావున్న కొన్ని స్పందనలకు మనసు యిచ్చే రూపం. ఇవి ఎప్పుడూ శాశ్వతంగా వుండవు. అంటే, ప్రపంచంలోని వస్తువులన్నీ అవాస్తవం, భ్రమ అని కాదు.

మనిషిలో శాశ్వతమైనదేదీ లేదు, కాబట్టి అతను శాశ్వతంగా వుండలేడు. అనుభవం ద్వారా తెలిసే యీ వాస్తవం, దానివల్ల జనించే భయం కలగలిసి అనేకమైన దారితప్పిన మత, తాత్విక సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయ్. లోతైన ఆలోచన, నిశితమైన విశ్లేషణతో బుద్ధభగవానుడు  తప్పుడుదోవ పట్టిన అన్ని రకాల తాత్వికచింతనలకు మూలం ఆత్మభావనలో వుందని గుర్తించాడు. అది జీవాత్మ లేక పరమాత్మ కావచ్చు. ఈ ఆత్మభావన అశాశ్వతమైనదాన్ని శాశ్వతమైందిగా భ్రమింపజేసి, జీవితంలోని సకల దుఃఖాలకు మూలకారణం అవుతుంది. **బోధిచర్యావతారంలో** చెప్పినట్లు ఆత్మభావన విడనాడకుండా దుఃఖాన్ని తొలగించలేం. వ్యక్తిగా అమరత్వం పొందాలనే తృష్ణను అంతం చేసినప్పుడే పరిపూర్ణమైన స్వేచ్ఛ, బుద్ధితో కూడిన జీవిత దృక్పథాన్ని చేరుకోగలం.

అనిత్య, అనాత్మల్ని పైన చెప్పినట్లు క్లుప్తంగా అయినా అర్థం చేసుకుంటేనే నిర్వాణం యొక్క నిజమైన ప్రాముఖ్యతను అర్థం చేసుకోగలం. నిర్వాణానికి సంబంధించి స్థూలంగా రెండు తప్పుడు అభిప్రాయాల్ని వదిలించుకోవటం అవసరం. కొందరు నిర్వాణం అంటే వేదాంత బ్రాహ్మణులు చెప్పిన, జీవాత్మ పరమాత్మలో ఐక్యం కావటం అనుకుంటారు. మరికొందరు జీవితానికి సంబంధించిన సకలచర్యలు అంతరించటమే నిర్వాణం అని భావిస్తారు. మొదటిదాని విషయంలో, నిర్వాణం అందుకు పూర్తిగా భిన్నమైందని చెప్పాలి. బౌద్ధ ధర్మం జీవాత్మను, పరమాత్మను కూడా నిరాకరిస్తుంది. అటువంటప్పుడు ఒకటి మరొకదానిలో ఐక్యమవటం గురించి ఎలా బోధిస్తుంది. తెవిజ్జసుత్తంలో, పరబ్రహ్మలో నమ్మకం వున్న వ్యక్తి గురించి బుద్ధుడు "అతను తాను ఎన్నడు చూడని, అది ఏమిటో, ఎక్కడుందో, ఎలా వుంటుందో, అసలు వుందో లేదో తెలియని శిఖరంపైకి ఎక్కాలని నాలుగురోడ్ల కూడలిలో మెట్లు కడుతుంటాడు." అని చెప్పాడు. బ్రాహ్మణులు వేదాలపై ఆధారపడతారు, వేదాలు వాటి రచయితలపై, వారు బ్రహ్మ ప్రజాపతిపై ఆధారపడతారు. ఇదెలా వుంటుందంటే, గుడ్డివాళ్ళు వరుసగా నిలబడి ఒకరికొకరు దారి చూపినట్లుంటుంది. వారి విముక్తి మార్గం స్తుతించటం, పూజించటం, ప్రార్థించటమే. వేదాంతం గొప్ప పదజాలంతో నిండివుంటుంది, కాని దానిలో సత్యం మాత్రం వుండదు. వేదాంతాన్ని అనుసరించేవాడు చంద్రుణ్ణి పట్టుకోవాలని, నీటికొలనులో దాని ప్రతిబింబం వైపు చేతులు చాపుతుంటాడు.

నిర్వాణం (నిర్వాణ–పాళీ) అనే పదం, నిర్ అంటే లేని మరియు వాత అంటే గాలి అనే శబ్ద ధాతువులనుండి పుట్టింది. త అనే శబ్దం ణ గా మారింది. నిజమైన అర్థంలో నిర్వాణం అనే పదాన్ని బుద్ధుడు అతని అనుచరులే వుపయోగించారు. ఉపనిషత్తులు తదితర బ్రాహ్మణ తాత్వికగ్రంథాల్లో అమృత, మోక్ష, ముక్తి, కైవల్య, అపవర్గ అనే సంస్కృతపదాల్ని విముక్తికి పర్యాయ పదాలుగా వాడారు. బౌద్ధసాంప్రదాయానికి చెందిన పాళీ, సంస్కృత గ్రంథాల్లోనే విముక్తిని సూచించటానికి నిర్వాణం అనే పదాన్ని తరచుగా వాడారు. బుద్ధుడు వుపయోగించిన అర్థంలో నిర్వాణం అంటే చల్లారిన మంట లేదా సమసిపోయిన అగ్ని అని తెలుస్తుంది. నిర్వాణం యొక్క శబ్దార్థం ఎలావున్నా, బుద్ధభగవానుని జీవితం, నిర్వాణమంటే సర్వం అంతరించటం కాదని తెలియజేస్తుంది. శాక్యముని తన ముప్పై ఐదవ ఏట బోధిని పొంది, తర్వాత నలభై ఐదు సంవత్సరాల పాటు సద్ధర్మాన్ని బోధిస్తూ, ఆచరిస్తూ జీవించాడు. కాబట్టి నిర్వాణం అంటే అన్నిరకాల చర్యలు అంతరించటం కాదు. నిర్వాణం అంటే ఒకవైపు రాగ, ద్వేష, మోహాలనే మంటల్ని అంతమొందించటం, మరోవైపు మానవునిలో వుత్తమ లక్షణాలను పరిపూర్ణంగా వికసింపచెయ్యటం. విత్తనం అంతరించి మహావృక్షంగా ఎదిగినట్లు, స్వార్థం అంతరించి పర–అర్థం (పరోపకారం) వృద్ధిచెందటం. అన్ని చర్యల్ని అంతమొందించటమే నిర్వాణం ఐతే ఆత్మహత్య దుఃఖాన్ని, బాధల్ని నివారించే సూటి, సత్వర మార్గం. వ్యక్తిత్వం, కర్మల నిజస్వభావాన్ని అర్థం చేసుకున్నవారికి, ఆత్మహత్యలో వుండే డొల్లతనం సులభంగానే అర్థమౌతుంది. అశాంతి, ఆందోళనల్ని కలిగించే ఆత్మహత్య దుఃఖాన్ని ఎలా నివారిస్తుంది? ఆత్మహత్య అదుపుతప్పిన మానసిక స్థితివల్ల లేదా తీవ్రమైన ఆందోళననుండి తప్పించుకోవాలనే ఆరాటంనుండి జరుగుతుంది. భావోద్రేకం లేదా తీవ్రమైన మానసిక వత్తిడి బాధిస్తుందనే భయంవల్ల మనిషి మృత్యువును ఆహ్వానిస్తాడు. కాబట్టి, ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఆత్మహత్య నిర్వాణానికి మార్గం కాదు. అయితే నిర్వాణం పొందిన వ్యక్తి తన జీవితం యిక ఏమాత్రం ప్రయోజనకరం కాదని స్వచ్ఛందంగా జీవితాన్ని చాలిస్తే అది అభ్యంతరకరమైంది కాదు.

ఒక కోణంలో చూస్తే రాగ, ద్వేష, మోహం అనే అగ్నిని ఆర్పెయ్యటమే నిర్వాణం. ఈ అగ్ని ఆరిపోయిన పిమ్మట పాపరహితమైన పరిపూర్ణ శాంతి, పవిత్రత, కరుణ, విజ్ఞానం నుండి వుత్పన్నమయ్యే కల్మషరహితమైన ఆనందం లభిస్తాయి. ఆచార్య అశ్వఘోషుని మాటల్లో చెప్పాలంటే, "మనోక్లేశాలన్నీ అంతమైన స్థితిలో మానసికమైన అలజడి సమసిపోయి, సహజాతమైన సత్ప్రవర్తనను అందుకోవటమే నిర్వాణం." మనోక్లేశాలను అంతమొందించటం, నైతిక, మేధోశక్తుల వికాసం సమాంతరంగా జరుగుతయ్. స్వార్థం సమూలంగా అంతరించిన పవిత్ర మానవుడు కరుణ, మైత్రి,

ప్రజ్ఞ, సహనం, సత్యసంధత, సంకల్పశక్తి, ఉపేక్షాభావం కలగలసిన నిలువెత్తు రూపం అవుతాడు. నిర్వాణం పొందిన వ్యక్తి సుగుణశీలం, సమగ్రజ్ఞానం, ఆలోచనా శక్తివల్ల లభించే పరిపూర్ణ సుఖసంతోషాల నిలయమౌతాడు. నిర్వాణాన్ని ఎలా గుర్తించగలం? ఆచార్య నాగసేనుడు "దుఃఖం నుండి సంపూర్ణమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, శాంతిసౌఖ్యాలు, పవిత్రత, సున్నితత్వం అనేవాటి వల్ల నిర్వాణాన్ని గుర్తించగలం" అని జవాబిచ్చాడు.

నిర్వాణమంటే స్వార్థం సమసిపోవటమే గాని, మూర్తిమత్వం (personality) అంతరించటం కాదు. స్పృహతప్పిన స్థితిలో, గాఢనిద్రలోని చేతనారహితమైన స్థితిలో మూర్తిమత్వం అంతరిస్తుంది. "గాఢనిద్రలో జీవాత్మ పరమాత్మలో సంపూర్ణంగా లీనమౌతుంది. స్పృహతప్పినప్పుడు అర్ధ-ఐక్యం జరుగుతుంది" అని వేదాంతం చెబుతుంది. బౌద్ధధర్మం యిటువంటి దృష్టికి చోటివ్వదు. పైగా అటువంటివాటిని మతితప్పిన భావాలని తేల్చి చెబుతుంది. నిర్వాణం జిజ్ఞాస, జ్ఞానం, ఆలోచన, పరిశీలన, ప్రీతి, శాంతి, సమత అనే ఏడు లక్షణాల్ని కలిగివుంటుంది. ఈ లక్షణాల్ని చేతనారహితస్థితిలో పొందటం అసాధ్యం. కాబట్టి నిర్వాణమంటే జీవితాన్ని సంపూర్ణమైన అర్థంలో జీవించటమే గాని అంతమొందించటం కాదు. నిర్వాణం పొంది అర్హతుడైన వ్యక్తి తనకోసం గాక యితరుల కోసం జీవిస్తాడు. నిర్వాణమంటే స్వార్థచింతనను అంతమొందించటంతో పాటు సంపూర్ణమైన కరుణ, సత్ప్రవర్తనను అందుకోవటం. క్లుప్తంగా చెప్పాలంటే ఆలోచనల్లో, ఆచరణలో అత్యున్నతమైన మానవత్వపు లక్షణాలను పొందటమే నిర్వాణం. నిర్వాణం పొందిన వ్యక్తి జీవితానికి కర్మసూత్రం అన్వయించదని కొందరు భావిస్తారు. బుద్ధిస్టుల ఆదర్శమైన అర్హతుడు, హిందువుల ఆదర్శమైన జీవన్ముక్తుడనే వాటిమధ్య వున్న భేదాన్ని స్పష్టంగా చూడలేకపోవటమే యీ తప్పిదానికి కారణం. జీవన్ముక్తుడు కర్మసూత్రానికి బద్ధుడు కాడని హిందూయిజం చెబుతుంది. అర్హతుడు కర్మసూత్రానికి వ్యతిరేకంగా ఏ పాపకార్యం చెయ్యలేడని బౌద్ధధర్మం చెబుతుంది. **తెలిజ్జసుత్తం** "అతను (అర్హతుడు) తాను చెయ్యకూడని పనుల్లో వుండే ప్రమాదాన్ని స్పష్టంగా చూడగలడు అని చెబుతుంది. స్వార్థాన్ని త్యజించటంలోనే పరిపూర్ణత వుంది; అప్రమత్తత లేక ఎరుక, లోతైన ఆలోచన, స్పష్టమైన అవగాహన ద్వారానే అది లభిస్తుంది.

ధర్మాచరణ ద్వారా మనిషి పొందగోరే లక్ష్యాలు మూడు: శాంతి, చిత్తప్రశాంతత; ప్రతికూల సమయంలో సడలని ధైర్యం, నిబ్బరం; మరణంలో కూడా ఆశాజనకంగా వుండటం. వీటిని నిర్వాణం ద్వారా పొందవచ్చని బౌద్ధం చెబుతుంది. సామాన్య మానవుడు దైవభావనలో విశ్రాంతిని, ప్రశాంతతను ఆశిస్తాడు. అతని అన్ని ప్రశ్నలకు సమాధానం దేవుడే. కాని బుద్ధిస్టుల విషయం యిందుకు పూర్తిగా భిన్నమైంది. దైవం యొక్క అస్థిత్వాన్ని నిరాకరించిన బుద్ధిస్టుకు అది లక్ష్యంగాని, విశ్రాంతి స్థానంగాని

కాదు. బుద్ధిస్టు లక్ష్యం ధర్మకాయాన్ని అందుకోవటం. ధర్మకాయం* అంటే జీవిత వాస్తవాల, విశ్వజనీన సత్యాల సమాహారం. బుద్ధిస్టు, ప్రపంచానికి సంబంధించిన తన భావనల్ని, అవగాహనను సమగ్రంగా వ్యక్తంచేసే రూపమే ధర్మకాయం. బుద్ధిస్టుకు విశ్వం ఒక యంత్రంగా కాకుండా జీవశక్తితో నిండిందిగా కనిపిస్తుందనే విషయాన్ని ధర్మకాయం తెలియజేస్తుంది. విశ్వం దాని అత్యున్నతదశలో ఒక నైతిక, మేధోక్రమం. అంతకుమించి ధర్మకాయం అంటే అస్తవ్యస్థత లేని ఏకీకృత సారాంశం.

ధర్మకాయం అంటే పసలేని అమూర్తభావన (abstraction) కాదు; అది ప్రపంచాన్ని అర్థం చేసుకోటానికి వుపకరించే అస్థిత్వపు లక్షణం. అది కార్యకారణ సంబంధంతో, సత్ప్రవర్తనతో వెన్నంటి వుండే ఆనందంలో, దుష్ప్రవర్తన కలిగించే వెగటుతనంలో ప్రతిఫలిస్తుంది. ధర్మకాయం మనిషి యొక్క సహేతుక సంకల్పంలో, నైతిక ఆశయంలో సమున్నతంగా వ్యక్తమయ్యే ఆదర్శధోరణి; అది ఒక వ్యక్తి లేక నియమిత మనస్తత్వం కాకపోయినా, ధర్మకాయం అన్ని రకాల మూర్తిమత్వాలకు మూలం; అది మానవ మూర్తిమత్వం అందుకోగల అత్యున్నత స్థాయి; అది ప్రతి వ్యక్తి, తరచు తనకు తెలియకుండా, పొందాలని ప్రయత్నించే స్థితి; అది హేతుబద్ధత గల ప్రతి మనిషికి, అదృశ్యంగా వుండే స్ఫూర్తిదాత. ధర్మకాయం లేకుండా మూర్తిమత్వం, హేతుతత్వం, సైన్సు, నైతికలక్ష్యం, ఆదర్శం, మనిషి జీవితానికి అర్థం లేనేలేవు.

మన జ్ఞానానికున్న పరిమితులు, శీల సమగ్రతా లేమివల్ల ధర్మకాయం గురించి మనకు సంపూర్ణంగా తెలియకపోవచ్చు. కాని, దాన్నుండి మార్గదర్శకత్వం, స్ఫూర్తి పొందేటందుకు తగినంత తెలుసు. వర్షించే మేఘం కొండకోనలు, నదీనదాలు, పర్వతాలు లోయలు, ఎడారులు మైదానాలు అనే తేడా లేకుండా అన్నిచోట్ల కురుస్తుంది. గడ్డి, పొదలు, చెట్టు, చేమ. ఇవన్నీ వర్షపునీటినే పీల్చుకున్నా, యీ మొక్కలు, చెట్లు వాటి స్వభావానికి అనుగుణంగానే ఎదగటం, పూలు పూయటం, పండ్లు కాయటం జరుగుతుంది. ధర్మకాయం ఒక్కటే అయినా భిన్నమైన జీవులు, భిన్నరీతుల్లో సత్యాన్ని అనుసరించి ధర్మకాయం యొక్క వెలుగును పొందుతయ్. దానిలో మనకు విశ్వాసం వున్నా, లేకపోయినా అది మనకు స్ఫూర్తినిస్తూనే వుంటుంది. దాన్ని గురించి జ్ఞానాన్ని పెంపొందించుకోవటం వల్ల అత్యుత్తమ ఫలితాన్ని పొందగలం. ధర్మకాయంపైగల ప్రేమ మనిషిని ఎల్లప్పుడు సత్యం, సౌశీల్యం, సౌందర్యం, సమున్నతత్వంవైపు నడుపుతుంది. ధర్మకాయం అంటే తన సంకల్పానికి భిన్నమైనదంతా పాపం అని చెప్పే సర్వశక్తివంతుడైన దైవం కాదు. "విశ్వానికి అధిపతిని నేనే; నా ఆదేశాలను పాటించేవారికి వరాలిస్తాను" అని ధర్మకాయం చెప్పదు; అది ప్రార్థనలు, పూజలు, పొగడ్తలతో పొంగిపోదు; ధర్మకాయం వరాలు ప్రసాదించదు, శిక్షలు విధించదు; అది తన

అధికారంతోగాక, హేతువుతో మనుషుల్ని నడిపిస్తుంది; తన శక్తితో గాక, వెలుగుతో నడిపిస్తుంది. మనం ధర్మకాయం సృష్టించిన జీవులం కాదు; మన అనుభవం, సంకల్పాల ఫలితమే మన జీవితాలు. అందువల్ల ప్రతి ఒక్కరు తమ జీవితాలకు తామే బాధ్యులు. తమ స్థితి గురించి మరొకర్ని నిందించి ప్రయోజనం లేదు.

జీవితం, మరణం - వీటికి సంబంధించిన సమస్యలపై లోతుగా ఆలోచించి, అచేతనావస్థ (non-conscious)లో వుండే స్వయంసిద్ధ స్పందనగల శక్తులనుండి జీవితం తనంతట తాను ప్రారంభమవుతుందని బుద్ధుడు గుర్తించాడు. తన గమ్యం తనకే తెలియని యీ స్పందనాశక్తి అన్ని చెడుగులకు మూలం. బుద్ధుడు తన **ఆధ్యాత్మిక ప్రతీత్య సముత్పాద సూత్రం**లో మానవుని జీవితం అభివృద్ధి చెంది, వ్యక్తమయ్యే వివిధ కార్యకారణ సంబంధాలను విస్పష్టంగా వివరించాడు. ప్రారంభంలో చైతన్యరహిత (అవిద్య) శక్తి వుంది. ఈ అసంగత, అనిర్వచనీయ జీవశక్తిలో ప్రాథమికమైన స్వయం చోదక ధోరణి (సంస్కార) అధమస్థాయి స్పందాలకు రూపం యిస్తుంది. వీటినుండి చేతన, స్పందన (విజ్ఞాన) వుత్పన్నం అవుతాయి. తద్వారా 'నేను', 'నేను కానిది' అనే స్వచేతన కలిగిన వ్యక్తి (నామ-రూప) అభివృద్ధి చెందుతాడు. ఈ చేతనలో ఆరు భిన్న అనుభవరంగాలు (షడాయతనలు) - అంటే పంచేంద్రియాలు, మనసు- మొదలౌతయ్. ఈ ఆరు రంగాల్లో జరిగే కదలిక బాహ్య ప్రపంచంతో సంబంధం లేక స్పర్శ (ఫస్స-పాలీ) నెలకొల్పుతుంది. పంచేంద్రియాలు, మనసు బాహ్యప్రపంచంలో పనిచెయ్యటంతో అన్ని రకాల వేదనలు (pleasure, pain) పుడతయ్. వీటి స్వభావం తెలియని వ్యక్తిలో యివి తీవ్రమైన కోరిక (తృష్ణ)ను కలిగిస్తాయి. స్వయంతృప్తి కోసం కలిగే యీ దాహం లేక తపన వాటిని తీవ్రంగా అంటిపెట్టుకొనే ధోరణి (ఉపాదానం)ని పెంపొందిస్తుంది. ఈ ఉపాదానం వ్యక్తికి తాను నిరంతరం కొనసాగాలనే **భవం** కలుగజేస్తుంది. ఈ **భవం** అతనిలో మార్పు లేక పుట్టుక (జాతి), స్వార్థంతో కూడిన యీ మార్పు జరామరణాలతో కూడిన దుఃఖానికి మూలకారణం. ఇవి అందోళన, ఆశాభంగం, రోదనకు దారితీస్తయ్.

ఈ విధంగా అన్ని రకాల దుఃఖానికి మూలం జీవితం ప్రారంభమయే అచేతనా స్పందనల్లో వుంది. ఈ స్పందనల్ని అదుపుచేసినపుడు వాటినడుండి జనించే దుష్టసంఖారాలు నశిస్తయ్. అజ్ఞానం అంతరించటంతో వ్యక్తి కేంద్రక భావనలు అంతమవుతయ్. వీటి అంతంతో జ్ఞానేంద్రియాల ద్వారా కలిగే భ్రమలు నశిస్తయ్. ఈ భ్రమలు నశించినప్పుడు చెడు భావనలు తలెత్తవు. తప్పుడు భావనలు లేనప్పుడు తృష్ణ అంతమవుతుంది. తృష్ణాంతంతో ఉపాదానం వుండదు. ఉపాదానం లేనప్పుడు వ్యక్తిభావం అంతరించటం, దీనితో సకల దుఃఖాల నుండి విముక్తి కలిగించే జాతి, జర, మరణం అంతమై నిర్వాణప్రాప్తి కలుగుతుంది.

కాబట్టి ఎవరి జీవితాన్ని మలుచుకునే శక్తి వారి చేతుల్లోనే వుంది. ఒకరి జీవితం దుఃఖమయమైతే మరొకర్ని నిందించి ప్రయోజనం లేదు. జీవితంలోని దుఃఖం జీవనం నుండి వచ్చిందే. జీవిత స్వభావాన్ని ఎరిగిన మనిషి దుఃఖాన్ని చూసి బెదిరిపోకూడదు; సత్యసంధతవైపు నడిచే నియమాన్ని ఎవరూ తప్పించుకోలేరు. ధర్మకాయం నుండి స్ఫూర్తిని పొంది, అష్టాంగమార్గంలో ధర్మానుగుణ్యమైన జీవితాన్ని గడిపేవారు, జీవితంలోని దుఃఖంనుండి విముక్తి కలిగి నిర్వాణాన్ని పొందగలరు.

నిర్వాణం పొందినవారు తమ సంతృప్తికి పరిమితమైన వ్యక్తికేంద్రక జీవితం జీవించరు. వారు మానవుడు అందుకోదగిన పరిపూర్ణత కోసం శ్రమిస్తూ యితరులకు స్ఫూర్తినిచ్చే **సంఘ** సభ్యులుగా వుంటారు. బోధిచర్యావతారంలో చెప్పినట్లు, 'బహుజన హితం కోసమే ఎవరైనా బోధిని పొందగోరుతారు.' నిర్వాణం మనిషిని లోకంలోని చవకబారుతనం నుండి విడదీసినా, అతన్ని సమాజంనుండి పూర్తిగా వేరుచెయ్యదు. ప్రపంచంతో సజీవమైన, సవ్యమైన ఐక్యత ద్వారానే నిర్వాణానికి పరిపూర్ణమైన ప్రాధాన్యత లభిస్తుంది. అంతరంగ శాంతిని పొందిన అర్హతుడు పాపకార్యాలకు దూరంగా వుండటమేగాక, నిరంతరం మంచిపనులు చేస్తుంటాడు. తనకోసం ఏమీ కోరకపోయినా, అతను బహుజన హితం కోసం శ్రమిస్తాడు. అందరిపై కరుణ కలిగివుంటాడు. అతనిలోని మైత్రిభావన తనను ద్వేషించే, తనను వ్యతిరేకించే వారిపై సైతం ప్రసరిస్తుంది. తల్లి తన ప్రాణాలను సైతం లెక్కచెయ్యక తన బిడ్డను కాపాడినట్లు, అర్హతుడు ఏ విధమైన భేదభావం లేక అందరిపైనా అవధులు లేని ప్రేమ కలిగివుంటాడు. ప్రపంచంలోని అనంతమైన బాధల్ని తొలగించటమే అతనికి అత్యున్నతమైన ఆనందం. **మెట్టసుత్తం**లో చెప్పినట్లు, 'నిలబడినా, నడుస్తున్నా, కూర్చున్నా, పడుకుని వున్నా అతను నిరంతరం సతి-సంప్రజ్ఞానుడై ఆ స్థితిలోనే వుంటాడు. అర్హతుడు మరణించినప్పుడు అతని దేహస్కందాలు విఘటనమై పోతయ్, కాని అతను జీవించే వుంటాడు. నిర్వాణంలో అర్హతుడు శరీరసంబంధమైన రుగ్మతలనుండి స్వేచ్ఛ పొందకపోవచ్చు, కాని పరినిర్వాణం (మరణం)లో అతను వాటినుండి విముక్తుడౌతాడు. అతను జీవించి వుండగా ఏ స్థితినైతే పొందాడో మరణానంతరం ఆ స్థితిగా మిగిలిపోతాడు. అతని కోసం ఏ రూపంలోనో, శబ్దంలోనో వెదకలేం. కాని ఎవరు ధర్మాన్ని చూడగలుగుతారో వారు బుద్ధుణ్ణి చూడగలుగుతారు. అతను విశ్వవ్యాపితమైన కరుణ, ప్రజ్ఞ విలసిల్లే తథాగత గర్భమైన ధర్మకాయంలో కలకాలం నిలిచివుంటాడు.

**సమాప్తం**

సుందరయ్య గ్రంథాలయం
A.C. No. 91932

"ఈ మధ్యకాలంలో భారతదేశంలో వివిధ ప్రాంతాలకు చెందినవారు బుద్ధిజంపై ఒక మంచి పుస్తకం సూచించమని అడుగుతున్నారు. అటువంటివారికి ప్రొఫెసరు నరసు రాసిన ఈ పుస్తకాన్ని ఏమాత్రం తటపటాయింపు లేకుండా సూచిస్తాను. ఎందుకంటే బుద్ధిజంపై ఇంతవరకూ వెలువడిన పుస్తకాల్లో ఇది అత్యుత్తమం అని నేను అనుకొంటున్నాను."

ఈ పుస్తకం గురించి డా. బాబా సాహెబ్ అంబేద్కరంతటివాడు చెప్పిన మాట ఇది. ఇది 1948లో ఆయన చెప్పిన మాట. పుస్తకం చదివితే ఆయన మాట ఈనాటికీ వర్తిస్తుందని అర్థమవుతుంది. మరి చదవండి.

Peacock Classics